www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2018-20
అక్షరాక్షరం అభ్యుదయం

సంపుటి : 68 సంచిక : 205 | శుక్రవారం 18-01-2019 | Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam | వెల: రూ.4.00 | పేజీలు : 12+ టాబ్లాయిడ్ | విజయవాడ ప్రచురణ



ఒడిశాలో అమానవీయం...!

- కులం తక్కువని తల్లీబిడ్డ వెలి
- మృతురాలి అంత్యక్రియలకు ససేమిరా
- సైకిల్‌పై తీసుకు వెళ్లి కొడుకే ఖననం చేసిన వైనం

తరచూ అమానుష ఘటనలతో సమాజం నివ్వెరపోతూనే ఉంది. పల్లెల్లో కులవివక్ష తాండవం చేస్తుంటే... సభ్య సమాజం నిలువరించలేని నిస్సహాయ స్థితికి చేరుకుందంటే ఏమాత్రం అరోపణ కాదు. తన భార్య శవాన్ని తన ఊరికి తీసుకెళ్ళడానికి చేతిలో డబ్బులు లేక మాంఝీ అనే వ్యక్తి తన భార్య మృతదేహాన్ని ఓ చాపలో చుట్టి భుజానికెత్తుకొని నడచిన ఘటన మరవక ముందే మరో ఘటన వెలుగు చూసింది. తన తల్లి అంత్యక్రియలకు ఇరుగు పొరుగు సహకరించక పోవటంతో మృతదేహాన్ని సైకిల్‌పై తీసుకువెళ్లి ఖననం చేసిన దయనీయ ఘటన ఒడిశాలో వెలుగు చూసింది. వివరాలు ఇలా ఉన్నాయి.

భువనేశ్వర్ : కర్పాబహాల్ గ్రామానికి చెందిన జానకి సిన్హానియా (45) భర్త అనారోగ్యంతో ఇటీవలే మృతి చెందాడు. దీంతో ఆమె తన కుమారుడు సరోజ్ (17)తో కలిసి పుట్టింటిలో ఉంటోంది. కూలీ పని చేసుకుంటూ తల్లికొడుకు జీవనాన్ని కొనసాగిస్తున్నారు. ఇటీవల మంచి నీళ్ల కోసం బావి వద్దకు వెళ్లి అదుపు తప్పి అందులో పడి జానకి చనిపోయింది. జానకి అంత్యక్రియలకు ఇరుగు పొరుగు ఎవ్వరూ ముందుకు రాలేదు. ఆమె శవాన్ని మోసేందుకు ఎవరూ ముందుకు రాలేదు. తల్లి అంతిమ సంస్కారానికి చేతిలో చిల్లిగవ్వ లేని స్థితిలో సరోజ్ తన తల్లి శవాన్ని సైకిల్‌పై 6 కిలో మీటర్ల దూరంలోని అడవికి తీసుకువెళ్లి గుంత తవ్వి పూడ్చిపెట్టాడు. అంత్యక్రియలకు సహకరించాలని గ్రామస్తులను వేడుకున్నప్పటికీ ఎవరూ ముందుకు రాలేదని సరోజ్ కన్నీరు పెట్టుకున్నాడు. కేవలం తాము తక్కువ కులానికి చెందిన వాళ్లమని గ్రామస్తులంతా తమను దూరం పెట్టారని ఆవేదన వ్యక్తం చేశాడు.

30 నుంచి అసెంబ్లీ

ఫిబ్రవరి 2న ఓటాన్ అకౌంట్ బడ్జెట్



విశాలాంధ్ర బ్యూరో– అమరావతి: అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల తేదీలు ఖరారయ్యాయి. ఈ నెల 30 నుంచి ఫిబ్రవరి 7 వరకు శాసనసభ, శాసన మండలి సమావేశాలు జరగనున్నాయి. దీనికి సంబంధించిన వివరాలను శాసనసభ, మండలి కార్యదర్శులు గురువారం సాయంత్రం విడుదల చేశారు. జనవరి 30న ఉదయం 9.30 గంటలకు ఉభయసభలు సమావేశమవుతాయని గవర్నర్ నరసింహన్ పేరిట నోటిఫికేషన్ జారీ చేశారు. ఫిబ్రవరి 2న ప్రభుత్వం ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌ను సభలో ప్రవేశపెట్టనుంది. అసైన్డ్ భూములు చట్ట సవరణ బిల్లుతో పాటు మరికొన్ని కీలకమైన బిల్లులను కూడా ప్రభుత్వం

- మిగతా 2 లో

యాక్.. కంపు..!

'నీలి-హరిత' శోభితం ప్రకటనలకే పరిమితం

ప్రపంచ స్థాయి రాజధానిని నిర్మిస్తున్నాం. ఈ లోపు బెజవాడను అతి సుందరంగా తీర్చిదిద్దుతాం. కాలువల్లో నిత్యం నీటిని నిల్వ చేసి బోటింగ్ షికార్లు నిర్వహిస్తాం. ఎక్కడ చూసినా పచ్చదనమే. నీటి నిల్వలతో నీలి కళ. ఇదీ సర్కారు ఊరింత. సీన్ కట్ చేస్తే... కాలువల పక్కన ముక్కు మూసుకోకుండా నడవలేని స్థితి. భయంకరమైన దుర్గంధం. బొమ్మలకు, రంగులకు, వీధి దీపాలకు వందకు పైగా కోట్లు ఖర్చు చేశారు. ఫలితం శూన్యం. ఒకటా రెండా నాలుగు ప్రభుత్వ శాఖల పర్యవేక్షణలో బెజవాడ కంపుతో శోభిల్లుతోందంటే కేవలం ఆరోపణ కాదు.



- సుందరీకరణకు రూ.50 కోట్లు
- పర్యాటకశాఖకు రూ. 2 కోట్లు
- ఇతర అభివృద్ధి పనులకు రూ.61 కోట్లు
- మురుగులో పోసిన పన్నీరే
- ఇదీ బెజవాడ దుర్గంధ పరిస్థితి

విశాలాంధ్ర బ్యూరో – అమరావతి : తాత్కాలిక రాజధాని విజయవాడలోని కాల్వలు నీరు లేక దుర్గంధాన్ని వెదజల్లుతున్నాయి. ఒక పక్క కోట్లాది రూపాయలతో కాలువల సుందరీకరణ పనులు జరుగుతుంటే మరోపక్క నీరు లేక కాల్వలు వెలవెలపోతున్నాయి. కొద్ది రోజుల కిందట తూర్పు ప్రధాన కాల్వకు నీటి విడుదల నిలిపివేయడంతో బందరు, రైవస్, ఏలూరు కాల్వలు మురుగు, చెత్తాచెదారంతో నిండి ముక్కుపుటాలు అదిరే స్థాయిలో దుర్గంధం వెలువడుతోంది. కాలువలపై ఉండే వంతెనలతోపాటు సమీప ప్రాంతాల్లో వెళుతున్న జనం ముక్కు మూసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. . మూడు కాల్వలు నగరం మధ్య గుండా ప్రవహిస్తుండడంతో

- మిగతా 2 లో



ఏలూరు లాకుల వద్ద పేరుకుపోయిన చెత్తాచెదారం



ఏపీ ఎన్నికల రథసారథిగా
గోపాలకృష్ణ ద్వివేది

ఆర్పీ సిసోడియా బదిలీ

విశాలాంధ్ర బ్యూరో–అమరావతి : ఆంధ్రప్రదేశ్ ఎన్నికల సంఘం నూతన ప్రధానాధికారిగా గోపాలకృష్ణ ద్వివేది నియమితులయ్యారు. ఇప్పటివరకూ ఈ బాధ్యతలు చూస్తున్న ఆర్పీ సిసోడియాను బదిలీచేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఓటర్లలో చైతన్యం రావాల్సిన అవసరముందని ద్వివేది అభిప్రాయం వ్యక్తం

- మిగతా 2 లో



డేరాబాబాకు జీవిత ఖైదు

11లో

కొలువు తీరిన టీ-అసెంబ్లీ



114 మంది ఎమ్మెల్యేలు ప్రమాణం

విశాలాంధ్ర బ్యూరో–హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత రెండో అసెంబ్లీ గురువారం కొలువు తీరింది. జాతీయ గీతాలాపనతో ఉదయం 11.30 గంటలకు ప్రొటెం స్పీకర్ ముంతాజ్ అహ్మద్ ఖాన్ సభను ప్రారంభించారు. తొలుత ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావును ప్రమాణం చేయడానికి ప్రొటెం స్పీకర్ ఆహ్వానించారు. గజ్వేల్ శాసనసభ్యుడిగా కేసీఆర్ ప్రమాణం చేశారు. "కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు అనే నేను..శాసనసభ సభ్యుడిగా ఎన్నికైనందున శాసనం ద్వారా నిర్మితమైన భారత రాజ్యాంగం పట్ల నిజమైన విశ్వాసం, విధేయత చూపుతానని భారతదేశ సార్వభౌమాధికారాన్ని సమగ్రతను కాపాడుతానని నేను స్వీకరించబోయే కర్తవ్యాన్ని శ్రద్ధాసక్తులతో నిర్వహిస్తానని దైవసాక్షిగా ప్రమాణం చేస్తున్నాను. తెలంగాణ శాసనసభ సభ్యుడినైన కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు అనే నేను.. సభ నియమాలకు కట్టుబడి ఉంటానని వాటిని అనుసరిస్తానని సభ మర్యాదలను పాటిస్తానని సాంప్రదాయాలను గౌరవిస్తానని దైవసాక్షిగా ప్రమాణం చేస్తున్నాను".. అంటూ కేసీఆర్ తెలుగులో ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం సభలోని మహిళా ఎమ్మెల్యేలు ప్రమాణం చేశారు. ఆదిలాబాద్ జిల్లా ఖానాపూర్ నుంచి గెలిచిన అజ్మీర రేఖానాయక్ (టీఆర్ఎస్), ఖమ్మం జిల్లా ఇల్లందు నుంచి ఎన్నికైన హరిప్రియ నాయక్ బానోతు (కాంగ్రెస్), వరంగల్ జిల్లా ములుగు నుంచి

- మిగతా 2 లో



సభాపతి పోచారం

ఏకగ్రీవంగా ఎన్నిక

విశాలాంధ్ర బ్యూరో–హైదరాబాద్: తెలంగాణ అసెంబ్లీ స్పీకర్‌గా సీనియర్ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్పీకర్ పదవికి ఎన్నిక కోసం గురువారం నామినేషన్ల ప్రక్రియ చేపట్టగా.. గడువు ముగిసేసమయానికి

- మిగతా 2 లో

అత్యున్నత విద్యకు
అమరావతే నెలవు

ఎక్స్‌ఎల్ఆర్ఐ క్యాంపస్‌కు సీఎం చంద్రబాబు శంకుస్థాపన

విశాలాంధ్ర బ్యూరో– అమరావతి : భవిష్యత్‌లో దేశంలోని అత్యున్నత విద్యాసంస్థలన్నింటికీ అమరావతి కేంద్రంగా మారుతుందని, నాలెడ్జ్‌కి చిరునామాగా ఏపీ అవతరిస్తుందని సీఎం చంద్రబాబు ఆశాభావం వ్యక్తం చేశారు. రాజధాని అమరావతిలోని ఐనవోలు వద్ద గురువారం మధ్యాహ్నం దేశంలోని బి- స్కూల్స్ లో ఒకటైన జేవియర్ స్కూల్ ఆఫ్

- మిగతా 2 లో



ఇదీ లోకం!



ప్రజాస్వామ్యాన్ని కించపరచడమే

కేరళలో వ్యాఖ్యలకు ప్రధాని జాతికి సమాధానం చెప్పాలి

సీపీఐ నాయకులు నారాయణ, రామకృష్ణ

న్యూఢిల్లీ/ అమరావతి : ప్రధానమంత్రి నరేంద్ర మోడీ కేరళ పర్యటన సందర్భంగా అక్కడి ఎల్డీఎఫ్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా చేసిన వ్యాఖ్యలు లౌకిక వ్యవస్థ తలదించుకునే విధంగా ఉన్నాయని భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) జాతీయ కార్యదర్శి డాక్టరు కె. నారాయణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శి కె. రామకృష్ణ వేర్వేరుగా విమర్శించారు. సుప్రీంకోర్టు తీర్పును అమలు చేస్తే సమర్థించాల్సిన ప్రధానే వ్యతిరేకించడం విచారకరమన్నారు. న్యూఢిల్లీలో నారాయణ మీడియాతో మాట్లాడుతూ, సాక్షాత్తు దేశ పార్లమెంటరీ విధానానికి నేతృత్వం వహిస్తున్న మోడీ కేరళకు వెళ్లి కమ్యూనిస్టులకు సంస్కృతిలేదని, దేశానికి వ్యతిరేకమని అనడం శోచనీయమన్నారు. శబరిమలలో మహిళల ప్రవేశంపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును అమలు చేస్తున్న ఎల్‌డీఎఫ్ ప్రభుత్వాన్ని తప్పుపట్టడం ప్రధానికి తగదన్నారు. ఈ అంశంపై ఎల్డీఎఫ్ విధానాన్ని

- మిగతా 2 లో





ప్రజలే నా వెన్నుదన్నుగా నిలవాలి

మోడీ నేతృత్వంలో బీజేపీ అధికారంలోకివచ్చాక వ్యక్తి స్వేచ్ఛను, భావప్రకటన స్వేచ్ఛను పూర్తిగా హరించి వేస్తున్నది. ఒక ప్రజాస్వామ్య అసంతృప్తిని, ఒక సైద్ధాంతిక విమర్శను భరించలేక, సహించలేక ఆ వ్యక్తులపై దాడులకు దిగడమేకాక, హత్యలకూ పాల్పడుతున్నది. నరేంద్ర దబోల్కర్, గోవింద్ పన్సారే, కల్బుర్గీ, గౌరీ లంకేశ్ లాంటి హేతువాదులను, మేధావులను,పాత్రికేయులను అత్యంత దారుణంగా హతమార్చిన నయా ఫాసిస్టు సర్కార్ ఇప్పుడు మాలాంటివారి వెంటపడుతోంది. విద్యావేత్తగా, పరిశోధకుడిగా దేశంలో 99శాతం ప్రజల సాంస్కృతిక, చారిత్రక నేపథ్యాన్ని, విశిష్టతను వెలుగులోకి తీసుకువస్తూ ప్రత్యామ్నాయ సంస్కృతిని, శ్రమ సంస్కృతిని అందించేందుకు కృషిచేస్తున్న నాలాంటివారిపై తప్పుడు కేసులు బనాయిస్తూ ప్రత్యామ్నాయ విధానాల గొంతు నొక్కేందుకు కాషాయదళం అతిపాశవికంగా వ్యవహరిస్తోంది. ఈ క్రమంలో దేశ ప్రజలకు నా విజ్ఞప్తి ఇది:



(సుప్రసిద్ధ మేధావి, మానవహక్కుల కోసం పోరాడుతున్న ప్రొఫెసర్ డాక్టర్ ఆనంద్ తేల్తుంబ్డే ప్రజల మద్దతు కోరుతూ రాసిన లేఖ సారాంశాన్ని ఇక్కడ ఇస్తున్నాం:)

నేను అహ్మదాబాద్‌లోని ప్రముఖ ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్‌లో చదువుకున్నాను. ఐఐటి ప్రొఫెసర్‌ను అలాగే భారత పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్‌లో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా పనిచేస్తున్నాను. గతంలో పెట్రోనెట్ ఇండియాకు ఎండీగా, సీఈఓగా పనిచేశాను. 26 పుస్తకాలను రచించాను. ఎకనామిక్ అండ్ పొలిటికల్ వీక్లీకి కాలమిస్ట్‌గా ఉన్నాను. కుల-వర్గం, ప్రభుత్వ విధానాల సమస్యలు తదితర అంశాలపై అసంఖ్యాకమైన వ్యాసాలు రాశాను. ప్రముఖ మేధావిగా, ప్రజాస్వామ్య, విద్యాహక్కుల కార్యకర్తగా

- మిగతా 11 లో

ఇండో అమెరికన్లకు కీలక పదవులు



వాషింగ్టన్ : అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ముగ్గురు భారత అమెరికా పౌరులను తన ప్రభుత్వంలోని కీలకపదవుల్లో నామినేట్ చేశారు. వీరి నియామకాలను సెనేట్ ఆమోదించవలసి ఉంటుంది. నియామకాలకు సంబంధించిన సమాచారాన్ని బుధవారం సెనేట్‌కు పంపారు. ఈ అంశాలను వైట్‌హౌస్ వెల్లడించింది. అణుఇంధన శాఖ సహాయ కార్యదర్శిగా రీటబరన్వాల్, గోప్యత మరియు పౌరహక్కుల బోర్డు నిర్వాహకుడిగా ఆదిత్యబమ్‌జాయ్‌ని, ఆర్థికశాఖ సహాయ కార్యదర్శిగా విమల్‌పటేల్‌ను ట్రంప్ నియమించారు.

ట్రంప్ తన పదవీకాలంలో ఇంతవరకు 3 డజన్లకుపైగా భారత, అమెరికా పౌరులను అనేక పదవులలో నియమించారు. మొదట నిక్కీహేలీని క్యాబినెట్ ర్యాంక్‌లో నియమించారు. అంతకుముందే మీడియా సహాయకార్యదర్శిగా రాజ్‌షాను నియమించారు. అయితే వీరిరువురు తమ పదవులకు రాజీనామా చేశారు. బరన్‌వాల్ నియామకాన్ని సెనేట్ ఆమోదించినట్లయితే ఆమె శక్తివంతమైన ఇంధనశాఖ సహాయ కార్యదర్శి పదవిని నిర్వహిస్తారు. అలాగే అణు సాంకేతిక పరిశోధనా అభివృద్ధి, మౌలిక అణు సాంకేతిక విభాగంపైన కూడా అజమాయిషీని చేస్తారు. గతంలో ఆమె వెస్టింగ్‌హౌస్‌లో టెక్నాలజీ డెవలప్‌మెంట్ డైరెక్టర్‌గా పనిచేశారు.

ఏలేలో గ్రాడ్యుయేషన్ విద్యనభ్యసించిన బమ్‌జాయ్ నేరశిక్షాస్మృతి, పాలనాపరమైన చట్టాలు, ఫెడరల్ కోర్టులు, జాతీయ భద్రతాచట్టం, కంప్యూటర్ నేరాలపై బోధించడమేకాక వ్యాసాలను రచిస్తారు. ఆయన గతంలో అమెరికా సుప్రీంకోర్టులో పనిచేశారు. పటేల్ ప్రస్తుతం ఆర్థిక సుస్థిరత అజమాయిషీ మండలి సహాయ కార్యదర్శిగా పనిచేస్తున్నారు.

లాస్‌ఏంజిల్స్‌లో టీచర్లతో చర్చలు



లాస్‌ఏంజిల్స్ : దేశంలో అతిపెద్ద రెండవ స్కూలు జిల్లాగా పేరుపొందిన లాస్‌ఏంజిల్స్‌లో టీచర్లతో ప్రభుత్వ అధికారులు చర్చలు జరిపారు. తమ వేతనాలను పెంచాలని కోరుతూ టీచర్లుచాలా రోజులుగా సమ్మె చేస్తున్నారు. వేతనాలను పెంచినట్లయితే ప్రభుత్వానికి భారమవుతుందని, ఆర్థికస్థితి దెబ్బతింటుందని అధికారులు వాదిస్తున్నారు. లాస్‌ఏంజిల్స్ మేయర్ ఎరిక్‌గార్‌శెట్టి ఈ చర్చలలో పాల్గొన్నారు. 4 రోజులుగా జరుగుతున్న పికిటింగ్‌ను కొనసాగిస్తామని టీచర్స్ యూనియన్ ప్రకటించింది. చర్చలకు సంబంధించిన వివరాలు ఇంకా వెల్లడికావలసి ఉంది. 30 ఏళ్ల కాలంలో టీచర్లు సమ్మె చేయటం ఇదే ప్రథమం. సమ్మె చేస్తున్న టీచర్లకు బదులుగా కొత్తవారితో క్లాసులు నిర్వహించాలని జిల్లా అధికారులు చేసిన ప్రయత్నం సఫలంకాలేదు. జిల్లా అంతటా 6.4 లక్షలమంది విద్యార్థులు చదువుకుంటున్నారని వేతనాలు పెంచితే స్కూలు వ్యవస్థ దివాలా తీస్తుందని జిల్లా అధికారులు తెలిపారు. అయితే టీచర్లతోపాటు విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కూడా టీచర్లతో పాటు ప్రదర్శనల్లో పాల్గొన్నారు. టీచర్ల సమ్మె కారణంగా స్కూళ్లకు హాజరవుతున్న విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గిపోయింది.



సిరియాలో ఆత్మాహుతి దాడి

ఐదుగురి అమెరికన్లతో సహా 20 మంది మృతి

దమాస్కస్ : సిరియాలో ఐఎస్ఐ ఉగ్రవాదులు ఆత్మాహుతి బాంబుదాడికి పాల్పడటంతో 5గురు అమెరికన్ సైనికులతో సహా మొత్తం 20 మంది చనిపోయారని అమెరికా సైనిక దళాలు తెలిపాయి. ఒక కాంట్రాక్టర్ కూడా చనిపోయినవారిలో ఉన్నారు. ఈ దాడిని అమెరికా సెంట్రల్ కమాండ్ కూడా ధృవీకరించింది. సిరియాలో ఉన్న తమ పదాతి దళాలలో 2వేల మందిని వెనక్కు పిలిపిస్తున్నట్టుగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించిన కొద్దివారాల్లోనే ఐఎస్ఐ ఉగ్రవాదులు రెచ్చిపోయారు. ఉగ్రవాదులను పూర్తిగా అణచివేసినట్టుగా కూడా ట్రంప్ చెప్పారు. సిరియా ఉత్తరప్రాంతంలోని మన్‌బిజ్ పట్టణంలోని ఒక రెస్టారెంటులోపల బుధవారం ఆత్మాహుతి బాంబుదాడి జరిగింది. సాధారణంగా అమెరికా సైన్యం ఈ రెస్టారెంటుకు వస్తుంది. అమెరికా సైనికులను లక్ష్యంగా చేసుకుని ఈ దాడి జరిగినట్టుగా తెలుస్తోంది. అమెరికా సైన్యం నాలుగేళ్లుగా సిరియాలోనే ఉంటూ తిరుగుబాటు



దారులకు మద్దతునిస్తూ ఉగ్రవాదులపై పోరాడుతున్నది. తమ సైనికులు ఇద్దరుమాత్రమే చనిపోయారని అమెరికా సెంట్రల్ కమాండ్ తెలిపింది. ఈ దాడిలో తమ సైనికులు ముగ్గురు గాయపడ్డారని కమాండ్ ఒక ప్రకటనలో వెల్లడించింది.

ఈ దాడిని తామే నిర్వహించామని ఐఎస్ ఉగ్రవాద సంస్థ ప్రచార విభాగం అమ్మక్ ప్రకటించింది. మన్‌బిజ్ పట్టణంలో ఐఎస్ ఉగ్రవాద సంస్థ ప్రస్తుతం పెద్దగా బలం కలిగిలేదు. అయితే కొన్ని రహస్య స్థావరాలలో అది ఉనికిని కలిగివుంది. అప్పుడప్పుడు స్థానిక అధికారులపైన, తమపై పోరాడుతున్న వారిపైన దాడులు చేస్తూవున్నారు. ట్రంప్ తీసుకున్న నిర్ణయాన్ని గతంలోనే వ్యతిరేకించిన వారికి తాజాగా జరిగిన బాంబుదాడి ఒక ఆయుధాన్ని సమకూర్చినట్లవుతుంది. సైన్యం ఉపసంహరణ తొందరపాటుతో తీసుకున్న నిర్ణయమని పలువురు విమర్శించారు.

సభ విశ్వాసం పొందిన గ్రీకు ప్రధాని

ఏథెన్స్ : గ్రీకు ప్రధాని అలెక్సిస్‌సిప్రాస్ బుధవారం పార్లమెంటులో ప్రవేశపెట్టిన విశ్వాసతీర్మానంపై నెగ్గారు. 300 మంది సభ్యులుగల పార్లమెంటులో 151 మంది సిప్రాస్‌కు అనుకూలంగా, 140 మంది వ్యతిరేకంగా ఓటు చేశారు. ఒకరు హాజరుకాలేదు. రానున్న రోజుల్లో మాసిడోనియ పేరుమార్పు ఒప్పందాన్ని కూడ పార్లమెంటు ఆమోదించవలసివుంది. ఈ అంశంపైన కూడా ఓటింగ్ జరుగుతుంది. గత సంవత్సరం మాసిడోనియ పేరుమార్పు ఒప్పందం జరిగింది. ఈ ఒప్పందాన్ని పాలక సంకీర్ణంలోని చిన్న పార్టీ వ్యతిరేకిస్తూ ప్రభుత్వం నుండి వైదొలగడంతో సిప్రాస్ సభ విశ్వాసాన్ని పొందడానికి బుధవారం ఓటింగ్ నిర్వహించనున్నట్లు ప్రకటించారు. పొరుగుదేశం గతంలో యుగొస్లావ్ రిపబ్లిక్ ఆఫ్ మాసిడోనియాగా ప్రపంచానికి తెలుసు. అయితే ఈ పేరును కేవలం మాసిడోనియాకు మార్పుచేయాలని, చాలాకాలంగా డిమాండ్ ఉన్నది. ఎట్టకేలకు గత ఏడాది మాసిడోనియాగా పేరును నిర్ధారించారు. దీనిపైనే ప్రతిపక్షం వ్యతిరేకత తెలిపింది. పాలక వామపక్ష సిర్జా పార్టీకి చెందిన 145 మంది డిప్యూటీలతో పాటు ఆరుగురు ఇండిపెండెంట్లు, అలాగే 2015 నుండి పాలకసంకీర్ణంలో ఉన్న మితవాద పార్టీ మైనార్టీలో ప్రభుత్వం పడకుండా సిప్రాస్‌కు అనుకూలంగా నిలిచింది. దేశ సుస్థిరత, ప్రతిష్టకోసం తనపై విశ్వాసాన్ని ప్రకటించాలని సిప్రాస్ సభ్యులనుద్దేశించి విజ్ఞప్తి చేశారు. ఐరోపాలో 13 ప్రభుత్వాలు ప్రస్తుతం మైనార్టీలో ఉన్నాయని సిప్రాస్ ప్రకటించారు. తాను పదవినుండి తప్పుకుని తక్షణం ఎన్నికలు నిర్వహించాలని కోరిన ప్రతిపక్షానికి జవాబుగా ఆయన ఈ అంశం తెలియజేశారు.

కార్చిచ్చుపై ఏర్పాట్లకు ఆటంకం

పోర్టులాండ్ : అమెరికాలో ప్రత్యేకించి కాలిఫోర్నియా ప్రాంతంలో ప్రతి ఏడాది అడవులు కాలిపోయి తీవ్రనష్టం కలిగిస్తూ ఉంటాయి. అయితే ఈ నష్టాలను తగ్గించేందుకు, వీలైనమేర అడవులు కాలిపోకుండా నివారించేందుకు, మంటలు విస్తరించి నప్పుడు వాటిని అదుపులోకి తెచ్చేందుకు అధికారులు సీజన్‌కు రెండు నెలలు ముందుగానే తగిన ఏర్పాట్లు చేసుకుంటారు. అయితే దాదాపు 25 రోజులకుపైగా ట్రంప్ ప్రభుత్వం పాక్షికంగా మూతపడివుండటంతో అధికారులు కార్చిచ్చును అదుపుచేసే ఏర్పాట్లను చేసుకునేందుకు ఆటంకం కలుగుతోందని సంబంధిత వర్గాలు తెలిపాయి. మంటలను ఆర్పేందుకు అవసరమైన శిక్షణా కోర్సులను తాత్కాలికంగా రద్దు చేశారు. ఫెడరల్ ప్రభుత్వం నియంత్రణలోవున్న అడవులలో కాలిపోయిన చెట్ల అవశేషాలను తొలగించే కార్యక్రమానికి కూడా ఆటంకం కలిగింది. ప్రభుత్వం పనిచేయకపోవటంవల్ల ఫెడరల్ ఉద్యోగులకు వేతనాలురాక ఇబ్బందులు పడుతున్నారు. మంటలను అదుపులోకి తీసుకురావడానికి ఉన్నతస్థాయి మేనేజర్లు, కాంట్రాక్టర్లు ముందుగానే సాధారణంగా సిద్ధమౌతారు. రాష్ట్రస్థాయి, స్థానిక సిబ్బందికి ముందుగా శిక్షణ ఇస్తారు. మంటలను ఆర్పేందుకు అవసరమైన నీరు లేదా ఇతర మార్గాలను అవలంభించడానికి తగిన వసతులను ముందుగానే ఏర్పాటు చేసుకుంటారు. మార్చి ప్రారంభంనుండే అక్కడక్కడ అడవులు అంటుకోవడం ఉంటుంది. ఏప్రిల్‌లో అడవులు అంటుకోవడం ఎక్కువగానే సంభవిస్తుంది. గత ఏడాది ఉత్తర కాలిఫోర్నియా పట్టణం పారడైజ్‌కు కార్చిచ్చువల్ల భారీగా నష్టం జరిగింది. మంటలను అదుపుచేసేందుకు విమానాలను సైతం వినియోగించారు. కార్చిచ్చును అదుపులోకి తీసుకురావడానికి కొన్ని నెలలు పట్టింది. వీరు తమ కార్యకలాపాలను ముగించుకుని కొన్ని నెలలు అయింది. ఈలోపే మళ్లీ సీజన్ ప్రారంభం కాబోతోంది. మరో రెండు నెలల్లోనే అడవులలో మంటలు ఆర్పేందుకు సిద్ధంకావలసిన పరిస్థితి ఉన్నది. పారడైజ్ పట్టణంలో సంభవించిన అగ్నిప్రమాదం గతంలో ఏనాడూ జరగలేదన్న అభిప్రాయం వ్యక్తమైంది.

సూడాన్‌కు అరబ్ రాయబారుల మద్దతు

ఖర్టౌమ్ : సూడాన్ ప్రభుత్వానికి అరబ్ రాయబారులు తమ పూర్తి తోడ్పాటును ప్రకటించారు. ప్రస్తుతం సూడాన్‌లో ప్రజలు ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆందోళనలు జరుపుతున్నారు. దేశంలో సుస్థిరత, భద్రతను కల్పించేందుకు ఈ రాయబారులు తమ మద్దతును ప్రకటించారు. సూడాన్ అధ్యక్షుడి సహాయకుడు పాలక నేషనల్ కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు అయిన ఫైసల్‌హసన్‌ఇబ్రహిం పలుదేశాల రాయబారులతో బుధవారం ఇక్కడ సమావేశమయ్యారు. ఈజిప్టు, సౌదీ అరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, సిరియా, జోర్డాన్, ఎమెన్, ఒమన్ దేశాల రాయబారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. సూడాన్ విదేశాంగ మంత్రిత్వశాఖ కార్యాలయంలో ఈ సమావేశం జరిగింది. ప్రస్తుతం దేశంలోవున్న పరిస్థితులను పూర్తిగా రాయబారులకు ఇబ్రహిం వివరించారు. సూడాన్‌కు మద్దతు తెలియజేస్తూ సౌదీ రాయబారి అలిబిన్‌హసన్, ఈజిప్టు రాయబారి స్వంఎస్సా తదితరులు సూడాన్‌కు తోడ్పాటుగా ఉంటామని హామీ యిచ్చారు. సూడాన్‌తో అన్ని విధాలుగా తాము సంబంధాలను ఏర్పరచుకుంటామని ఈజిప్టు రాయబారి పేర్కొన్నారు. దేశంలో తలెత్తిన సంక్షోభాన్ని పరిష్కరించుకోగలమన్న ఆశాభావాన్ని సూడాన్ అధ్యక్షుడు ఒమర్‌అల్‌బషీర్ వ్యక్తం చేశారు.దేశంలో ఆర్థిక పరిస్థితులు రోజురోజుకూ దిగజారిపోతున్నాయి. నిత్యావసర వస్తువుల ధరలు విరామం లేకుండా పెరుగుతూనే ఉన్నాయి. దీంతో ప్రజలు గత డిసెంబర్ 19 నుండి ఏదో విధమైన ఆందోళనలు కొనసాగిస్తున్నారు.

యాక్..కంపు..!

(మొదటిపేజీ తరువాయి)

ఇటలీలోని వెనిస్ తరహాలో అభివృద్ధి చేస్తామని పాలకులు దశాబ్దాలుగా చేస్తున్న హామీలు కార్యరూపం దాల్చలేకపోతున్నాయి. రాష్ట్ర విభజన తర్వాత విజయవాడను తాత్కాలిక రాజధానిగా ప్రకటించి ఇక్కడ నుంచే పాలన ప్రారంభించిన సీఎం చంద్రబాబు నగరాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామన్నారు. మొత్తం నగరాన్ని నీలి-హరిత శోభితంగా అభివృద్ధి చేసి వేసవి కాలంలో ఉష్ణోగ్రతలను 3 నుంచి 5 డిగ్రీలకు తగ్గించే విధంగా చర్యలు చేపట్టాలని సీఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు. మూడు కాల్వల్లోనూ వివిధ రకాల బోట్లను ఏర్పాటు చేసి పర్యాటకులను ఆకట్టుకునే విధంగా ప్రణాళికలు రూపొందించాలన్నారు. కాల్వల్లో ప్రజా రవాణా వ్యవస్థను కూడా కల్పిస్తామన్నారు. దీంతో బెజవాడ నగరం రాజధాని హంగులను సమకూర్చుకుని మొత్తం రూపురేఖలు మారిపోవడం ఖాయమని ప్రజలు ఊహాలోకాల్లో తేలియాడారు. అయితే సీఎం తరచూ తిరిగే బందరురోడ్, సీఎం క్యాంప్ కార్యాలయం, విమానాశ్రయం వెళ్లే రోడ్డు, పున్నమిఘాట్ వంటి ప్రాంతాలు మినహా మిగిలిన ప్రాంతాలు అభివృద్ధికి ఆమడదూరంలో ఉన్నాయని నగరవాసులు పేర్కొంటున్నారు. ప్రధాన ప్రాంతాల్లోని కాల్వల ఒడ్డును కార్పెట్ గ్రాస్ (తివాచీ గడ్డి) పరచగా, కొన్ని ప్రాంతాల్లో రంగురంగుల మొక్కలు నాటి అధికారులు చేతులు దులిపేసుకున్నారని విమర్శలు గుప్పిస్తున్నారు.

నాలుగున్నరేళ్లలో వంద కోట్లుపైనే ఖర్చు

ప్రభుత్వంలోని వివిధశాఖలు విజయవాడ నగరాభివృద్ధి కోసం రూ. 100 కోట్లకు పైగా వినియోగించాయి. ముఖ్యంగా విజయవాడ మున్సిపల్ కార్పోరేషన్ (వీఎంసీ), రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ (సీఆర్‌డీఏ), అమరావతి అభివృద్ధి సంస్థ (ఏడీసీ), పర్యాటకశాఖలు విజయవాడ సుందరీకరణకు ప్రణాళికలైతే రూపొందించి పనులైతే చేస్తున్నాయే కానీ నగరం ఆశించిన స్థాయిలో నీలి-హరిత సోయగాలతో అలరించలేకపోతోంది. కృష్ణాపుష్కరాలు-2016 సందర్భంగా ప్రభుత్వం నగర సుందరీకరణకు రూ. 50 కోట్లు వెచ్చించింది. తర్వాత పర్యాటకశాఖ మరో రూ. 2 కోట్లతో కాల్వ గట్లను అభివృద్ధి చేసేందుకు ఖర్చు చేసింది. గత సంవత్సరం రూ. 61 కోట్లతో నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపటినట్లు జిల్లా కలెక్టర్ బి.లక్ష్మీకాంతం వెల్లడించారు. నగరంలోని మూడు కాల్వ గట్లను 18 కిలోమీటర్ల మేరా ఆహ్లాదవాతారణం కల్పిస్తామన్నారు. సీఎం చంద్రబాబు 2017వ సంవత్సరం అక్టోబరులో నగరంలో ఆకస్మికంగా తనిఖీలు చేసిన సందర్భంలోనూ అనేక వాగ్దానాలు చేశారు. తీరా అక్కడక్కడా నామమాత్రంగా పచ్చదనం తప్ప కాల్వల్లో ఎక్కడా నీరు లేని పరిస్థితి. పలు ప్రాంతాల్లో కాలువ గట్ల వెంట పరచిన కార్పెట్ గ్రాస్ సరైన నిర్వహణ లేక ఎండిపోతోంది. కొన్నేళ్లుగా వర్షాభావ పరిస్థితులు నెలకొనడంతో ప్రకాశం బ్యారేజీ వద్ద పూర్తిగా 12 అడుగుల నీటి మట్టాన్ని కొనసాగించే పరిస్థితి లేదు. దీంతో అన్ని కాలాల్లో కాల్వల్లో నీటిని విడుదల చేయడం కష్టమేనని జలవనరులశాఖ అధికారులు స్పష్టం చేస్తున్నారు. కృష్ణాడెల్టా ఆయకట్టుకు నీటి సరఫరా నిలిచిపోవడంతో ప్రస్తుతం నివాసాల్లోని వ్యర్థజలాలు డ్రైనేజీల ద్వారా ప్రధాన కాల్వల్లోకి చేరుతున్నాయి. ప్రజారోగ్యానికి సవాలు విసురుతున్నాయి.

కొలువు తీరిన టీ-అసెంబ్లీ

(మొదటిపేజీ తరువాయి)

ఎన్నికైన డి.అనసూయ (సీతక్క)(కాంగ్రెస్), నల్గొండ జిల్లా ఆలేరు నుంచి ఎన్నికైన గొంగిడి సునీత (టీఆర్ఎస్), మెదక్ జిల్లా నుంచి ఎన్నికైన పద్మా దేవేందర్ రెడ్డి (టీఆర్ఎస్), రంగారెడ్డి జిల్లా, మహేశ్వరం నుంచి ఎన్నికైన సబితా ఇంద్రారెడ్డి(కాంగ్రెస్) వరుసగా ప్రమాణస్వీకారం చేశారు. మహిళా ఎమ్మెల్యేలుగా ఎన్నికైన ఆరుగురిలో ఇద్దరు ఆంగ్లంలో ప్రమాణ స్వీకారం చేయగా, మిగతా నలుగురు తెలుగులో ప్రమాణం చేశారు. వీరి తర్వాత ఆంగ్ల అక్షమాలిక ప్రకారం మిగతా ఎమ్మెల్యేలు ప్రమాణ స్వీకారం చేశారు. మొత్తం 114 ఎమ్మెల్యేలు ప్రమాణం చేశారు. దాదాపు రెండున్నర గంటలపాటు ప్రమాణ స్వీకార కార్యక్రమం జరిగింది. బీజేపీ సభ్యులు రాజాసింగ్, టీడీపీ సభ్యులు సండ్ర వెంకటవీరయ్య, టీఆర్ఎస్ సభ్యులు మాదవరం కృష్ణారావు, ఎంఐఎం సభ్యులు అక్బరుద్దీన్ ఓవైసీ, జాఫర్ హుస్సేన్ సభకు హాజరు కాలేదు. ఎంఐఎం పార్టీకి చెందిన ప్రొటెం స్పీకర్ ముందు తాను ప్రమాణం చేయలేనని.. అసెంబ్లీకి రానని.. రాజాసింగ్ ముందే తెలిపిన విషయం తెలిసిందే. ఈ సారి సభలో సీనియర్ ఎమ్మెల్యే కేసీఆర్ ఉండగా, వనమా వెంకటేశ్వరావు (73) సీనియర్ సభ్యుడిగా ఉన్నారు. వనమా వెంకటేశ్వరావు కొత్తగూడెం నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ తరపున గెలుపొందారు. సభలో అందరికి కంటే అత్యంత పిన్న సభ్యురాలు బానోతు హరిప్రియ. ఆమె వయసు 29 సంవత్సరాలు. ఇల్లందు నుంచి కాంగ్రెస్ తరపున పోటీ చేసిన హరిప్రియ బానోతు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ఎమ్మెల్యేలతో ప్రమాణం చేయించిన అనంతరం ప్రొటెం స్పీకర్ ముంతాజ్ అహ్మద్‌ఖాన్ సభను శుక్రవారానికి వాయిదా వేశారు.

అసెంబ్లీకి ఎన్నికైన 119 మందిలో టీఆర్ఎస్ నుంచి 88 మంది ఎమ్మెల్యేలు, కాంగ్రెస్ నుంచి 19 మంది ఎమ్మెల్యేలు, ఏడుగురు ఎంఐఎం ఎమ్మెల్యేలు, తెలుగుదేశం పార్టీ నుంచి ఇద్దరు ఎమ్మెల్యేలు, ఒక బిజెపి ఎమ్మెల్యే ఉన్నారు. వీరితోపాటు ఇద్దరు ఇండిపెండెట్లు ఎంపికయ్యారు. వీరు అధికారిక పార్టీలో చేరడంతో టీఆర్ఎస్ ఎమ్మెల్యేల సంఖ్య 90 కి చేరింది. ఇక వీరితోపాటు ఒక ఆంగ్లో-ఇండియన్ ఉంటారు. గత అసెంబ్లీలో ఉండి ప్రస్తుత అసెంబ్లీకి ఎన్నికైనవారు 76 మంది ఉండగా, ఉమ్మడి అసెంబ్లీలో సభ్యులుగా ఉండి ఎంపికైనవారు 16 మంది ఉన్నారు. 23 మంది సభ్యులు కొత్తగా ఎంపికయ్యారు. ఎమ్మెల్యేలుగా ఎన్నికైన ఎంపీలు ఇద్దరు, ఎమ్మెల్యేలుగా ఎన్నికైన ఎమ్మెల్సీలు ముగ్గురు ఉన్నారు. మహిళా సభ్యులు ఆరుగురు, ముస్లిం మైనారిటీ సభ్యులు ఎనిమిది మంది, ఆంగ్లో ఇండియన్ ఒకరు ఉన్నారు.

తొలిసారి ఎమ్మెల్యేలు: హరిప్రియ నాయక్ - కాంగ్రెస్ (ఇల్లందు), నాగేశ్వరరావు - టీడీపీ (అశ్వరావుపేట), సురేందర్, కాంగ్రెస్ - (ఎల్లారెడ్డి), సుంకె రవిశంకర్-టీఆర్ఎస్ (చొప్పదండి), మెతుకు ఆనంద్-టీఆర్ఎస్ (వికారాబాద్), రోహిత్ రెడ్డి-కాంగ్రెస్ (తాండూరు), హర్షవర్ధన్ రెడ్డి-కాంగ్రెస్ (కొల్లాపూర్), కాలేరు వెంకటేష్-టీఆర్ఎస్ (అంబర్‌పేట్), ఉపేందర్ రెడ్డి-కాంగ్రెస్ (పాలేరు), మల్లారెడ్డి- టీఆర్ఎస్ (మేడ్చల్), బాల్క సుమన్-టీఆర్ఎస్ (చెన్నూరు), రాములు నాయక్-ఇండిపెండెంట్ (వైరా), కొరికంటి చందర్-ఇండిపెండెంట్ (రామగుండం), నరేందర్-టీఆర్ఎస్ (వరంగల్ వెస్ట్), పెద్ది సుదర్శన్ రెడ్డి-టీఆర్ఎస్ (నర్సంపేట), భేతి సుభాష్ రెడ్డి- టీఆర్ఎస్ (ఉప్పల్), ముఠా గోపాల్- టీఆర్ఎస్ (ముషీరాబాద్), కృష్ణమోహన్ రెడ్డి- టీఆర్ఎస్ (గద్వాల్), నరేందర్ రెడ్డి-టీఆర్ఎస్ (కొడంగల్), బొల్లం మల్లయ్య యాదవ్ - టీఆర్ఎస్ (కోదాద), కంచర్ల భూపాల్ రెడ్డి- టీఆర్ఎస్ (నల్గొండ), డాక్టర్ సంజయ్- టీఆర్ఎస్ (జగిత్యాల), క్రాంతి- టీఆర్ఎస్ (అందోల్), నిరంజన్ రెడ్డి- టీఆర్ఎస్ (వనపర్తి), కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి-కాంగ్రెస్ (మునుగోడు), మానిక్ రావు- టీఆర్ఎస్ (జహీరాబాద్), కొప్పుల మహేష్ రెడ్డి -పరిగి (టీఆర్ఎస్).

అమరావతే నెలవు

(మొదటిపేజీ తరువాయి)

మేనేజ్ మెంట్-ఎక్స్‌ఎల్‌ఆర్‌ఐ క్యాంపస్ నిర్మాణానికి ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రముఖ ఎక్స్‌ఎల్‌ఆర్‌ఐ దక్షిణ భారతదేశంలో మొదటి క్యాంపస్‌ని అమరావతిలో నెలకొల్పుతోందని, దాని నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఈ రోజు చాలా మంచి రోజన్నారు. 1949లో ప్రారంభమైన ఈ సంస్థకు జంషెడ్ పూర్, భువనేశ్వర్‌లలో క్యాంపస్‌లు ఉన్నాయని తెలిపారు. మనం 50 ఎకరాల భూమి ఇస్తే రూ.235 కోట్లతో ఇక్కడ క్యాంపస్ నిర్మిస్తున్నారని చెప్పారు. దేశంలో అత్యున్నత విద్యా సంస్థగా ఈ క్యాంపస్ ఎదగాలన్న ఆకాంక్షించారు. ప్రపంచంలోని అత్యున్నత పరిశోధనాసంస్థలతో ఈ సంస్థ అవగాహనా ఒప్పందాలు చేసుకుంటుదని తెలిపారు. ఈ సంస్థ నిర్మించబోయే అంతర్జాతీయ పాఠశాలకు 8 ఎకరాల భూమి ఇస్తున్నట్లు సీఎం ప్రకటించారు. దేశంలోని టాప్ 20 విద్యా సంస్థలలో కనీసం పది సంస్థలకు ఇక్కడకు రప్పిస్తున్నట్లు చెప్పారు. ఇప్పటికే విట్, ఎస్ఆర్ఎం, అమృత వంటి సంస్థలు వచ్చాయని,ఇప్పుడు ఎక్స్‌ఎల్‌ఆర్‌ఐ కూడా వచ్చిందన్నారు. నాలెడ్జిపై పెట్టుబడులు పెడితే మంచి ఫలితాలు వస్తాయన్నారు. రాజధాని అమరావతి నాలెడ్జి ఎకానమీకి కేంద్రంగా అభివృద్ధి చెందుతుందని చెప్పారు. నాలెడ్జి ద్వారానే అన్ని రంగాల్లో సమర్థవంతమైన నాయకత్వం పెంపొందుతుందన్నారు. ఏ రాష్ట్రానికైనా రాజధాని ఆస్తి అన్నారు. అటువంటి రాజధాని నిర్మాణానికి భూములు ఇచ్చిన రైతుల చొరవ, త్యాగం రాష్ట్రం మరువదని చెప్పారు. ఇప్పటివరకు చదువులు, ఉద్యోగాల కోసం మనం ప్రపంచంలోని అన్ని ప్రాంతాలకు వెళ్లేవారమని,ఇక ముందు ప్రపంచమే మన వద్దకు వస్తుందన్నారు.రాష్ట్ర విభజన చట్టం ప్రకారం కేంద్రం ఐఐటీ, ఐఐఎం, వ్యవసాయ విశ్వవిద్యాలయం, ఏఐఎంఎస్ వంటి 11 విద్యాసంస్థలను ఏర్పాటు చేయవలసి ఉందని చెప్పారు.

వాటి కోసం 2,912 ఎకరాల భూమి కేటాయించినట్లు తెలిపారు. అంతే కాకుండా వాటి కాంపౌండ్ వాల్స్ కోసం రూ.132 కోట్లు కేటాయించినట్లు చెప్పారు. దేశంలోని వంద టాప్ విశ్వవిద్యాలయాలలో ఆరు మన రాష్ట్రంలోనే ఉన్నట్లు తెలిపారు. 30 దేశాలు 679 మంది విద్యార్థులను ఎంపిక చేస్తే వారిలో 258 మంది ఆంధ్రప్రదేశ్ వారే ఉన్నట్లు చెప్పారు. ఎవరు అడ్డుకున్నా రాష్ట్రంలో అభివృద్ధి ఆగదని, అనుకున్న లక్ష్యానికి అన్నీ పూర్తి చేస్తామన్నారు. శంకుస్థాపన చేసిన రోజే దాని ప్రారంభోత్సవ తేది నిర్ణయిస్తున్నామని చెప్పారు. అనంతపురం జిల్లాలో ప్రారంభించిన కియా మోటార్స్ తొలి కారు ముందుగా నిర్ణయించిన ప్రకారం ఈ నెల 29న రోడ్డెక్కనున్నట్లు తెలిపారు. అలాగే ఈ సంస్థ కూడా 8 నెలల్లో నిర్మాణం పూర్తి చేస్తుందని ఆశిస్తున్నట్లు చెప్పారు. అమరావతి రాజధానిలో అన్నీ ఆధునిక సౌకర్యాలు కల్పించనున్నట్లు తెలిపారు. ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలిగించకుండా డక్ట్ ద్వారా గ్యాస్, మంచినీరు, సమాచార కేబుల్స్,మురుగు నీరు పారుదల వ్యవస్థ ఏర్పాటు చేస్తున్నామని, రాజధాని మొత్తానికి ఒకేచోట ఏసీ యూనిట్ ఏర్పాటు చేసి కావలసిన ఇంటికి పంపించే వ్యవస్థ చర్యలు తీసుకుంటున్నామన్నారు. వాతావరణ కాలుష్యం ఏర్పడకుండా అమరావతిలో ఎలక్ట్రికల్ వాహనాల వినియోగం పెంచుతామన్నారు. అమరావతిని ఆనందనగరంగా, దేవతల రాజధానిగా అభివర్ణించారు. ఎక్స్‌ఎల్‌ఆర్‌ఐకు ప్రభుత్వం, సీఆర్డీఏ నుంచి సంపూర్ణ సహకారం అందిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మంత్రి డాక్టర్ నారాయణ, తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్,నామినేటెడ్ ఎమ్మెల్యే ఫిలిప్స్ సీ టాచర్ జిల్లా పరిషత్ చైర్ పర్సన్ జానీమూన్, మంగళగిరి మునిసిపల్ చైర్మన్ గంజి చిరంజీవి, జిల్లా కలెక్టర్ కోన శశిధర్, సీఆర్డీఏ కమిషనర్ డాక్టర్ చెరుకూరి శ్రీధర్, గుంటూరు బిషప్ ఫాదర్ బి చిన్నబత్తిని, విజయవాడబిషప్ ఫాదర్ టీ జోసెఫ్ రాజారావు, ఆంధ్ర జోసూట్ ప్రావిన్స్, ప్రావిన్సియల్ ఫాదర్ పీఎస్ అమల్ రాజు, ఎక్స్‌ఎల్‌ఆర్‌ఐ జంషెడ్ పూర్ డైరెక్టర్ ఫాదర్ ఈ.అబ్రహం, అడ్మినిస్ట్రేటివ్ అండ్ ఫైనాన్స్ డీన్ ఫాదర్ జెరోమ్ కుటిన్హా, అకడమిక్ డీన్ డాక్టర్ అశీష్ కె పాణి, అమరావతి చీఫ్ అడ్మినిస్ట్రేటిల్ ఆఫీసర్ ఫాదర్ కె.ఎస్.కాసిమర్ తదితరులు పాల్గొన్నారు.

సభాపతి పోచారం

(మొదటిపేజీ తరువాయి)

ఒక్క నామినేషన్ మాత్రమే దాఖలైంది. పోచారం శ్రీనివాస్‌రెడ్డి మాత్రమే నామినేషన్ దాఖలు చేయడంతో ఆయన ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శుక్రవారం ఉదయం 11 గంటలకు ఆయన తెలంగాణ రెండో స్పీకర్‌గా బాధ్యతలు స్వీకరించనున్నారు. శ్రీనివాస్ రెడ్డికి స్పీకర్ పదవి రావడంతో బాన్సువాడలో సంబరాలు వెల్లువెత్తాయి. టీఆర్ఎస్ నాయకులు, శ్రేణులు మిఠాయిలు పంచుకొని తమ ఆనందాన్ని వ్యక్తంచేశారు. ఉదయం పోచారం శ్రీనివాస్‌రెడ్డి అసెంబ్లీ కార్యదర్శి కార్యాలయంలో నామినేషన్ పత్రాలు సమర్పించిన సంగతి తెలిసిందే. ఈ కార్యక్రమానికి సీఎం కేసీఆర్‌తో పాటు, కాంగ్రెస్ ఎమ్మెల్యే భట్టి విక్రమార్క, ఎంఐఎం ఎమ్మెల్యే బలాల హాజరయ్యారు. స్పీకర్‌గా పోచారానికి అన్ని పార్టీలు మద్దతు తెలిపాయి. గురువారం ఉదయమే పోచారం పేరును ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు ఖరారు చేశారు. కాంగ్రెస్ పార్టీ కూడా స్పీకర్ ఎన్నికకు మద్దతు తెలపడంతో పోచారం ఎన్నిక ఏకగ్రీవం అయింది. అంగ్లంపై పట్టు ఉండటంతో సభ నిర్వహణలో కూడా ఇబ్బందులు ఉండవనే ఉద్దేశంతో శ్రీనివాస్‌రెడ్డి వైపు కెసిఆర్ మొగ్గు చూపారు. తెలంగాణ ఉద్యమ సమయంలో టిడిపి నుంచి టిఆర్ఎస్‌లో చేరిన పోచారం శ్రీనివాస్‌రెడ్డి, కెసిఆర్‌కు అత్యంత సన్నిహితుడిగా ఉంటున్నారు. కేసీఆర్ గత ప్రభుత్వంలోనూ పోచారానికి కీలకమైన వ్యవసాయ శాఖను అప్పగించారు. పోచారం శ్రీనివాస్‌రెడ్డి బాన్సువాడ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఆరుసార్లు పోటీ చేసి, ఐదుసార్లు విజయం సాధించారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో అందరికన్నా సీనియర్ రాజకీయ నాయకుడిగా కొనసాగుతున్నారు. 1976లో రాజకీయాల్లో అడుగు పెట్టిన పోచారం.. 1977లో దేశాయిపేట సింగిల్‌విండో చైర్మన్‌గా ఎన్నికయ్యారు. 1987లో డీసీసీబీ చైర్మన్‌గా పనిచేశారు. 1994లో తొలిసారి బాన్సువాడ నుంచి తెలుగుదేశం పార్టీ తరపున పోటీచేసి ఎమ్మెల్యే అయ్యారు. 1998లో గృహ నిర్మాణ శాఖ మంత్రిగా పనిచేశారు. 1999లో రెండోసారి ఎమ్మెల్యేగా గెలుపొంది భూగర్భ గనులు, జల వనరుల శాఖ మంత్రిగా పనిచేశారు. కొంత కాలం పంచాయతీ రాజ్ శాఖ మంత్రిగా కూడా ఉన్నారు. 2004లో ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓటమి చెందారు. 2009లో టిడిపి అభ్యర్థిగా మరోసారి ఎమ్మెల్యేగా పోటీ చేసి విజయం సాధించారు. 2011లో తెలంగాణ ఉద్యమంలో ఆయన తన పదవికి రాజీనామా చేసి టీఆర్ఎస్‌లో చేరారు. ఉప ఎన్నికలో మళ్లీ గెలిచారు. 2014లో గెలిచి సిఎం కెసిఆర్ నాయకత్వంలోని తెలంగాణ తొలి ప్రభుత్వంలో వ్యవసాయ శాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వహించి, లక్ష్మీపుత్రుడిగా పేరుగాంచారు. తాజాగా జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లోనూ బాన్సువాడ నుంచి ఆయన ఘన విజయం సాధించారు. మరోవైపు స్పీకర్‌గా పోచారం శ్రీనివాసరెడ్డి అభ్యర్థిత్వం ఖరారు అయిన పక్షంలో డిప్యూటీ స్పీకర్‌గా రేఖా నాయక్ పేరు కూడా ఖరారు అవుతుందనే ప్రచారం పార్టీలో జోరుగా సాగుతోంది. టిఆర్ఎస్ పార్టీ తరపున రెండోసారి ఖానాపూర్ నియోజకవర్గం నుంచి రేఖా ఎన్నికయ్యారు. డిప్యూటీ స్పీకర్ పదవిని రేఖా నాయక్ కు కట్టబెట్టేందుకు కేసీఆర్ నిర్ణయం తీసుకున్నారనే ప్రచారం జరుగుతోంది. ఎస్టీ కోటాలో రేఖా నాయక్‌కు డిప్యూటీ స్పీకర్ పదవిని కట్టబెట్టాలని నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది. గతంలో తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గా మధుసూదన్ రెడ్డి వ్యవహరించగా, ఉప సభాపతిగా పద్మా దేవేందర్ రెడ్డి వ్యవహరించిన విషయం తెలిసిందే.

ప్రజాస్వామ్యాన్ని కించపరచడమే

(మొదటిపేజీ తరువాయి)

తప్పుపట్టడమంటే న్యాయవ్యవస్థకు వ్యతిరేకం, పార్లమెంటరీ ప్రజాస్వామ్యానికి వ్యతిరేకం, లౌకికవాదానికి వ్యతిరేకం, స్త్రీలకు సమానహక్కులు ఇవ్వడానికి వ్యతిరేకంగా పేర్కొన్నారు. ఇది పచ్చి అవకాశవాదమన్నారు. మహారాష్ట్రలోని శనిసింగనాపూర్‌లో మహిళల ప్రవేశానికి సంబంధించి సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును అమలు చేస్తున్న మహారాష్ట్ర ప్రభుత్వాన్ని సమర్థిస్తున్న ప్రధానమంత్రి శబరిమల విషయంలో ఎల్‌డీఎఫ్ ప్రభుత్వాన్ని తప్పుపట్టడం పచ్చి అవకాశవాదానికి నిదర్శనమన్నారు. శబరిమల తీర్పు ఎల్డీఎఫ్ ప్రభుత్వం ఇచ్చింది కాదనీ, దేశ అత్యున్నత న్యాయస్థానం ఇచ్చిందని, ఆ తీర్పును అమలు చేయకపోతే, కమ్యూనిస్టులు రాజ్యాంగ వ్యతిరేకులు ఆ ప్రభుత్వాన్ని రద్దు చేయమని అంటారన్నారు. అమలు చేస్తేనేమో సంస్కృతికి వ్యతిరేకమంటున్నారని చెప్పారు. ఎల్డీఎఫ్ ప్రభుత్వాన్ని పడగొట్టడమే ప్రధాని వ్యాఖ్యల ముఖ్యోద్దేశమన్నారు. ఒక ప్రధానమంత్రిగా కాకుండా గుజరాత్‌లో ఒక మున్సిపాలిటి కమిషనర్‌గా, ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తగా మోడీ మాట్లాడుతున్నారు తప్ప దేశ ప్రజాస్వామ్యాన్ని ప్రతిబింబించే విధంగా మాట్లాడడంలేదన్నారు. ఆయన వ్యాఖ్యలు లౌకికవ్యవస్థ తలదించుకునే విధంగా ఉన్నాయని నారాయణ చెప్పారు.

ప్రధాని వ్యాఖ్యలు రాజ్యాంగ వ్యతిరేకంగా, ప్రజాస్వామ్యాన్ని కించపరిచే విధంగా ఉన్నాయని విజయవాడలో మీడియాతో మాట్లాడుతూ, రామకృష్ణ అన్నారు. ప్రత్యేకించి శబరిమల విషయంలో కేరళలో వామపక్షాల వైఖరి అక్కడి ప్రభుత్వమో, ముఖ్యమంత్రో నిర్ణయం చేసి అమలుపరిచింది కాదని, సుప్రీంకోర్టు తీర్పని స్పష్టం చేశారు. అత్యున్న న్యాయస్థానం తీర్పు శిరోధార్యం అనీ, ఏ పార్టీ ప్రభుత్వం ఉన్నప్పటికీ ఆ తీర్పును అమలు చేసి తీరాల్సిందేనని, ధిక్కరించకూడదని చెప్పారు. ఒక వేళ తీర్పు నచ్చకపోతే రివ్యూ పిటీషన్ వేయాలని అన్నారు. తీర్పును అమలు చేసిన ఎల్డీఎఫ్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా వ్యాఖ్యలు చేసిన ప్రధానమంత్రి సుప్రీంకోర్టు తీర్పుల పట్ల, కోర్టు పట్ల, న్యాయవ్యవస్థ పట్ల గౌరవం ఉన్నదో, లేదో తేల్చుకోవాలన్నారు. ప్రధానమంత్రి స్థానంలో ఉన్న వ్యక్తి తీర్పును అమలు చేసిన రాష్ట్ర ప్రభుత్వ విధానాన్ని వ్యతిరేకించే, కించపరిచే విధంగా వ్యాఖ్యలు చేయడం సమంజసం కాదని అన్నారు. ఆయన మాటల్లో కమ్యూనిస్టు వ్యతిరేకత స్పష్టమౌతోందన్నారు. నరనరాన కమ్యూనిస్టు వ్యతిరేకత జీర్ణించుకుపోయినందున ఆయన ఈ వ్యాఖ్యలు చేశారని చెప్పారు. చరిత్రను గౌరవించడం, అన్ని మతాల మనోభావాలను గౌరవించే సంస్కృతి కమ్యూనిస్టులకు ఉన్నదని రామకృష్ణ స్పష్టం చేశారు. ప్రధానమంత్రి స్థానంలో ఉన్న వ్యక్తి హుందాగా వ్యవహరించి తన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని డిమాండు చేశారు. ఈ ఏడాది జరగనున్న సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ఆయన ఈ వ్యాఖ్యలు చేశారని, ఈ వ్యాఖ్యలపై ప్రధాని జాతికి సమాధానం చెప్పాలని రామకృష్ణ డిమాండు చేశారు.

30 నుంచి అసెంబ్లీ

(మొదటిపేజీ తరువాయి)

ఈ సమావేశాల్లో తీసుకొచ్చే అవకాశముంది. ఈ ప్రభుత్వానికి ఇవే చివరి సమావేశాలు కానుండడంతో వచ్చే ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని పలు సంక్షేమ పథకాలను ఈసమావేశాల్లో ప్రకటించే అవకాశం వుంది. గత ఏడాది కాలంగా అసెంబ్లీ సమావేశాలకు గైర్హాజరవుతున్న ప్రతిపక్ష వైసీపీ సభ్యులు ఈసారైనా హాజరవుతారా ? లేక మళ్ళీ గైర్హాజరవుతారా ? అనే అంశంపై పార్టీ వర్గాల్లో చర్చ సాగుతోంది.

గోపాలకృష్ణ ద్వివేది

(మొదటిపేజీ తరువాయి)

చేశారు. రాబోయే సార్వత్రిక ఎన్నికల నిర్వహణపై రాజకీయ పార్టీలు, అధికారులతో చర్చిస్తానని ఆయన చెప్పారు. అందరి సమన్వయ సహకారంతో ఎన్నికలను విజయవంతంగా నిర్వహిస్తామని ఆశాభావం వ్యక్తం చేశారు. ఎన్నికలను స్వేచ్ఛగాను, నిజాయితీగాను కొనసాగేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. అన్ని శాఖలు సహకరిస్తే ఎన్నికల ప్రక్రియ విజయవంతమవుతుందని పేర్కొన్నారు.

కట్నం మంటల్లో తల్లి, ఇద్దరు బిడ్డల సజీవ దహనం

- గర్భవతిపై అదనపు కట్నం కోసం ఘాతుకం
- భర్త సహా నలుగురిపై కేసు నమోదు

విశాలాంధ్ర - బనగానపల్లె : సభ్య సమాజాన్ని కలవరపెట్టే కిరాతకం ఇది. అదనపు కట్నం కోసం నాలుగు నెలల గర్భవతిని, ముక్కుపచ్చలారని ఇద్దరు బిడ్డలను నిలువున తగలబెట్టిన రాక్షసత్వం కలవరం సృష్టించింది. స్థానికుల గుండెను పిండేసింది. ఈ దుర్మార్గ ఘటన ఎందరినో కలచి వేసింది. కర్నూలు జిల్లా బనగానపల్లె మండలంలోని నందివర్గం పోలీస్‌స్టేషన్ పరిధిలోని పండ్లాపురం గ్రామంలో గురువారం పుట్టా వెంకటలక్ష్మమ్మ(35) ఇద్దరు చిన్నారులు పవన్‌కుమార్ (13), పావని (9)లను అత్తింటివారు సజీవదహనం చేసిన కిరాతకం తీవ్ర సంచలనం రేపింది నందివర్గం ఎస్సై హరిప్రసాద్ వివరాల మేరకు బేతంచెర్లకు చెందిన గోవిందప్ప కుమార్తె వెంకటలక్ష్మమ్మకు, పండ్లాపురం గ్రామానికి చెందిన శివరామయ్యకు 15 ఏళ్ల కిందట వివాహం జరిగింది. మృతురాలి పుట్టింటి బంధువుల వివరాల మేరకు కొన్నేళ్లుగా వెంకటలక్ష్మమ్మను భర్త శివరామయ్య, అత్త లక్ష్మమ్మ, మామ చిన్నలక్ష్మన్న అదనపు కట్నంకోసం వేధిస్తున్నారు. నాలుగు నెలల గర్భవతి కాగ గర్భం తీయించుకోవాలని, ఇక పిల్లలు వద్దని వెంకటలక్ష్మమ్మపై ఒత్తిడి తీసుకువచారు. గర్భం తీయించుకొనేందుకు ఇష్టం లేని ఆమె వారి వేధింపులను ఇంతకాలం భరించింది. గురువారం తెల్లవారుజామున భర్త, అత్తమామలు, మరిది రాజశేఖర్ వెంకటలక్ష్మమ్మ, ఇద్దరు పిల్లలు పవన్‌కుమార్, పావనిలపై డీజిల్‌పోసి నిప్పంటించి తగులబెట్టారు. మృతురాలి సోదరుడు కొట్టాల వెంకటాద్రి ఈ మేరకు ఫిర్యాదు చేశారు. ఈ సమాచారంతో పోలీసులు పండ్లాపురం గ్రామానికి చేరుకుని తల్లి, ఇద్దరు పిల్లల మృతదేహాలను స్వాధీనం చేసుకున్నారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం బనగానపల్లె ప్రభుత్వాస్పత్రికి తరలించి భర్త, అత్త, మామ, మరిదిలపై కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు.



రబీకి చీడ పీడ..!

- పంటలకు తెగుళ్లు
- రైతు గుండెల్లో దిగులు
- 6,786 హెక్టార్లలో నష్టం
- జొన్న, మొక్కజొన్నకు 'కత్తెర'
- విరిగిన వరి వెన్ను
- అపరాలను పీల్చేస్తున్న పురుగు
- నివారణ చర్యలు అత్యవసరం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : రబీలో పంటలకు తెగుళ్ల ఆశిస్తున్నాయి. రాత్రి సమయంలో విపరీతంగా మంచు పడటం, పగటిపూట ఎండలతో చీడపీడలు ప్రభావం తారా స్థాయికి చేరుతోంది. . ఉష్ణోగ్రతల్లో పెను మార్పుల వలనే తెగుళ్ల విస్తరిస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ఈఏడాది రబీలో సాధారణ సాగు విస్తీర్ణం 23.43 లక్షల హెక్టార్లు కాగా.. ఇప్పటి వరకు 17.81లక్షల హెక్టార్లలో పంటలను సాగు చేశారు. అంటే 76 శాతం విస్తీర్ణంలోనే సాగు జరిగింది. రాష్ట్ర వ్యాప్తంగా 6,786 హెక్టార్లలో వివిధ తెగుళ్లను గుర్తించినట్లు వ్యవసాయ శాఖ అధికారులు ప్రకటించారు. ప్రధానంగా చిత్తూరు, అనంతపురం, కృష్ణా, పశ్చిమ గోదావరి, శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాల్లో జొన్న, మొక్క జొన్న పంటలకు కత్తెర పురుగు ఆశించింది. దీంతో పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. . కత్తెర పురుగు ఆకులతోపాటు మొక్కలను కూడా తినేస్తుంది. దీంతో రైతన్న బెంబేలెత్తిపోతున్నాడు. అలాగే చిత్తూరు, కర్నూలు, అనంతపురం, కడపజిల్లాల్లో వరిపంటకు ఆకుముడత, కాండం తొలుచుపురుగు సోకింది. కృష్ణా, ప్రకాశం జిల్లాల్లో శనగ పంటకు రసం పీల్చే పురుగు ఆశించింది. కర్నూలు జిల్లాలో పెసర పంటకు రసం పీల్చే పురుగు సోకింది. కృష్ణా, గుంటూరు, చిత్తూరు, అనంతపురం జిల్లాల్లో మినుము, వేరుశనగ పంటలకు రసం పీల్చే పురుగు ఆశించింది. కృష్ణా, గుంటూరు, ప్రకాశం, కర్నూలు, చిత్తూరు జిల్లాల్లో మిర్చి పంటకు ఆకుమచ్చ తెగులు ఆశించింది. కర్నూలు జిల్లాలో కందిపంటలో మరుకామచ్చల పురుగు కనిపించింది. దీంతో రైతులు బెంబేలెత్తిపోతున్నారు. పంటలు ఏపుగా ఎదిగే తరు ణంలో పురుగు దాడి చేయడంతో అన్నదాత ఆందోళన చెందుతున్నాడు. వ్యవసాయశాఖ అధికారులు 6,786 హెక్టార్లలో గుర్తించినట్లు ప్రకటించినప్పటికీ అనధి కారికంగా చూస్తే ఇరవై ఐదువేల హెక్టార్లలో తెగుళ్లు ఉండవచ్చునని రైతాంగం చెబుతుంది. ఈనేపథ్యంలో యుద్ధప్రాతిపదికన నివారణ చర్యలు చేపట్టాల్సి ఉంది. తెగుళ్ల నివారణకు సంబంధించి మందుల పిచికారీపై వ్యవసాయాధికారులు రైతాంగాన్ని అవగాహన కల్పిం చాల్సిఉంది. గత ఖరీఫ్ సీజన్‌లో జొన్న, మొక్కజొన్నపై కత్తెరపురుగు దాడి చేయడం వలన రైతాంగం తీవ్రంగా నష్టపోయింది. వేల క్వింటాల్ దిగుబడులు పడిపో యాయి. కత్తెర పురుగు ఉధృతిని నివారించడంలో అధికార యంత్రాంగం కూడా విఫలం చెందింది. తాజాగా రబీ సీజన్‌లో కూడా కత్తెర పురుగు సోకడంతో రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. సాంప్రదాయ బద్ధమైన మందులను పిచికారి చేసినప్పటికీ కత్తెర పురుగు లొంగకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. వేరుశనగ, శనగ, పెసర, మినుము పంటలకు రసం పీల్చే పురుగు ఆశించడంతో ఆకులు ఎండిపోతున్నాయి. దీనివలన మొక్కల ఎదుగుదల ఆగిపోతుంది. ఈనేపథ్యంలో తీవ్ర నష్టం జరుగుతాదని రైతన్న ఆందోళన చెందుతున్నాడు. గత ఖరీఫ్ సీజన్‌లో కరవు, భారీ వర్షాలు, తిత్లీ తుపాను వలన రైతన్న తీవ్రంగా నష్టపోగా, రబీ సీజన్‌లో వాతావరణ పరిస్థితుల వలన తెగుళ్లు సోకి రైతన్న నష్టపోతున్నాడు.



ముందుకు కదలని సాగు

రబీ సీజన్ ఆరంభమై నాలుగు నెలలు గడుస్తున్నప్పటికీ సాగు ముందుకు కదలడంలేదు. 23.43లక్షల హెక్టార్లలో సాగు చేయాల్సి ఉండగా కేవలం 17.81 లక్షల హెక్టార్లలో నాట్లు వేశారు. ఒకవైపు వర్షాభావ పరిస్థితులు, మరొకవైపు రిజర్వాయర్లలో తగిన నీటి నిల్వలు లేకపోవడంతో సాగు ముందుకు కదలడం లేదు. దీనిలో వరి 4.67లక్షల హెక్టార్లలో, శనగలు 4.57లక్షల హెక్టార్లలో, మొక్కజొన్న 1.18లక్షల హెక్టార్లలో, మినుము 2.38లక్షల హెక్టార్లలో, పెసలు 76వేల హెక్టార్లలో, వేరుశనగ 50వేల హెక్టార్లలో, మిర్చి 14వేల హెక్టార్లలో, జొన్న లక్ష హెక్టార్లలో సాగు చేశా రు. ప్రధానంగా ఈశాన్య రుతుపవనాల వలన ఆశించినస్థాయిలో వర్షాలు కురవకపోవడంతో రబీ సీజన్ నత్తనడకన సాగుతుంది.

బీసీలను ఓసీల్లో కలిపేస్తుంటే

ఏం చేస్తున్నారు..!?

టీడీపీ అధికార ప్రతినిధి అనురాధ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : తెలంగాణలో కేసీఆర్ 26 బీసీ కులాలను ఓసీల్లో కలుపుతుంటే తలసాని శ్రీనివాస్ ఏమి చేస్తున్నారని టీడీపీ అధికార ప్రతినిధి పంచుమర్తి అనురాధ ప్రశ్నించారు. విజయవాడ టీడీపీ కార్యాలయంలో గురువారం జరిగిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడుతూ కేసీఆర్ దగ్గర మార్కులు పొందాలనే తపనతో రాజకీయ భిక్షపెట్టిన టీడీపీపై తలసాని శ్రీనివాస్ అనైతికంగా ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. తెలుగుదేశం పార్టీకి ఉన్న మరొక పేరు బీసీల పార్టీ అన్నారు. అలాంటి పార్టీ బీసీలకు అన్యాయం చేసిందని చెప్పడం తలసాని తెలివితక్కువ తనానికి నిదర్శనమని విమర్శించారు. తెలంగాణలో బీసీలను అణగదొక్క డానికి చేయాల్సిన అన్యాయాలన్నీ చేసిన కేసీఆర్‌ను ఒక్క మాట అనకుండా ఆయన కాళ్లకు తలసాని మొక్కుతున్నారని ధ్వజమెత్తారు. కేసీఆర్, కేటీఆర్, జగన్, తలసానిలు ఒక ముఠాగా ఏర్పడి బీసీల మధ్య చిచ్చుపెట్టి వారిని నాశనం చేయడానికి పన్నాగం పన్నుతున్నారని విమర్శించారు. బీసీలకు స్థానిక సంస్థల్లో 33శాతం రిజర్వేషన్లు ఇచ్చి బీసీలను రాజకీయంగా పైకి తీసుకొచ్చింది టీడీపీనేనని పేర్కొన్నారు. పించన్ల పెంపు వలన ప్రభుత్వ ప్రతిష్ట పెరగడాన్ని చూసి జీర్ణించుకోలేక వైసీపీ నేతలు కొత్త డ్రామాలకు తెరతీశారని అన్నారు.

ఆంధ్రులను అవమానించడమే

రాష్ట్రమంత్రి కొల్లు రవీంద్ర



విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : ఒకవైపు నిత్యం ఆంధ్రప్రదేశ్‌పై కేసీఆర్ విషం చిమ్ముతుంటే ఆయన కుమారుడు కేటీఆర్‌తో వైఎస్ జగన్ భేటీ అవ్వడం ముమ్మాటికీ ఆంధ్రులను అవమానించడమేనని రాష్ట్ర క్రీడలు, న్యాయశాఖ మంత్రి కొల్లు రవీంద్ర విమర్శించారు. విజయవాడలో టీడీపీ కార్యాలయంలో గురువారం జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అవకాశవాద రాజకీయాలు చేసే గద్దలు కేసీఆర్, జగన్‌లని ధ్వజమెత్తారు. కేసీఆర్, జగన్‌ల అపవిత్ర కలయి కపై ఆంధ్రా ప్రజలు రగిలి పోతున్నారని చెప్పారు. ఆంధ్రుల సంస్కృతీ సంప్రదాయాలను నిత్యం తూలనాడుతున్న కేసీఆర్‌తో జగన్ అంటకాగడాన్ని ఆంధ్రులు హర్షించడంలేదని పేర్కొన్నారు. మోడీ డైరెక్షన్‌లో కేసీఆర్ ఏర్పాటు చేసిన ఫెడరల్ ఫ్రం ట్‌కు దేశవ్యాప్తంగా ప్రతికూల పవనాలు వీస్తుంటే జగన్ ఆకూటమికి వత్తాసు పలకడం పలు అను మానాలకు తావిస్తుందని అన్నారు. తనపైన ఉన్న కేసుల నుంచి బయటపడటం కోసం మోడీతో దోస్తీ చేస్తున్న జగన్, ఇప్పుడు హైదరాబాద్‌లో ఆస్తులను కాపాడుకోవడం కేసీఆర్‌కు ఊడిగం చేస్తున్నారని ఆక్షేపించారు. పోలవరం, అమరావతి నిర్మాణాలను అడ్డుకోవాలని కేసులు వేసిన చరిత్ర హీనులతో జగన్ ఎలా భేటీ అవుతారని ప్రశ్నించారు. సమా వేశంలో పౌరసరఫరాలశాఖ రాష్ట్ర డైరెక్టర్ లుక్కా సాయిరాం ప్రసాద్‌గౌడ్, తెలుగు యువత నాయ కులు సూర్యనారాయణ ప్రసాద్, మహ్మద్ ఫైజాన్ తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్ర ద్రోహులు కేసీఆర్, మోడీ మిత్రులా?: వేమూరి ఆనందసూర్య

ఆంధ్రా ద్రోహులైన కేసీఆర్, మోడీలు వైసీపీ అధినేత జగన్‌కు మిత్రులానని రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ వేమూరి ఆనందసూర్య ప్రశ్నించారు. విజయవాడలో టీడీపీ కార్యాలయంలో గురువారం జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఫెడరల్ ఫ్రంట్ పేరుతో ఆంధ్రా ద్రోహుల ఫ్రంట్‌గా ఏర్పడిన కేసీఆర్, జగన్‌లు ఏ ముఖం పెట్టుకుని ప్రజల్లోకి వస్తారని అన్నారు. మోడీ డైరెక్షన్‌లో కేసీఆర్ ఫెడరల్ ఫ్రంట్ ద్వారా ఆంధ్రులకు ద్రోహం చేయడానికి జగన్ సిద్ధ పడుతున్నారని విమర్శించారు. మంత్రి పదవి కోసం ఊడిగం చేస్తున్న తలసాని శ్రీనివాస్ ఒళ్లు దగ్గర పెట్టుకుని మాట్లాడాలని హెచ్చరించారు.

గుండెపోటుతో అగ్రిగోల్డ్ ఏజెంట్ మృతి

విశాలాంధ్ర-విశాఖ సిటీబ్యూరో: పండగ పూట విశాఖ నగరంలోని ఓ కుటుం బంలో విషాధఛాయలు అలముకున్నాయి.. డిపాజిట్ దారుల ఒత్తిడి తట్టుకోలేక అగ్రి ఏజెంట్ గుండెపోటుతో మృతి చెందాడు. కుటుంబ సభ్యుల వివరాలివి... విశాఖ వన్‌టౌన్ ప్రాంతంలోని శ్రీవాసవి కల్యాణమండపం సమీపంలో సప్పా అప్పలరాజు కుటుంబంతో నివాసం ఉంటున్నారు. ఆయన చాలా ఏళ్ళుగా అగ్రిగోల్డ్ ఏజెంట్‌గా చేరి, అగ్రిగోల్డ్ బీఎం కార్డు హోదాలో సంస్థకు విశేష సేవలందించారు. ఎంతో నమ్మకంతో మిత్రులు, బంధువులు తెలిసిన వారందరితో సుమారు రూ.2 కోట్లకు పైగా డిపాజిట్లు చేయిం చారు. అయితే పండుగ సందర్భంగా పలువురు బాధితులు అప్పలరాజు ఇంటికి వచ్చి కట్టిన డబ్బులు ఇవ్వాలని ఒత్తిడి చేశారు. అంతేకాక ఇవ్వలేమని ఖరా ఖండీగా చెప్పడంతో దుర్భాషలాడడంతో తీవ్ర మనస్థాపానికి గురైన అప్పలరాజు గుండెపోటుతో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

రుణాల రద్దు తాత్కాలిక ఉపశమనమే

- విధానపర జోక్యంతో సంస్థాగత మార్పులు అవశ్యం
- విద్యాధిక యువత వ్యవసాయంపై దృష్టి పెట్టాలి
- ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు



హైదరాబాద్ : రుణాల రద్దు తాత్కాలిక ఉపశమనం మాత్రమేననీ, దేశంలో ప్రస్తుతం రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలకు ఏ మాత్రం పరిష్కారం చూపించదని ఉపరాష్ట్రపతి ఎం. వెంకయ్యనాయుడు అన్నారు. వ్యవసాయరంగం పరిస్థితి మెరుగుదలకు దీర్ఘకాలిక చర్యలు అవశ్యమని పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర స్థాయిల్లో విధానపరమైన జోక్యం ద్వారా వ్యవసాయరంగంలో సంస్థాగతమైన మార్పులు తీసుకురాగలమని ఆయన నొక్కిచెప్పారు. 'నిలకడైన, స్మార్టు వ్యవసాయం కోసం వ్యవసాయ పరిష్కారాలను చూపించడం' అనే అంశంపై రెండు రోజుల సమావేశాన్ని గురువారం ఇక్కడ వెంకయ్యనాయుడు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రుణాల రద్దుకు తాను వ్యతిరేకం కాదని స్పష్టం చేశారు. "మీకు సామర్థ్యం ఉన్నప్పుడు, మీరు సంపదకలిగి ఉన్నప్పుడు మాత్రమే పంపిణీ చేయగలుగుతారు. సంపదలేకపోతే, దానిని ఎలా పంపిణీ చేస్తారు?అప్పుడు నీవు బిక్షగాడుగా మారుతావు. అందువల్ల మనం దీర్ఘకాలిక ప్రయోజనాల గురించి ఆలోచించాలి. అనుసంధానం, విద్యుత్, రోడ్లు, నీరు, నిల్వ సదుపాయాలు, శీతలీకరణ పద్ధతులు, మంచి మార్కెట్ వ్యవస్థ, సమయానికి అవసరమైన రుణాలు. ఇవి ఇప్పుడు రైతాంగం ఎదుర్కొంటున్న సవాళ్లు" అని చెప్పారు. రైతుల ఆత్మహత్యలు తీవ్రం కావడంతో ఈ ఏడాది ఉత్తర ప్రదేశ్, పంజాబ్, మహారాష్ట్ర, రాజస్థాన్, కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవసాయ రుణాల రద్దును ప్రకటించాయి. దేశానికి, ప్రపంచానికి నిలకడైన వ్యవసాయం అవసరమని అన్నారు. వ్యవసాయ రంగం అనేక సవాళ్లను ఎదుర్కొంటోందని, ఈ సవాళ్లకు సమగ్ర బహుళ పరిష్కారం అవసరమని చెప్పారు. లాభదాయకంగా లేకపోవడంతో ప్రజలు క్రమంగా వ్యవసాయాన్ని విడిచిపెడుతున్నారని వెంకయ్యనాయుడు ఆందోళన వ్యక్తం చేశారు. "రైతుల బాధలను చూసి నేను నిజంగానే చలించిపోయాను" అని చెప్పారు. వ్యవసాయరంగంలో సవాళ్లను సమర్థమంతంగా ఎదుర్కొని, వ్యవసాయాన్ని లాభదాయకంగా చేసేందుకు పెద్దఎత్తున శాస్త్రీయ, సాంకేతిక అభివృద్ధి అవసరమని అన్నారు. "ఇందుకు ప్రధాన మంత్రి (నరేంద్ర మోడీ) చాలా ఆసక్తికంగా ఉండడం పట్ల నేను చాలా సంతోషంగా ఉన్నాను. ఇందుకు సంబంధించి ఆయన అనేక చర్యలు తీసుకుంటున్నారు. వ్యవసాయరంగంపై ఆయన దృష్టి కేంద్రీకరించారు" గత బడ్జెట్‌లో 11 లక్షల కోట్ల రూపాయల వ్యవసాయ రుణాన్ని కేటాయించడాన్ని వెంకయ్య ప్రస్తావించారు. అది పెద్ద మొత్తమే అయినప్పటికీ, ఇంకా సరిపోదు అని అన్నారు. విద్యాధికులైన యువకులు గ్రామాలకు వెళ్లి వ్యవసాయం చేయాల్సిన అవసరాన్ని ఉపరాష్ట్రపతి నొక్కిచెప్పారు. వ్యవసాయరంగం లాభదాయకం అయినప్పుడే ఇది సాధ్యమవుతుందని అన్నారు.

ఏపీఆర్వో పోస్టులపై

గందరగోళానికి తెర

- పీజీ అభ్యర్థులు అర్హులుగా సవరించిన ప్రభుత్వం
- ఉత్వర్వులు విడుదల చేసిన ఏపీపీఎస్సీ

విశాలాంధ్ర-విశాఖసిటీ: రాష్ట్రంలోని వివిధ ఉద్యోగాల నోటిఫికేషన్లకు సంబంధించి పేర్కొన్న విద్యార్హత కన్నా ఆ విభాగానికి చెందిన అభ్యర్థులు ఉన్నత విద్యార్హత కలిగి ఉన్నా అర్హులే అంటూ ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఉత్తర్వులు విడుదల చేసింది. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల సహాయ పౌర సంబంధాల అధికారి(ఏపీఆర్వో) పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేయడం, దాన్ని బట్టీ ఆ పోస్టులకు జర్నలిజం, పీఆర్ ఒక సబ్జెక్టుగా కలిగిన డిప్లమో, డిగ్రీ అభ్యర్థులు విద్యార్హతగా పేర్కొనడం జరిగింది. కానీ ప్రస్తుతం రాష్ట్రంలో ఆ సబ్జెక్టులో పీజీ చేసిన వారే ఎక్కువగా ఉండడంతో 'ఏపీఆర్వో పోస్టులపై అయోమయం' అనే వార్త కథనంతో ఈ విషయాన్ని విశాలాంధ్ర వెలుగులోకి తెచ్చింది. దీనిపై స్పందించిన రాష్ట్ర ప్రభుత్వం ఆ పోస్టులకు సంబంధించి ఆ సబ్జెక్టులో పీజీ చేసిన వారు కూడా అర్హులే అంటూ సవరణ చేసింది. ఈ మేరకు ఏపీపీఎస్సీ ఉత్తర్వులు కూడా విడుదల చేసింది. దీంతో రాష్ట్రంలో ఇతర ఉద్యోగాల నోటిఫికేషన్లకు కూడా ఈ విధానం వర్తించనుంది.

దివ్యాంగుల సమస్యల పరిష్కారానికి సహకరించండి

రామకృష్ణకు వికలాంగుల హక్కుల వేదిక వినతి

విశాలాంధ్ర-విజయవాడ: ఏపీలోని దివ్యాంగుల సమస్యల పరిష్కారానికి సహకరిచాల్సిందిగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణను ఏపీ వికలాంగుల హక్కుల వేదిక నాయకులు కోరారు. ఈ మేరకు వారు దాసరి భవన్‌లో గురువారం రామకృష్ణను కలిసి వినతి పత్రం అందజేశారు. వికలాంగులకు రాజకీయ రిజర్వేషన్, శారీరక వికలాంగులకు రూ.5వేల పింఛన్, మూగ, చెవిటి, అంధులు, మానసిక వికలాంగులకు రూ.10వేల పింఛన్ ఇవ్వడంతోపాటు వికలాంగుల హక్కుల చట్టం-2016 అమలయ్యేలా చూడాలని విన్న వించారు. ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం, వారి కుటుంబాలకు ఉచిత విద్యుత్, మున్సిపాలిటీల్లో ఇంటి పన్ను రద్దు తోపాటు రుణాలు తదితర సమస్యలను వారు రామకృష్ణ దృష్టికి తీసుకువచ్చారు. తమ సమస్యల పరిష్కారం కోసం ఈనెల 31న 24 గంటలపాటు నిరవధిక దీక్ష చేయనున్నట్లు నాయకులు తెలిపారు. సానుకూలంగా స్పందించిన రామకృష్ణ వికలాంగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. అనంతరం అఖిల భారత వికలాంగుల హక్కుల వేదిక క్యాలెండర్‌ను ఆయన ఆవిష్కరించారు. రామకృష్ణను కలిసినవారిలో వేదిక జాతీయ, రాష్ట్ర అధ్యక్షులు కొల్లి నాగేశ్వరరావు, ధూళిపాళ్ల మల్లిఖార్జునరావు, కార్యదర్శి చోడంపుడి మాణిక్యాలరావు, కృష్ణా జిల్లా అధ్యక్షుడు తీగల ఆంజనేయులు, నగర అధ్యక్షుడు బోసంగి తిరుపతిరావు, నాయకులు పోసి కుమార్, బొచ్చా ఏసు, తాళ్లపోగు వెంకటేశ్వర్లు, ఎన్.శివశంకర్, వేముల మైనర్‌బాబు, పి.బలరామకృష్ణ ఉన్నారు.



20న వ్య.కా.సం రాష్ట్ర కౌన్సిల్

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి : వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర జనరల్ కౌన్సిల్ సమావేశం ఈనెల 20వ తేదీ ఉదయం 10 గంటలకు విజయవాడ దాసరి నాగభూషణరావుభవన్‌లో జరుగుతుందని సంఘ రాష్ట్ర ప్రధానకార్యదర్శి ఆవుల శేఖర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈసమావేశానికి ఇటీవల బీకేఎంయూ నూతన అధ్యక్షులుగా ఎన్నికైన మాజీ ఎమ్మెల్యే పెరియా స్వామి, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి మాజీ ఎమ్మెల్యే కె.రామకృష్ణ హాజరవుతారు. కావున సభ్యులందరూ సకాలంలో తప్పక హాజరు కావాలని శేఖర్ విజ్ఞప్తి చేశారు.

25 మంది టీచర్లకు అంతర్ రాష్ట్ర బదిలీలు..

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: తెలుగు రాష్ట్రాల్లో పనిచేస్తున్న 25మంది ఉపాధ్యాయులకు స్పౌజ్ కోటా కింద అంతర్‌రాష్ట్ర బదిలీలు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఈ మేరకు గురువారం రాష్ట్ర విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఆదిత్యనాథ్‌దాస్ జీవో నంబరు-19 విడుదల చేశారు. తెలంగాణా రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో పనిచేస్తున్న 25మంది ఉపాధ్యాయులు స్పౌజ్ కోటా కింద ఏపీకి బదిలీ చేయాలని అక్కడి టీఆర్‌ఎస్ ప్రభుత్వానికి దరఖాస్తు చేశారు. వారి విజ్ఞప్తి మేరకు ఏపీలోని వివిధ జిల్లాలకు 25మందిని బదిలీ చేశారు.ల

అతిగా స్పందించిన చంద్రబాబు

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: జగన్‌పై దాడి కేసును కేంద్రం నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ (ఎన్‌ఐఏ)కు అప్పగించడంపై సీఎం చంద్రబాబు అతిగా స్పందించారని రామకృష్ణ అన్నారు. విజయవాడలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ విశాఖపట్నం విమానాశ్రయంలో జగన్‌పై దాడి జరిగితే సీఎం హోదాలో చంద్రబాబు వెంటనే స్పందించి జగన్‌కు ఫోన్ చేసి పరామర్శించి యోగక్షేమాలు అడిగి ఉంటే బాగుండేదన్నారు. అయితే దాడి జరిగిన చాలా సేపటి తర్వాత మీడియా సమావేశాన్ని ఏర్పాటు చేసి ఇదంతా డ్రామా అటూ నీరుగార్చే ప్రయత్నాలు చేశారన్నారు. విమానాశ్రయంలో జరగిన దాడి కనుక ఇది రాష్ట్ర పరిధిలోకి రాదని, కేంద్రానికి సంబంధించిందని స్వయంగా చంద్రబాబే చెప్పారన్నారు. తీరా కేంద్రం ఈ కేసును ఎన్‌ఐఏకు అప్పగిస్తే చంద్రబాబు అభ్యంతరం చెబుతూ 5 పేజీల లేఖను ప్రధాని మోడీకి రాయడం సరికాదన్నారు. కేంద్ర సంస్థ దర్యాప్తు చేస్తే రాష్ట్ర ప్రభుత్వం సహకరించాలే కానీ ఈ విధంగా అడ్డు చెప్పడం సబబుగా లేదన్నారు. ఈ కేసును మొదట దర్యాప్తు చేసిన సిట్ అన్ని వివరాలను ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వానికి అందచేసిందన్నారు. వీటిని ప్రభుత్వమే బహిర్గతం చేసి ఉంటే బాగుండేదన్నారు. తీరా ఎన్‌ఐఏ దర్యాప్తు చేపడితే రికార్డులు ఇవ్వం.. సహకరించం.. అని చెప్పడం దారుణమన్నారు. దీంతో రాష్ట్ర ప్రభుత్వం వాస్తవాలు దాస్తోంది, సజావుగా విచారణ జరగడం ఇష్టంలేదనే అనుమానాలను ప్రభుత్వమే ప్రజల్లో కలిగిస్తోందన్నారు. జాతీయ సంస్థ ఎన్‌ఐఏతో దర్యాప్తు చేస్తే వాస్తవాలు తప్పకుండా వెలుగులోకి వస్తాయని రామకృష్ణ అన్నారు.



35శాతం మధ్యంతర భృతి ఇవ్వకుంటే

మహోద్యమం

- ఎస్టీయూ రాష్ట్ర కార్యవర్గం తీర్మానం
- పెండింగ్ డీఏల అమలుకు డిమాండు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: పెరిగిన ధరలకు అనుగుణంగా 35శాతం మధ్యంతర భృతిని ప్రభుత్వం ప్రకటించకుంటే ఉద్యోగ సంఘాల జేఏసీతో కలిసి మహోద్యమం చేపడతామని ఎస్టీయూ రాష్ట్ర కార్యవర్గం తీర్మానించింది. విజయవాడ ఎస్టీయూ భవన్‌లో గురువారం జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశానికి ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు సీహెచ్ జోసఫ్ సుధీర్‌బాబు అధ్యక్షత వహించారు. విద్య, ఉపాధ్యాయరంగ సమస్యల పరిష్కారంపై కూలంకుషంగా చర్చించారు. సుధీర్‌బాబు మాట్లాడుతూ తక్షణమే గతేడాది జూలై1వ తేదీ నుంచి 35శాతం మధ్యంతర భృతిని ప్రకటించాలని ప్రభుత్వాన్ని డిమాండు చేశారు. సీపీఎస్ విధానాన్ని రద్దు చేసేలా అసెంబ్లీలో తీర్మానించకపోతే పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. స్పెషల్ టీచర్లకు నోషనల్ ఇంక్రిమెంట్ల మంజూరులో జాప్యాన్ని సహించబోమని, పెండింగ్‌లో ఉన్న డీఏలను తక్షణమే మంజూరు చేయాలని డిమాండు చేశారు. నెలనెలా ఉద్యోగుల వేతనాల నుంచి చందాలు మినహాయిస్తున్నప్పటికీ.. హెల్త్‌కార్డుల ద్వారా వైద్యచికిత్సలు సక్రమంగా అందట్లేదన్నారు. బెంగళూరు, చెన్నై, వేలూరు తదితర నగరాల్లోని సూపర్‌స్పెషాలటీ ఆస్పత్రుల్లో హెల్త్‌కార్డులు చెల్లుబాటయ్యేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండు చేశారు. సీఎఫ్‌ఎంఎస్ విధానం అమలులో సమస్యల్ని పరిష్కరించాలని, మున్సిపల్, ఎయిడెడ్, గురుకుల, మోడల్ స్కూళ్లకు ఇచ్చిన హామీలకు అనుగుణంగా ఉత్తర్వులు ఇవ్వాలని డిమాండు చేశారు. సమావేశంలో ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గాజుల నాగేశ్వరరావు తీర్మానాలను ప్రవేశపెట్టగా వాటిని కార్యవర్గం ఏకగ్రీవంగా ఆమోదించింది. ఆర్థిక కార్యదర్శి సుబ్బరాజు, ఉపాధ్యాయవాణి పత్రికా సంపాదకుడు ఎంవీఎస్ఎన్ ప్రసాద్, నీల కంఠయ్య, గంటామోహన్, ఎంవీ రమణప్ప, టీ.వెంకట రమణయ్య, రఘునాథరెడ్డి, షఫీ, సన్యాసిరావు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

నేటి నుంచి ఎస్జీటీ రెడీ...!

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్రవ్యాప్తంగా శుక్రవారం నుంచి సెకండరీ గ్రేడ్ టీచర్స్ (ఎస్జీటీ) పరీక్షలు ప్రారంభమవుతాయి. ఈ పరీక్షలకు దాదాపు రెండు లక్షల మంది దరఖాస్తు చేశారు. ఈ నెల 18వ తేదీ నుంచి 31వరకూ ఆన్‌లైన్లో నిర్వహిస్తారు. పాఠశాల విద్యా కమిషన్ కె.సంధ్యారాణి పర్యవేక్షణలో ఏర్పాట్లు పూర్తి చేశారు. డీఎస్సీ-2018లో భాగంగా తొలివిడతగా.. స్కూల్ అసిస్టెంట్ లాంగ్వేజెస్, నాన్ లాంగ్వేజెస్, లాంగ్వేజీ పండిట్లు, పీఈటీ, డ్రాయింగ్, మ్యూజిక్ పరీక్షలను నిర్వహించారు. ఎస్జీటీ పరీక్షలతోపాటు ఎల్‌పీ(స్పెషల్) పరీక్షలు కొనసాగుతాయి. ఎస్జీటీ పరీక్ష పేపర్‌ను టెట్ కమ్ టీఆర్టీ సిలబస్‌తో 3 గంటల వ్యవధిలో ఉంటుంది. ప్రతిరోజూ ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్లుగా కొనసాగనున్న పరీక్షలకు విద్యాశాఖాధికారులు చర్యలు చేపట్టారు.

ఆ పార్టీలది ఫెవికాల్ బంధం

పీసీసీ ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎన్.తులసిరెడ్డి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఫెడరల్‌ఫ్రంట్ పేరిట టీఆర్‌ఎస్, వైసీపీలు ఫెవికాల్ బంధాన్ని ఏర్పరుచుకున్నాయని పీసీసీ ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎన్.తులసిరెడ్డి విమర్శించారు. విజయవాడ ఆంధ్రరత్నభవన్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రానికి టీఆర్‌ఎస్ పార్టీ తీరని ద్రోహం చేసిందని, డబ్బు కోసం ఆ పార్టీకి రాష్ట్రాన్ని వైసీపీ తాకట్టు పెడుతోందని దుయ్యబట్టారు. వైసీపీ జెండాలో వైసీఆర్ ఫోటో స్థానంలో కేసీఆర్ ఫోటో పెట్టుకోవాలని ఎద్దేవా చేశారు. నవ్యాంధ్ర ప్రజలను, దేశాన్ని అవమానకరంగా కేసీఆర్ వ్యాఖ్యానించారని, సీమాంధ్రుల పంచెలు ఊడదీసి కొడతామని హెచ్చరించారని గుర్తుచేశారు. అలాంటి కేసీఆర్‌తో జగన్ జతకట్టి ఆంధ్రులకు తీరని ద్రోహం చేశారని దుయ్యబట్టారు. తెలంగాణా రాష్ట్ర ఎన్నికల్లో టీఆర్‌ఎస్ గెలిస్తే..ఏపీలో వైసీపీ శ్రేణులు బాణసంచా కాల్చడం విడ్డూరంగా ఉందని మండిపడ్డారు. ప్రత్యేక హోదానే తమ ప్రధాన అజెండా అనే వైసీపీ వ్యాఖ్యల్లో చిత్తశుద్ధి లేదన్నారు. ప్రత్యేక హోదా ఇస్తామంటున్న కాంగ్రెస్‌ను ఎందుకు విమర్శిస్తున్నారని, కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా ఫెడరల్ ఫ్రంట్‌లో ఎందుకు చేరారని ప్రశ్నించారు. రాబోయే ఎన్నికల్లో వైసీపీకి ప్రజలు గుణపాఠం చెప్పాలని కోరారు. ఈ సమావేశంలో పీసీసీ కార్యదర్శి బోడపాటి బాబూరావు పాల్గొన్నారు.

సంపాదకీయం

ఎన్నికల లబ్ధికే ఈ కుట్ర

ఒక ప్రజాస్వామిక అసమ్మతి, ఒక సైద్ధాంతిక విమర్శను దేశ భద్రతకు విఘాతంగా చిత్రించి ప్రజల్ని వంచించేందుకు మోడీ సర్కారు నడుంకట్టింది. యువతరంపైన, ప్రత్యేకించి అణగారిన తరగతులపైన సానుభూతి లేకుండా రాజకీయ వ్యూహాలతో విద్రోహాలు అంటగట్టే దుర్మార్గానికి పాల్పడుతోంది. సంస్కృతి అంటే మతం కాదనీ, దేశమంటే మనుషులేగానీ మతాలూ కాదని నమ్మేవారిపై దేశద్రోహం ముద్ర వేస్తూ ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు నీచమైన ఎత్తుగడలకు పాల్పడుతోంది. దేశాన్ని అవమానించారంటే ఎవరికైనా ఆగ్రహం కలగడం సహజమే. ఇటువంటి దుష్ప్రచారంతో సామాన్యులలో దేశం పెను ప్రమాదాన్ని ఎదుర్కొంటున్నదన్న భయాన్ని కలిగించడం, జాతీయ ఉన్మాదాన్ని రెచ్చగొట్టడం ద్వారా తమ పాలనపై గడ్డకట్టిన ప్రజావ్యతిరేకత నుంచి వారి దృష్టి మళ్లించేందుకూ తద్వారా ఎన్నికల్లో లబ్ధి పొందేందుకూ మోడీ సర్కారు ఈ దిగజారుడుతనాన్ని ప్రదర్శిస్తోంది. ఢిల్లీలోని జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ(జేఎన్‌యూ) విద్యార్థి సంఘం మాజీ అధ్యక్షుడు కన్హయకుమార్, విద్యార్థి నాయకులు ఉమర్ ఖలీద్, అనిర్బన్ భట్టాచార్య తదితరులపై పాతకేసును తిరగదోడుతూ ఢిల్లీ పోలీసులు దేశద్రోహ ఆరోపణతో సోమవారం తాజాగా చార్జిషీటు దాఖలు చేశారు. అనుమతి లేకుండా సమావేశం, అల్లర్లను రెచ్చగొట్టడం, క్రిమినల్ కుట్ర తదితర ఆరోపణలు కూడా దానిలో పేర్కొన్నారు. అఫ్జల్ గురు ఉరిశిక్షను వ్యతిరేకిస్తూ 2016 ఫిబ్రవరి 9న యూనివర్సిటీలో జరిగిన నిరసన కార్యక్రమాల్లో వీరంతా దేశ వ్యతిరేక నినాదాలు చేశారన్నది అసలు అభియోగం. దాదాపు మూడేళ్లు కావస్తున్న ఈ కేసులో న్యాయస్థానాల ముందు బలమైన సాక్ష్యాలు చూపించడంలో విఫలమైన పోలీసులు ఇప్పుడు హడావుడిగా ఈ చార్జిషీటు దాఖలుచేశారు. రానున్న సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకొనే బీజేపీ పాలకులు దీన్ని తెరపైకి తెచ్చారనేది స్పష్టమవుతోంది. ఈ కేసు నమోదు వెనుక వారి రాజకీయ లక్ష్యాలు తేటతెల్లమవుతున్నాయి.

ఈ కేసుకు సంబంధించి ఒకసారి వెనక్కి తిరిగి పారచూస్తే.. బీజేపీ ఎంపీ ఫిర్యాదు మేరకు ఢిల్లీ పోలీసులు ఆ ఘటనతో సంబంధం లేని యూనివర్సిటీ విద్యార్థి సంఘ అధ్యక్షుడు కన్నయ్య కుమార్‌ను ఆ ఏడాది ఫిబ్రవరి 12న అరెస్టు చేశారు. అతనికి హఫీజ్ సయీద్‌తో సంబంధాలున్నాయని స్వయానా హోం మంత్రి అసత్యారోపణ చేశారు. ట్యాంపరింగ్ చేసిన వీడియో టేపులు ప్రచారంలో పెట్టారు. జేఎన్‌యూను పోలీసు శిబిరంగా మార్చారు. దీనికి విద్యార్థులే గాక అధ్యాపక ఉద్యోగ సంఘాలు కూడా ఏకోన్ముఖంగా నిరసన తెలిపాయి. బీజేపీయేతర పార్టీలన్నీ ఇది అప్రజాస్వామికమని ఆక్షేపించాయి. నోబెల్ గ్రహీతలైన అంతర్జాతీయ మేధావులతో సహా పలువురు ఈ నిర్బంధాన్ని ఖండించారు. అయితే మోడీ అనుచరులు మాత్రం ఇది కాంగ్రెస్ రాజకీయంగా, కమ్యూనిస్టుల కుట్రగా చిత్రించడానికీ, మతం రంగు పులమడానికి ప్రయత్నిం చారు. అరెస్టుల గురించి ప్రశ్నిస్తే దేశద్రోహులనే దుష్ప్రచారం చేశారు. ఈ అన్యాయాన్ని సహించలేక చాలామంది రచయితలు, రాజకీయ వేత్తలు, మీడియా ప్రముఖులు, మీ దేశభక్తి ముద్ర కంటే దేశద్రోహులం అనిపించుకోవడానికే మేం సిద్ధమని ప్రకటించారు. కన్నయ్యకుమార్‌ను కోర్టుకు హాజరుపర్చినప్పుడు, మేమే దేశం అనే వారు నల్లకోట్లతో ప్రత్యక్షమై ఆ ఆవరణలోనే దాడులు చేశారు. దేశభక్తి ఉప్పొంగి న్యాయస్థానంలో వందేమాతర గీతాలాపనచేసి అక్షింతలు వేయించుకున్నారు. మార్చి2న ఆర్నెల్ల మధ్యంతర బెయిల్ ఇచ్చిన ఢిల్లీ కోర్టు, ఆగస్టులో కన్హయకుమార్‌కు పూర్తి బెయిల్ ఇచ్చింది. ఈ కేసును అడ్డంపెట్టుకొని బీజేపీ పాలకులు దేశంలో విద్వేష రాజకీయాలు నడిపేందుకు అప్పుడు, ఇప్పుడు తెగబడుతున్నారు. ఆ సమయంలో బెంగాల్ శాసనసభ ఎన్నికలుంటే, ఇప్పుడు ఏకంగా సార్వత్రిక సమరం సమీపిస్తుండ డమే అందుకు ప్రధాన కారణం. రాజకీయ ప్రయోజనాల కోసం దేవుళ్లను, మతాలను, దేశభక్తిని పావులుగా వాడుకోవాలని చూడడం దారుణం. సాక్షాత్తూ శ్రీరాముడ్ని తమ రథంపై ఎన్నికల గుర్తుగా వేసుకుని ఊరేగిన వారు ఎంతకైనా దిగజారుతారనడానికి ఈ కేసే ఒక ఉదాహరణ. ఈ సంస్కృతినీ మతాన్నీ, దేశభక్తిని కాషాయదళం కన్నా మరెవరు అవమానించగలరు?

తాజా చార్జిషీటులో పోలీసులు చూపిన ఆధారాలేవీ కొత్తవేమీ కాదనీ, అత్యధిక శాతం గతంలోనివేనని నిపుణులు పేర్కొంటున్నారు. గతంలో పోలీసులు నకిలీ వీడియోలపై ఆధారపడి ఈ కేసు కట్టారు. టీవీల్లో ప్రసారమైన వీడియోలన్నీ నకిలీవేనని నిందితులు వాదించారు. ఇవి న్యాయస్థానం ముందు నిలబడలేకపోవడంతో కన్హయకుమార్ తదితరులకు బెయిల్ మంజూరైంది. పోలీసులు కొత్తగా సమకూర్చుకు న్నట్లు చెబుతున్న వీడియోలలో కొన్ని చానెళ్ల నుంచి వచ్చినవేనట. మరికొన్ని కొందరు వ్యక్తుల నుంచి సంపాదించారట. దేశవ్యతిరేక నినాదాలు చేస్తున్న బృందానికి కన్హయకుమార్ నాయకత్వం వహించిన దృశ్యాలున్న వీడియోలు సంపాదించినట్లు పోలీసులు చెబుతున్నారు. అంతేకాదు, ఈ కార్యక్రమానికి యూనివర్సిటీలో ఒక ప్రాంతంలో కలుసుకోమంటూ ఉమర్ ఖలీద్, కన్నయ్యకు పంపిన మెసేజ్‌ను కూడా సంపాదించినట్లు పోలీసులు చెబుతున్నారు. పోలీసులు చెప్పేదే నిజమనుకుంటే, ఇప్పటి వరకూ వారేమి చేసినట్లు? ఈ మూడేళ్లు ఎందుకు వృథా చేసినట్లు? ఈ ప్రయత్నమేదో అప్పుడే చేసి ఉన్నట్లయితే ఈ వివాదం ఇంతవరకూ కొనసాగేది కాదు, కాలం, డబ్బు ఆదాయ అయ్యేది కదా! కన్హయకుమార్ స్వయంగా దేశవ్యతిరేక నినాదాలు చేయలేదని పోలీసులే అంగీకరిస్తున్న నేపథ్యంలో ఈ కొత్త ఆధారాలు ఆయనను దేశద్రోహిగా ఎలా రుజువు చేయగలుగుతాయి? ఒక కమ్యూనిస్టుగా ఉన్న వ్యక్తి ఈ దేశంలో దేశభక్తుడుగా నిలుస్తాడే తప్ప దేశద్రోహానికి ఎన్నటికీ పాల్పడడు. అది కమ్యూనిస్టుల చరిత్ర, వారసత్వం. పంజాబ్‌లోగానీ, అసోంలోగానీ, కాశ్మీర్‌లోగానీ సమైక్యత కోసం నిలబడి ప్రాణాలు అర్పించారే తప్ప పిరికితనం ప్రదర్శించలా.. అధికారం కోసం అడ్డదారులు తొక్కలేదు. మరి బీజేపీ మాతృక ఆరెస్సెస్‌కు ఉన్న చరిత్ర ఏమిటి? క్విట్ ఇండియా ఉద్యమంలో వాజ్‌పేయి చేసిందేమిటి? గాంధీని హత్యచేసిన గాడ్సే దేశభక్తుడన్నది.. అఫ్జల్ గురును ఆరాధించే పీడీపీతో కలసి కాశ్మీర్‌లో అధికారం పంచుకున్నది బీజేపీ వారే కదా! కాశ్మీర్ ఉగ్రవా దులకు నిధులిచ్చిన జైన్ డైరీలలో బీజేపీ ముఖ్యమంత్రులు ముఖ్య నేతల పేర్లు కూడా బయట పడడంతో రాజీనామాలు చేసిన మాట నిజం కాదా? మండల్‌కు వ్యతిరేకంగా కమండల్ అంటూ కులాల కురుక్షేత్రం రగల్చలేదా? హెచ్‌సీయూ నుంచి జేఎన్‌యూ వరకూ పరిస్థితులు దారుణంగా దిగజారడానికి ఈ అపర మనువులు కారణం కాదా? కాబట్టి ఈ కేసును ఒక ఎన్నికల ఎత్తుగడగానే మోడీ సర్కారు చేపట్టింది. అసలైన దేశద్రోహులు వారే. వారి నుంచి దేశాన్నీ, దేశభక్తుడైన కన్హయకుమార్‌ను రక్షించుకోవడం నేడు ఈ దేశ ప్రజల ముందున్న ప్రధాన కర్తవ్యం.

చురక

కర్నాటక సర్కారును
కూలదోసె కుతంత్రం
కమలదళం ఎమ్మెల్యేల
కొనే నేర స్వతంత్రం

అధికారం అధిష్టించ
అక్రమంగ చొరబాటు
రాజ్యాంగం విలువలకు
రాజకీయ విషం కాటు

- వేల్పుల నారాయణ

విశ్లేషణ

ఆశలు పెంచారు - ఆచరణలో విఫలమయ్యారు



పి.జనార్దనరావు

ఇతరులకు 60 సంవత్సరాలు ఇచ్చారు. నాకు 60 నెలలు ఇవ్వమన్నాడు. 2014 ఎన్నికల సందర్భంగా నరేంద్ర మోడీ, ప్రతి ఏడాది రెండు కోట్లు ఉద్యోగాలు కల్పిస్తామని నిరుద్యోగ యువతకు ఆశలు కల్పించారు. ప్రతిసంవత్సరం రెండు కోట్ల మందికి ఉపాధి కల్పన. అడగకనే వ్యవసాయదారులకు, యువతకు, స్త్రీలకు, షెడ్యూల్డు కులాలవారికి, షెడ్యూల్డు తెగలవారికి, ఇతర ఓబీసీలకు ఎన్నో వరాలు ప్రకటించారు. సంపన్నులుగా మార్చుతానన్నాడు. స్విస్ బ్యాంకుల్లో దాచిన లక్షలకోట్లు అది తెచ్చి ప్రతి కుటుంబానికి 15 లక్షలు అందజేయగలనన్నాడు. ప్రజలను భ్రమల్లో వుంచి ఎన్నికల్లో విజయం సాధించి ప్రధాని అయ్యారు గదా! వాటన్నింటిని జుమ్లా అని కొట్టిపడేశారు. వంచన గదా! పైన పేర్కొన్న వర్గాల్లో ఏ వర్గానికైనా కించిత్తు ప్రయోజనం ఎందుకు కల్పించలేదు? ఇష్టం లేకనా లేక పబ్బం గడిచిందనా! కొమ్ముగాచిన కార్పోరేట్లకు ఎన్నో సౌలభ్యాలు కల్పించారు. వ్యాపార వర్గాలకు, బహుళజాతి ద్రవ్య పెట్టుబడిదారులకు పలు విధాలుగా తోడ్పడ్డారు. ఆర్థిక వ్యవస్థలో వృద్ధి సాధించి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడానికి వారి తోడ్పాటు తీసుకున్నారు. దేశీయమైన వనరులను వారికి చౌకగా కట్టబెట్టారు. వృద్ధి సాధ్యమై సంపద సాధించాలంటే పెట్టుబడులు ప్రభుత్వం, ప్రయివేటు రంగం పెట్టాలి. వృద్ధి జరిగినప్పుడు ఉపాధుల సృష్టి జరిగి - ఆదాయం, సంపాదనవల్ల వినిమయం పెరుగుతుంది. అదేవిధంగా దేశీయ ఉత్పత్తులను ఎగుమతి చేయటం ద్వారా ఆదాయం సంపాదించవచ్చును. ప్రయివేటు రంగం పెట్టుబడు లకు సిద్ధంగా లేదు.

ప్రపంచంలోనే అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న దేశంగా పేరుగాంచాము. ప్రస్తుత స్థితి ఏమిటి? జీడీపీ వృద్ధి 7 శాతం చుట్టూ తిరుగుతోంది. ఉత్పాదక రంగాలైన వ్యవసాయం, మాన్యూఫ్యాక్చరింగ్, స్తంభించాయి. అత్యధికంగా ఉపాధులు కల్పించాయి అవి సూక్ష్మ, చిన్న, మధ్యతరహా ఎంటర్‌ప్రైజెస్ తోడ్పాటు లేక మూతబడ్డాయి. ప్రభుత్వం పెట్టుబడులు అందజేయక సంక్షోభం కొనసాగుతోంది. వృద్ధి సాధించే దశలో ఉపాధుల సృష్టి జరగనందున "జాబ్‌లెస్ గ్రోత్" అయ్యింది. జనసామాన్య ఆదాయ వనరులు పెంచనందున వినిమయం, ఆహార వినిమయం తగ్గింది. పేదరికం, మాల్‌న్యూట్రిషన్ తగ్గించటంలో విఫలమయ్యారు. ఉపాధి అవకాశాలు తగ్గి గ్రామీణ ప్రాంతాల నుండి వ్యవసాయ కూలీలు, సన్నకారు రైతులు, చేతివృత్తులవారు నగరాలకు వలసబాట పట్టారు. పౌర సౌకర్యాలు లేని మురికివాడలు పెరిగాయి. నగరాల్లో విద్య, ఆరోగ్య సౌకర్యాలు వారికి అందుబాటులో లేవు. భారత ఆర్థిక వ్యవస్థ రుతుపవనాలు దేశమంతటా వర్షించే దానిపై ఆధారపడివుంది. రుతుపవనాలు విఫలమైతే వ్యవసాయ రంగ ఉత్పత్తులపై తీవ్ర ప్రభావం పడుతుంది. వినిమయం తగ్గి ఉపాధులు తగ్గుతాయి. జీడీపీ పెరుగుదలపై దాని ప్రభావం వుంటుంది. పెట్టుబడులకు అదనపు ఆదాయం వుండదు. అధికమైన వృద్ధి, ఆధారపడదగిన ఆర్థిక వృద్ధికి అవసరమైన పెట్టుబడులు లభ్యంకావు. వినిమయం పెరగదు. సాధించిన వృద్ధి ఆధారపడిందిగా లేదు. వృద్ధితో సృష్టించబడిన సంపద అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టుటకు తోడ్పడలేదు. మానవ వనరుల సామర్థ్యంతో ప్రాతిపదిక సౌకర్యాల విస్తరణతో, సామాన్య ప్రజలకు ప్రయోజనాలు అందించే విధంగా లేదు. దేశంలో అసమానతలు - ధనిక - పేద గ్రామీణ ప్రాంతాలు, నగరాల మధ్య వ్యవసాయ రంగం - వ్యవసాయేతర రంగాల మధ్య పెరిగాయి. అంతేగాదు. సృష్టించబడిన సంపదలో 2016లో 48 శాతం, 2017లో 73 శాతం జనాభాలో ఒక్క శాతం దక్కించుకోటానికి సహకరించింది ప్రభుత్వం.

మోడీ కొన్ని విశేషమైన ప్రకటనలు చేశారు. గుడ్ గవర్నెన్స్, అచ్చేదిన్ ఆయేగా, నేను తినను, ఇతరులను తిననివ్వను వగైరాలు. దేశం సహజ వనరులు, మానవ వనరులు కలిగి వుంది. అవినీతి అనే జాడ్యం వల్ల దేశం పేదదిగాను, వెనుకబడినదిగాను వుంది. అటువంటి స్థితిలో మోడీ ప్రకటనలు ప్రజల్లో ఆశలు రేకెత్తించాయి. ఓట్లు వేసి గెలిపించారు. నయా ఉదారవాదం ఆచరణకు మోడీ నిబద్ధులు. దేశ అతిపెద్ద మార్కెట్‌ను బహుళజాతి ద్రవ్య పెట్టుబడులకు తెరచుట ద్వారా అభివృద్ధిని అద్దుకున్నారు. భారత ఆర్థిక వ్యవస్థ సాధించిన ప్రయోజనాలన్నింటిని వారికి కట్టబెట్టారు. దేశీయులను దారిద్ర్యంలో వుంచారు. ప్రయోజనం పొందిన వర్గాలు దేశాభివృద్ధికి తోడ్పడలేదు. అత్యధిక శాతం ప్రజలు నేటికీ రోటీ, కపడా, మకాన్‌ల కొరకు ప్రభుత్వం వైపు చూస్తున్నారు.

మోడీ రెండు అంశాలను ప్రధాన లక్ష్యంగా పెట్టుకొన్నారు. 1) కాంగ్రెసు నుండి దేశాన్ని విముక్తి చేయడం, 2) అధికారాన్ని పదిలపరచుకోవడం. ప్రత్యర్థులు బలహీనంగా వున్నప్పుడే ఇది సాధ్యమని విశ్వసించారు. పాలన ప్రారంభించిన మొదటి రోజు నుండి ఇందుకు కృషి చేశారు. వివిధ రాష్ట్రాల్లో జరిగిన ఎన్నికల్లో మీరు చేపట్టిన ప్రచార సరళి దీన్ని రుజువు చేసింది. కాని మొదటి సంవత్సరంలోనే ఢిల్లీ ఎన్నికలు ఆప్‌కు పట్టం కట్టాయి. చివర్లో బీహారు ఎన్నికలు భంగపాటు కల్పించాయి. మీరు నమ్మిన కార్పోరేట్ రంగం గాని, ఆరెస్సెస్ బలగం గాని అనుకొన్న లక్ష్యం సాధించటానికి తోడ్పడలేదు. అస్సాంలో, ఈశాన్యరాష్ట్రాల్లో, త్రిపుర, మణిపూర్, గోవా, హిమాచల్‌ప్రదేశ్‌లలో విజయం సాధించారు. మీ ఆకాంక్షలు రెక్కలు లేని పక్షివలే ఎగిరాయి. కాని 22 సంవత్సరాలు ముఖ్యమంత్రిగా పని చేసిన గుజరాత్‌లో ముగ్గురు కుర్రాళ్లు చెమట పట్టించారు. ప్రత్యర్థిగా రాహుల్ గాంధీ రంగంలోకి వచ్చారు. నేటి నినాదం బీజేపీ ముక్త భారతదేశం. ఐదు, పది, పదిహేను సంవత్సరాలు కాషాయ నేతల పాలనలో వున్న రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌ఘడ్‌లు కాంగ్రెసు పాలనలోకి వెళ్ళాయి. అర్ధాంతరంగా ప్రకటించిన పెద్దనోట్ల రద్దు, తగినంత వ్యవధి లేకుండా జీఎస్టీ అమలు వల్ల వ్యవసాయ కార్మికులు, చిన్న వ్యాపారులు, నిరక్షరాస్యులు అసంఘటిత రంగంలోని కాజువల్ పనివారు 37 లక్షల ఉద్యోగులు, 65 లక్షల మహిళా కార్మికులు, 23 లక్షల పట్టణ మహిళలు జీవనోపాధిని కోల్పోయారు. చిన్న మొత్తాల పొదుపు పథకాలపైన అందించే వడ్డీరేట్లు తగ్గడం వల్ల పెన్షనర్లు, చిరు ఉద్యోగులు తీవ్రంగా నష్టపోయారు. పేదరికం, పంట నష్టం, రుణగ్రస్థత వల్ల వ్యవసాయదారులు ఆత్మహత్యకు పాల్పడటం ఆగలేదు. వ్యాపార పంటలు ప్రభుత్వానికి ఆదాయం అందిస్తున్నాయి. కాని, వాటిని పండించేవారు అధిక పెట్టుబడులు పెట్టడం, తీరా పంట అమ్మకం వచ్చేనాటికి ధరలు తగ్గడం వల్ల తీవ్రంగా నష్టపోతున్నారు. బ్యాంకులు అవసరమైన మేర పరపతి అందించకపోవడం, అధిక వడ్డీలకు వడ్డీ వ్యాపారులపైన ఆధారపడటం సంక్షోభానికి కారణం. గ్రామీణ ప్రాంతాల్లో పేదరికం అధికం. అక్కడ నివసించేవారు 54 శాతం మందికి ఎటువంటి ఆస్తులు లేవు. రెక్కల కష్టంతో తెచ్చే ఆదాయం వారిది. మహాత్మా గాంధీ పేరున గ్రామీణ ఉపాధి హామీ పథకానికి అరకొరగా మోడీ ప్రభుత్వం తోడ్పడుతుంది. మొత్తంమీద గ్రామీణ ఆర్థిక జీవనాన్ని చిందరవందర చేశారు. భారత ఆర్థిక వ్యవస్థను ప్రపంచీకరణలో భాగం చేయటంవల్ల ప్రపంచ పెట్టుబడిదారీ దేశాల్లో సంభవించే ఒడుదుడుకులు భారత ఆర్థిక వ్యవస్థపై ప్రభావం చూపుతాయి. పెద్దనోట్ల రద్దు ప్రజా జీవనాన్ని తీవ్రంగా ఇబ్బందుల్లో పడవేసింది. ఖరీఫ్, రబీ వ్యవసాయ కార్యక్రమాలను అద్దుకున్నాయి. నగదు అందుబాటులో లేనందున వలస కార్మికులు, కాజువల్ కార్మికులు గ్రామాలకు తరలివెళ్లటం వలన చిరుపారిశ్రామిక వ్యవస్థలు మూతపడ్డాయి.

కార్పోరేట్ రంగం మోడీకెందుకు అండగా వుంది? కేపిటల్ ఇంటెన్సివ్ రంగాన్ని ఆయన గుజరాత్ ముఖ్యమంత్రిగా ప్రోత్సహించారు. సెజ్‌ల పేరున వేలాది ఎకరాల పంటభూములు సేకరించి అంబానీకి, అదానీకి, టాటాలకు, ఇతర పారిశ్రామికవేత్తలకు అందించారు. కార్మికవర్గంపై నిర్బంధాలు విధించి ట్రేడ్ యూనియన్‌లు లేకుండా చేశారు. అనేక సౌలభ్యాలు కల్పించి అపారంగా లాభించటానికి తోడ్పడ్డారు. మోడీని ప్రధానమంత్రి అభ్యర్థిగా ప్రకటించటానికి వారు, వారి మీడియా విశేషంగా కృషి చేసింది. ప్రధాని అయితే మరింతగా తోడ్పాటు అందించగలరని ఆర్థికంగా విస్తారంగా తోడ్పడ్డారు. మీడియా ద్వారా విశేషంగా ప్రభావం కల్పించారు. మోడీ ప్రధాని పీఠం అధిష్టించిన తరువాత తీసుకున్న మొదటి చర్య భూసంస్కరణ చట్టానికి చేపట్టిన మార్పులు. ఆర్డినెన్స్‌లు జారీ చేసి భంగపడ్డారు. రాజ్యసభలో ఆమోదం పొందలేకపోయారు. అలాగే అదానీకి ఆస్ట్రేలియాలో బొగ్గు గని కోసం బిలియన్ డాలర్లు అప్పు ఇవ్వమని బ్యాంకులను కోరటం జరిగింది. ప్రజావ్యతిరేకత ఆనాడే చవిచూశారు. బ్యాంకుల్లో పారుబాకీలు పెరగటం కార్పోరేట్ వర్గాలు విస్తారంగా అప్పు తీసుకొని బకాయిపడటం వల్లనే జరిగింది. పారుబాకీల పేరున రద్దు చేయటం వారికే ప్రయోజనం చేకూర్చటమే. ఐడీబీఐ 50 వేల కోట్లు నష్టాల్లో వుంటే ఎల్‌ఐసీ ద్వారా వారికి లబ్ది చేకూర్చుటం జరిగింది. సంపన్న వర్గాలపై ఎందుకంత ఆసక్తి. మోడీకి ఉపాధులు కల్పించే ఆలోచన లేదని లేబర్ ఇంటెన్సివ్ రంగాన్ని అశ్రద్ధ చేయటం తెలుపుతున్నది. పెట్టుబడిదారీ ప్రపంచం మాంద్యం నుండి బయటపడలేదు. వాగ్దానం చేసినట్లు గుడ్ గవర్నెన్స్ అందించనందున భారత ఆర్థిక సామర్థ్యం, విశ్వసనీయతను, నమ్మకాన్ని కోల్పోయింది. అందుకు మోడీ చేపట్టిన పెద్దనోట్ల రద్దు, జీఎస్టీ అమలు తోడ్పడ్డాయి. అంతర్జాతీయ రేంటింగు సంస్థలు భారత క్రెడిట్ రేటింగును పెంచటానికి ఇష్టపడటం లేదు. ద్రవ్యలోటు, కరెంట్ అకౌంట్, బీఓపీ పెరుగుతున్నాయి. స్టాక్, డెట్ మార్కెట్ల నుండి విదేశీ సంస్థల మదుపరులు తమ పెట్టుబడులను వెనక్కి తీసుకొంటున్నారు. క్రూడు ధరలు పెరగటం మొదలైంది. పెట్రోలు, డీజిల్, వంటగ్యాస్ ధరలు పెరుగుతున్నాయి. బ్యాంకులు లిక్విడిటీ సమస్యను ఎన్‌పీఏ సమస్య ఎదుర్కొంటున్నాయి. ఎన్‌బీఎఫ్‌సీలకు ఫైనాన్స్ అందజేయ నిరాకరిస్తున్నాయి. అభివృద్ధికి ఎగుమతులకు, ఉపాధి కల్పనకు, వినిమయానికి విస్తారంగా తోడ్పడే మైక్రో ఎంటర్‌ప్రైజెస్ తోడ్పాటు లేక మూతపడుతున్నాయి. అమెరికా రక్షణాత్మక విధానం అవలంభిచటం వల్ల మన ఎగుమతులు నష్టపోతున్నాయి. సన్న వర్గాలు ప్రభుత్వంపై పూర్తి పట్టు సాధించి తమ ప్రయోజనాలు కాపాడుకొంటున్నాయి. ఉపాధి అవకాశాలు తగ్గటం వల్ల ఆదాయం లేని ప్రజలు చాలినంతగా ఆహారం పొందటం లేదు. ఆశలు పెంచారు. ఆచరణలో విఫలమయ్యారు.

వ్యాసరచయిత విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు

అంతర్జాతీయం

ఐరోపాలో ఆగని కార్మిక నిరసనలు, పెరుగుతున్న మితవాదం !

ఐరోపాలో ప్రస్తుతం భౌతికంగా చలి, రాజకీయంగా వేడి పోటీ పడుతున్నాయి.మే నెలలో ఐరోపా పార్లమెంట్ ఎన్నికల గడువు దగ్గరపడుతోంది. ఈ పూర్వరంగంలో పలు చోట్ల పెల్లుబుకుతున్న ఆందోళనలనల పట్ల ఎలా వ్యవహరించాలో పాలక పార్టీలకు దిక్కుతోచటం లేదు. పచ్చి మితవాదులు, నయా నాజీలు, ఫాసిస్టు శక్తుల ప్రభావం పెరుగుతోంది. ఫ్రాన్సులో పసుపు చొక్కాల ఆందోళనను చల్లబర్చేందుకు అధ్యక్షుడు మక్రాన్ కొన్ని రాయితీలు ప్రకటించినప్పటికీ ప్రతి శనివారం జరుగుతున్న నిరసన ప్రదర్శనలు ఐదవ తేదీన కూడా జరిగాయి. సోషలిజాన్ని కాలదన్నుకొని పెట్టుబడిదారీ విధానాన్ని తిరిగి ప్రవేశపెట్టిన దేశం హంగరీ. పూర్తి పరిహారం లేకుండా ఓవర్‌టైమ్ చేయటం లేదా చేసిన పనికి వెంటనే చెల్లింపులు చేయనవసరం లేకుండా వీలు కల్పిస్తూ పార్లమెంట్ ఆమోదించిన బిల్లును 'బానిస చట్టం 'గా వర్ణిస్తూ దానికి వ్యతిరేకంగా వేలాది మంది కార్మికులు వణికిస్తున్న చలిని కూడా లెక్క చేయకుండా పెద్ద ఎత్తున ప్రదర్శనలు జరిపారు. మరోపూర్వ సోషలిస్టు రాజ్యమైన సెర్బియాలో వరుసగా ఐదవ శనివారం ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రదర్శనలు జరిగాయి. ఇవి మచ్చుకు కొన్ని. గతానికి భిన్నంగా ఈ ఆందోళనల సందర్భంగా జనం తీవ్రంగా స్పందించటం ఒక ముఖ్యాంశం. అన్ని చోట్లా ఆందోళనల లక్షణాలు ఒకే విధంగా లేనప్పటికీ మొత్తం మీద చూసినపుడు జనాకర్షక వైఖరులు, ఆర్థిక జాతీయవాదం ముందుకు వస్తున్నాయి. ఇవి విడివిడిగానూ, ఒకదానినొకటి ఆశ్రయించిగానూ వుంటాయి. ఈ వైఖరిని ఐరోపా యూనియన్‌ను బలహీనపరిచేందుకు దోహదం చేస్తుందన్నది కొందరి అంచనా. పది సంవత్సరాల క్రితం పెట్టుబడిదారీ ప్రపంచాన్ని తీవ్రంగా కుదిపివేసి ఇప్పటికీ ప్రభావం చూపుతూ అందరికీ సుపరిచితమైన 2008 ఆర్థిక సంక్షోభం పర్యవసానాలే ఇవన్నీ అని చెప్పవచ్చు.

రెండవ ప్రపంచ యుద్ధం తరువాత స్థూలంగా ఐరోపాలో సోషల్ డెమొక్రటిక్ పార్టీలు, మితవాద పార్టీలుగా రాజకీయ పక్షాలు వున్నాయి. గత పది సంవత్సరాలలో సాంప్రదాయ మితవాదం స్థానే పచ్చిమితవాద శక్తులు పెరిగి పెద్దవి అవుతున్నాయి. గత పాలకుల వైఫల్యాలను ఎండగడుతూ తాము నూతన ఐరోపాను నిర్మిస్తామనే ప్రజాకర్షక వాగ్దానాలు, వలస కార్మికులు ముఖ్యంగా ముస్లిం వ్యతిరేకతను రెచ్చగొట్టే శక్తులు పెరుగుతున్నాయి. ముస్లిం తీవ్రవాదంపై యుద్ధం పేరుతో అమెరికా నాయకత్వంలో పశ్చిమాసియా, ఆఫ్రికా, మధ్య ప్రాచ్యంలో ఐరోపా ప్రభుత్వాల మద్దతుతో దాడులు చేస్తున్న పూర్వరంగంలో ఐరోపాలోని మితవాద శక్తులలో ముస్లిం వ్యతిరేకత పెరగటంలో ఆశ్చర్యం లేదు. పదేండ్ల నాటి ఆర్థిక సంక్షోభంతో వలస కార్మికుల రాక తమ ప్రయోజనాలను దెబ్బతీస్తున్నదనే భావం ఐరోపాలో కలుగుతున్నది.

కొన్ని దేశాలలో జరుగుతున్న పరిణామాలు కొన్నేండ్ల నాటి అరబ్బు వసంత కాల ఆందోళనలను పోలి వున్నాయన్నది కొందరి వర్ణన. సోవియట్ యూనియన్ మాదిరి ఆరు నుంచి 28 దేశాలకు విస్తరించిన ఐరోపా యూనియన్ కూడా ప్రజాకర్షక, ఆర్థిక జాతీయవాదాలతో కూలిపోతుందా అని కూడా పరిపరివిధాల ఆలోచిస్తున్న వారు లేకపోలేదు. అనేక దేశాలలోని పరిణామాలు అంతర్గత రాజకీయ నాటకాల లక్షణాలను కూడా కలిగి వున్నాయి. వీటికి వలసల సమస్య ఉమ్మడిగా వుంది. అమెరికా, రష్యాలు ఐరోపా రాజకీయవేదిక మీద ప్రధాన పాత్రధారులుగా వున్నాయి. ఐరోపా యూనియన్ ఉమ్మడిగా రష్యాను వ్యతిరేకిస్తున్నది, అదే సమయంలో కొన్ని దేశాలు భిన్నవైఖరిని వ్యక్తం చేస్తున్నాయి. ఐరోపా యూనియన్ తమ శత్రువు అని డోనాల్డ్ ట్రంప్ వర్ణించిన అంశం కూడా తెలిసిందే. ఈ పరిణామాలు వాటి మధ్య వున్న అంతర్గత వైరుధ్యాలకు నిదర్శనం. పాలకవర్గాలు రాజీపడుతున్న కారణంగా ఒక కొత్త రూపాన్ని తీసుకొనే స్థితి ఇంకా రాలేదు. ఒక కూటమిగా ఐరోపా బతికి బట్టగలుగుతుందా అన్న సందేహాలు కూడా వెలువడుతున్నాయి.

మే నెలలో జరిగే ఐరోపా పార్లమెంట్ ఎన్నికలలో మితవాద పార్టీలు మెజారిటీ సాధించటం లేదా దగ్గరగా వచ్చే అవకాశాలున్నాయి.పూర్వపు యుగోస్లావియా నుంచి ప్రత్యేక దేశంగా ఆవిర్భవించిన సెర్బియా అధ్యక్షుడు అలెగ్జాండర్ యుసిక్ నియంతృత్వ వైఖరికి వ్యతిరేకంగా వేలాది మంది గత ఐదు వారాలుగా ప్రతి శనివారం రాజధాని బెల్‌గ్రేడ్‌లో ప్రదర్శనలు జరుపుతున్నారు. నవంబరు నెలలో క్రుసెవాక్ పట్టణంలో ప్రతిపక్ష నేత బర్కొ స్టెఫానోవిచ్ మీద దాడి చేసిన దుండగులు అధికారపక్షానికి చెందిన వారేనని ప్రతిపక్షాలు విమర్శించాయి.డిసెంబరు ఎనిమిది నుంచి జరుగుతున్న ప్రదర్శనల్లో విద్యార్థులు, కళాకారుల వంటి అనేక మంది ప్రముఖులు భాగస్వాములౌతున్నారు. యాభై లక్షల మందిలో ఒకరిని అనే బ్యానర్ వెనుక ప్రదర్శనలు జరుపుతున్నారు. ఒక వేళ 50లక్షల మంది వీధుల్లోకి వచ్చినప్పటికీ తాను ప్రతిపక్షంతో మాట్లాడేది లేదని, జనంచెప్పేది వింటాననటూ అధ్యక్షుడు యుసిక్ జనాన్ని మరింతగా రెచ్చగొట్టాడు. ముప్ఫై ప్రతిపక్ష పార్టీలు, సంస్థలు సెర్బియా కోసం కూటమి పేరుతో ప్రదర్శనలు జరుపుతున్నాయి.దేశం రోజు రోజుకూ నియంతృత్వంవైపు పయనిస్తున్నదని, ప్రజాస్వామిక వ్యవస్థలను చిన్నచూపు చూస్తున్నారని ప్రతిపక్షాలు విమర్శిస్తున్నాయి. మీడియాలో స్వేచ్ఛలేదు, జర్నలిస్టులకూ స్వేచ్ఛ లేదని, ఎన్నికలు కూడా స్వేచ్ఛగా జరిగే పరిస్థితి లేదని విమర్శిస్తున్నాయి.

ఏడాదికి నాలుగు వందల గంటల పాటు ఓవర్‌టైమ్ వర్క్ చేయాలన్న యజమానులకు అనుగుణంగా చట్టం చేసిన హంగరీ ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ డిసెంబరులో ప్రారంభమైన నిరసనలు ఈనెలలో కూడా కొనసాగాయి. ఐదవ తేదీన జాతీయ సమ్మెకు పిలుపు నివ్వగా మరోసారి 19వ తేదీన నిరసన ప్రదర్శనకు పిలుపునిచ్చారు. మెరుగైన వేతనాలు, సులువైన వుద్యోగ విరమణ విధానాన్ని కూడా వారు కోరుతున్నారు.అయితే ఈ ఆందోళనల వెనుక హంగేరియన్-అమెరికన్ బిలియనీర్ జార్జ్ సోరోస్ హస్తం వుందని, పెద్ద మొత్తంలో నిధులు అందచేసినట్లు హంగరీ ప్రభుత్వం ఆరోపించింది. వలసదారుల అనుకూల విధానాలను తాము అడ్డుకుంటున్న కారణంగానే ఇదంతా జరుగుతోందని పేర్కొన్నది. కార్మిక చట్టంతో సహా అనేకం నిరంకుశంగా వున్నాయని ప్రతిపక్షాలు విమర్శించాయి.

అనేక దేశాలలో జనం వీధుల్లోకి రావటం అక్కడి అసంతృప్తికి నిదర్శనం అయితే పచ్చి మితవాద పార్టీలు జనాన్ని ఆకర్షించటం మరొక సూచిక.2019 వారిదే అవుతుందా ? ఇటలీలో గతేడాది జరిగిన ఎన్నికలలో 630కిగాను 125 సీట్లు తెచ్చుకొని ఇటలీ సంకీర్ణ ప్రభుత్వంలో నార్తరన్ లీగ్ అనే మితవాద పార్టీ భాగస్వామిగా వుంది. పేరుకు చిన్నపార్టీ అయినా ప్రభుత్వ అజెండాను రూపొందించటంలో పెద్ద పాత్ర నిర్వహిస్తున్నది. యూరోపియన్ కమిషన్ అధ్యక్షుడిగా వున్న జీన్ క్లాడ్ జుంకర్ తరచూ ఈ ప్రజాకర్షక శక్తులు, జాత్యంహంకారులు, ఫాసిస్టులు, సిల్వనీ(ఇటలీ) లీపెన్, జర్మనీ ఎఎఫ్‌డిపార్టీతో ఐరోపా ప్రమాదంలో వుంది అంటారు. ప్రస్తుతం హంగరీ, నార్వే, స్వీడన్, ఫిన్లాండ్, ఆస్ట్రియా, ఇటలీల్లో పచ్చి మితవాద పార్టీలు పాలక పక్షాలు లేదా భాగస్వామ్య పక్షాలుగా వున్నాయి.

వివిధ సర్వేలు మితవాద శక్తులు గతం కంటే బలంగా తయారవుతున్నాయని, వివిధ పార్టీల మధ్య విభేదాలున్నప్పటికీ ఐరోపాయూనియన్‌కు బ్రేకులు వేసేవిగా వున్నాయని చెబుతున్నారు. ఇటీవలి వరకు అనేక దేశాలలో నోటి తుత్తర శక్తులుగా వున్నప్పటికీ ప్రస్తుతం అనేక దేశాలలో అధికారంలో వుండటం లేదా అధికార పక్షాలకు మద్దతు ఇచ్చేవిగా తయారయ్యాయి. ఇటీవలి కాలంలో పెరిగిపోయిన వలసలను వ్యతిరేకిస్తూ వలసల రహిత ఐరోపా కావాలని, ఐరోపా యూనియన్ బదులు ఐరోపా జాతులుగా వుండాలని చెబుతున్నాయి. యూరోబారో మీటర్ తాజా సర్వే ప్రకారం ఐరోపా యూనియన్ సభ్యత్వం తీసుకోవటం మంచిదే అయినప్పటికీ అది తప్పుడు మార్గంలో నడుస్తున్నదని 62శాతం మంది అభిప్రాయపడ్డారు. వలసల తక్షణ సమస్యగా భావిస్తున్నారు. మితవాద పార్టీలు 20శాతం మేరకు ఐరోపా వ్యాపితంగా ఓట్లను తెచ్చుకొనేవిగా వున్నాయని, ఇది మెజారిటీ సాధించేందుకు దోహదం చేయకపోయినా ఐరోపా యూనియన్ పనికి ఆటంకాలు కలిగించేందుకు వీలుకలిగి స్తాయని భావిస్తున్నారు. మేము ఒక చారిత్రక మలుపులో వున్నాం, తీవ్రమైన ప్రపంచీకరణ ముగింపుకు రానున్నది అని ఫ్రెంచి నేషనలిస్టు పార్టీ నాయకురాలు మారినె లీపెన్ ఇటీవల సోఫియా నగర పర్యటనలో చెప్పారు.

రుణమాఫీతో ఊరట కష్టమే!

రాజుకుమార్

రైతు రుణాల రద్దుకు దరఖాస్తులు స్వీకరించే ప్రక్రియను మధ్యప్రదేశ్ ప్రభుత్వం ప్రారంభించింది. అర్హులైన రైతుల ఖాతాల్లో రూ.2 లక్షల రుణాల రద్దు మొత్తం ఫిబ్రవరి చివరి నాటికి డిపాజిట్ చేయనున్నట్లు మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి కమల్‌నాథ్ పేర్కొన్నారు. అయితే ఈ పథకం ఫలప్రదం గురించి నిపుణులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ పథకం కింద ప్రయోజనాలు అనేక మంది రైతులకు నిరాకరించబడతాయని వారు అభిప్రాయపడుతున్నారు. మహాజన్ నుండి రుణాలు తీసుకున్న 70 శాతం మంది రైతులు ఈ పథకం నుండి మినహాయించబడతారని సీపీఐ (ఎం) మధ్యప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శి జస్విందర్ సింగ్ పేర్కొంటున్నారు. మాజీ ముఖ్యమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ రైతులకు వడ్డీరహిత రుణాలు ప్రకటించారు. అయితే రుణాలు ఇవ్వడానికి సహకార బ్యాంకులు విముఖత వ్యక్తం చేయడంతో రైతులు మహాజన్ రుణాలపై ఆధారపడవలసి వచ్చింది. అదే విధంగా, రుణ రద్దు కారణంగా రైతులకు రుణాలు విస్మరించడాన్ని బ్యాంకులు ప్రారంభించాయి. ఈ అంశాలన్నీ పరిశీలించి, రైతులకు నేరుగా ప్రయోజనాలు ఏ విధంగా సమకూర్చాలన్న విషయంలో అధ్యయనం చేయడానికి ఒక కమిషన్‌ను ఏర్పాటు చేయాలని జస్విందర్ సింగ్ ప్రతిపాదించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత సైతం రాష్ట్రంలో నలుగురు రైతులు ఆత్మహత్యలు చేసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. రైతులు మహాజన్‌కు వున్న అప్పులను పరిశీలించడానికి మార్కెట్ అధ్యయనం నిర్వహిస్తున్నట్లు కమల్‌నాథ్ తెలిపారు. అనధికారిక రుణాలు అదుపు చేయడానికి ప్రభుత్వం సాధ్యమైన అన్ని చర్యలు చేపడుతుందని కూడా ఆయన పేర్కొన్నారు. 'జైకిసాన్ క్రాప్‌లోన్ స్కీం' వల్ల 55 లక్షల మంది రైతులు రూ.50 వేల కోట్లు విలువ చేసే పంట రుణాలు రద్దు ప్రయోజనం పొందుతారు. రుణాలు చెల్లించిన తరువాత రైతులకు సర్టిఫికెట్లు కూడా ఇస్తారు. ఈ ప్రక్రియ అంతా ఫిబ్రవరి నాటికి పూర్తవుతుంది.

రైతుల రుణం ప్రభుత్వ బాధ్యతని, అందుచేత 2019 సార్వత్రిక ఎన్నికల కోడ్ అమలులోకి రావడానికి ముందే దానికొరకు బడ్జెట్‌లో తగిన నిధులు కేటాయించేటట్లు చూడాలని కిసాన్ సంఘర్ష్ సమితి కార్యనిర్వాహక చైర్మన్ డా॥ సునిలామ్ డిమాండ్ చేశారు. భూసేకరణ చట్టం కింద రైతుల నుండి సేకరించిన భూములను వారికి తిరిగి ఇవ్వాలని కూడా ఆయన డిమాండ్ చేశారు. రైతు రుణాల రద్దు పథకం విజయవంతం కావాలంటే అనేక సవాళ్ళు ఉన్నాయి. రైతుల రుణాల రద్దు గురించి పదే పదే ప్రకటించడం వల్ల రైతులకు రుణాలు ఇవ్వడానికి బ్యాంకులు విముఖతను చూపుతున్నాయి. రుణాల రద్దు కన్నా వారి పంటలకు ఆయిన వ్యయాన్ని తిరిగి రాబట్టడం గురించే రైతులు ఎక్కువగా ఆలోచిస్తున్నారు. కనీస మద్దతు ధర తగినంతగా పెంపుదల చేసినపుడు మాత్రమే అది సాధ్యమవుతుంది. వ్యవసాయం పట్ల నూతన తరాల వారు ఉదాసీనత చూపడం భవిష్యత్తులో సంక్షోభాన్ని తీవ్రతరం చేస్తుంది. అందుచేత కేవలం రుణాలు రద్దు చేయడం మాత్రమే సరిపోదు. వ్యవసాయ రంగాన్ని తిరిగి పట్టాలపైకి ఎక్కించేందుకు ప్రభుత్వ విధానాలను సంపూర్ణంగా ప్రక్షాళన చేయవలసిన అవసరముందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

ఇ-మెయిల్

విధానం ఓడి .. ప్రధాని నెగ్గి .. గందరగోళంలో బ్రెగ్జిట్

యూరోపియన్ సమాఖ్య నుండి వైదొలగాలని నిర్ణయించుకున్న బ్రిటన్ కు ఆ ముహూర్తం దగ్గర పడుతున్నా గందరగోళ పరిస్థితులు తప్పడం లేదు. ప్రస్తుత ప్రధాని తెరసా మే ప్రతిపాదించిన విధివిధానాల ఒప్పందం పార్లమెంటులో ఆ దేశ చరిత్రలోనే ఎన్నడూ లేనంత భారీ పరాజయాన్ని పొందింది.అంటే దాదాపు అందరూ ఆ రూపంలో ఉన్న ఒప్పందాన్ని తిరస్కరించి, ప్రధాని కి పాఠం చెప్పారు.అయితే ఆమె పై ప్రవేశపెట్టబడిన అవిశ్వాస తీర్మానాన్ని అలాగే ఓడించి మద్దతు ప్రకటించారు.ముందు రోజు ఆమె పాలసీ ని చెత్తబుట్టలోకి పంపి,రెండోరోజు ఆమె పదవీగౌరవాన్ని కాపాడారు. లేదంటే ఆమె రాజీనామా చెయ్యాల్సి వచ్చేది.ఇప్పుడు తిరస్కరించబడ్డ ఒప్పందం స్థానే ప్రత్యామ్నాయ ఒప్పందం పార్లమెంటులో ప్రవేశపెట్టాల్సి ఉంటుంది. అన్ని కార్యక్రమాలు మార్చి 29 లోగా జరిగితే ఆ రోజునుండి బ్రిటన్ యూరోపియన్ సమాఖ్య నుండి విడిపోతుంది. అయితే అందరికీ ఆమోదయోగ్యమైన ఒప్పందం సిద్ధం కాకపోతే, ఏ ఒప్పందం లేని బ్రెగ్జిట్ వచ్చే ప్రమాదముంది.అప్పుడు బ్రిటన్ ఉన్నఫళంగా విడిపోవడం వల్ల నష్టపోయే ప్రమాదముంది.ఆ స్థితి రాకూడదంటే విడాకుల ముహుర్తాన్ని వాయిదా వెయ్యమని అడగడం కానీ, లేదా సమాఖ్యలో కొనసాగుతామంటూ, అందుకు తగ్గట్టు ఆర్టికల్ 50 అమలుని వెనక్కి తీసుకోవడం కానీ ఆ దేశం చెయ్యాలి.సమాఖ్య వద్దంటూ ఇంతదూరం వచ్చాక అలా చెయ్యడం సబబేనా అన్నది ఒక అనుమానం.ఒక అవమానం.లేదా ఎటూ తెగని ఐర్లాండ్ సరిహద్దు వివాదాన్ని అధిగమిస్తూ కస్టమ్స్ విషయంలో సమాఖ్యతో కలిసే ఉండడం లాంటి కొన్ని కఠిన నిర్ణయాలు తీసుకోవడం అవసరం.

డా.డి.వి.జి.శంకరరావు, మాజీ ఎంపీ, పార్వతీపురం.

విశాలాంధ్ర
బతుకు
The Life
శుక్రవారం
18 జనవరి 2019

వలస విలాసం!



మధ్యప్రదేశ్‌లోని జబల్‌పూర్‌లో గ్వారీఘాట్ వద్ద నర్మదా దేవాలయం సమీపంలో సందడి చేస్తున్న వలస పక్షులు

REAL STORY

జీవితానికి వెలుగు...పుస్తకం! ఇది చాలా మంది ప్రముఖులు చెప్పిన మాట, చెబుతున్న మాట. కానీ ఇక్కడ చెబుతున్నది మాత్రం ఓ సాధారణ మహిళ, ఓ కన్న తల్లి, ఓ పుస్తక విక్రేత. అక్షరం ముక్కరాని ఓ నిరక్షరాస్యురాలు. చదువు పాఠాలు చెప్పి పరీక్షలు పెడితే... జీవితం పరీక్షలు పెట్టి పాఠాలు చెబుతుంది. ఇది మనం తరచూ వినే మాటే. ఇందుకు ప్రత్యక్ష నిదర్శనం ఆమె. ఏ ఆధారమూ లేని సగటు మహిళ సాధారణంగా యాచనను ఆశ్రయిస్తుంది. కానీ ఈ తల్లి తన కోసం, తన బిడ్డ పోషణ కోసం యాచనను ఎంచుకోలేదు. శ్రమను నమ్ముకుంది. మరి ఇందుకోసం ఆమె చేసిన పనేంటో ఆమె మాటల్లోనే......

జీవితానికి వెలుగు...పుస్తకం!



ఎవరికైనా విద్య గొప్ప ఆస్తి. కానీ నేను మాత్రం కనీస విద్యను కూడా అభ్యసించలేదు. కారణం నేను కనీస వసతులు కూడా లేని నిరుపేద కుటుంబంలో జన్మించాను. ఆర్థిక పరిస్థితుల్లో ఎలాంటి మెరుగు లేదు. ఈ పరిస్థితులు నా కూతురుపై ఎలాంటి ప్రభావం చూపడం నాకు ఇష్టంలేదు. అందుకనే నా బిడ్డకు మెరుగైన విద్యను అందించాలనుకున్నాను. తద్వారా మాలాంటి లక్షలాదిమంది నిరుపేదలకు ఆశా కిరణంగా చేయాలనుకుంటున్నాను.

నా పేరు లక్ష్మీ. నా పేరుకు నేనున్న పరిస్థితికి ఏ మాత్రం పొంతన లేదు. ఇలాంటి స్థితిలో కూతురుని చదివించడం ఎలా? దీని కోసం నేనే ఎంచుకున్న మార్గం కష్టపడి పనిచేయడం, గౌరవంగా వీధుల్లో పుస్తకాలు అమ్ముకోవాలని నిర్ణయించుకున్నాను. నా జీవితానికి ఆధారమైన ఈ పుస్తకాలే కూతురు జీవితంలో వెలుగునింపుతాయని ఆశిస్తున్నాను. ప్రస్తుతం నా కూతురుకు నాలుగేళ్ళు. తొందరల్లోనే నా బిడ్డ పాఠశాలకు వెళ్ళుతుంది. తన స్నేహితులతో ఆడుకుంటుంది.

ఇప్పుడు తనను నాతో పాటే పుస్తకాలమ్మడానికి తీసుకెళ్ళుతున్నా కారణం తనను చూసుకోవడానికి ఎవ్వరూ లేరు.

ఈ పని ఏం అంత తేలిక కాదు. ఎండ, వాన, రోగం ఇవన్నీ లెక్క చేయకుండా ముందుకు సాగాలి. నా బిడ్డ కోసం, దానికో మంచి జీవితాన్ని ఇవ్వడం కోసం నేను ఇవేమీ లెక్క పెట్టదలచుకోలేదు. నా బిడ్డ కలను నిజం చేసేందుకు ఇవేమీ అడ్డంకి అవుతాయని నేను అనుకోవడం లేదు. నేను అమ్మే పుస్తకాల వల్ల ఇతరుల జ్ఞానం పెరుగుతుంది. దీంతో పాటు నా బిడ్డ కలలు కూడా నిజమవుతాయి. మీ బిడ్డల జీవనోపాధి కోసం వారికి కనీస చదువును నేర్పించమని నేను ప్రతి ఒక్కరిని కోరుతున్నాను. కారణం విద్య అనేది పేదరికాన్ని రూపుమాపే గేట్ వే లాంటిది.

– లక్ష్మీ

రెండేళ్ళకే గూగుల్ గురు

ఇటీవల కాలంలో ఎవరికైనా ఎలాంటి సమాచారం కావాలన్న గూగుల్‌లో ఒక్కక్లిక్ చేస్తే చాలు. కళ్ళు మూసి తెరిచేలోగా వారి కళ్ళముందు సమాచారం ఉంటున్న రోజులు. దీంతో మనుషులు వారి మెమోరీకి పెద్ద పని చెప్పడం లేదు. ప్రతీ చిన్న విషయానికి ఇంటర్నెట్ సహాయం పొందుతున్నారు. మరిలాంటి రోజుల్లో రెండేళ్ళ చిన్న పాప తన మెమోరీతో అందరినీ ఆశ్చర్యపరచడమేకాక ఇండియా బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్‌లో చోటు సంపాదించుకుని గూగుల్ గురుగా ఫేమస్ అయ్యింది.





రెండేళ్ళ వయస్సులోని పసివారికి మాట్లాడటం కూడా సరిగ్గా రాదు. కానీ ఉత్తర్‌ప్రదేశ్‌లోని మధురకు చెందిన గురు మాత్రం ఏకంగా ప్రపంచ పటాన్నే వివరించేస్తుంది. నిజానికి రెండేళ్ళ పిల్లలు మాటలు కూడా సరిగ్గా చెప్పలేరు. కానీ ఈ చిన్నారి మాత్రం ఒకటి కాదు రెండు కాదు ఏకంగా ఆరవై దేశాల పేర్లు చెప్పేస్తుంది. పేర్లేగా అని తేలికగా తీసుకోకండి. దీంతో పాటు ఆ దేశాల జెండాలను గుర్తిస్తుంది. వీటితో పాటు ఆరవై ఐదు దేశాల రాజధానులను, భారత దేశ సరిహద్దులను కూడా స్పష్టంగా చెబుతుంది. అందుకనే కాబోలు గూగల్ గురు అయింది.

ఉత్తరప్రదేశ్‌కు చెందిన ప్రియ, అరవింద్ ఉపాధ్యాయ్‌లకు జూలై 14, 2016న గురు జన్మించింది. రెండేళ్ళు ఈ చిన్నారి తల్లిదండ్రులు గర్వించే విధంగా ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు దక్కించుకుంది.

గ్లోబల్ రికార్డ్ అండ్ రిసెర్చ్ ఫౌండేషన్ వారి చిల్డ్రన్ రికార్డ్స్ వరుసలో గురు కూడా ఉంది కారణం గురు ఒక్క నిముషంలో పదిహేడు దేశాల జెండాలను గుర్తించింది.

గురు తల్లిదండ్రులు సివిల్ ఎగ్జామ్స్‌కి సిద్ధమవుతున్నారు. అందుకని వారిరివురు సబెక్టుకు సంబంధించిన ప్రశ్నలు అడిగే సమయంలో గురు ఆ సమాధానాలను ఆసక్తిగా వింటుండేది. గురు కేవలం 19నెలల వయస్సు నుండే రాజధానుల పేర్లు చెప్పడం మొదలు పట్టింది. కొన్నాళ్ళకు తన తండ్రి వాళ్ళ అమ్మను అడిగే ప్రశ్నలకు తానే జావాబు ఇచ్చే స్థాయికి వచ్చింది. ఈ విషయం వారిరిరువురిని ఆశ్చర్యానికి గురిచేసింది. దీంతో అరవింద్ గురును రాజధానుల గురించి ప్రశ్నించాడు. ప్రశ్న పూర్తికాకుండానే తన కూతురు సమాధానం చెప్పడం అరవింద్ షాక్ అయ్యాడు.

గురు తల్లిదండ్రులు ఎన్నడు కూడా తనకు ఇవన్నీ నేర్పాలనీ ప్రయత్నించలేదు. ఈ సమాధానాలను గురు ఒక ఆట భావించి నేర్చుకున్నదని తన తల్లిదండ్రులు చెబుతున్నారు. కేవలం రాజధానులే చెప్పడమే కాదు. దేని పేరైనా ఒక్కసారి వింటే అలా గుర్తు పెట్టుకోవడం గురు మెమోరీ ప్రత్యేకత అంటున్నారు.

గురు తల్లి తను చదువుకునే సమయంలో పాపను ఒడిలో కూర్చొబెట్టుకునేది. ఆ సమయంలో తను ఏది బిగ్గరగా చదివితే అది పాప గుర్తుపెట్టుకునేదని ప్రియ చెబుతున్నది. గురు వీడీయో యూ ట్యూబ్‌లో పలువురి ప్రశంసలు అందుకుంటోంది.



బొప్పాయి కొమ్మతో స్ట్రా

ప్లాస్టిక్ నిషేదంపై కొన్ని రాష్ట్రాలు తీవ్రంగా దృష్టిపెట్టాయి. ఈ వరుసలోనే తమిళనాడు కూడా ఉంది. దీంతో అక్కడ రైతులు సరికొత్త ఆలోచనలకు శ్రీకారం చుట్టారు. దానిలో ఎకో స్ట్రా ఒకటి.

గ్లాసు పట్టుకొని, కొబ్బరి బొండాన్ని చేతితో పట్టుకొని తాగే రోజులు పోయి ఫ్యాషన్ స్ట్రాతో తాగే విధానం మొదలయింది. ఈ విధానం వల్ల పర్యావరణానికి తీవ్ర ఆకంటకం కలుగుతోంది. ప్లాస్టిక్‌పై విధించిన నిషేధం ఈ స్ట్రాలకు కూడా వర్తించి వీటిని కూడా బ్యాన్ చేశారు. దీంతో దారిలో అక్కడక్కడ లభించే కొబ్బరి బొండాలు అమ్మకాలు పడిపోయా. స్ట్రాకి కొబ్బరి బొండానికి లింకేంటా అని ఆలోచిస్తున్నారా? అక్కడే అసలు విషయం ఉంది. ఈతరానికి స్ట్రాలు లేకుండా ఎలా తాగాలో తేలీదు. అందుకనే వాటిని కొనడం లేదు.

పడిపోయిన కొబ్బరి బొండాల అమ్మకాలను తిరిగి పునరుద్ధరించాలనుకున్న అక్కడి రైతులు ఆలోచనల్లోకి అరటి ఆకులను విందు భోజనాలకు వినియోగించే విషయం గుర్తుకు వచ్చింది. ఇలాగే ఈ స్ట్రాలను ప్రకృతి ద్వారా తయారు చేయవచ్చు అనుకున్నారు. ఇలా వచ్చిందే ఈ ఎకో స్ట్రా. దీన్ని బొప్పాయి కొమ్మతో తయారు చేస్తున్నారు. మధురైకు చెందిన థంగమ్ పాండేయన్ అనే రైతు ఈ ఆలోచనను వెలుగులో పెట్టాడు. మిగిలిన వారు దాన్ని ఆచరిస్తున్నారు. థంగమ్ పాండేయన్ మొదటగా తన తోటలోని కొమ్మలతో తయారుచేసి వీటి మరవకుళమ్ అనే బస్‌స్టాప్ వద్ద విక్రయించాడు.

పాండేయన్ తన ఫామ్‌లోని బొప్పాయి చెట్ల నుంచి రాలిపోయే దశలో ఉన్న కొమ్మలను తీసుకొని స్ట్రాలుగా తయారు చేసి అమ్మడంతో తిరిగి గిరాకీ మొదలైందని మిగిలిన వారు ఈ ఆలోచనను ఆచరణలో పెట్టారు.

ఈ విధంగా వారి విన్నూత ఆలోచనలు పర్యావరణాన్ని కాపాడటంలో సహాయపడుతున్నాయి.

మెదడు ఓ మహాద్భుతం!

మనిషి మెదడు ఓ అద్భుతం. దాని గురించి మనకు తెలియని అంశాలు ఎన్నో ఉన్నాయి. అవి అత్యంత ఆసక్తికరమైన అంశాలు కావడం గొప్ప విశేషం. వాటి గురించి తెలుసుకుంటే ఔరా అనడమే కాదు...నిజంగా ఎంత అద్భుతం అని మీరే అంటారు. మరి అత్యంత ఆసక్తికరమైన ఆ వాస్త వాలు ఏమిటో తెలుసుకుందాం.



- క్షీరదాలన్నింటిలోకీ అంటే పిల్లలకు పాలు ఇచ్చి పెంచే జంతువులన్నింటిలోకీ మనిషి మెదడే అతి పెద్దది. దాని రూపం మాత్రం ఒకటే.
- మనిషి శరీరంలో 70 శాతం నీరే ఉంటుంది. ఈ విషయం అందరికీ తెలుసు. మరి మెదడూ ఇదే మాదిరిగా ఉంటుందనే విషయం మనలో ఎంతమందికి తెలుసు? మనిషి మెదడులోనూ 75 శాతం నీరే ఉంటుంది. శరీరం డీహైడ్రేషన్‌కి గురి అయినప్పుడు మెదడు పనితీరు మందగించడానికీ, సరిగ్గా పనిచెయ్యకపోవడానికీ ఇదే కారణం. మనం సరిగా గమనించం కానీ...నిజానికి మనకు దాహం వేయడానికి ముందే...అంటే డీహైడ్రేషన్‌కు గురైనట్లు శారీరక లక్షణం కనిపించక ముందే మెదడు మనకు ఈ విషయం తన పనితీరు ద్వారా చెబుతుంది.
- ఆలోచనా శక్తి మెదడు సొంతం. మరి రోజుకి ఎన్ని ఆలోచనలు చేస్తుందో తెలుసా?... దాదాపుగా సగటున 70 వేల ఆలోచనలు. వీటిల్లో చాలావరకూ పదేపదే వస్తుంటాయి. అయితే రోజుకి ఇన్ని ఆలోచనలు మెదడులో రావడమే అద్భుతం కదా!
- మనిషి మెదడు ఆలోచనల పుట్ట అని తెలుసుకున్నాం. ఈ ఆలోచనల క్రమంలోనే మరో విశేషమూ దాగి ఉంది. అది...ఆలోచన వచ్చిన ప్రతిసారీ మెద డులోని నరాల వ్యవస్థ కొత్తగా ఏర్పడుతుంది లేదా మార్పు చెందుతూ ఉంటుంది. ఒకే రకమైన భావనలు, భావోద్వే గాలు, అనుభవాలను వదిలేసేటప్పుడు కూడా మన మెదుడులో ఇలాంటి పరిస్థితే ఉంటుంది.
- మీకు మీరు చక్కిలిగింతలు పెట్టుకోగలరా? ఎప్పుడైనా ప్రయత్నించారా. ఇది అసాధ్యం. కారణం మన స్పర్శను మన మెదడు గుర్తిస్తుంది. ఈ కారణంగానే మనకి మనంగా కితకితలు పెట్టుకోలేం. మన స్పర్శతో మనం ఆశ్చర్యానికి లోనవలేం.
- సాధారణంగా తలనొప్పి వచ్చినప్పుడల్లా మెదడులో ఏదో తేడా వచ్చిందని అనుకుంటూ ఉంటారు. ఇది ఒట్టి అపోహ. మెదడుకి అసలు నొప్పి అంటేనే తెలియదు. మనకు నొప్పిని తెలియజేసేది నరాలు, కండరాలే. సో, ఇకనుంచి తలనొప్పి వచ్చినప్పుడల్లా మీ మెదడుని నిందించకండే.
- మెదులో రక్తనాళాలు అపారంగా ఉంటాయి. వీటిని కొనిస్తే వీటి పొడవు లక్ష (100,00) మైళ్ళ పై మాటేనంటే నోరెళ్ళబెట్టడం మన వంతు అవుతుంది.
- ఎవరైనా ఆవలించడం చూస్తే మన ప్రమేయం లేకుండానే ఆటోమేటిగ్గా మనకూ ఆవలింత వచ్చేస్తుంది. దీనికి కారణం మన మెదడులో ఉండే మిర్రర్ న్యూరాన్లే. మనం ఇతరుల చర్యకు ప్రతిస్పందించేది వీటి వల్లే. మనం నలుగురితో కలిసేందుకు మనకు కావలసిన సామర్థ్యాలను ఇచ్చేది ఈ మిర్రర్ న్యూరాన్లే.
- మెదడుకి బద్ధ శత్రువు ఒత్తిడి. ఈ ఒత్తిడి మన మెదుడులోని కణాలను చంపేస్తుంది. ఒత్తిడి మన మెదడు మీద అధిక భారాన్ని మోపుతుంది. మెదుడోలని హార్మోన్లను దెబ్బతీస్తుంది. ఫలితం మెదడులోని కణాల తీరూ దెబ్బతింటుంది.
- మనం ఎవరితోనైనా ప్రేమలో పడ్డామంటే దానికి కారణం మెదడు విడుదల చేసే ఆక్సీటోసిన్ అనే రసాయనం. ఇది అధిక మోతాదులో విడుదల అయినప్పుడు ప్రేమ భావన కలుగుతుంది లేదా పెరుగుతుంది. తల్లీబిడ్డల మధ్య ఏర్పడే బలమైన ప్రేమ బంధానికీ ఇదే కారణం. ఇది కొన్ని నెలలు, కొన్ని సంవత్సరాలు ప్రభావం చూపుతుంది.
- మన మెదుడులో మనం కేవలం 10 శాతం మాత్రమే ఉపయోగించుకుంటామనే అపోహ ఒకటి ఎక్కువగా ఉంది జనంలో. మెదడులోని ప్రతి భాగం ఎంత బాగా పనిచేస్తుందో అంతా బాగా మనం మొత్తం మెదుడుని ఉపయోగించుకుంటాం. కేవలం పది శాతం కాదు.

మేను మెరవాలంటే..



మంచి రంగు ఉండాలని అందరూ కోరుకుంటారు. కానీ దానిని నిజం చేసుకునేవాళ్ళు కొంతమందే. మీకూ ఇలాంటి కోరిక ఉందా? ఎంత ప్రయత్నించినా ఫలితం ఉండడం లేదా? ఈసారి ఇలా చేసిచూడండి.

- చర్మం నిగనిగలాడుతూ ఉండాలంటే క్యారెట్‌ని ఉపయోగించండి. ఆహారంలో కాదు... సౌందర్యపోషణగా. అవును క్యారట్ సౌందర్య పోషణలోనూ చర్మానికి మంచి ఛాయను ఇవ్వడంలోనూ ముందు ఉంటుంది. ఇందుకోసం క్యారట్‌ను తొక్కతీయుకుండానే తురిమి ఎండలో పెట్టండి. 50 గ్రాముల క్యారెట్ ఎండు తురుముకు అంతే మోతాదులో కీరదోస విత్తనాలు, పెసరపప్పు, బార్లీ గింజలు కలిపి తయారు చేసిన పొడిని చేర్చాలి. ఈ రెండూ కలిపిన మెత్తని పేస్ట్‌ని శరీరానికి రాసుకుని స్నానం చేయాలి. తరచుగా ఇలా చేస్తూ ఉంటే చర్మానికి మంచి ఛాయ రావడమే కాదు...నిగనిగలాడే మెరుపూ వస్తుంది.
- రంగు కోల్పోయిన చర్మానికి క్యారట్ మంచి మందులా పనిచేస్తుంది. ఇది రంగును పెంచడమే కాకుండా చర్మ ఆరోగ్యానికీ క్యారెట్ రసం బాగా తోడ్పడుతుంది.

టిఫిన్లు - చిట్కాలు



- ముదిరిపోయిన ఆనపగింజల్ని బియ్యంతో కలిపి నానేసి, రుబ్బి దోశెలు వేసుకుంటే చాలా రుచిగా ఉంటాయి
- బియ్యంలో కొంచెం మెంతులు కలిపి రుబ్బితే దోశెలు గట్టిగా వస్తాయి.
- మిగిలిపోయిన అన్నంలో ఎర్రకారం, జీలకర్ర, కొంచెం ఉప్పు కలిపి మెత్తగా రుబ్బి వడియాలుగానో, చిప్స్‌గానే పెట్టుకుని ఎండబెట్టుకోవాలి. తర్వాత ఇవి వేయించుకుని తింటే చాలా రుచిగా ఉంటాయి.
- పూరీ పిండి కలిపేటప్పుడు కొంచెం చక్కెర కలిపితే పూరీలు చాలా సేపటివరకూ తాజాగా ఉంటాయి
- అరకిలో గోధుమపిండికి రెండు మగ్గిన అరటిపళ్ళు, ఒక కప్పు పెరుగు కలిపితే చపాతీలు మెత్తగా ఉంటాయి.
- పకోడీల పిండికి కొంచెం బేకింగ్ పౌడర్ గానీ, వేడినూనె గానీ వేసి కలిపితే పకోడీలు లావుగా వస్తాయి, కరకరలాడతాయి
- పప్పులుగానీ, బియ్యంగానీ అర్జంటుగా నానబోయవలసి వస్తే వేడినీళ్ళల్లో నానబోస్తే తొందరగా నానతాయి.
- పూరీలు చేసేటప్పుడు అవి తెల్లగా రావాలంటే వేడి నూనెలో నాలుగైదు జామ ఆకులు వేస్తే సరిపోతుంది.
- బొబ్బట్లు సరిగా రాకపోతే ఒక చెంచాడు గోధుమ రవ్వ కలిపి వేస్తే బాగా వస్తాయి.

నేను - సుడిగుండం (నవల) 18

పి.చంద్రశేఖర అజాద్
సెల్: 92465 73575



నిన్నటి సంచిక తరువాయి

ఇప్పుడు మనం యవ్వనంలో వున్నాం. ఎంత కాదనుకున్నా 'ప్రేమ' లాంటి విషయాలు మనల్ని ప్రభావితం చేయగలవు. అందుకే ఇవన్నీ మనం దృష్టిలో పెట్టుకోవాలి.

నువ్వు హైదరాబాద్ నగరానికి కొత్త. ఈ లేఖలో రాస్తున్న చిరునామాకి సరాసరి వెళ్లు. వారినే ఓ గది చూపించమంటే చూపిస్తారు. నీ ఆర్థిక పరిస్థితి నాకు తెలుసు. అందుకే ఖర్చుల కోసం వెయ్యి రూపాయలుంచాను.

ఇందులో నువ్వు కించపడాల్సిన అవసరం లేదు. నేను ఉచితంగా ఇవ్వటం లేదు. అలా అని జీతం తీసుకోగానే పంపించమని కాదు. నీకు అవసరం అనుకుంటే ఉత్తరం రాయి. నువ్వు కుదురుకునేంత వరకు పంపుతాను. కొన్ని రుణాలు వుంటుండాలి కూడా. నాకు అవసరం వచ్చినప్పుడు తీసుకుంటాను. ఉత్తరాలు రాస్తుండు. అధ్యయనం మానొద్దు. ఉంటాను. స్నేహంగా.

– అమిత

ఆ లేఖను రెండు మూడు సార్లు చదువుకున్నాను. పులకరింత, కాస్త దుఃఖం. మావయ్య-అమిత ఇలా ఒక్కొక్కరూ నా జీవితంలోకి వస్తున్నారు. స్నేహహస్తం అందిస్తున్నారు. ఎలా కృతజ్ఞతలు తీర్చుకోవటం.

ఇంటి దగ్గరికి వచ్చాకా నేను ఆ ఉత్తరాన్ని చదువుకుంటుంటే "ఏంటి నాన్నా అంతగా చదువుతున్నావు" అంది అమ్మ.

"అమిత రాసిన ఉత్తరం"

అమ్మ ముఖంలో అదో రకమైన ఫీలింగ్. అర్థం చేసుకున్నాను.

"ఎల్లుండి మనం బయలుదేరాలి"

"మనమా!" అంది.

"అవునమ్మా.... ముందు నేను వెళ్లాను. అక్కడ గది చూసుకుంటాను. వచ్చి తీసుకు వెళ్తాను. అందుకు నువ్వు తయారుగా వుండాలి. ఇన్ని రోజులూ నాకు శ్రమంటే ఏంటో తెలియకుండా పెంచావు. ఇప్పుడు నువ్వు విశ్రాంతి తీసుకోవాలి"

"నాకింకా ఓపిక లేదనుకుంటున్నావా? నువ్వు ఒక్కడివే నాకొడుకునను కుంటున్నావా" అనగానే బిత్తరపోయాను.

"మావయ్యని కూడా ఏ పనీ చేయ వద్దంటావా. సుఖ పెట్టటం అంటే అమ్మని పని చేయనీయటం కాదు. నాకు ముగ్గురు పిల్లలున్నారు. ఇన్ని రోజులూ యిక్కడ వుండి రెక్కలు రాగానే ఎగిరిపోవటం కాదు. నువ్వు వెళ్లు. నేను నీ దగ్గరకు రావటానికి ఇంకా చాలా రోజులున్నాయి" అంది.

నేను మాట్లాడలేకపోయాను.

"ఆ అమ్మాయి ఎవరో నాకు తెలియదు. నీకూ ఆ అమ్మాయికి మధ్య వుంది స్నేహితమో, ఇంకేమన్నానో కూడా. నువ్వు చదువుకుంటానికి వెళ్లేటప్పుడు ఏం చెప్పానో నీకు గుర్తుందనుకుంటున్నాను"

"గుర్తుంది. గుర్తుంచుకుంటాను. అమిత నా స్నేహితురాలు. అసలు అమిత గురించి ఇంకోరకంగా ఆలోచించటానికి భయపడాలి. మనలా వారిది పూరిల్లు కాదు. ఆకాశానికి – భూమికి మధ్య వున్నంత దూరం నాకూ అమితకి వుంది."

"ప్రేమకు అవన్నీ అవసరం లేదు పిచ్చి సన్నాసి" అంది.

మొదటిసారి అమ్మ ఇలా మాట్లాడింది. 'సన్నాసి' అన్నందుకు, అందులోనూ "పిచ్చి' కూడా కలిపినందుకు నాకు సంతోషం కలిగింది. కొడుకులు ఎంత ఎదిగినా అలనాటి పిల్లలుగానే తల్లులు భావించాలి.

- - - - -

నేను బయలుదేరే క్షణాలు వచ్చాయి. మావయ్య నాకు డబ్బులు ఇవ్వబోయాడు. "వద్దు మావయ్యా' అన్నాను

"అదేంటి అల్లుడూ నెల రోజులయితే గాని జీతం రాదు. అప్పటిదాకా ఏం వాడుకుంటావు?"

"అమిత నాకు డబ్బులు యిచ్చింది" అన్నాను.

ఆశ్చర్యంగా చూసాడు.

తర్వాత ఓ చాప, దిండు, రెండు దుప్పట్లు ఓ చుట్టగా చుదుతున్నాడు. ఇవన్నీ ఎందుకు. అక్కడ నేను కొనుక్కుంటాను అన్నాను.



"చిన్న చిన్నవే కదా అనుకుంటాం. కొనేటప్పుడు తెలుస్తుంది. అసలు నీకు వంట సామాన్లు కూడా యిద్దామనుకున్నాను. నువ్వు సరాసరి ఆఫీస్‌లోనే దిగుతున్నావు కదా" అన్నాడు.

"నిజమే. నన్ను చూడాలి. మాట్లాడాలి. వారికి నేను నచ్చాలి"

"అది కూడా వుందా?"

"ఉంటాయి మావయ్యా... పైగా అది ఫ్యాక్టరీ... ఇవన్నీ అక్కడ వుంచటం కుదురుతుందో లేదో తెలియదు. ఒకవేళ అక్కడ ఏర్పాట్లు వుండొచ్చు" అన్నాను.

అందరూ వీడ్కోలు చెబుతున్నారు.

నా చూపులు వెన్నెల మీద ఉన్నాయి. ఈసారి నాకు హైదరాబాద్ చూపిస్తావా అని వెన్నెల అడగలేదు.

- - - - -

భాగ్య నగరం

సికింద్రాబాద్ స్టేషన్‌లో దిగాను. హైదరాబాద్ అంటే నాంపల్లిలో దిగాలన్నారు. సికింద్రాబాద్ కి దగ్గర మా ఫ్యాక్టరీ వుంటుందన్నారు. రైల్వేస్టేషన్ కిటకిటలాడుతోంది. నేను బ్యాగ్ మాత్రం తెచ్చుకున్నాను. స్టేషన్ బయటకు వచ్చాక...

హైదరాబాద్‌ని భాగ్యనగర్ అని కూడా అంటారని, ఇక్కడ ఓ ప్రేమకథ వుందని గుర్తు వచ్చింది. బహుశా నా చివరి మజిలీ ఇదేనా అనుకున్నాను. అమిత యిచ్చిన చిరునామా ప్రకారం బస్‌లో ఓ చోట దిగి, కొంతదూరం నడుచుకుంటూ వెళ్లి ఫ్యాక్టరీకి చేరుకున్నాను. అది బాలానగర్ పారిశ్రామిక వాడ.



మా ఓనర్ పేరు శ్రీనివాస్,

ఆయన నన్ను నిశితంగా చూసాడు. బ్యాగ్ ఓ పక్కన పెట్టాను. అక్కడ బల్క్ డ్రగ్స్ తయారు చేయటానికి పౌడర్ తయారు చేస్తారు.

"రాము కదా నీ పేరు. నాకు ఇదే కాదు ఇంకొన్ని వ్యాపారాలున్నాయి. అన్నీ చూసుకోవటం నాకు కుదరటం లేదు. అందుకే నీ గురించి చెప్పగానే పంపమన్నాను. ఇక్కడ నీ పోస్టు ఇదీ అని చెప్పలేను. మొత్తం నువ్వు చూసుకోవాలి. నువ్వు సూపర్ వైజర్‌వి. లెక్కలు రాయాలి. మార్కెటింగ్ వుంటుంది. బిల్స్ ప్రిపేర్ చేయాలి. డబ్బులు వసూలు చేయాలి. బ్యాంక్ పనులు చూడాలి" అన్నాడు.

నేను తలూపాను.

"నీకు డ్రైవింగ్ లైసెన్స్ వుందా?" అన్నాడు.

"నాకు డ్రైవింగ్ రాదు" అన్నాను.

"స్కూటర్ కూడా నడపలేవా? మనకి డ్రైవింగ్ రాకపోతే సిటీలో పనులు జరగవు. అయినా యూనివర్సిటీలో చదువుతూ బైక్ నడపటం రాకపోవటమేంటి" అని ఆశ్చర్యపడ్డాడు.

"అవకాశం లేదు" అన్నాను.

"నువ్వు వారం రోజుల్లో బండి తోలటం నేర్చుకోవాలి. సిటీ అంటే స్పీడ్. ఇక్కడ పరుగులు తీయగలిగిన వారు మాత్రమే వుంటారు. లేదంటే ఊరెళ్లి మట్టి పిసుక్కోవాల్సిందే" అన్నాడు.

మట్టి మనుషుల గురించి చులకనగా మాట్లాడుతున్నాడని నాకు కాస్త చివుక్కుమనిపించింది.

"నేను మట్టిని నమ్ముకుంటే బతకటం కష్టం అని తెలిసి ఇక్కడికి వచ్చా. పెళ్లయిందా?"

"లేదండి" "అమ్మా – నాన్నల్ని తీసుకు వస్తావా?"

"నాన్న చనిపోయారు. అమ్మ ఇప్పుడే రాదు"

"అయితే సింగిల్ రూమ్ చాలు. మనకు దగ్గర్లో వుంటే బాగుంటుంది. రాజుగాడిని అడిగితే చూపిస్తాడు" అన్నాడు.

అలా కంపెనీలో జాయినయ్యాను.

- - - - -

రాజు నెల్లూరు నుండి వచ్చాడు.

అక్కడ అతను కాక ఇంకో వ్యక్తి పని చేస్తాడు. అవసరాన్ని బట్టి రోజు కూలీలను పిలుస్తుంటారు. అందరం పొట్టకూటికి వచ్చిన వాళ్లమే. మధ్యాహ్నం ఓ పాక దగ్గరకు తీసుకు వెళ్లాడు. అక్కడ భోజనం చేయటానికి యిబ్బంది పడ్డాను. నాకు వంట చేయటం రాదు.

ప్రపంచం గురించి ఎన్నో మాట్లాడుకుంటాం. ఇలాంటి చిన్న చిన్న విషయాల మీద దృష్టి వుండదు. ఈ విషయం తెలిసినా అమ్మ నా దగ్గరకు రాదు అని నాకు తెలుసు.

అర్జెంట్‌గా స్వయంపాకం మొదలు పెట్టాలి. లేకపోతే డబ్బులకి డబ్బులు ఖర్చు. ఆరోగ్యం చెడిపోతుంది. రాత్రికి మాత్రం ఇక్కడ తినకూడదనుకున్నాను. కంపెనీలో సైకిల్ వుంది. అది తీసుకుని బయలుదేరాను. ముందు పరిసరాల్ని గమనించాలి. ఇంకో హోటల్ కనిపించింది. అయినా టిఫిన్ చేసాను.

రాత్రి అక్కడే వున్నాను. అది పారిశ్రామిక ప్రాంతం కాబట్టి సాయంకాలం నుండే రకరకాల వాయువులు గాల్లోకి వదులుతున్నారు. నాకు తలనొప్పి వచ్చింది. దుర్వాసన. ఈ ఉద్యోగం వద్దు. ఇంటికి పారిపోదామా అనుకున్నాను.

అప్పుడు మరో ఆలోచన వచ్చింది.

ఇక్కడ పని చేస్తున్న వారంతా మనుషులే. మొదటి ప్రయత్నంలోనే వెనక్కి వెళ్లటం మంచిది కాదు. చావయినా, బతుకయినా ఇక్కడే!

ఎందుకయినా మంచిదని నేను కొన్ని ఇన్‌లాండ్ కవర్లు, స్టాంపులు, నోట్ బుక్స్ తీసుకొచ్చాను. దగ్గర్లో పోస్టాఫీసు కూడా లేదు. ఇక్కడి పరిస్థితుల గురించి ఏమీ రాయకుండా అమితకు ధన్యవాదాలు చెబుతూ. అమ్మకి, మావయ్యకి ఇక్కడంతా బాగుందని రాసాను.

- - - - -

రెండు రోజుల్లో ఓ గది దొరికింది. అద్దె నూట యాభై రూపాయలు. రేకుల షెడ్డు. ఆ ఇంటి ఆవరణలో రెండు చెట్లు వున్నాయి. బయట ఓ వృక్షం వుంది. ఇంటికి రాగానే వాటిని చూసుకుంటే సంతోషం కలిగేది.

ఓ పళ్లెం, చిన్న కిరోసిన్ స్టవ్, కొన్ని అవసరమైన వంట సామాన్లు, చాప, రెండు దుప్పట్లు తక్కువలో కొన్నాను. అప్పుడు మావయ్య గుర్తొచ్చాడు. కష్టమైనాగాని అవి తెచ్చుకుంటే బాగుండేది అనిపించింది. అనుభవం అనుభవమే!

వచ్చీరాని వంట మొదలు పెట్టాను. అదే పరమాన్నం. శ్రీనివాస్‌ని అడ్వాన్స్ అడగాలనిపించింది. నన్ను నేను ప్రూవ్ చేసుకోకుండా అడ్వాన్స్ అడగటం నాకు నచ్చలేదు.

అమ్మ ఎప్పటినుంచి దాచిందో రెండు వందలు యిచ్చింది. ఇంటి వాళ్లు మంచివారు.

నేను మెల్లగా అక్కడి పరిస్థితులకి అలవాటు పడ్డాను.

నెల చివర్లో మాత్రం డబ్బులు అయిపోయాయి.

(ఇంకా ఉంది)

దేశంలో మొట్టమొదటి 'స్మార్ట్ సిటీ' ఏది ?



భారతదేశ గ్రామీణాభివృద్ధి పథకాలు బిట్ బ్యాంక్

- "ప్రధానమంత్రి రోజ్‌గార్ యోజన" పథకాన్ని మొదట ఎప్పుడు ప్రారంభించారు ? - 1993, అక్టోబర్ 2
- స్వతంత్ర భారతదేశం స్వర్ణజయంతి సందర్భంగా 1997, డిసెంబర్ 1 నుంచి అమలులోకి వచ్చిన పథకం ఏది ? - స్వర్ణజయంతి షహరి రోజ్‌గార్ యోజన (ఎస్‌జేఎస్‌ఆర్‌వై)
- ఎస్‌జేఎస్‌ఆర్‌వై పథకంలో విలీనమైన పథకాలు ఏవి ? - ఎన్ఆర్‌వై, యూబీఎస్‌పీ, పీఎంఐయూపీఈఆర్
- "ఆయుష్మాన్ భారత్"ని 2018, ఏప్రిల్ 14న ప్రధానమంత్రి నరేంద్రమోడీ ఎక్కడ ప్రారంభించారు ? - ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్‌లో
- రైతులు నూతన పద్ధతులు అవలంబించి, ఆదాయాన్ని పెంచుకోవడానికి 2018, జూన్ 4న కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన పథకం ఏది ? - కృషి కళ్యాణ్ అభియాన్
- రైతులకు సౌర విద్యుత్ సరఫరా చేయడం కోసం కేంద్రప్రభుత్వం ప్రారంభించిన పథకం ఏది ? - కుసుమ్ (కిసాన్ ఉర్జా సురక్షా ఏవమ్ ఉత్థాన్ మహాభియాన్)
- ఏ పథకం ద్వారా అన్నదాన సంస్థలకు కేంద్ర జీఎస్టీ (సీజీఎస్టీ), సమీకృత జీఎస్టీ (ఐజీఎస్టీ) మొత్తాలను తిరిగి చెల్లిస్తారు ? - సేవాభోజ్ యోజన
- భూగర్భ జలాలు అడుగంటిన కరువు పీడిత ప్రాంతాల్లో నీటిని రీఛార్జ్ చేసేందుకు వీలుగా ఎన్ని కోట్లతో అటల్ భూ జల్ యోజన పథకాన్ని చేపట్టింది ? - 6000 కోట్లతో
- జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవాన్ని పురస్కరించుకుని 2018 ఏప్రిల్ 24న ఎక్కడ రాష్ట్రీయ గ్రామ్ స్వరాజ్య అభియాన్‌ను ప్రారంభించారు ? - మధ్యప్రదేశ్‌లోని రామ్‌నగర్ (మండ్లా జిల్లా)
- కేంద్ర పథకాల ద్వారా లబ్ధి పొందుతున్న వారి వివరాలను తెలుసుకునేందుకు ఉపయోగపడే వెబ్‌సైట్ ? - డీబీటీ భారత్
- రాజీవ్‌గాంధీ ఖేల్ అభియాన్, అర్బన్ స్పోర్ట్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ స్కీమ్, నేషనల్ స్పోర్ట్స్ టాలెంట్ సెర్చ్ ప్రోగ్రామ్‌లను కలిపి నూతనంగా ప్రారంభించిన పథకం ఏది ? - ఖేలో ఇండియా
- రఫ్తార్ పథకానికి రానున్న 3 సంవత్సరాలలో (2018-2021)లో ఎన్ని కోట్లు కేటాయిస్తారు ? - రూ.15,722 కోట్లు
- స్కూల్ చలో అభియాన్ పథకాన్ని ఎవరు ప్రారంభించారు ? - కేంద్ర మానవ వనరుల అభివృద్ధిశాఖ మంత్రి ప్రకాశ్ జవదేకర్
- ప్రధానమంత్రి వయో వందన యోజన పథకాన్ని న్యూఢిల్లీలో ఎప్పుడు ప్రారంభించారు ? - 21 జూలై 2017
- పని ప్రదేశాల్లో ఎదురయ్యే లైంగిక వేధింపులపై మహిళా ఉద్యోగులు ఫిర్యాదు చేసేందుకు వీలుగా కేంద్ర మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి మేనకా గాంధీ ప్రారంభించిన ఆన్‌లైన్ వేదిక ఏది ? - షీ బాక్స్
- దీన్ దయాళ్ స్పర్శ్ యోజన పథకం ద్వారా విద్యార్థులకు ప్రతి మూడు నెలలకు ఎంత చొప్పున చెల్లిస్తారు ? - రూ.1,500
- దేశంలోని గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని విద్యుత్ కనెక్షన్ లేని పేదలందరికీ ఉచితంగా విద్యుత్ కనెక్షన్లను అందించేందుకు ఉద్దేశించిన పథకం ఏది ? - ప్రధానమంత్రి సహజ్ బిజిలీ హర ఘర్ యోజన - సౌభాగ్య
- షాదీ శగన్ ద్వారా డిగ్రీ పూర్తిచేసిన ముస్లిం యువతులకు కేంద్రప్రభుత్వం ఎంత అందజేయనుంది ? - రూ.51,000
- స్మార్ట్ సిటీల్లో స్కిల్ డెవలప్‌మెంట్ కోసం ప్రారంభించిన కేంద్రం ఏది ? - ప్రధానమంత్రి కౌశల్ కేంద్రం
- కేంద్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'స్వచ్ఛ భారత్'ను ప్రజలకు మరింత చేరువ చేయడమే లక్ష్యంగా 'స్వచ్ఛత్ సేవ' పేరుతో పారిశుద్ధ్య కార్యక్రమాన్ని 2017 సెప్టెంబర్ 15న ఉత్తరప్రదేశ్‌లోని కాన్పూర్ సమీపంలో ఉన్న ఈశ్వరీ గంజ్ గ్రామంలో లాంఛనంగా ప్రారంభించినది ఎవరు ? రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్
- దేశంలో బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించడానికి 'పెన్సిల్ పోర్టల్'ను ప్రారంభించినది ఎవరు ? - కేంద్ర హోంమంత్రి రాజ్‌నాథ్ సింగ్
- జిల్లా స్థాయి, పంచాయతీ స్థాయి గ్రామీణాభివృద్ధి పథకాల అమలును సమీక్షించే యాప్ ఏది ? - దిశ పోర్టల్, గ్రామ సంవాద్
- దివ్యాంగులకు సంబంధించి సమాచారాన్ని వారికి సులభంగా అందుబాటులో ఉంచడం కోసం "దివ్యాంగ్ సారథి" పేరుతో సమగ్రమైన మొబైల్ అప్లికేషన్‌ను ఎవరు ప్రారంభించారు ? - కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వశాఖ మంత్రి తావర్‌చంద్ గెహ్లోట్
- "లక్ష్యా కార్యక్రమం" ముఖ్య ఉద్దేశ్యం ఏమిటి ? - మాతా శిశు సంక్షేమం
- జాతీయ స్థాయిలో నిర్వహించే 'వైజ్ఞానిక ప్రతిభాన్వేషణ పరీక్ష (నేషనల్ సైన్స్ టాలెంట్ సెర్చ్ ఎగ్జామినేషన్-ఎన్ఎస్‌టీఈ)"ను మొబైల్ అప్లికేషన్ (యాప్) ద్వారా నిర్వహించనున్నారు. ఆ యాప్ పేరేమిటి ? - విద్యార్థి మంథన్ (వివియమ్)
- కేంద్ర క్రీడాశాఖ రూపొందించిన "జాతీయ క్రీడా ప్రతిభాన్వేషణ"ను కేంద్ర క్రీడా శాఖ మంత్రి విజయ్ గోయెల్‌తో కలిసి 2017 ఆగస్టు 28న ప్రారంభించింది ఎవరు ? - ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు
- "డిజిటల్ పోలీస్ పోర్టల్"ను ప్రారంభించినది ఎవరు ? - రాజ్‌నాథ్ సింగ్
- యువకు గిట్టుబాటైన ఉపాధిని కల్పించే మార్కెటింగ్ నైపుణ్యాలను పెంచేందుకు రూ.4000 కోట్లతో ఆన్‌లైన్ కోర్సులను అందరికీ అందుబాటులో ఉంచేందుకు ప్రారంభించిన పథకం ఏది ? - స్వయం (స్టడీ వెబ్స్ ఆఫ్ యాక్టివ్ లెర్నింగ్ ఫర్ యంగ్ యాస్పైరింగ్ మైండ్స్)
- జీవనోపాధి ప్రోత్సాహం, నైపుణ్యాల పెంపు కార్యక్రమం - సంకల్ప్ (ఎస్ఏఎన్‌కేఏఎల్‌పీ)
- సంకల్ప్ అనగా ఏమి ? - స్కిల్ ఎక్విజిషన్ అండ్ నాలెడ్జ్ అవేర్‌నెస్ ఆఫ్ లైవ్‌లీహుడ్ ప్రమోషన్
- ప్రభుత్వాన్ని ప్రజలతో నేరుగా అనుసంధానం చేయడానికి రూపొందించిన కార్యక్రమం ఏది ? - "ఈ సంపర్క్"
- జనాభా నియంత్రణకు కేంద్రం ప్రారంభించిన పథకం ఏది ? - మిషన్ పరివార్ వికాస్
- భారత శాస్త్ర పరిశోధన సంస్థల్లో ఎన్.ఆర్.ఐ. విదేశీ శాస్త్రవేత్తలు మూడు నెలలుగా పనిచేసేలా కేంద్రం కొత్తగా ప్రవేశపెట్టిన కార్యక్రమం ఏది ? - "విజిటింగ్ అడ్వాన్స్‌డ్ జాయింట్ రీసెర్చ్" (వజ్ర)
- పాస్‌పోర్టు, వీసాకు అవసరమైన సర్టిఫికెట్లపై డిజిటల్ విధానంలో అటెస్టెడ్ సంతకాలు చేసేందుకు కేంద్రప్రభుత్వ పైలెట్ ప్రాజెక్టుగా 2017, మే 13న "ఈ-సనద్" ఎక్కడ ప్రారంభమైంది ? - హైదరాబాద్
- ఒక ఐపి- రెండు ఆసుపత్రులు పథకం ముఖ్యంగా ఎవరికోసం ఉద్దేశించినది ? - వలస కార్మికుల కోసం
- ఆహార ప్రాసెసింగ్ పరిశ్రమ మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలోని పథకాలన్నింటినీ పునర్వ్యవస్థీకరించి కేంద్రప్రభుత్వం ప్రారంభించిన పథకం ఏది ? - సంపద
- కేంద్రప్రభుత్వం వృద్ధుల సంక్షేమార్థం "రాష్ట్రీయ వయోశ్రీ యోజన" పథకాన్ని 2017 మార్చి 25న ఎక్కడ ప్రారంభించారు ? - ఆంధ్రప్రదేశ్‌లోని నెల్లూరులో
- అమరవీరుల సహాయార్థం ప్రారంభించిన వెబ్ పోర్టల్, యాప్ ఏవి ? - "భారత్ కే వీర్"
- దేశవ్యాప్తంగా 6 కోట్ల గ్రామీణ కుటుంబాలకు 2019 నాటికి డిజిటల్ అక్షరాస్యత కల్పించేందుకు ప్రారంభించిన పథకం ఏది ? - "ప్రధానమంత్రి గ్రామీణ్ డిజిటల్ సాక్షరత అభియాన్"
- విద్యాసంస్థల నాణ్యతా ప్రమాణాలు మెరుగుపరిచేందుకు ప్రారంభించిన ప్రాజెక్టు ఏది ? - విశ్వజీత్ ప్రాజెక్టు
- సామాన్య ప్రజలకు కూడా విమాన ప్రయాణం అందుబాటులోకి తీసుకురావాలన్న ఉద్దేశ్యంతో ప్రారంభించిన పథకం ఏది ? - ఉడాన్ పథకం
- "స్టార్టప్ ఇండియా - స్టాండప్ ఇండియా'8ను 2016 ఏప్రిల్ 5న ఎక్కడ ప్రారంభించారు ? - నోయిడా
- 2019 నాటికి ఎల్ఈడీ బల్బుల వాడకాన్ని దేశమంతా విస్తృతం చేసే లక్ష్యంతో కేంద్రప్రభుత్వం ప్రారంభించిన పథకం ఏది ? - ఉజాలా
- ఇనామ్ అనునది ? - జాతీయ వ్యవసాయ మార్కెట్ పోర్టల్
- ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థుల మానసిక వికాసానికి దోహదపడే 2016 జూన్ 16న ప్రారంభమైన సరికొత్త పథకం ఏది ? - విద్యాంజలి
- "డిజిటల్ ఇండియా పథకం"కు కేంద్రం ఎప్పుడు ఆమోదం తెలిపింది ? - 20, ఆగస్టు, 2014
- "ప్రధానమంత్రి క్రిషి సించాయి యోజన పథకం"కు కేటాయించిన మొత్తం ఎంత ? - 50 వేల కోట్లు
- ప్రధానమంత్రి క్రిషి సించాయి యోజన పథకం కింద అయ్యే ఖర్చును కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భరించాల్సిన నిష్పత్తి ? - 75:25
- ప్రధానమంత్రి జన్‌ధన్ యోజన 2014, ఆగస్టు 28న ఎక్కడ ప్రారంభమైంది ? - న్యూఢిల్లీ
- "రూపే డెబిట్ కార్డులు" ఏ పథకం కింద అందిస్తారు ? - ప్రధానమంత్రి జన్‌ధన్ యోజన
- ప్రధానమంత్రి జన్‌ధన్ యోజన నినాదం ఏది ? - మేరా ఖాతా - భాగ్య విధాత
- సుదూర ప్రాంతాల్లో నివసించే వారి ఆరోగ్య అవసరాలను తీర్చడం కోసం ప్రారంభించిన పథకం ఏది ? - నేషనల్ ఆయుష్ మిషన్
- వరిష్ట పింఛను బీమా యోజన పథకం కింద 66,665 నుంచి 6.6 లక్షలు పొదుపు చేస్తే ఏడాది తరువాత ఎంత పింఛను లభిస్తుంది ? - రూ.500 నుండి రూ.5000
- దేశాన్ని తయారీ కేంద్రంగా మార్చాలి అనే పట్టుదలతో, దేశంలోని భారీ యంత్ర పరికరాల ఉత్పత్తిలో అంతర్జాతీయ స్థాయి పోటీ తత్వాన్ని ప్రవేశపెట్టాలని ప్రారంభించిన పథకం ఏది ? - మేకిన్ ఇండియా
- "మేకిన్ ఇండియా" పథకం ఎప్పుడు ప్రారంభమైంది ? - 2014, సెప్టెంబర్ 25న
- "మేకిన్ ఇండియా" ప్రచార కార్యక్రమాన్ని రూపొందించిన అమెరికాకు చెందిన అడ్వర్‌టైజ్‌మెంట్ కంపెనీ ఏది ? - వైడన్ అండ్ కెన్నడీ
- "దీన్‌దయాళ్ ఉపాధ్యాయ అంత్యోదయ యోజన" పథకాన్ని 2014 సెప్టెంబర్ 25న ఎక్కడ ప్రారంభించారు ? - న్యూఢిల్లీలో
- "స్వచ్ఛ భారత్" పథకం ఎప్పుడు ప్రారంభమైంది ?- అక్టోబర్ 2, 2014
- "స్వచ్ఛ భారత్'8 పథకం కింద ప్రతి గ్రామ పంచాయతీకి సంవత్సరానికి ఎన్ని లక్షల రూపాయలు అందజేస్తారు ? - 20 లక్షలు
- ఏ పథకాన్ని స్వచ్ఛ భారత్ పథకంలో విలీనం చేశారు ? - నిర్మల్ భారత్ అభియాన్
- "స్వచ్ఛ భారత్" నినాదం ఏమిటి ? - స్వచ్ఛత వైపు ఒక ముందడుగు
- "స్వచ్ఛ భారత్" నినాదాన్ని రూపకల్పన చేసినది ?- భాగ్యశ్రీ (గుజరాత్)
- 2015, నవంబర్ 15 నుండి అన్ని సేవలపై స్వచ్ఛభారత్ సుంకం ఎంత ? - 0.5%
- స్వచ్ఛ భారత్ టోల్‌ఫ్రీ నంబరు ? - 1969
- ఆధార్ కార్డులోని వేలిముద్రల సాయంతో ఎలక్ట్రానిక్ పద్ధతిలో డబ్బు బదిలీ చేయడానికి, డిజిటల్ చెల్లింపులను ప్రోత్సహించడానికి 2017, ఏప్రిల్ 14న ప్రారంభించిన యాప్ ఏది ? - భీమ్-ఆధార్ యాప్
- "సంసద్ ఆదర్శ గ్రామ యోజన" అనే పథకాన్ని ఎవరి జయంతి సందర్భంగా ప్రధానమంత్రి న్యూఢిల్లీలో ప్రారంభించారు ? - లోక్‌నాయక్ జయప్రకాశ్ నారాయణ్
- దేశ ప్రధాని ప్రజలను ఉద్దేశించి వర్తమాన అంశాలు, సమస్యల గురించి ప్రజలతో రేడియోలో ప్రతినెలా మాట్లాడే కార్యక్రమం మన్ కీ బాత్ ఎప్పుడు ప్రారంభమైంది ? - 2014 అక్టోబర్ 3
- సాంస్కృతిక, వారసత్వ సంపదకు ఆలవాలమైన పురాతన నగరాల పరిరక్షణ, అభివృద్ధికి కేంద్రప్రభుత్వం 2015, అక్టోబర్ 10న వరంగల్‌లో ప్రారంభించిన పథకం ఏది ? - హృదయ్
- హృదయ్ అనగా ? - హెరిటేజ్ సిటీ డెవలప్‌మెంట్ అండ్ ఆగ్మెంటేషన్ యోజన
- హృదయ్ పథకం కింద తెలంగాణ నుండి ఏ నగరాన్ని ఎంపిక చేశారు ? - వరంగల్
- విదేశాలలో నివసించే భారతీయుల సమస్యల గురించి ఉద్దేశించిన పోర్టల్ ఏది ? - మదద్ (చేయూత)
- బాలికల పట్ల వివక్షతలను తొలగించడం, భ్రూణ హత్యలను అరికట్టేలా ప్రజలను చైతన్యపరచడం, బాలికల విద్యను ప్రోత్సహించడం కోసం హర్యానాలోని పానిపట్టు జిల్లాలో 2015 జనవరి 22న నరేంద్రమోడీ ప్రారంభించిన పథకం ఏది ? - బేటీ బచావో - బేటీ పదావో
- "సుకన్య సమృద్ధి యోజన'ను ఏ పథకం కింద అమలు చేస్తున్నారు ?



- బేటీ బచావో - బేటీ పదావో

- బేటీ బచావో - బేటీ పదావో పథకానికి బ్రాండ్ అంబాసిడర్ ఎవరు ? - బాలీవుడ్ నటి మాధురీ దీక్షిత్
- భూసార కార్డుల (సాయిల్ హెల్త్ కార్డ్స్) పథకాన్ని ప్రధానమంత్రి నరేంద్రమోడీ ఎక్కడ ప్రారంభించారు ? - రాజస్థాన్‌లోని సూరత్‌గఢ్‌లో
- "ప్రగతి డే" అని ఏ రోజును పిలుస్తారు ? - ప్రతి నెల నాలుగవ బుధవారం
- ప్రధానమంత్రి ముద్రా యోజన పథకాన్ని ఏ పథకం కింద మోడీ ప్రారంభించారు ? - జన్‌ధన్ యోజన పథకం
- పర్యావరణ అనుకూల వాహనాల అమ్మకాలను పెంచే లక్ష్యంతో కేంద్రప్రభుత్వం ప్రారంభించిన పథకం ఏది ? - ఫేమ్ ఇండియా
- సాంప్రదాయ కళలు, అభివృద్ధి పథకం అయిన ఉస్తాద్ పథకాన్ని 2015, మే 14న ఎక్కడ ప్రారంభించారు ? - ఉత్తరప్రదేశ్‌లోని వారణాసిలో
- 'స్మార్ట్ సిటీ పథకం' కింద ఎంపిక చేసిన నగరానికి సంవత్సరానికి ఎన్ని కోట్ల రూపాయలు అందిస్తారు ? - 100 కోట్లు
- 'స్మార్ట్ సిటీ పథకం' కింద ఆంధ్రప్రదేశ్, నుండి ఎంపికూన నగరాలు ఏవి ? - విశాఖపట్నం, కాకినాడ, తిరుపతి, అమరావతి
- దేశంలో మొట్టమొదటి స్మార్ట్ సిటీ నగరం ఏది ? - పుదుచ్చేరి
- 2022 నాటికి దేశంలోని ప్రతి కుటుంబానికి ఇళ్లు నిర్మించి ఇవ్వడం కోసం రూపొందించిన పథకం ఏది ?- ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం
- ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన పథకం పాలసీదారుడు ప్రతి సంవత్సరం ఎంత ప్రీమియం చెల్లించాలి ? - రూ.12
- గోల్డ్ కాయిన్ స్కీమ్ కింద ఇండియా గోల్డ్ కాయిన్‌లో ఒకవైపు జాతీయ చిహ్నమైన అశోక చక్ర ఉండగా, మరోవైపు ? - గాంధీ ఉంటారు
- అతివృష్టి, అనావృష్టి, అకాల వర్షాలు, కరువులతో తల్లడిల్లుతునన రైతాంగానికి ఊరటనిస్తూ కేంద్రప్రభుత్వం ప్రారంభించిన పథకం ఏది ? - ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన
- "ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకం" పంట నష్టం జరిగిందని తెలియగానే బీమా మొత్తంలో ఎంత మొత్తాన్ని నేరుగా రైతుల ఖాతాలకు బ్యాంకులో జమ చేస్తారు ? - 25%
- 2019 వరకు జాతీయ రహదారులను రైల్వే క్రాసింగ్‌లు లేని రహదారులుగా తీర్చిదిద్దడం ఏ పథకం ముఖ్య ఉద్దేశ్యం ?- సేత భారతం
- నోట్ల రద్దు తరువాత నల్లధనాన్ని పేదల సంక్షేమానికి వినియోగించేందుకు 2016 డిసెంబర్‌లో ప్రారంభించిన పథకం ఏది?- గరీబ్ కళ్యాణ్ యోజన
- పంచాయతీ స్థాయిలో ఉండే కామన్ సర్వీస్ సెంటర్లు (సీఎస్‌సీ) ద్వారా గ్రామీణ ప్రాంతాలవారు, అణగారిన వర్గాల వారికి న్యాయ సహాయ సేవలు అందించడం కోసం కేంద్ర న్యాయమంత్రిత్వశాఖ ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్ మంత్రిత్వశాఖ సహాయంతో 2017 జూన్‌లో ప్రారంభమైన పథకం ? - టెలి రా
- పవర్‌లూమ్ రంగ సమగ్రాభివృద్ధికి కేంద్రప్రభుత్వం ప్రారంభించిన పథకం ఏది ? - పవర్‌టెక్స్ ఇండియా
- ఉత్తరప్రదేశ్‌లోని గంగానది ఒడ్డున ఉన్న 1600 గ్రామాలను అభివృద్ధి చేయడం కోసం ఉద్దేశించిన పథకం ఏది ? - గంగా గ్రామ యోజన
- భారతదేశంలో ఉన్నత విద్య నాణ్యతను అంతర్జాతీయ సహకారంతో పెంపొందించేందుకు కేంద్రప్రభుత్వం రూపొందించిన పథకం ఏది ? - జియాన్ (జీఐఏఎన్- గ్లోబల్ ఇనీషియేటివ్ ఆఫ్ అకడమిక్ నెట్‌వర్క్స్)
- వివిధ జాతులకు చెందిన దేశీయ పాడి పశువులు, ఎద్దులు, దున్నపోతుల శీతలీకరించిన పశు వీర్యం, పిండాలు, ఆన్‌లైన్‌లో క్రయ విక్రయాలు జరిపేందుకు కేంద్రప్రభుత్వం ప్రారంభించిన వెబ్ పోర్టల్ ఏది ? - ఈ-పశుహాత్
- చేతివృత్తుల కళాకారులకు ప్రభుత్వం ఇచ్చే గుర్తింపు కార్డులు ? - పెహచాన్ కార్డు
- చేనేత కార్మికులు తమకు కావలసిన ముడి సరుకు, ఇతరత్రా వస్తువుల లభ్యత గురించి సులువుగా తెలుసుకోవడానికి "ఈ-ధాగా" మొబైల్ యాప్‌ను ప్రారంభించింది ఎవరు ? - కేంద్ర మంత్రి స్మృతి ఇరానీ

విశాలాంధ్ర బిజినెస్

సెన్సెక్స్	నిఫ్టీ	బంగారం (విజయవాడ)	బంగారం (విశాఖపట్నం)	వెండి (విజయవాడ)	వెండి (విశాఖపట్నం)	డాలరు Vs రూపాయి
52.79 ▲	14.90 ▲	-860 ▼	30,080	-100 ▼	41,500	71.05
36,374.08	10,905.20	30,050	ప్రొద్దుటూరు 30,080	40,300	ప్రొద్దుటూరు 42,668	
		22 క్యారెట్లు, 10 గ్రాములు	22 క్యారెట్లు, 10 గ్రాములు	కిలో (రూపాయల్లో)	కిలో (రూపాయల్లో)	

టాప్ గెయినర్స్ (సెన్సెక్స్)

కంపెనీ	ప్రస్తుత ధర	మార్పు (శాతాల్లో)
బీపీసీఎల్	355.20	2.29
గెయిల్	332.40	2.12
యాక్సిస్ బ్యాంక్	676.65	1.91
హెచ్‌సీఎల్ టెక్	957.00	1.75
భారతీ ఇన్‌ఫ్రాటెల్	282.35	1.67

టాప్ లూజర్స్ (సెన్సెక్స్)

కంపెనీ	ప్రస్తుత ధర	లాస్ (శాతాల్లో)
సన్‌ఫార్మా	426.55	-6.00
ఎస్-బ్యాంక్	201.50	-3.29
జీ ఎంటర్‌టైన్	440.90	-2.48
ఎస్‌బీఐ	304.35	-1.90
ఐషర్ మోటార్స్	20,847.75	-1.76

విదేశీమారకం విలువ (ఫారెక్స్)

కరెన్సీ	రూ.విలువ క్రి.ముగింపు	రూ.విలువ ప్ర.ముగింపు
డాలర్	71.24	71.05
యూరో	81.17	81.00
పౌండ్	91.79	91.67
ఆస్ట్రేలియా డాలర్	51.11	50.93
సింగపూర్ డాలర్	52.57	52.42

బులియన్

బంగారం (10 గ్రాములు)	22 క్యారెట్లు రూ.	24 క్యారెట్లు రూ.
హైదరాబాద్	30,080	32,240
చెన్నై	30,080	32,240
బెంగళూరు	30,500	32,620
ముంబై	31,660	33,861
విజయవాడ	-	32,400
విశాఖపట్నం	30,080	32,550
ప్రొద్దుటూరు	30,080	32,630

ముడి చమురు	60.30

ఫోక్స్ వ్యాగన్‌కు ఎన్జీటీ షాక్

- రూ.100 కోట్ల జరిమానా
- 24 గంటల్లో చెల్లించాలని ఆదేశం
- లేదో ఎండీ అరెస్టు, ఆస్తులు సీజ్ తప్పదని హెచ్చరిక

న్యూఢిల్లీ : జర్మన్ కార్ల తయారీ సంస్థ ఫోక్స్ వ్యాగన్‌కు కోలుకోలేని షాక్ తగిలింది.. తప్పుడు డీజిల్ మీటర్లతో వినియోగదారులను మోసం చేశారంటూ దాఖలైన కేసులో.. న్యూఢిల్లీలోని నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ (ఎన్జీటీ) రూ.100కోట్లు చెల్లించాలని ఆదేశించింది. ఒక్క 2006 ఏడాదిలోనే దాదాపు 3.17లక్షల వాహనాల ద్వారా వాస్తవానికంటే 40 రెట్లు నైట్రస్ ఆక్సైడ్స్ విడుదల చేసిందన్న ఫిర్యాదుపై 24 గంటల లోగా సెంట్రల్ కాలుష్య నియంత్రణ బోర్డుకు జరిమానా సొమ్మును డిపాజిట్ చేయాలని నేడు గురువారం ఆదేశించింది. లేని పక్షంలో సంస్థ భారత్ విభాగం ఎండీని అరెస్టు, సంస్థ ఆస్తులను సీజ్ చేస్తామని హెచ్చరించింది. జస్టిస్ ఆదర్శ్ కుమార్ నేతృత్వంలోని నలుగురు సభ్యుల ప్యానల్ మధ్యంతర ఉత్తర్వులను జారీ చేసింది. ప్రపంచవ్యాప్తంగా కాలుష్య ఉద్గారాలపై, అనేక కేసులను ఎదుర్కొంటున్న ఫోక్స్ వ్యాగన్ భారతదేశంలో కూడా వాహనాల్లో నైట్రస్ ఆక్సైడును పరిమితులను అధిగమించి వాడిందని, తద్వారా ఢిల్లీ నగరంలో అటు పర్యావరణానికి ఇటు ప్రజల ఆరోగ్యానికి హాని కలిగించిందని తెలిపింది. 2016లో ఫోక్స్‌వ్యాగన్ సుమారు 48.678 టన్నుల నైట్రస్ ఆక్సైడ్‌ను విడుదల చేసినట్టు 2018 డిసెంబర్ 24న ఎన్జీటీ ప్యానల్ నిర్ధారించింది. కాగా ఈ కేసులో 171.34 కోట్ల రూపాయలను చెల్లించాల్సిందిగా గత ఏడాది నవంబరు 16న ఆదేశించింది. ఈ విషయాన్ని దర్యాప్తు చేయడానికి నిపుణుల బృందాన్ని ఏర్పాటు చేసింది. ఆరోపణలను సమర్థించిన కమిటీ జరిమానా విధించాలని సిఫార్సు చేసింది. కానీ సంస్థ జరిమానా సొమ్మును జమలేదు. దీనిపై ఆగ్రహం వ్యక్తం చేసిన ఎన్జీటీ రూ. 100కోట్లు చెల్లించాల్సిందిగా తాజా ఆదేశాలు జారీ చేసింది. భారత దేశంలో మొత్తం 3.27 లక్షల ఫోక్స్‌వ్యాగన్ వాహనాల్లో తప్పుడు మీటర్లను బిగించినట్టు ఎన్జీటీ గుర్తించింది. దీంతో భారత దేశంలోని 3.23 లక్షల వాహనాలను వాపస్ తీసుకుంటామని ఫోక్స్‌వ్యాగన్ ఎన్జీజీకి తెలిపింది. 2015లో పుణెలోని ఆటోమోటివ్ రిసెర్చ్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా నివేదిక ప్రకారం పరికరాలను మార్చాలని ఫోక్స్‌వ్యాగన్‌ను ఎన్జీటీ ఆదేశించింది. ఐతే, 3,23,700 కార్లను ఫోక్స్‌వ్యాగన్ రీకాల్ చేసింది. ఏఆర్ఏఐ ప్రమాణాలకు అనుగుణంగా పరికరాలను అమర్చినట్టు ప్రకటించింది. ఐతే రోడ్లపై తనిఖీల్లో ఫోక్స్‌వ్యాగన్ కార్ల నుంచి ఉద్గారాలు ఎక్కువగా ఉన్నట్టు తేలింది. పరిమితులకు మించి 1.1 నుంచి 2.6 రెట్లు ఉన్నట్టు తేలింది. దీంతో ఎన్జీటీ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తూ భారీ జరిమానా విధించింది. తమ వాహనాలు దేశంలో స్టేజ్4 నిర్దేశించిన ఉద్గార నిబంధనలకు అనుగుణం గానే ఉన్నాయని ఫోక్స్ వ్యాగన్ ఇండియా చెబుతోంది.

హెచ్-1బీ వీసాపై శ్రమ దోపిడీ...!



- జీతాలు తక్కువ.. వేధింపులు ఎక్కువ
- ఉద్యోగుల్లో అభద్రత
- అమెరికా థింక్-ట్యాంక్ నివేదిక

వాషింగ్టన్: అమెరికాలో హెచ్-1బీ వీసాలపై పనిచేస్తున్న ఉద్యోగులకు చాలా సార్లు పని వాతావరణం ఏమాత్రం బాగుండట్లేదని, వేధింపులకు గురవుతున్నారని, పనికి తగిన వేతనం ఇవ్వకుండా దోపిడీ చేస్తున్నారని అమెరికాకు చెందిన ఓ సంస్థ వెల్లడించింది. ఈ ఉద్యోగాల విషయంలో.. జీతాల పెంపుతో పాటు పలు సంస్కరణలు తీసుకురావాలని సౌత్ ఏషియన్ సెంటర్ ఆఫ్ ది అట్లాంటిక్ కౌన్సిల్ (థింక్-ట్యాంక్) అనే సంస్థ సూచించింది. ఈ వీసాలపై పనిచేసే ఉద్యోగులకు మంచి పని వాతావరణం, ఉద్యోగ భద్రత కల్పించాలని పేర్కొంది. హెచ్-1బీ వీసా విధానంలో మార్పులు తీసుకొస్తామని, మంచి సంస్కరణలు చేస్తామని, ప్రతిభావంతులు అమెరికాలో ఉండేందుకు మార్గం సుగమం చేస్తామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇటీవల ప్రకటించిన నేపథ్యంలో ఈ సంస్థ ఉద్యోగుల పరిస్థితులను చాలా మెరుగు పరచాలంటూ నివేదిక విడుదల చేసింది. ప్రస్తుతం హెచ్-1బీ వీసా విధానం వల్ల అమెరికన్లకు హానీ జరగడంతో పాటు.. హెచ్-1బీ వీసాదారులు దోపిడీకి, వేధింపులకు గురవుతున్నారని, తగిన వేతనం ఇవ్వకుండా పని చేయిస్తున్నారని నివేదిక వెల్లడించింది. తగిన వేతనంతో పాటు చక్కని పని వాతావరణం, ఉద్యోగ హక్కులు కల్పిస్తే ఇక్కడ వారి జీవితాలు మెరుగవుతాయని పేర్కొంది. ఈ వీసాల విషయంలో మొదట చేయాల్సిన పని జీతాలు పెంచడం అని తెలిపింది. అప్పుడే అత్యుత్తమ ప్రతిభావంతులు అమెరికాకు వస్తారని వెల్లడించింది. కంపెనీలు అమెరికన్లను కూడా తగినన్ని ఉద్యోగాలు ఇవ్వాలని, అర్హతను బట్టి పదవులు ఇవ్వాలని తెలిపింది.



ఈజీగా... విదేశీ రుణాలు..!

న్యూఢిల్లీ: భారత్‌లోని సంస్థలు విదేశాల నుంచి రుణాలు పొందే విషయమై భారతీయ రిజర్వు బ్యాంక్ (ఆర్బీఐ) సరళీకరించిన కొత్త విధానాన్ని తీసుకువచ్చింది. ఇందులో భాగంగా అర్హత కలిగిన అన్ని సంస్థలు ఆయా రంగాలతో సంబంధం లేకుండా ఆటోమేటిక్‌గా విదేశాల నుంచి రుణాల రూపంలో నిధులను సమీకరించుకొనేలా ఆర్బీఐ ప్రకటించింది. దీంతో విదేశాల నుంచి రుణాలను పొందేందుకు గాను ఇప్పటి వరకు రంగాల వారీగా అమలులో ఉన్న ఆంక్షలను ఆర్బీఐ తొలగించినట్టయింది. కొత్త విధానంలో భాగంగా అర్హత కలిగిన సంస్థలు ఒక్క ఆర్థిక సంవత్సరంలో 75 కోట్ల డాలర్ల వరకు విదేశీ వాణిజ్య రుణాలను (ఈసీబీ) పొందొచ్చు. భారత్‌లో వ్యాపార నిర్వహణను మరింతగా సలభతరం చేసే దిశలో భాగంగా ఈ చర్యలను చేపట్టినట్టుగా ఆర్బీఐ తెలిపింది. దేశంలో ఆర్థిక విధానాల సరళీకరణ, హేతుబద్ధీకరణలో భాగంగానే ఈసీబీ, రూపాయి విలువతో కూడిన బాండ్ల విషయంలో ఈ నిర్ణయం తీసుకున్నట్టుగా బ్యాంక్ తెలిపింది. ఈసీబీకి అర్హత కలిగిన సంస్థల జాబితాలో అదనంగా పోర్టు ట్రస్టులు, సెజ్‌లు, సీడ్బీ, ఎగ్జిమ్ బ్యాంక్, మైక్రోఫైనాన్స్ సంస్థలు, రిజిస్టర్డ్ సొసైటీలు, ట్రస్టులు, కో-ఆపరేటివ్ సంస్థలు, ఎన్‌జీవోలను కూడా చెర్చినట్టుగా ఆర్బీఐ తెలిపింది. ఈ సంస్థలు ఇకపై సులువుగా విదేశీ రుణాలు పొందే అవకాశం ఉంది. పరిశ్రమ వర్గాలతో ఆర్బీఐ గవర్నర్ భేటీ ఆర్బీఐ నూతన గవర్నర్ శక్తికాంత దాస్ గురువారం దేశంలోని వివిధ పారిశ్రామిక సంఘాల ప్రతినిధులతో భేటీ కానున్నారు.

విజ్ఞానం

సూసైడ్ రిస్క్‌ను పెంచుతున్న కేన్సర్



కేన్సర్ సూసైడ్ రిస్క్‌ను నాలుగురెట్లు పెంచుతుందని తాజా అధ్యయనం వెల్లడించింది. పెన్సిల్వేనియాలోని స్టేట్ కేన్సర్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ అధ్యయనవేత్తల నివేదిక ఆధారంగా కేన్సర్ చికిత్సలో అత్యంత ముందంజలో ఉన్నప్పటికీ కేన్సర్ ప్రభావం మనిషి మానసికంగా కృంగదీస్తుందని వెల్లడించింది. కేన్సర్ మరణాలకు కారణమైనప్పటికీ కేన్సర్ రోగులు కేవలం కేన్సర్ వలనే మరణించడంలేదు. మరణానికి పలు కారణాలు ఉన్నప్పటికీ, వాటిలో సూసైడ్ ఒకటి. కేన్సర్ అని గుర్తించడంతోనే రోగి డిప్రెషన్ గురవ్వడం మనం గమనిస్తాం.. ఇవన్నీ కేన్సర్ గుర్తింపు, చికిత్స, ఆర్థికవత్తిడి, ఇతర కారణాలై ఉండవచ్చు... పురుషుల్లో యుక్తవయసులో కేన్సర్‌గుర్తింపబడిన వారిలో ఊపిరితిత్తులు, తల, మెడ, టెస్టికులర్ కేన్సర్, లింఫోమాస్‌కు గురైనవారు సూసైడ్‌కు గురవుతున్నట్లు తెలుసోతంది. కేన్సర్ గుర్తింపబడిన ఐదేళ్లకు వీరిలో సూసైడ్ తగ్గుముఖం పట్టినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా టెస్టికులర్ కేన్సర్, హాడ్గ్కిన్ లింఫామాకు గురైనవారు సూసైడ్ రిస్క్ ఎక్కువగా ఉంటుంది. కేన్సర్‌కు గురైనవారిలో పెద్దవారిలో ప్రోస్టేట్, హెడ్, నెక్ కేన్సర్ వ్యాధిగ్రస్థుల్లో సూసైడ్ రిస్క్ ఎక్కువగా ఉంటుంది.

నూత్న బ్యాండేజ్‌తో ప్రయోజనమే...

బయోడిగ్రేడబుల్, నానో ఫైబర్ బ్యాండేజ్‌తో గాయాలను త్వరగా మాన్పించవచ్చునని తెలుస్తోంది. అంతర్జాతీయ శాస్త్రవేత్తల బృదం చేపట్టిన అధ్యయనంలో యాంటిబాక్టీరియల్ ప్రభావం కూడా ఈ నూతన బ్యాండేజ్‌లో ఉంటుందని తెలిపారు. మార్చవలసిన అవసరంలేకుండానే దీర్ఘకాలంపాటు కొనసాగే ఈ బ్యాండేజిలో చర్మం పెరుగుదలతోపాటు ఇన్‌ఫెక్షన్ రిస్క్ ఉండదని స్పుత్నిక్ న్యూస్ వెల్లడించింది. గాయాలను మాన్పే చికిత్సలో భాగంగా కొనసాగుతున్న పద్ధతులవలన హానికర బాక్టీరియాను నిర్వీర్యం చేయడంతోపాటు మంచి డాక్టీరియాపై కూడా ప్రతికూల ప్రభావం చూపుతోంది. జెక్ రిపబ్లికు చెందిన నూదన బయోకాంపాటబుల్ డ్రెస్సింగ్ మెటీరియల్ ఇన్‌ఫ్లమేషన్‌సోకకుండా నివారిస్తుంది.

ఫేస్‌బుక్ నిబంధనలు మరింత కఠినం



న్యూఢిల్లీ: ప్రముఖ సోషల్ మీడియా వెబ్‌సైట్ ఫేస్‌బుక్ భారత్‌లో రాజకీయ ప్రకటనలకు సంబంధించిన నిబంధనలను కఠినతరం చేసింది. భారత్‌లో మరికొన్ని నెలల్లో లోక్‌సభ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఫేస్‌బుక్ జాగ్రత్తలు తీసుకుంటోంది. కొన్ని నెలల్లో ఎన్నికలు జరగాల్సిన భారత్, నైజీరియా, ఉక్రెయిన్, యూరోపియన్ యూనియన్లలో రాజకీయ ప్రకటనలపై నిబంధనలు కఠినం చేసినట్లు ఫేస్‌బుక్ వెల్లడించింది. ప్రకటనలలో రాజకీయాలకు సంబంధించిన జోక్యం అరికట్టేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలిపింది. దాదాపు అన్ని దేశాల్లో ఫేస్‌బుక్ అతి పెద్ద సోషల్ మీడియా. రాజకీయ నాయకులు వివిధ ప్రకటనల కోసం ఫేస్‌బుక్‌ను ఉపయోగించుకోవడమే కాకుండా నకిలీ వార్తలు, ఇతర అనవసర ప్రచారాలు కూడా ఎక్కువయ్యాయి. కొన్ని ఎన్నికల నిబంధనలకు, కంపెనీ పాలసీలకు విరుద్ధంగా ఉంటున్నాయి. దీంతో ఫేస్‌బుక్ తగిన చర్యలు తీసుకుంటోంది. ప్రపంచవ్యాప్తంగా అధికార వర్గాల నుంచి ఫేస్‌బుక్‌పై ఒత్తిళ్లు రావడంతో ఫేస్‌బుక్ గత ఏడాది రాజకీయ ప్రకటనలను పర్యవేక్షించేందుకు పలు రకాల ప్రయత్నాలు ప్రారంభించింది. మనదేశంలో వచ్చే నెల నుంచి రాజకీయాలకు సంబంధించిన ప్రకటనలను సెర్చ్ చేయడానికి వీలైన ఆన్‌లైన్ లైబ్రరీలో ఉంచనున్నట్లు కంపెనీ అధికారి ఒకరు తెలిపారు. ఇది కచ్చితంగా పనిచేస్తుందని చెప్పలేమని, కానీ కొద్ది కొద్దిగా మెరుగు చేసుకుంటూ వెళ్తామని పేర్కొన్నారు. నైజీరియాలో ఈరోజు నుంచి ఈ పాలసీ ప్రారంభిస్తున్నామని, ఉక్రెయిన్‌లో వచ్చే నెలలో మొదలుపెడతామని చెప్పారు. నైజీరియాలో అధ్యక్ష ఎన్నికలు ఫిబ్రవరి 16 నుంచి ప్రారంభంకానుండగా, ఉక్రెయిన్‌లో మార్చి 31 నుంచి జరగనున్నాయి.

బంగారం మిలమిల..
వెండి వెలవెల

ముంబై: వరుసగా నాలుగో రోజు బంగారం ధర పెరిగింది. స్థానిక నగల వ్యాపారుల నుంచి డిమాండ్ పెరగడంతో బంగారం ధర పెరుగుతూ వస్తోందని నిపుణులు అభిప్రాయ పడుతున్నారు. ఈరోజు స్వచ్ఛమైన పసిడి ధర పది గ్రాములకు రూ.110 పెరిగి రూ.33,300కు చేరింది. కాగా నేడు వెండి ధర తగ్గింది. కేజీ వెండి ధర రూ.300 తగ్గి రూ.40,200గా ఉంది. పారిశ్రామిక వర్గాలు, నాణేల తయారీదారుల నుంచి వెండికి డిమాండ్ తగ్గినట్లు మార్కెట్ వర్గాలు వెల్లడించాయి. గురువారం 99.9శాతం స్వచ్ఛమైన బంగారం, 99.5శాతం స్వచ్ఛమైన బంగారం పది గ్రాములకు రూ.110 తగ్గింది. దీంతో వీటి ధరలు వరుసగా రూ.33,300గా, రూ.33,150గా ఉన్నాయి. గత మూడు రోజులుగా బంగారం ధర పదిగ్రాములపై రూ.315 పెరిగింది. అంతర్జాతీయ మార్కెట్లో బంగారం, వెండి ధరలు పెరిగాయి. న్యూయార్క్ మార్కెట్లో ఔన్సు బంగారం ధర 1292.55డాలర్లు కాగా, ఔన్సు వెండి ధర 15.57డాలర్లుగా ఉంది.

స్వల్ప లాభాలతో సరి..!

ముంబై: దేశీయ మార్కెట్లు గురువారం స్వల్ప లాభాలతో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్ల సానుకూల ప్రభావంతో ఈ ఉదయం సూచీలు ఉత్సాహంగా ప్రారంభమైనప్పటికీ.. కీలక రంగాల్లో వెల్లువెత్తిన అమ్మకాలు మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీశాయి. ఫలితంగా ఆద్యంతం తీవ్ర ఒడుదొడుకుల్లో సాగిన సూచీలు చివరకు స్వల్ప లాభాలతో సరిపెట్టుకున్నాయి. ఈ ఉదయం సూచీలు సానుకూలంగా ప్రారంభమయ్యాయి. ట్రేడింగ్ ఆరంభంలో సెన్సెక్స్ 100 పాయింట్లకు పైగా లాభపడింది. నిఫ్టీ కూడా 10,900 మార్క్ పైన ట్రేడ్ అయ్యింది. అయితే ఆ జోరు ఎంతో సేపు నిలువలేదు. ఆసియా మార్కెట్ల మిశ్రమ సంకేతాలతో పాటు ఫార్మా, ప్రభుత్వ రంగ బ్యాంకుల షేర్లు కుదేలవడంతో సూచీలు నష్టాల్లోకి జారుకున్నాయి. ఒక దశలో సెన్సెక్స్ 100 పాయింట్లు నష్టపోయింది. అయితే చివరి గంటల్లో మళ్లీ కొనుగోళ్లు జరగడంతో సూచీలు తేరుకున్నాయి. గురువారం నాటి సెషన్‌లో సెన్సెక్స్ 53 పాయింట్లు లాభపడి 0.15శాతంతో 36,374 వద్ద, నిఫ్టీ 15 పాయింట్ల లాభంతో 0.14 శాతంతో 10,905 వద్ద స్థిరపడ్డాయి. డాలర్‌తో రూపాయి మారకం విలువ 71.11గా కొనసాగుతోంది. సెన్సెక్స్ ప్యాక్‌లో యాక్సిస్‌బ బ్యాంకు, హెచ్‌సిఎల్ టెక్,ఎమ్‌అండ్ ఎమ్, టిసిఎస్, హెచ్‌డిఎఫ్‌సి, కొటక్ బ్యాంకు, పవర్ గ్రిడ్, హీరో మోటాకార్ప్, వేదాంత టాప్ గెయినర్స్ కాగా 1.91శాతం లబ్దిపొందింది. సన్‌ఫార్మ అతిపెద్ద నష్టదాయిగా 5.78శాతం నష్టపోయింది. యస్‌బ్యాంకు, ఎస్‌బీఐ, బజాజ్ ఫైనాన్స్, టాటాస్టీల్, భారతి ఎయిర్‌టెల్, ఓఎన్‌జిసి, 3.31శాతం నష్టపోయింది. ఆర్ఐఎల్, హెచ్‌యుఎల్ 1.12శాతం నష్టపోయింది. అనుకూల, ప్రతికూలతల మధ్య సూచీలు ఊగిసలాటకు లోనయ్యాయి. కార్పొరేట్ రంగాల కీలక ఫలితాలు, తీవ్ర అనిశ్చిత పరిస్థితుల మధ్య మదుపరులు ఆచితూచి వ్యవహరిస్తున్నారు. ఐటి స్టాక్స్ మార్కెట్‌కు కలిసివచ్చాయని చెప్పవచ్చు. విదేశీ మదుపరులు రూ.9010కోట్ల విలువైన షేర్లను అమ్మగా దేశీయ మదుపరులు రూ.304.27 కోట్ల షేర్లను అమ్మినట్లు తెలుస్తోంది.


సీఎల్పీ నేత ఎంపిక సస్పెన్స్

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: తెలంగాణ కాంగ్రెస్ శాసనసభాపక్ష నేతగా ఎవరన్న దానిపై ఇంకా సస్పెన్స్ కొనసాగుతూనే ఉంది. గురువారం నుంచి అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమైన నేపథ్యంలో కాంగ్రెస్ అధిష్ఠానానికి సీఎల్పీ నేత ఎన్నిక తలనొప్పిగా మారింది. బుధవారం ఉదయం నుంచి అర్ధరాత్రి వరకు హైదరాబాద్‌లోని ఓ హోటల్‌లో కాంగ్రెస్ నేతలు సమావేశమై చర్చించినా సీఎల్పీ నేత ఎంపికపై ఓ నిర్ణయానికి రాలేదు. దీంతో ఏఐసీసీ పరిశీలకుడు కేసీ వేణుగోపాల్ గురువారం ఉదయం కాంగ్రెస్ ఎమ్మెల్యేలతో సీఎల్పీ కార్యాలయంలో సమావేశమ య్యారు. సీఎల్పీ నేత ఎంపికపై ఎమ్మెల్యేల నుంచి అభిప్రాయాలు సేకరించారు. అయితే సీఎల్పీ నేత ఎన్నికపై తుది నిర్ణయం రాహుల్‌గాంధీకే అప్పగిస్తూ ఎమ్మెల్యేలంతా ఏకవాక్య తీర్మానం చేశారు. టీపీసీసీ అధ్యక్షులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, భట్టి విక్రమార్క, కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, సబితా ఇంద్రారెడ్డి సీఎల్పీ నేత రేసులో ఉన్నారు. సీఎల్పీ నేత ఎంపిక నిర్ణయం పార్టీ అధినేత రాహుల్‌గాంధీ కోర్టులోకి చేరడంతో ఆయన ఎవరిని ఎంపిక చేస్తారోనని అందరిలోనూ ఉత్కంఠ నెలకొంది. గురువారం సాయంత్రం లేదా శుక్రవారం రాహుల్ తన నిర్ణయం ప్రకటిస్తారని సీఎల్పీ వర్గాలు చెబుతున్నాయి. మరోవైపు శాసనసభ స్పీకర్ పదవికి పోటీ చేయరాదని తెలంగాణ కాంగ్రెస్ పార్టీ నిర్ణయించింది. ఈ అంశాన్ని ఎమ్మెల్యేల సమావేశంలో టీపీసీసీ అధ్యక్షులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్రతిపాదించగా అందరూ అంగీకరించారు. దీంతో తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ పదవి ఏకగ్రీవానికి లైన్ క్లియర్ అయినట్లే.

ఒక్కరోజులోనే ఐటీ రిఫండు

'రిటర్న్స్' విశ్లేషణకు కొత్త విధానం

న్యూఢిల్లీ: తదుపరి తరం ఆదాయపు పన్ను ఫైలింగ్ విధానాన్ని అభివృద్ధి చేసే పనులను ఐటీ దిగ్గజం ఇన్ఫోసిస్‌కు అప్పగిస్తూ క్యాబినెట్ నిర్ణయం తీసుకుంది. దాదాపు రూ.4,241.97 కోట్ల విలువైన ఈ ప్రాజెక్టు పనులను ఇన్ఫోసిస్‌కు అప్పగించినట్టుగా రైల్వే శాఖ మంత్రి పీయూష్ గోయెల్ క్యాబినెట్ సమావేశం అనంతరం తెలిపారు. కొత్త విధానం వల్ల పన్ను చెల్లింపుదారు ఐటీ-రిటర్నులు దాఖలు చేసిన ఒక్క రోజుల్లోనే సమాచార విశ్లేషణ జరిగి పన్ను రిఫండ్స్ ఏమైనా ఉంటే.. కనిష్టంగా ఆదే రోజు పన్ను చెల్లింపుదారు అకౌంట్‌కు జమయ్యేలా ఈ విధానాన్ని రూపొందిస్తున్నట్టుగా మంత్రి తెలిపారు. ప్రస్తుతం ఐటీ రిటర్నుల విశ్లేషణకు గాను ఆదాయపు పన్ను శాఖ దాదాపు 63 రోజుల వ్యవధిని తీసుకుంటోంది. కొత్త విధానం వల్ల ఈ సమయం గరిష్టంగా తగ్గి పన్ను చెల్లింపుదారులకు సౌకర్యంగా మారనుందని మంత్రి తెలిపారు. ఈ కొత్త విధానం 18 నెలల్లో అందుబాటులోకి రానుందని ఆయన అన్నారు. తొలత దీనిని మూడు నెలల పాటు ప్రయోగాత్మకంగా పరీక్షించిన తరువాత పూర్తి స్థాయిలో అందుబాటులోకి తేనున్నట్టుగా ఆయన తెలిపారు.



22,600 కోట్లతో బీపీసీఎల్ రిఫైనరీ విస్తరణ

ఈశాన్య భారతపు రిఫైనరీ అవసరాలను తీర్చేందుకు గాను ప్రతిపాదించిన నుమాలీఘర్ రిఫైనరీ విస్తరణకు గాను కేంద్ర క్యాబినెట్ బుధవారం సమ్మతి తెలిపింది. దాదాపు రూ.22,594 కోట్ల వ్యయంతో భారత్ పెట్రోలియం కార్పొరేషన్‌కు (బీపీసీఎల్) చెందిన నుమాలీఘర్ రిఫైనరీని ప్రస్తుతం ఉన్న మూడు మిలియన్ టన్నుల సామర్థ్యం నుంచి 9 మిలియన్ టన్నుల సమార్థ్యం కలిగిన రిఫైనరీగా మార్చనున్నారు. ఈ విషయాన్ని క్యాబినెట్ సమావేశం అనంతరం రైల్వే శాఖ మంత్రి పీయూష్ గోయెల్ వెల్లడించారు. నాలుగేండ్ల కాలంలో ఈ ప్రాజెక్టు పనులు పూర్తవనున్నట్టుగా ఆయన తెలిపారు. ఈ ప్రాజెక్టులో భాంగా పారాదీప్ నుంచి నుమాలీఘర్ రిఫైనరీ వరకు ముడి చమురు పైపులైను ఏర్పాటుతో పాటు నుమాలీఘర్ నుంచి సిలిగూరి వరకు ప్రొడక్ట్ పైప్‌లైన్‌ను ఏర్పాటు చేయనున్నట్టుగా మంత్రి తెలిపారు.

ఎక్సిమ్ బ్యాంకుకు 6వేల కోట్ల మూలధనం

ప్రభుత్వ రంగంలోని ఎక్స్‌పోర్టు-ఇంపోర్టు బ్యాంకు ఆఫ్ ఇండియాకు (ఎక్సిమ్ బ్యాంక్) రూ.6,000 కోట్ల మూలధనం సమకూర్చడానికి బుధవారం కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. రీకాపిటలైజేషన్ బాండ్ల జారీ ద్వారా ఈ మొత్తాన్ని సమకూర్చనున్నారు. వచ్చే మార్చి లోపు ఎక్సిమ్ బ్యాంకుకు రూ.4,500 కోట్లు, 2018-19 ఆర్థిక సంవత్సరంలో మరో రూ.1,500 కోట్లు అందించడానికి క్యాబినెట్ అంగీకరించిందని మంత్రి పియూష్ గోయల్ వెల్లడించారు. ఈ మూలధనం వల్ల ఎగుమతిదారులు, దిగుమతిదారులకు ప్రోత్సాహం లభించనుందని ఆయన వెల్లడించారు.

ఘనంగా లాస్యదృత రిథం



విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: లాస్యదృత, సెంటర్ ఫర్ ఫెర్‌ఫార్మింగ్ అండ్ ఫైన్ ఆర్ట్స్ ఫౌండేసన్ తమ 5వ వార్షికోత్సవ వేడుకలను రిథం-2019 పేరిట సికింద్రాబాద్‌లోని గురుస్వామి ఆడిటోరియంలో ఘనంగా జరుపుకుంది. ఈ కార్యక్రమంలో కర్నాటక్ వోకల్, వీణ కార్యక్రమాలతో పాటు మోహినీనాట్యం ప్రదర్శనను శాస్త్రీయ సంగీత ప్రేమికుల సమక్షంలో నిర్వహించారు. విద్యార్థుల సంగీత, నృత్యాలతో గురుస్వామి కేంద్రం ఆహ్లాదకరంగా మారడంతో పాటు ఆహుతుల మనసులను రంజింపజేసింది. ఈ సందర్భంగా నిర్వాహకులు అనిత మాట్లాడుతూ నిబద్ధత, క్రమశిక్షణ, అంకితభావం, కలిగిన సాంస్కృతిక కేంద్రం లాస్యదృత అని తెలిపారు. సంగీతం, కళలు, నృత్యం వంటి కళలను ఒకే చోటకు తీసుకురావాలనేది తమ లక్ష్యమని, ప్రతిభవుంటే అభ్యాసావకాశాలు ఖచ్చితంగా లభ్యం కావడమే కాకుండా ఎలాంటి అవాంతరాలు లేకుండా వాటిని పొందవచ్చునన్నారు.



భారతీయ డిజైనర్లకు 'లెక్సస్' అవార్డ్స్

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: వినూత్న డిజైన్‌పై దృష్టిని సారించి ప్రోత్సాహకాలు అందిస్తున్న లెక్సస్ ఇండియా రెండో లెక్సస్ డిజైన్ అవార్డు ఇండియా (ఎల్‌డిఎఐ) విజేతలను ప్రకటించింది. 12 విభాగాల్లో పోటీలు జరుగగా, మొత్తం 557 ఎంట్రీలు వచ్చాయని, వాటి నుంచి విజేతలను ఎంపిక చేశామని సంస్థ ప్రెసిడెంట్ పిబి.వేణుగోపాల్ వెల్లడించారు. డిజైన్ ఫర్ ఎ బెటర్ టుమారో అనే థీమ్‌తో ఎల్‌డిఎఐ 2019 జరిగిందని, ఈ పోటీల్లో సమాజం ఎదుర్కొంటున్న అనేక సమస్యలకు సరైన పరిష్కారం కోసం ఆలోచనలు వచ్చాయన్నారు. లెక్సస్ ఇండియా చైర్మన్ ఎన్.రాజా మాట్లాడుతూ సౌకర్యం, విలాసం, సురక్షిత, సుస్థిరదాయకతలకు హామీ ఇచ్చేలా లెక్సస్ నిలిచిందన్నారు.

దారి కనుక్కోండి



తోకలు

ఒకప్పుడు జంతువులకు మనుషుల్లాగే తోకలు ఉండేవికావు. అడవికి రాజైన సింహానికి మాత్రమే పెద్ద తోక ఉండేది. సింహం తన తోకను అటుఇటు ఊపుకుంటూ రాజసంగా నడిచేది. తోకతో



సింహం ఎంతో హుందాగా, అందంగా కనపించేది. సింహం తోకను చూసినప్పుడల్లా మిగతా జంతువులకు తమకూ అలాగే తోక ఉంగే ఎంత బాగుంటుందో అనే కోరిక కలిగేది. ఒకరోజు జంతువులన్నీ కలసి సింహంతో తమకూ తోకలు కావాలని మొరపెట్టుకున్నాయి. సింహం వనదేవత దగ్గకు వెళ్లి జంతువు కోరికను తెలిపింది. వనదేవత సింహానికి ఒక తోకట చుట్ట ఇస్తూ ఎవరికి ఎంత కావాలో కనుక్కుని ఇవ్వమని చెప్పింది.

సింహం 'తోకలు కావలసిన వారంతా ఫలానా రోజు తన దగ్గరకు రావాలి' అని అడవిలో దండోరా వేయించింది. జంతువులు ఎంతో ఉత్సాహంగా సింహం చెప్పిన చోటుకు, చెప్పిన రోజుకు చేరుకున్నాయి. అదే అడవిలో ఒక కుందేలు ఉండేది. దానికి బద్ధకం ఎక్కువ. ఏ రోజు చేయవలసిన పనిని ఆ రోజు చేసేది కాదు. ప్రతి పనిని వాయిదా వేసేది. ఒక కోతి సింహం దగ్గరకు వెళుతూ ఒక చెట్టుకింద కునుకు తీస్తున్న కుందేలును చూసి 'మిత్రమా! తోకల పంపకం జరుగుతోంది. నువ్వు రావా;' అని అడిగింది.

'ఎండ ఎక్కువగా ఉంది కదా కోతి బావా! పైగా నిద్ర ముంచుకు వస్తోంది. నువ్వెలాగూ వెళుతున్నావుగా, ఆ చేత్తోనే నా కోసం కూడా అడిగి తీసుకురా!' అంది కుందేలు.

అక్కడ సింహం ఎవరికి ఎంత తోక కావాలో, వారి వారి పనులను బట్టి విశ్లేషిస్తూ జంతువులన్నిటికీ తోకలు ఇస్తోంది. కోతి.. చెట్లమీద, కొమ్మలమీద గెంతుతుంది కాబట్టి దానికి సరిపడా తోకను ఇచ్చి, కుందేలు కోసం కూడా ఇచ్చింది. కుందేలుకు ఇవ్వవలసిన తోకను పట్టుకుని ఇంటికి తిరిగి వస్తున్న



కోతికి మార్గమధ్యంలో దుర్బుద్ధి కలిగింది. కుందేలుకు ఇచ్చిన తోకను కూడా తనే అతికించేసుకుంది.

జరిగిన విషయం తెలుసుకుని కుందేలు లబోదిబోమంది. సింహం దగ్గరకు పరుగెత్తుకు వెళ్లి ఏడుస్తూ జరిగిన సంగతి వివరించింది. కానీ అప్పటికే సింహం దగ్గరున్న తోక చుట్టంతా అయిపోయింది. కొంచెం తోక ముక్క మాత్రమే మిగిలింది.

'నీ బద్ధకం వల్లే నీకు నష్టం జరిగింది. నా దగ్గర ఈ కాస్త తోక మాత్రమే ఉంది. తీసుకో. ఇకనుంచైనా నీ బద్ధకాన్ని వదిలేసి జాగ్రత్తగా ఉండు' అని హితవు చెప్పి కుందేలుకు ఆ తోక ముక్కను ఇచ్చింది సింహం.

ఈ విధంగా కోతికి పెద్ద తోక, కుందేలుకు చిన్నతోక వచ్చాయి. చిన్నారులూ.. బద్ధకం ఎంత పనిచేసిందో చూశారా.. మీరు అలా చేయకండే..!

సరస్సులోని ఊరు!



సరస్సులో ఎక్కడైనా నీళ్లుంటాయిగానీ ఊళ్లుంటాయా? కానీ ఓ చోట నిజ్జంగానే ఊరుంది. ఎక్కడంటే ఆ సరస్సులో ఉన్న దీవుల్లో. అసలీ గందరగోళం ఏంటీ అంటే?

- ఈ సరస్సు ఉన్నది చైనాలో. అక్కడి జెజియాంగ్ ప్రావిన్సులోని చునాన్ కౌంటీలో.
- ఇంతకీ దీని పేరేంటో చెప్పలేదు కదూ. చింగ్‌డావ్ లేక్. దీనికి థౌజండ్ ఐలాండ్ లేక్ అనే పేరూ ఉంది. అంటే వెయ్యి దీవుల సరస్సన్నమాట.
- దీనిలో 1,078 పెద్ద దీవులున్నాయి. చిన్నవైతే ఇంకా చాలానే ఉన్నాయి.
- మొత్తం 573 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో ఉందీ సరస్సు. అందుకే దీనిలోని దీవులపై ఇళ్లుంటాయి. వాటిని కలుపుతూ మధ్య మధ్యలో వంతెనలూ, రహదారులూ ఉంటాయి. ఇంకా ఒక ఇంటి నుంచి మరో ఇంటికి పడవల్లోనూ వెళుతుంటారు.
- మనుషులకే కాదు ఈ సరస్సులో జంతువులకూ కొన్ని దీవులున్నాయి. అందుకే పక్షుల దీవి, కోతుల దీవి, పాముల దీవి... లాంటివీ ఉన్నాయిక్కడ.
- ఇంత చిత్రమైన సరస్సు ఊరు ఎలా వచ్చిందో తెలుసా? అంతకు ముందు ఈ ప్రాంతంలో మామూలుగానే ఇళ్లుండేవి. 1959లో ఇక్కడ గ్జినాన్ నదిపై విద్యుత్ ఉత్పత్తి ప్రాజెక్టును నిర్మించారు. ఇప్పుడు ఈ ప్రాంతమంతా దానికి రిజర్వాయర్‌గా చేశారు. అందులో భాగంగానే ఇక్కడ ఈ సరస్సు ఏర్పడింది.
- దీంతో ఇక్కడుండే ప్రజలంతా దీవులుగా మారిన ఎత్తయిన ప్రాంతాల్లోకి నివాసాలు మార్చుకున్నారు. అలా ఇక్కడ సరస్సులో ఊరు ఏర్పడిపోయిందన్నమాట. ఈ ఊరునీ సరస్సు పేరుతోనే పిలవడం విశేషం.
- నివాసాలు రావడంతో అందుకు అనుగుణంగా ప్రభుత్వం ఇక్కడ రవాణా వ్యవస్థల్ని అభివృద్ధి చేసింది.
- ఇక్కడి దీవుల్లో కొన్ని గుహల్లాంటివీ ఉన్నాయి. వాటిల్లోంచి నీరు కాలువల్లాగ ప్రవహిస్తుంటుంది.
- చుట్టూ పర్వతాలతో, దట్టమైన అడవులతో చూడ్డానికి భలే అందంగా ఉంటుందీ చోటు.
- అందుకే దీన్ని చూసేందుకు పర్యటకులూ ఆసక్తి చూపిస్తున్నారు. ఏదో కథల్లోని ఊరిలా ఉందంటూ మురిసిపోతుంటారు. దీంతో ఇక్కడ రిసార్టులూ, రెస్టారెంటులు సైతం వెలిశాయి. భలే చిత్రమైన ఊరే!

ప్రప్రథమం



మూగ, చెవిటివాళ్లు- పెదవుల కదలికల ద్వారా మాటలను అర్థం చేసుకొనే 'లిప్ రీడింగ్'ను నేర్చుకొన్న మొదటి వ్యక్తి స్పెయిన్ రాజు 'లూయి-డి-వెలాసోలా'. బధిరుడైన లూయికి ఓ మతాధికారి 1615-20 మధ్యకాలంలో ఈ విద్యను నేర్పాడు.





సాహిత్యం నుంచి విప్లవం పుట్టదు. విప్లవం, సాహిత్యం రెండూ జీవితం నుంచే పుడతాయి.

- కొడవటిగంటి కుటుంబరావు

రంగులు వేయండి



'ఇంకెవ్వరూ అలా బాత్‌టబ్‌లో పడి చనిపోరా?'



మలయాళీ భామ ప్రియా ప్రకాశ్ వారియర్ నటించిన 'శ్రీదేవి బంగ్లా' చిత్రం వివాదాల్లో చిక్కుకుంది. ప్రశాంత్ మాంబుల్లి దర్శకత్వం వహించిన ఈ చిత్రం.. అలనాటి తార శ్రీదేవి జీవితం నేపథ్యంలో ఉందంటూ పలువురు ఆరోపిస్తున్నారు. ఈ మేరకు శ్రీదేవి భర్త, నిర్మాత బోనీ కపూర్ చిత్రబృందానికి నోటీసులు కూడా పంపించారు. ఈ వివాదంపై తాజాగా దర్శకుడు ప్రశాంత్ మాంబుల్లి మాట్లాడుతూ.. 'ప్రియా ప్రకాశ్ గతంలో చెప్పినట్లుగానే సినిమాను ప్రేక్షకుల నిర్ణయానికే వదిలేద్దాం. ఇది క్రైమ్ థ్రిల్లర్ నేపథ్యంలో తెరకెక్కించిన చిత్రం. అలాంటప్పుడు సినిమాలోని సస్పెన్స్ గురించి ముందే చెప్పలేం. సినిమా గురించి ప్రశ్నిస్తున్న వారందరికీ కథ చెప్పుకొంటూ కూర్చోలేను. నేను శ్రీదేవికి వీరాభిమానిని. ఆమె బాత్‌టబ్‌లో పడి చనిపోయినంత మాత్రాన ఇంకెవ్వరూ అలా చనిపోకూడదని లేదు కదా? మమ్మల్ని సినిమా విడుదల చేసుకోనివ్వండి. బోనీ కపూర్ మాకు పంపిన నోటీసులను మేం ధైర్యంగా ఎదుర్కొంటాం. అనుమతి లేకుండా ఒకరిపై బయోపిక్ తీయకూడదన్న విషయం మాకూ తెలుసు. శ్రీదేవి అనే నటి లండన్‌లో ఎదుర్కొన్న పరిస్థితులేంటి? అన్న నేపథ్యంలో నేను కథ రాసుకున్నాను' అని వెల్లడించారు.

ప్రియా ప్రకాశ్ మాట్లాడుతూ.. 'శ్రీదేవి.. ఇది జస్ట్ సినిమాలో నా పాత్ర పేరే కదా.. అందులోనూ కథానాయిక పాత్ర కావడం కాకతాళీయంగా జరిగిపోయింది. దానికే ఇంత రాద్ధాంతం ఎందుకు? ట్రైలర్‌కు మంచి స్పందన వస్తోంది. కాబట్టి సినిమా శ్రీదేవి నేపథ్యంలో తెరకెక్కించిందా? కాదా? అన్నది ప్రేక్షకులకే వదిలేయాలి' అని పేర్కొన్నారు. 'శ్రీదేవి బంగ్లా' చిత్రం ఏప్రిల్‌లో ప్రేక్షకుల ముందుకు రానుంది.



రజనీ కొత్త సినిమా టైటిల్ అది కాదు

ప్రముఖ దర్శకుడు ఏ.ఆర్ మురుగదాస్ త్వరలో సూపర్‌స్టార్ రజనీకాంత్‌తో కలిసి ఓ సినిమా చేయబోతున్న సంగతి తెలిసిందే. అయితే ఈ సినిమాకు 'నార్కలి' అనే టైటిల్‌ను పరిశీలిస్తున్నట్లు కోలీవుడ్‌లో ప్రచారం జరుగుతోంది. ఈ వదంతులపై తాజాగా మురుగదాస్ ట్వీటర్ ద్వారా స్పందించారు. తన తర్వాతి ప్రాజెక్ట్ టైటిల్ 'నార్కలి' కాదని స్పష్టం చేశారు. టైటిల్ ప్రకటించేంతవరకు అభిమానులు ఓపికపట్టాలని, తప్పుడు ప్రచారాలు చేయొద్దని సూచించారు.

ఈ కొత్త సినిమా గురించి గతంలో మురుగదాస్ మాట్లాడుతూ.. రజనీకి కథ చెప్పానని, ఆయన నుంచి ఫోన్‌కాల్ కోసం ఎదురుచూస్తున్నానని అన్నారు. ఫాంటసీ చిత్రంగా దీన్ని తెరకెక్కించబోతున్నట్లు కూడా చెప్పారు. అయితే ఈ ప్రాజెక్టుకు సంబంధించి అధికారిక ప్రకటన ఇంకా చేయలేదు. ఇందులో రజనీకి జోడీగా కీర్తి సురేశ్ నటించనున్నట్లు కోలీవుడ్ వర్గాల సమాచారం. సినిమాలో కథానాయిక పాత్రకు ఆమె బాగా సరిపోతారని చిత్రబృందం భావిస్తోందట. ఇటీవల రజనీ నటించిన 'పేట' చిత్రం విడుదలై మంచి విజయం అందుకుంది.



'అమ్మ' పాత్రకు భారీ పారితోషికం

తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి దివంగత నేత జయలలిత జీవిత కథను సినిమాగా తెరకెక్కించేందుకు చాలా కాలంగా ప్రయత్నాలు జరుగుతున్నాయి. ప్రముఖ నిర్మాణ సంస్థలు జయ జీవిత కథకు వెండితెర రూపం ఇచ్చేందుకు ముందుకు వస్తున్నారు. ఇప్పటికే నిత్య మీనన్ ప్రధాన పాత్రలో ఓ సినిమాను ప్రకటించారు. సినిమాగానే కాక వెబ్ సిరీస్‌గానూ అమ్మ బయోపిక్ ప్రేక్షకుల ముందుకు రానుంది. ప్రముఖ దర్శకుడు గౌతమ్ మీనన్ నిర్మిస్తున్న ఈ వెబ్ సిరీస్‌లో రమ్యకృష్ణ జయలలిత పాత్రలో నటించనున్నారు. ఈ పాత్రలో నటించేందుకు రమ్యకృష్ణ భారీగా రెమ్యూనరేషన్ అందుకోనున్నారట. బాహుబలి తరువాత రమ్యకృష్ణ రేంజ్ తారా స్థాయికి చేరింది. ఈ బయోపిక్ వివాదాస్పదం అయ్యే అవకాశం కూడా ఉండటంతో రమ్యకృష్ణ భారీ పారితోషికం డిమాండ్ చేసినట్టుగా తెలుస్తోంది. ఈ సిరీస్‌లో



జయలలిత సినీ నటిగా ఉన్న సమయంలో వచ్చే సన్నివేశాల్లో యువ కథానాయిక ఆ పాత్రలో కనిపించనున్నారు. మూడు సీజన్లుగా తెరకెక్కనున్న ఈ వెబ్ సిరీస్‌ను తమిళ్, తెలుగు, హిందీ, మలయాళ భాషల్లో ఒకేసారి రూపొందిస్తున్నారు.



'పైరసీ వెబ్‌సైట్‌లోకి చొరబడలేమనుకున్నారా'

సినిమా విడుదలకు ఒకరోజు ముందే పైరసీ కాపీలు ఆన్‌లైన్‌లోకి వచ్చేస్తున్నాయి. వీటిని అరికట్టేందుకు ఎన్ని చర్యలు తీసుకున్నా పైరసీ బాబుల ఆగడాలకు అడ్డులేకుండాపోయింది. దీనికి తోడు కొందరు ప్రేక్షకులు ఆన్‌లైన్‌లో ఉచితంగా సినిమా లభిస్తోంది కదా అని డౌన్‌లోడ్ చేసేసుకుంటున్నారు. అలాంటివారికి 'ఉరి: ది సర్జికల్ స్ట్రయిక్' చిత్రబృందం నుంచి షాకింగ్ సర్‌ప్రైజ్ ఎదురైంది. బాలీవుడ్ నటుడు విక్కీ కౌశల్, యామి గౌతమ్ ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'ఉరి: ది సర్జికల్ స్ట్రయిక్'. గత శుక్రవారం విడుదలైన ఈ సినిమా బ్లాక్ బస్టర్ విజయం అందుకుంది.

అయితే ఈ సినిమా కూడా కొన్ని వెబ్‌సైట్లలో పైరసీకి గురైంది. ఈ నేపథ్యంలో ఓ వ్యక్తి ఓ వెబ్‌సైట్ నుంచి 'ఉరి' సినిమాను డౌన్‌లోడ్ చేశాడు. సినిమాను చూద్దామని ప్లే బటన్ నొక్కగానే చిత్రబృందం పెట్టిన ఓ వీడియో ప్రసారమైంది. ఆ వీడియోలో 'మాలాంటి భారతీయ సైనికులు శత్రుదేశంలోకి చొరబడి ఉగ్రవాదులను అంతం చేస్తున్నప్పుడు మీ పైరసీ వెబ్‌సైట్‌లోకి చొరబడలేమనుకుంటున్నారా?' అని యామీ వీడియోలో చెప్పే డైలాగ్ హైలైట్‌గా నిలిచింది. ఈ వీడియోను ఇండియన్ డిఫెన్స్ ఫేస్‌బుక్‌లో పోస్ట్ చేసింది.

ఈ వీడియోపై సినీ నటుడు సాయి ధరమ్ తేజ్ స్పందించారు. 'ఇదే బెస్ట్ సర్జికల్ స్ట్రయిక్. కిల్ పైరసీ. చిత్రబృందానికి అభినందనలు' అంటూ వారి ప్రయత్నాన్ని అభినందించారు. 2016లో పాకిస్థాన్‌లో భారత్ ఆర్మీ నిర్వహించిన మెరుపు దాడులు (సర్జికల్ స్ట్రయిక్స్) నేపథ్యంలో 'ఉరి' చిత్రాన్ని ఆదిత్య ధర్ తెరకెక్కించారు.

'అతని చెంప చెళ్లుమనిపిస్తుందని ఆశిస్తున్నా'

కథానాయిక రకుల్ ప్రీత్ సింగ్ ఓ నెటిజన్‌పై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రకుల్ వేసుకునే దుస్తులపై ఆమె జీవనశైలిపై భగత్ అనే నెటిజన్ ఆమెను ట్యాగ్ చేస్తూ అసభ్యంగా కామెంట్లు పెట్టాడు. దీనిపై ఆగ్రహం వ్యక్తం చేసిన రకుల్ తనదైన శైలిలో సమాధానమిచ్చారు. 'మీ అమ్మ నీకు ఇలాంటివే నేర్పిస్తున్నారా? అదే విధంగా కొన్ని మంచి విషయాలు కూడా నేర్పించమని అడుగు. నీలాంటి వాళ్లు ఉన్నంతవరకు ఆడవాళ్లకు రక్షణే ఉండదు. సమానత్వం, రక్షణ గురించి డిబేట్లు పెట్టినంతమాత్రాన సరిపోదు' అని ట్వీట్ చేసి అతని నోరుమూయించారు.

రకుల్ పెట్టిన ట్వీట్‌పై పలువురు నెటిజన్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. భగత్ చేసిన కామెంట్లకు అతని తల్లిని అనడం సబబు కాదని, ఇలాంటి కామెంట్లకు సమాధానమిచ్చి మరింత దిగజారిపోయారంటూ చురకలంటిస్తున్నారు. వీటిపై రకుల్ స్పందిస్తూ.. 'నా మాటతీరు, నైతిక విలువల గురించి ప్రశ్నిస్తున్న వారందరూ.. ఓ మహిళను పట్టుకుని అసభ్యంగా మాట్లాడుతున్నప్పుడు ఎందుకు ప్రశ్నించరు? ఇలాంటి నీచమైన ఆలోచనలు కలిగి ఉన్నవారికి నా భాషలో బుద్ధి చెప్పాలనుకున్నాను. వారికి కూడా కుటుంబం ఉంటుందని, వారి ఇంట్లో వాళ్లను కామెంట్ చేస్తే నాలాగే ఫీలవుతారని చెప్పడానికే అలా స్పందించాల్సి వచ్చింది. భగత్ పెట్టిన కామెంట్‌కు అతని తల్లి చెంప చెళ్లుమనిపిస్తుందని ఆశిస్తున్నాను' అని మరో ట్వీట్‌లో పేర్కొన్నారు రకుల్.



ఒక్క చిత్రంతోనే..

ఒక్క చిత్రంతోనే దేశ వ్యాప్తి చెందిన నటిని తాను అంటోంది నటి సాయిపల్లవి. నిజమే ప్రేమమ్ అనే ఒక్క మలయాళ చిత్రంతోనే ఈ తమిళ పొన్ను పాపులర్ అయ్యింది. ఆ చిత్రం తరువాత తెలుగు, తమిళం భాషల్లోనూ నటించే అవకాశాలను అందుకుంటోంది. ముఖ్యంగా కోలీవుడ్‌లో తొలి చిత్రం దయా కాస్త నిరాశ పరిచినా, ధనుష్‌తో రొమాన్స్ చేసిన మారి2 కమర్షియల్‌గా ఓకే అనిపించుకోవడం సాయిపల్లవికి కాస్త ఊరటనిచ్చింది. ఇప్పుడు సూర్యతో జత కడుతున్న ఎన్‌జీకే చిత్రం కోసం చాలా ఆసక్తిగా ఎదురుచూస్తోంది. ఈ జాణ గురించి వదంతులూ బాగానే ప్రచారం అవుతున్నాయి. ముఖ్యంగా సాయిపల్లవి బందాను తట్టుకోలేకపోతున్నామని, ఆమెను కలిసి కథ వినిపించడం కష్టతరంగా మారిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

దీనికి స్పందించిన సాయిపల్లవి తాను ఒక సాధారణ కుటుంబానికి చెందిన అమ్మాయినని, సినీ వెలుగు అన్నది అనూహ్యంగా తనపై పడిందేనని చెప్పింది. ఒక్క చిత్రంతోనే నటిగా దేశ వ్యాప్తి చెందానని అంది. అయితే ఎప్పుడూ తాను బందా చూపలేదని చెప్పింది. అంతే కాదు గర్వం ప్రదర్శించిందీ లేదని అంది. తాను బందా చూపితే రేపే మరో ప్రతిభావంతురాలైన నటి ఇతర నటీమణులను వెనక్కి నెట్టేస్తుందని పేర్కొంది. ఆ విషయం తెలిసిన నటిగా తానెప్పుడూ బందా చూపనని చెప్పింది. ఎవరైనా సరైన విధంగా తనను కలిసి మాట్లాడితే వారు చెప్పే కథలను విని తనకు నచ్చితే నటిస్తానని చెప్పింది.

సినిమాకు సంబంధించినంత వరకూ ఏదీ నిరంతరం కాదని అంది. ఈ రోజు సాధారణ యువతిగా ఉన్న వారు రేపు ఉన్నత స్థాయికి చేరుకోవచ్చు అని నటి సాయిపల్లవి పేర్కొంది.



అండమాన్‌లో భూకంపం...!



పోర్ట్ బ్లెయిర్ : అండమాన్ నికోబార్‌లో భూకంపం సంభవించింది. నికోబార్ ద్వీపాల్లో గురువారం ఉదయం సంభవించిన ఈ భూకంపం తీవ్రత రిక్టరు స్కేలుపై 6.0గా నమోదైందని నేషనల్ సెంటర్ ఫర్ సెస్మోలజీ వెల్లడించింది. ఉదయం 8.43 సమయంలో భూమి కంపించినట్లు తెలిపింది. నికోబార్ ద్వీపాల ప్రాంతంలో బంగాళాఖాతం సముద్రంలో 84 కిలోమీటర్ల లోతులో భూకంపం వచ్చినట్లు గుర్తించారు. ఇప్పటి వరకు ఎలాంటి సునామీ హెచ్చరికలు జారీ చేయలేదు. ఆస్తి, ప్రాణ నష్టం గురించిన వివరాలు ఇంకా తెలియరాలేదు.

దురంతో ఎక్స్‌ప్రెస్‌లో దోపిడీ



న్యూఢిల్లీ : ఢిల్లీ పరిసరాల్లో దోపిడీ దొంగలు గురువారం ఢిల్లీలో స్వైరవిహారం చేశారు. ఓ రైల్లో యథేచ్ఛగా ప్రయాణికులను దోచుకున్నారు. జమ్మూ - ఢిల్లీ దురంతో ఎక్స్‌ప్రెస్ రైలు తెల్లవారుజామున ఢిల్లీ శివారులోని బద్లి దగ్గర ఆగింది. ఆ సమయంలో దుండగులు రైల్లోకి ప్రవేశించి రెండు ఏసీ బోగీల్లోని ప్రయాణికులను బెదిరించి నగదు, ఫోన్లు, బంగారు నగలు లాక్కొని పారిపోయారు. సుమారు పది మంది దుండగులు రైల్లోకి ప్రవేశించారని.. బీ3, బీ7 ఏసీ కోచ్‌ల్లో దోపిడీ చేశారని ఓ ప్రయాణికుడు ఆన్‌లైన్ పోర్టల్‌లో ఫిర్యాదు చేశాడు. మెడ దగ్గర కత్తి పెట్టి బెదిరించి విలువైన వస్తువులు తీసుకొని పారిపోయారని వెల్లడించాడు. రైల్వే పోలీసులు ఈ ఘటనపై దర్యాప్తు ప్రారంభించారు. దుండగులను త్వరలోనే పట్టుకుంటామని ఉత్తర రైల్వే అధికారులు తెలిపారు.



థానేలో ముగ్గురు పారిశుద్ధ్య కార్మికుల మృతి

థానే : మహారాష్ట్రలోని థానెలో మురికినీటి శుద్ధ కర్మాగారం నుంచి వెలువడిన విషవాయులు ముగ్గురు పారిశుద్ధ్య కార్మికుల ప్రాణాలను హరించాయి. ఈ ఘటన బుధవారం స్థానిక మీరా రోడ్డులో చోటుచేసుకుంది. నిరుపయోగంగా ఉన్న సీవేజ్ ప్లాంట్‌లోని చాంబర్ వాల్వ్‌ను శుభ్రం చేసే క్రమంలో ఈ ముగ్గురు మరణించినట్టు థానే పోలీసు కంట్రోల్ రూమ్ అధికారి గురువారం తెలిపారు. ఈ ముగ్గురు దినసర కూలీలని, వీరికి ఎలాంటి శిక్షణ ఇవ్వకుండానే పని అప్పగించారన్నారు. చాం బర్‌ను శుభ్రం చేసేందుకు లోపలికి దిగిన ఓ కార్మికుడు ఊపిరి ఆడక అక్కడే కుప్పకూలిపోయాడని, సహచరుడి కోసం వెళ్లి మరో ఇద్దరు విషవాయులకు బలయ్యారని అధికారి తెలిపారు. 17ఏళ్ల మరొక కార్మికుడు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడని, అతని ఆరోగ్య పరిస్థితి ఆందోళనకరంగా ఉందన్నారు. మీరా రోడ్డు రైల్వేస్టేషన్ సమీపంలోని ఈ పారిశుద్ధ్య పనిని ఓ కాంట్రా క్టరు ఈ ముగ్గురికి అప్పగించాడని, వారికి మాస్క్‌లు ఇవ్వలేదని అధికారి తెలిపారు. మృతులను ముజప్ఫర్ మౌలిక్ (24), రఫీక్ మండల్ (50), మొఫ్జుమ్ (18)గా గుర్తించినట్టు వెల్లడించారు. మృతదేహాలను పోస్టుమార్టం కోసం స్థానిక ఆసుపత్రికి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామన్నారు.

డ్యాన్స్ బార్లకు ఊరట..!



- ఆంక్షలు సడలింపు
- మందు, చిందుకు ఓకే
- మహా ప్రభుత్వానికి సుప్రీం ఝలక్



న్యూఢిల్లీ : మహారాష్ట్రలోని డ్యాన్స్ బార్లపై ఆంక్షలను సుప్రీంకోర్టు సడలించింది. డ్యాన్స్ బార్ల నిర్వహణపై రాష్ట్ర ప్రభుత్వం విధించిన కఠిన నిబంధనలను కొట్టేసింది. బార్లలో లిక్కరు, డాన్స్ కలగలుపేనని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎ.కె.సిక్రి, తో కూడిన ధర్మాసనం స్పష్టం చేసింది. 2016లో డ్యాన్స్ బార్లపై కఠిన ఆంక్షలు విధిస్తూ మహారాష్ట్ర ప్రభుత్వం ఓ చట్టం తీసుకొచ్చింది. డ్యాన్స్ చేసే ప్రదేశాల్లో మద్యం సరఫరా చేయరాదని, బార్లు రాత్రి 11.30 గంటలకల్లా మూసివేయాలని, డ్యాన్స్ బార్లలో సీసీటీవీ కెమెరాల ఏర్పాటు చేయాలని, వేర్వేరు ఫ్లోర్లల్లో బార్ రూమ్స్, డ్యాన్స్ నిర్వహించాలని ఈ చట్టంలో చేర్చారు. నిబంధనలు పాటించక పోతే భారీ జరిమానా విధించే విధంగా చట్టాన్ని అమలులోకి తీసుకు వచ్చింది. దీంతో భారతీయ బార్ గాళ్స్ యూనియన్, ఇండియన్ హోటల్ అండ్ రెస్టారెంట్స్ అసోసియేషన్ మహారాష్ట్ర ప్రభుత్వం తీసుకు వచ్చిన మహారాష్ట్ర ప్రొబిషన్ ఆఫ్ అబ్‌సీన్ డాన్స్ ఇన్ హోటల్స్, రెస్టారెంట్స్, బార్ రూమ్స్ అండ్ ప్రొటెక్షన్ ఆఫ్ డిగ్నిటీ ఆఫ్ ఉమెన్ యాక్ట్ 2016ను సుప్రీంలో సవాల్ చేశారు. బార్లల్లో నృత్యం చేయటమే తమ వృత్తి అని, ఈ చట్టంతో తమ జీవనాధారాన్ని కోల్పోతున్నామని బార్ గాళ్స్ సంఘం కోర్టుకు విన్నవించింది. ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన సుప్రీం ధర్మాసనం రాష్ట్ర ప్రభుత్వం తీసుకు వచ్చిన చట్టాన్ని తప్పుబట్టింది. ప్రార్థనాలయాలు, విద్యాసంస్థలకు కనీసం కిలోమీటరు దూరంలో డ్యాన్స్ బార్లు ఉండాలన్న నిబంధనను కూడా కోర్టు తోసిపుచ్చింది. ముంబైలో ఇది కుదరదని, దీనిపై ప్రభుత్వం ఓ నిర్ణయం తీసుకోవాలని కోర్టు అభిప్రాయపడింది.

ఈ బార్లలో డ్యాన్స్ చేసే మహిళలకు టిప్స్ ఇవ్వాలి తప్ప.. వాళ్లపై డబ్బు వెదజల్లకూడదని కూడా కోర్టు తేల్చి చెప్పింది. బార్ రూమ్స్, డ్యాన్స్ ఫ్లోర్ మధ్య గోడ ఉండాలన్న నిబంధనను కూడా సుప్రీం కొట్టేసింది. డ్యాన్స్ బార్లలో సీసీటీవీ కెమెరాల ఏర్పాటు తప్పనిసరి కాదని వ్యక్తిగత గోప్యతకు భంగం కలిగించడమేనని ధర్మాసనం వ్యాఖ్యానించింది. బార్లలో ఆర్కెస్ట్రా ఏర్పాటు చేసేందుకు న్యాయస్థానం అంగీకారం తెలిపింది. సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 11.30 గంటల వరకు మాత్రమే డ్యాన్స్ బార్లు పని చేయాలంటూ రాష్ట్ర ప్రభుత్వం విధించిన నిబంధనను సుప్రీంకోర్టు న్యాయమూర్తి సమర్థించారు. డ్యాన్స్ చేసే ప్రదేశంలో మద్యం సరఫరాకు కోర్టు అంగీకరించింది.

లాయర్ల మిశ్రమ స్పందన

సుప్రీంకోర్టు తీర్పుపై న్యాయవాదుల నుంచి మిశ్రమ స్పందన వచ్చింది. ఈ ఆదేశాలను కొంత మంది స్వాగతించగా, మరికొంత మంది మహారాష్ట్ర ప్రభుత్వానికి ఎదురుదెబ్బగా పేర్కొన్నారు. ఒక వర్గం న్యాయవాదులు కోర్టు తీర్పును స్వాగతిస్తూ, పౌరుల హక్కులు, రాష్ట్ర ప్రభుత్వ విధి పట్ల సుప్రీంకోర్టు సమతుల్యత పాటించిందని తెలిపారు. మరో వర్గం న్యాయవాదులు ప్రభుత్వ వైఖరిని పూర్తిగా సమర్థించిందని పేర్కొన్నారు. బొంబయి హైకోర్టు పదవీవిరమణ చేసిన న్యాయమూర్తి ఎఫ్ఐ రెబెల్లో మాట్లాడుతూ, డ్యాన్స్‌బార్లపై అసహేతుకంగా విధించిన ఆంక్షలను సుప్రీంకోర్టు కొట్టిపారేసిందన్నారు. 2006లో న్యాయమూర్తిగా ఉన్నప్పుడు ఆయన ఆంక్షలను విధించడాన్ని నిలిపివేశారు. సీనియర్ న్యాయవాది ఆనంద్ గ్రోవర్ మాట్లాడుతూ, సుప్రీంకోర్టు రూలింగ్‌ను స్వాగతించారు. బార్ డ్యాన్సర్ల తరఫున హైకోర్టులో ఆయన వాదించారు. "ఇది మంచి తీర్పు.. ప్రత్యేకించి బార్ యజమానులకు. ప్రజలు చట్టబద్ధంగా తమ వ్యాపారం చేసుకునేందుకు ఇది మరింత స్వేచ్ఛను ఇచ్చింది" అని అన్నారు. సీనియర్ న్యాయవాది, మహారాష్ట్ర మాజీ అడ్వకేట్ జనరల్ శ్రీహరి అనేయి స్పందిస్తూ, "సుప్రీంకోర్టు ఈ అంశంపై ఆచరణాత్మక, సమతుల్య వ్యూహాన్ని తీసుకున్నది" అని చెప్పారు.

సర్కారు, బార్‌ల కుమ్మక్కు

డ్యాన్స్‌బార్లపై సుప్రీం తీర్పుకు ఎన్సీపీ స్పందన

ముంబై : మహారాష్ట్రలోని డ్యాన్స్‌బార్లపై రాష్ట్ర ప్రభుత్వం విధించిన ఆంక్షలను తొలగిస్తూ సుప్రీంకోర్టు జారీచేసిన ఆదేశాలపై మిశ్రమ స్పందన వచ్చింది. మహారాష్ట్ర ప్రభుత్వం, డ్యాన్స్ బార్ యజమానుల మధ్య సంబంధాల వల్లే సుప్రీం కోర్టు ఈ తీర్పు ఇచ్చిందని ఎన్సీపీ గురువారం పేర్కొన్నది. రాష్ట్రంలో డ్యాన్స్ బార్లు తిరిగి తెరిపించడానికి ఈ ఆదేశాలు మార్గంసుగమం చేస్తాయని తెలిపింది. రాష్ట్రంలో తాము అధికారంలోకి వస్తే డ్యాన్స్ బార్లపై తిరిగి నిషేధం విధిస్తామని ఎన్సీపీ స్పష్టం చేసింది. డ్యాన్స్ బార్ల లైసెన్స్‌లు, నిర్వహణను నియంత్రిస్తూ 2016లో ప్రత్యేక నిబంధనలను పొందుపరుస్తూ ప్రభుత్వం తీసుకువచ్చిన చట్టాన్ని కొట్టివేస్తూ అత్యున్నత న్యాయస్థానం గురువారం ఆదేశాలు జారీచేసింది. ముఖ్య మంత్రి అధికార నివాసం 'వర్ష'లో ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నావిస్, బార్ ఓనర్ల అసోసియేషన్ మధ్య సమావేశం జరిగిందని ఎన్సీపీ తెలిపింది. సుప్రీంకోర్టులో ప్రభుత్వ వాదనను బలహీనపరచడానికి ఈ సమావేశం దోహదం చేసిందని పేర్కొన్నది. ఈ సమావేశం ఎప్పుడు జరిగింది పార్టీ నిర్దుష్టంగా తెలపలేదు. ఎన్సీపీ జాతీయ అధికార ప్రతినిధి నవాబ్ మాలిక్ మాట్లాడుతూ, మేయర్స్ బంగ్లా (దాదర్)లో రెండున్నర సంవత్సరాల క్రితం ఇదే అంశంపై కొంత మంది బీజేపీ నాయకులు, బార్ యజమానుల ప్రతినిధుల మధ్య ఇటువంటి సమావేశమే జరిగిందని తెలిపారు. "కోర్టు ఈ ఆదేశాలను ఇచ్చినప్పటికీ, బీజేపీ నాయకులు, ముఖ్య మంత్రి, బార్ యజమానుల అసోసియేషన్ మధ్య సంబంధాలు ఈ ఆదేశాలకు దారితీశాయి" అని ముంబైలో విలేకరులతో మాట్లాడుతూ మాలిక్ తెలిపారు.

వసూళ్లల్లో బీజేపీ మేటి

- కమలం పార్టీకే 93 శాతం విరాళాలు
- క్యూకట్టిన కార్పొరేట్‌లు
- ఈ ఏడాది రూ.437.04 కోట్లు ఆదాయం



న్యూఢిల్లీ : విరాళాల వసూళ్లల్లో మళ్లీ బీజేపీ అగ్రస్థానంలో నిలిచింది. ఆ పార్టీకే కార్పొరేట్ శక్తులన్నీ కాషాయ పార్టీ కార్యాలయానికే క్యూకట్టాయి. 2017-18 ఆర్థిక సంవత్సరంలో జాతీయ పార్టీలన్నీ సేకరించిన విరాళాల్లో బీజేపీ వాటా 93 శాతంగా ఉంది. జాతీయ పార్టీలన్నీ కలిపి మొత్తం రూ.469.89 కోట్లు విరాళాలుగా అందుకోగా... అందులో ఒక్క బీజేపీకే రూ.437.04 కోట్లు దక్కినట్టు అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రీఫామ్స్ (ఏడీఆర్) వెల్లడించింది. ఎన్నికల కమిషన్‌కు జాతీయ పార్టీలు ఇచ్చిన సమాచారం ప్రకారం ఏడీఆర్ ఈ నివేదికను విడుదల చేసింది. రూ.20 వేలకు పైగా విరాళాలు అందుకున్న జాతీయ పార్టీల వివరాలను ఈ నివేదికలో పేర్కొంది. దీని ప్రకారం కాంగ్రెస్ పార్టీకి రూ.26.65కోట్లు, నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ రూ.2.08కోట్లు, సీపీఐ(ఎం) రూ.2.75 కోట్లు, సీపీఐ రూ..1.14కోట్లు, తృణమూల్ కాంగ్రెస్ పార్టీ రూ.20 లక్షలు చొప్పున విరాళాలుగా అందుకున్నాయి. బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ)కి రూ.20వేలకు పైగా విరాళాలు రాలేదు. కాంగ్రెస్, ఎన్సీపీ, సీపీఐ, సీపీఎం, తృణమూల్ కాంగ్రెస్ పార్టీల విరాళాల కంటే బీజేపీ 12 రెట్లు ఎక్కువ కైవశం చేసుకుంది. మొత్తం 4,201 మంది విరాళాలు ఇవ్వగా.. అందులో బీజేపీ 2,977 మంది, కాంగ్రెస్‌కు 777 మంది, ఎన్సీపీకి 42 మంది, సీపీఎంకు 196 మంది, సీపీఐకి 176 మంది, తృణమూల్ కాంగ్రెస్‌కు 33 మంది విరాళాలు ఇచ్చారు. 2016-17తో పోల్చుకుంటే జాతీయ పార్టీలకు విరాళాలు 20శాతం తగ్గాయి. అన్ని పార్టీలకు కలిపి రూ.589.38కోట్లు విరాళాలుగా వచ్చాయి. 205-16తో పోల్చుకుంటే గతేడాది బీజేపీకివిరాళాలు 18శాతం తగ్గగా, కాంగ్రెస్‌కు 36 శాతం, ఎన్సీపీకి 67 శాతం, సీపీఎంకు 47 శాతం, సీపీఐకి 20 శాతం, టీఎంసీకి 90శాతం తగ్గాయి. దేశ రాజధాని ఢిల్లీలో బీజేపీకి అత్యధికంగా రూ.208.56కోట్లు, మహారాష్ట్రలో రూ.71.93 కోట్లు , గుజరాత్‌లో రూ.44.02కోట్లు, కర్ణాటకలో రూ.43.67కోట్లు, హర్యానాలో రూ.1059కోట్లు వచ్చాయి.

రక్షణ కల్పించండి..!

సుప్రీంను ఆశ్రయించిన అయ్యప్ప మహిళా భక్తులు



న్యూఢిల్లీ : తమకు ప్రాణహాని ఉందని.. రక్షణ కల్పించాలని శబరిమల ఆలయంలోకి ప్రవేశించిన ఇద్దరు మహిళలు.. బిందు, కనకదుర్గ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. పిటిషన్‌ను స్వీకరించిన న్యాయస్థానం శుక్రవారం విచారణ జరపనుంది. ఈనెల 2న అయ్యప్ప ఆలయాన్ని బిందు, కనకదుర్గ దర్శించిన విషయం తెలిసింది. దీనిపై హిందూ సంఘాలు ఒక్కసారిగా మండిపడ్డాయి. ఆలయంలోకి ప్రవేశించిన ఇద్దరు మహిళలపై దాడి చేస్తామని అయ్యప్ప భక్తులు ప్రకటించడంతో ఆ మహిళలు కొన్ని రోజుల పాటు ఎవరికీ కనిపించకుండా అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. వారం రోజుల తర్వాత అత్తగారింటికి వచ్చిన కనకదుర్గపై హిందూ సంప్రదాయాలను మంటగలిపావంటూ ఆమె అత్త దాడి చేసింది. తలకు గాయమైన కనకదుర్గను ఆసుపత్రికి తరలించారు. ఈ నేపథ్యంలో తమపై మరోసారి దాడి జరిగే అవకాశం ఉందని భావిస్తున్న ఇద్దరి మహిళలు... తమకు భద్రత కల్పించాలంటూ సుప్రీంకోర్టును ఆశ్రయించారు.

పాఠశాలలకు ఐఐటీ, విశ్వవిద్యాలయాల శిక్షణ



అహ్మదాబాద్ : దేశంలోని ప్రఖ్యాత ఐఐటీలు, ఐఐఎస్ఈఆర్‌లు అలగే పేరుపొందిన విశ్వవిద్యాలయాలు తమ ప్రాంత పరిధిలోని పాఠశాలల విద్యార్థులకు గణిత, సైన్సు పాఠ్యాంశాల్లో శిక్షణ ఇవ్వను న్నట్లు కేంద్ర మానవ వనరుల శాఖ మంత్రి ప్రకాష్ జవదేకర్ తెలిపారు. 21 శతాబ్దంలో గణితం, ఇంజనీరింగ్, సాంకేతికతకు ఉన్న ప్రాముఖ్యత నేపథ్యంలోనే ఈ కార్యక్రమాన్ని ప్రవేశ పెట్టినట్లు తెలిపారు. 'ఐఐటీలు, ఐఐఎస్ఈఆర్‌లు, ప్రఖ్యాత విశ్వవిద్యాలయాలు వాటి చుట్టు పక్కలు ఉన్న 10 నుంచి 15 పాఠశాలలను గుర్తించి, అక్కడి విద్యార్థు లకు శిక్షణ ఇవ్వాల్సిందిగా కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. దీని ద్వారా చిన్న వయసు నుంచే విద్యార్థుల్లో సాంకేతిక విద్య పట్ల ఇష్టం ఏర్పడి, అందులో వారు రాణించడానికి అవకాశం ఉంటుంది. ముఖ్యంగా గణిత, సైన్సు పాఠ్యాంశాలపై దృష్టి పెట్టల్సిందిగా నిర్ణయించాం. విద్యార్థుల్లో సృజనాత్మకత పెంచేందుకు ప్రభుత్వం ఎన్నో కార్యక్రమాలు చేపడుతోంది. ఆవిష్కరణల సంస్కృతి పెంచేందుకు హాస్టల్ గదుల నుంచే స్టార్టప్‌లు నెలకొల్పేలా ప్రోత్సహిస్తున్నాం. ఇందులో భాగంగా ప్రధాన మంత్రి రీసర్చ్ ఫెలోషిప్‌ల కింద అర్హులకు నెలకు రూ.లక్ష అందిస్తున్నాం. ప్రస్తుతం ఇటువంటికి 100 వరకూ రీసర్చ్ ప్రాజెక్టులు వివిధ ఐఐటీలు, విశ్వ విద్యాలయాల్లో కొనసాగుతున్నాయి. ప్రభుత్వం అటల్ టింకరింగ్ లాబ్స్ పేరిట 2000 లాబ్స్‌ను నెలకొల్పింది. ఇటువంటివి ఇంకా 3000 లాబ్స్ నెలకొల్పబో తున్నాం. స్మార్ట్ ఇండియా హెకథాన్‌లో పాల్గొనే వారి సంఖ్య మూడేళ్లలో 1.5 లక్షలకు పెరిగింది. ఈ చర్యల ద్వారా సైన్సు, ఇంజనీరింగ్, సాంకేతికత, గణితం, రీసర్చ్, ఆవిష్కరణల రంగంలో ప్రోత్సాహం పాఠశాలల నుంచే ప్రారంభం కానుందని' తెలిపారు.



'గోవా టూరిజం పాలసీ' నిరుపయోగం


పానాజీ : 'గోవా టూరిజం పాలసీ 2018' ప్రజలకు ఎందుకూ పనికిరాని విధంగా ఉందని కాంగ్రెస్ విమర్శించింది. ప్రతిపక్ష పార్టీ ఎమ్మెల్యే అలీషో రెజినాల్డో లౌరెన్కో మాట్లాడుతూ 'ఈ పాలసీపై అభ్యంతరం తెలుపుతూ పర్యాటక మంత్రి అజోంకర్‌కు లేఖ రాశాను. గోవా రాష్ట్రానికీ అలాగే ప్రజలకు ఈ పాలసీ అత్యంత నిరుపయోగంగా ఉంది. ఎంత ఆదాయం వస్తుందో సరిగ్గా తెలుపడం లేదు. టూరింజం అభివృద్ధి కార్పొరేషన్ ఆస్తులను ప్రైవేటీకరణ చేసే విధంగా ఉంది. ఎటు వంటి ఉద్యోగవకాశాలు ఈ పాలసీ ద్వారా రావడంలేదు. ప్రజల ఆస్తులను ప్రైవేటీకరించేందుకు ఒప్పుకోం. ఈ పాలసీ ద్వారా వన్య ప్రాణులకూ నష్టం జరిగే అవకాశం ఉంది. మాస్టర్‌ప్లాన్ అమోదానికి ముందు నష్టాలను పరిగణనలోకి తీసుకోవాలి. పంచాయతీలు, గ్రామసభల అభిప్రాయాలను పరిగణించలేదు' అని తెలిపారు.

లోక్‌పాల్‌కు సుప్రీం గడువు

న్యూఢిల్లీ : లోక్‌పాల్ నియామకానికి అభ్యర్థుల పేర్లను సిఫారసు చేయాలని సెర్చ్ కమిటీని సుప్రీంకోర్టు ఆదేశించింది. ఈ జాబితాను సమర్పించేందుకు ఫిబ్రవరి నెలాఖరు వరకు గడువు విధించింది. భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రంజన్ గొగోయ్ నేతృత్వంలోని ధర్మాసనం ఆదేశించింది. ఈ సెర్చ్ కమిటీకి సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ రంజన ప్రకాశ్ దేశాయ్ నాయకత్వం వహిస్తున్నారు. సెర్చ్ కమిటీ లోక్‌పాల్ అభ్యర్థుల ఎంపిక బాధ్యతను సమర్థవంతంగా నెరవేర్చేందుకు వీలుగా తగిన సిబ్బంది, మౌలిక సదుపాయాలను కల్పించాలని కేంద్ర ప్రభు త్వాన్ని సుప్రీంకోర్టు ఆదేశించింది. తదుపరి విచారణ మార్చి 7న జరుగుతుందని తెలిపింది. ఈ ధర్మాసనంలో సీజేఐ జస్టిస్ రంజన్ గొగోయ్‌తో పాటు జస్టిస్ ఎల్ ఎన్ రావు, జస్టిస్ ఎస్ కే కౌల్ కూడా ఉన్నారు. కేంద్ర ప్రభుత్వం తరపున అటార్నీ జనరల్ కే కే వేణుగోపాల్ వాదనలు వినిపించారు.

ఫిరాయింపుల యత్నాల్లో మా పాత్రలేదు

బీజేపీ కర్ణాటక అధ్యక్షుడు యెడ్యూరప్ప



బెంగళూరు : కర్ణాటకలో కాంగ్రెస్-జేడీ(ఎస్) సంకీర్ణ ప్రభుత్వాన్ని కూల్చివేసేందుకు నిర్వహించే ఏ ఆపరేషన్‌లోనూ తమ పార్టీ పాలుపంచుకోదని బీజేపీ కర్ణాటక రాష్ట్ర అధ్యక్షుడు బీఎస్ యెడ్యూరప్ప చెప్పారు. ఈ వ్యవహారంలో తమ పార్టీ సభ్యుల ఎవరి పాత్ర లేదని గురువారం ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ ఆయన స్పష్టం చేశారు. కర్ణాటకలో కాంగ్రెస్-జేడీ(ఎస్) సంకీర్ణం, బీజేపీ మధ్య అధికారానికి జరుగుతున్న పోరు తీవ్రతరమైంది. కాంగ్రెస్ ఎమ్మెల్యేలను తమ వైపు తిప్పుకునేందుకు బీజేపీ చేసిన ప్రయత్నాలు బెడిసికొట్టాయి. పార్టీ ఫిరాయింపులను తీవ్రంగా ప్రయత్నాలు జరుగుతున్నాయని రెండు పక్షాలు ఒక దానిపై ఒకటి ఆరోపించుకున్నాయి. ఈ నేపథ్యంలో యెడ్యూరప్ప పై విధంగా బుకాయించారు. "ప్రస్తుతం ముంబైలో ఉన్న పాలక సంకీర్ణం ఎమ్మెల్యేలతో బీజేపీ ఎటువంటి భేరసారాలు చేయడంలేదు" అని మాజీ ముఖ్యమంత్రి చెప్పారు. సంకీర్ణాన్ని నడపడంలో తమ అశక్తత, వైఫల్యాలను కప్పి పుచ్చుకునేందుకు కాంగ్రెస్, జేడీ(ఎస్) ప్రయత్నిస్తున్నాయని యెడ్యూరప్ప ఆరోపించారు. "కాంగ్రెస్, జేడీ(ఎస్) ఎమ్మెల్యేలు ఫిరాయించేలా బీజేపీ ఎమ్మెల్యే ఎవరూ కూడా ప్రయత్నించడంలేదు. మా ఎమ్మెల్యేలందరినీ ఒకచోట సమావేశపరిచాం. రానున్న లోక్‌సభ ఎన్నికలకు సిద్ధంకావడంపై గత రెండుమూడు రోజులుగా చర్చిస్తున్నాం. ఈ రోజున వాళ్లంతా తిరిగి వచ్చారు" అని యెడ్యూరప్ప చెప్పారు.

కాంగ్రెస్ నాయకులపై ఆయన తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. రాజ్యాంగం గురించి వారు మాట్లాడుతారు, అయితే 1960 నుంచి వారు ఏమి చేస్తున్నారో అందరికీ తెలుసునని అన్నారు. "మా ఎమ్మెల్యేలను సమావేశపరిస్తే వారెందుకు భయపడుతున్నారు. నాకు అర్థంకావడంలేదు. కాంగ్రెస్, జేడీ(ఎస్) మధ్య అంతర్గత కుమ్ములాటలు మితిమీరి పోయాయి.. తమ అంతర్గత కుమ్ములాటలను కప్పి పుచ్చుకునేందుకు బీజేపీని వారు దోషిని చేయకూడదు" అని అన్నారు. రాష్ట్రంలో బీజేపీకి చెందిన 104 మంది ఎమ్మెల్యేలతో పాటు న్యూఢిల్లీ, గుర్గావ్ వెళ్లి యెడ్యూరప్ప నేడు బెంగళూరుకు తిరిగి వచ్చారు. తుమకూరు జిల్లా సిద్ధగంగ మఠం స్వామీజి శివ కుమారను ఆయన దర్శించుకున్నారు. కొంతమంది బీజేపీ ఎమ్మెల్యేలు తమతో టచ్‌లో ఉన్నారన్న కాంగ్రెస్-జేడీ(ఎస్) నాయకుల వ్యాఖ్యలపై యెడ్యూరప్ప స్పందిస్తూ, "మేమంతా కలిసే ఉన్నాం. నలుగురైదుగురు ఎమ్మెల్యేలు మీతో (కాంగ్రెస్-జేడీఎస్) కాంట్రాక్టులో ఉన్నారని చెపుతున్నారు. పిలవండి వాళ్లని, చూపించండి" అని అన్నారు.

ప్రతికూల ధోరణి తగదు : సీజే గగోయ్

న్యూఢిల్లీ : ప్రతి విషయాన్నీ ప్రతికూల దృష్టితో చూడకూడదని సుప్రీంకోర్టు గురువారం పేర్కొంది. ఉద్యమకారుడు, సీనియర్ న్యాయవాది ప్రశాంత్ భూషణ్‌కు ఓ పిటిషన్ విచారణ సందర్భంగా లోకాన్ని చూడవలసిన విధానంపై సలహా ఇచ్చింది. ఆయన ప్రతి విషయాన్నీ ప్రతికూల దృక్పథంతో చూడరాదని, విషయాలను సానుకూల దృష్టితో చూస్తే లోకం బాగుంటుందని పేర్కొంది. లోక్‌పాల్ నియామకం గురించి దాఖలైన పిటిషన్‌ను భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రంజన్ గొగోయ్, జస్టిస్ ఎల్ ఎన్ రావు, జస్టిస్ ఎస్ కే కౌల్ ధర్మాసనం విచారణ జరిపింది. ఫిబ్రవరి నెలాఖరులోగా లోక్‌పాల్ నియామకానికి అభ్యర్థుల పేర్ల జాబితాను సిఫారసు చేయాలని సెర్చ్ కమిటీని ఆదేశించింది. పిటిషనర్ తరపున ప్రశాంత్ భూషణ్ వాదనలు వినిపించారు. లోక్‌పాల్ నియామకం విషయంలో ఏం జరుగుతోందో ప్రజలు తెలుసుకోవడానికి వీలుగా అన్ని పరిణామాలను అధికారిక వెబ్‌సైట్‌లో ప్రచురించాలని కోరారు. సెర్చ్ కమిటీలోని సభ్యుల చర్చనీయాంశాలతో సహా ప్రచురించాలన్నారు. విచారణపై సందేహాలతో అంతరాయం కలిగిస్తున్న భూషణ్‌ను ఉద్దేశించి సీజేఐ మాట్లాడుతూ సన్నిహితులు ఉన్న సెర్చ్ కమిటీ మీద అనుమానాలు వ్యక్తం చేయడానికి కారణమేదైనా ఉందా? అని అడిగారు. "మిస్టర్ భూషణ్, విషయాలను ఎల్లప్పుడూ ప్రతికూల ధోరణితో చూడకండి. విషయాలను సానుకూలతతో చూడటం మొదలెట్టండి. బతకడానికి ప్రపంచం మెరుగైన ప్రదేశమవుతుంది. ప్రతికూలతతో విషయాలను చూడకండి" అని చెప్పారు. రేపటి నుంచి సానుకూల దృక్పథాన్ని అలవరచుకోవాలని ప్రశాంత్ భూషణ్‌కు సీజేఐ సలహా ఇచ్చారు.

ఈశాన్య ప్రజలకు రక్షణ లేకుంటే మద్దతివ్వం..

పౌరసత్వం బిల్లుపై మణిపూర్ సీఎం స్పష్టీకరణ

ఇంఫాల్ : ఈశాన్య ప్రజలకు రక్షణ కల్పించే నిబంధనను చేర్చకపోతే పౌరసత్వం (సవరణ) బిల్లు-2016కు మద్దతివ్వమని మణిపూర్ ముఖ్యమంత్రి ఎన్.బిరెన్ సింగ్ తేల్చిచెప్పారు. ఈ విషయంలో తాము పూర్తి స్పష్టతతో ఉన్నామన్నారు. పౌరసత్వ బిల్లుకన్నా ముందుగా ముందుగా మణిపూర్ ప్రజల (సంరక్షణ) బిల్లు, 2018ను రాష్ట్రపతి ఆమోదించాలని ఆయన షరతు పెట్టారు. గత జూలైలో మణిపూర్ బిల్లును చట్టసభ ఏకగ్రీవంగా ఆమోదించింది. 1951 పూర్వం రాష్ట్రానికి వచ్చిన ఎస్టీలు, పంగల్ ముస్లింలు, మెయిటీస్‌కు 'స్థానికత' కల్పించడమే ఈ బిల్లు ముఖ్యఉద్దేశం. మణిపూర్‌యేతరులుగా ఉన్న వారు నోటిఫికేషన్ వెలువడిన నెలలోగా నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. మణిపూర్ ప్రజలతో పాటు ఇతర ఈశాన్య రాష్ట్రాల ప్రజలకు సంరక్షణ కల్పించే నిబంధనను చేర్చేంత వరకు పౌరతస్వ (సవరణ) బిల్లు, 2016కు తాము మద్దతివ్వమని చండేల్ జిల్లాలో పలు అభివృద్ధి ప్రాజెక్టులకు శంకుస్థాపన చేసిన సందర్భంగా ముఖ్యమంత్రి తెలిపారు. మణిపూర్ ప్రజల (సంరక్షణ) బిల్లునకు రాష్ట్రపతి ఆమోదం లభించేలా చూడాలని కోరుతూ కేంద్ర హోంమంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు మెమోరాండం కూడా పంపారు.

ఏకకాలంలో ఎన్నికలు సవాలే

- అయినా స్వేచ్ఛగా, సజావుగా నిర్వహిస్తాం
- ఒడిశా డీజీపీ శర్మ



భువనేశ్వర్ : లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలు ఏకకాలంలో నిర్వహించడం ఒడిశా పాలనా యంత్రాంగానికి పెద్ద సవాల్‌గా ఆ రాష్ట్ర పోలీసు డైరెక్టర్ జనరల్ (డీజీపీ) ఆర్పీ శర్మ చెప్పారు. సీనియర్ పోలీసు అధికారుల 61వ మహాసభ గురువారం ఇక్కడ ప్రారంభమైంది. ఈ మహాసభలో శర్మ మాట్లాడుతూ, ఎన్నికలు స్వేచ్ఛగా, సజావుగా నిర్వహించేందుకు ఏర్పాట్లు ఇప్పటికే ప్రారంభమయ్యాయని తెలిపారు. ఎన్నికల క్రమంలో తమ పాత్ర నిర్వహించడంలో ఇప్పటి వరకు పోలీసుల పాత్ర సున్నితమని చెప్పారు. "మావోయిస్టుల ప్రభావిత ప్రాంతాలలో గతంలోనూ మేము విజయవంతంగా ఎన్నికలు నిర్వహించాం. ఈ సారీ సున్నితమైన జోన్లలో అదే విధానాన్ని మేము పాటిస్తాం" అని చెప్పారు. మూడు రోజులపాటు జరిగే ఈ మహాసభలో శాంతి, భద్రతల పరిస్థితి, నేరాల పరిస్థితి, మావోయిస్టుల సమస్య, మెగా కార్యక్రమాలు, రోడ్ల భద్రతలో పోలీసుల ఏర్పాట్లు తదితర అంశాలు చర్చకు వస్తాయి.

మావోయిస్టు ప్రభావిత జిల్లాలలో పోలీసులు తమ కార్యకలాపాలను ఉధృతం చేస్తారని శర్మ తెలిపారు. "పొరుగు రాష్ట్రాలలోని డీజీపీలతో మావోయిస్టుల కదలికలను పర్యవేక్షించడం, ఇంటెలిజెన్స్ నెట్‌వర్క్‌ని పటిష్టపర్చుకోవడం, పంచుకోవడం మా ప్రథమ ప్రాధాన్యత" అని చెప్పారు. ప్రజాందోళనలు పోలీసులకు సవాల్‌గా మారడం దేశవ్యాపితంగానూ, ఒడిశా రాష్ట్రంలోనూ క్రమంగా తగ్గుతోందని అన్నారు. విధుల నిర్వహణలో పారదర్శకంగా ఉండాలని, ప్రజా సహకారం కోరాలని పోలీసు అధికారులకు శర్మ సూచించారు. జిల్లా పోలీసు సూపరింటెండెంట్లు, డీసీపీలు, సాయుధ పోలీసు దళాల కమాండెంట్లు, రేంజ్ ఐజీపీలు, సీనియర్ అధికారులు అదేవిధంగా హోంగార్డులు, అగ్నిమాపక శాఖ, రక్షణ శాఖ సంస్థల సభ్యులు మొదటి రోజు సమావేశానికి హాజరయ్యారు.



గుంటూరు దోపిడీ దొంగలు దొరికారు

- ప్రకాశం జిల్లా దొనకొండలో అరెస్టు
- ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల్లో 31 కేసులు
- రూ. 14 లక్షల విలువైన సొత్తు స్వాధీనం

విశాలాంధ్ర - ఒంగోలు : రెండు తెలుగు రాష్ట్రాల్లో దొంగతనాలకు తెగ బడుతున్న నలుగురు దొంగలను ప్రకాశం జిల్లా పోలీసులు పట్టుకున్నారు. గుంటూరు జిల్లాకు చెందిన ఈ ముఠా వివరాలను గురువారం ఒంగోలులోని ఎస్పీ కార్యాలయంలో జిల్లా ఎస్పీ సత్యఏసుబాబు మీడియాకు వెల్లడించారు. గుంటూరు జిల్లా దుర్గి మండలం ఆత్మకూరు గ్రామానికి చెందిన పొన్నూరి సత్యానందం, మాచర్లకు చెందిన మూలి ఫణీందర్‌రెడ్డి, మాచవరం మండలం వేమవరం గ్రామానికి చెందిన మోబిన్ సైదా, అదే గ్రామస్తుడు పొదిలి జోజిబాబు చోరీలకు పాల్పడ్డారు. వీరిని ప్రకాశం జిల్లా దొనకొండ శివారు ప్రాంతంలో బుధవారం సాయంత్రం అరెస్టు చేసినట్లు వివరించారు. ప్రకాశం జిల్లాలో ఏడు కేసులు, గుంటూరు జిల్లాలో 15 కేసుల్లో ముద్దాయిలుగా ఉన్నట్టు వివరించారు. విచారణలో గుంటూరు జిల్లాలో 2 నేరాలు, కృష్ణా జిల్లాలో ఒకటి, తెలంగాణా రాష్ట్రంలో 21 చోట్ల నేరాలకు పాల్పడినట్లు ఒప్పుకున్నట్లు తెలిపారు. 104 గ్రాముల బంగారు ఆభరణాలు, 15 కేజీల వెండి ఆభరణాలు, రోల్డ్ గోల్డ్ తాళిబొట్టు చైన్, రోల్డ్‌గోల్డ్ నల్లపూసల తాడు ఒకటి, పిస్టల్ ఒకటి, నాలుగు బుల్లెట్లు, కత్తి, ఏడు మోటార్ సైకిళ్లు స్వాధీనం చేసుకున్నారు. రూ.14 లక్షల విలువైన సొత్తు స్వాధీనం చేసుకున్నామన్నారు.

30 ఎకరాల చెరకు పంట దగ్ధం



విశాలాంధ్ర - దత్తిరాజేరు : విజయనగరం జిల్లా దత్తిరాజేరు మండలం కె.కొత్తవలస, కోరపు రెవెన్యూ పరిధిలో గురువారం 30 ఎకరాల్లో చెరకు పంట అగ్నికి ఆహుతి అయ్యింది. సుమారు 20 లక్షల రూపాయల విలువైన పంటకు నష్టం వాటిల్లినట్లు రైతులు అంచనా వేస్తున్నారు. గ్రామానికి చెందిన రెడ్డి ఆదినారాయణ, సింహాచలం, రెడ్డి పార్వతి, అల్లుకృష్ణ, గౌరినాయుడు, రెడ్డి, సత్యం, రెడ్డి అప్పలస్వామి, రెడ్డి సింహాచలం వంగపండు అప్పలనాయుడు, రెడ్డినారా యణతో పాటు పలువురి చెరకు పంట కాలిపోయింది. అగ్నిమాపక కేంద్రాలు కొంత మేరకు మంటలను అదుపు చేశాయి. పొలంలోకి వెళ్ళే వీలు లేకపోవడంతో ఎక్కువ శాతం మంటలను అదుపు చేయలేకపోయామని ఎస్సై ఉమామహేశ్వర రావు తెలిపారు. ఘటనా స్థలాన్ని రెవెన్యూ కార్యదర్శులు అప్పారావు, చిట్టిబాబు, పరిశీలించారు.

ప్రకృతి విపత్తులపై ఐఈఎంఎస్ రూపకల్పన



విశాలాంధ్ర - కాకినాడ : రాష్ట్రంలో ప్రకృతి వైపరీత్యాలు, ఇతర అత్యవసర సమ యాల్లో తీసుకోవలసిన చర్యలపై ఇంటిగ్రేటెడ్ ఎమర్జెన్సీ మేనేజ్‌మెంట్ సిస్టమ్ (ఐఈఎంఎస్) రూప కల్పనపై యూకేఏఈకి చెందిన అట్లాస్ టెలికమ్యూనికేషన్ ప్రతినిధులతో జిల్లా కలెక్టర్ కార్తికేయ మిశ్రా సమావేశమయ్యారు. అట్లాస్ టెలికమ్యూనికేషన్ ప్రాజెక్టు మేనేజర్ విలియమ్ గ్లిసన్, ఆపరేషన్ ఎనలిస్ట్ గౌతమ్ బెనర్జీ, అపరేషన్ అసిస్టెంట్ హర్ష్ ఆదిత్య జిల్లా కలెక్టర్ కార్తికేయ మిశ్రాతో గురువారం కలెక్టరేట్‌లో సమావేశమయ్యారు. రాష్ట్రంలో ఇంటిగ్రేటెడ్ ఎమర్జెన్సీ మేనేజ్‌మెంట్ సిస్టమ్ రూపొందించే ప్రక్రియలో భాగంగా ఈ బృందం సభ్యులు గురువారం కలెక్టర్‌తో సమావేశమయ్యారు. రాష్ట్రంలో తమ పర్యటనను రాష్ట్రంలో ప్రాధా న్యత గల తూర్పు గోదావరి జిల్లా నుంచి ప్రారంభిస్తున్నామని ప్రాజెక్టు మేనేజర్ విలి యమ్స్ గ్లిసన్ కలెక్టర్‌కు వివరించారు. అట్లాస్ టెలికమ్యూనికేషన్ రూపొందించే ఇంటిగ్రేటెడ్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ ప్రకృతి వైపరీత్యాలను ఎదుర్కొనేందుకు, మానవ కల్పిత ప్రమాద నివారణకు, ఇతర అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు దోహదపడుతుందని వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తూర్పుగోదావరి జిల్లా రాష్ట్రంలో పెద్ద జిల్లా అని, ఈ జిల్లాలో 177 కి.మీ. మేర కోస్తా ప్రాంతం ఉందని, గోదావరి నది ఈ జిల్లాలో 260కి.మీ. మేర ప్రవహిస్తుందని తెలిపారు. జిల్లాలోని మూడు డివిజన్లలోని 13మండలాలు తుపానులకు ప్రభావితమయ్యే అవకాశముందన్నారు. అట్లాస్ టెలికమ్యూనికేషన్ సంస్థ రూపొందించే ఇంటిగ్రేటెడ్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ రూపకల్పనలో క్షేత్ర స్థాయిలో ప్రజలు, అధికారులు, ఇతర అభిప్రాయా లను, అనుభవాలు పరిగణనలోనికి తీసుకుని ఆయా ప్రాంతాల భౌగోళిక పరిస్థితులను అధ్యయనం చేయాలని కలెక్టర్ కార్తికేయ మిశ్రా బృందం సభ్యులకు సూచించారు. ఈ సమావేశంలో డీఆర్‌ఓ ఎస్‌వీఎస్‌ఎన్ సుబ్బలక్ష్మి, జె.రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

10 రోజులైనా గోవాలోనే యువతి మృతదేహం

- భర్త చేతిలో భార్య హతం
- విలపిస్తున్న యువతి తల్లిదండ్రులు
- ప్రకాశం జిల్లా గోపాలపురంలో విషాదం


విశాలాంధ్ర - పామూరు : గోవా రాష్ట్రం బంబేరియాలో ఈ నెల ఎనిమిదో తేదీ రాత్రి ప్రకాశం జిల్లా పామూరు మండలానికి చెందిన యువతిని భర్త హతమార్చిన ఘటనలో మృతదేహం కోసం మృతురాలి తల్లిదండ్రులు పడరాని పాట్లు పడుతున్నట్టు తెలుస్తోంది. పామూరు పంచాయతీ పరిధిలోని గోపాలపురం గ్రామానికి చెందిన పాలపర్తి నత్యం, పద్మ దంపతుల ఏకైక కుమార్తె అనూష (25)కు నెల్లూరు జిల్లా సీతారాంపురం మండలం దేవిశెట్టిపల్లి గ్రామస్తుడు మహేశ్వరరావుతో 2017 సెప్టెంబర్ 23వ తేదీన పెద్దలు ఘనంగా పెళ్ళి చేశారు. ఎనిమిది లక్షల రూపాయల కట్నంతోపాటు ఇతర లాంఛనాలు ఇచ్చారు. మహేశ్వరరావు గోవాలోని బంబేరియాలో పోలీసు ఉద్యోగం చేస్తుండగా, తండ్రి సోమయ్య ప్రభుత్వ వైద్యశాలలో స్వీపర్‌గా జీవనం సాగిస్తున్నాడు. కొత్త కాపురం పెట్టినప్పటి నుంచి అనూష తన భర్తతో పాటు కుటుంబ సభ్యుల నుంచి వేధింపులను ఎదుర్కొంటోంది. ఈ విషయం అనేకసార్లు తల్లిదండ్రులకు మొరపెట్టుకుంది. అయినా కుమార్తెకు నచ్చచెప్పిన తల్లిదండ్రులు గోవాలోనే భర్త దగ్గర ఉంచారు. ఈ నెల ఎనిమిదో తేదీ రాత్రి మహేశ్వరరావు, మామ సోమయ్య మద్యం తాగి చిత్రహింసలు పెడుతున్నట్లు ఫోన్ ద్వారా తల్లిదండ్రులకు అనూష సమాచారం ఇచ్చింది. ఆందోళన చెందిన తల్లిదండ్రులు తెల్లవారితే గోవాకు పయనమవుదామను కున్నారు. ఈలోపే గోవాలోని బంధువుల నుంచి అనూష మృతి చెందినట్లు సమాచారం అందటంతో తల్లిదండ్రులు కన్నీరు మున్నీరయ్యారు. బంధువులతో కలిసి 10వ తేదీన గోవాకు చేరుకున్న అనూష తల్లిదండ్రులకు బిడ్డను చూసే అవకాశం లేకుండా చేశారు. పోస్టుమార్టం పేరుతో ఎవరికీ అనుమానం రాకుండా భర్త, మామ కలిసి రాత్రికి రాత్రికే అనూష మృతదేహాన్ని వైద్యశాలకు తరలించారు. అదే వైద్యశాలలో సోమయ్య స్వీపర్‌గా పనిచేస్తూ పోస్టుమార్టం కార్యక్రమాన్ని అనుకూలంగా మలచుకుంటున్నాడనే విమర్శలు లేకపోలేదు. అప్పటి నుంచి దర్యాప్తు పేరుతో పోలీసులు మృతదేహాన్ని అప్పగించలేదు. దర్యాప్తు పూర్తయిన తరువాత మృతదేహాన్ని భర్తకే అప్పగిస్తామని పోలీసులు చెప్పడంతో అనూష తల్లిదండ్రులతోపాటు బంధువులు అక్కడే పడిగాపులు కాస్తున్నారు. అనూషను చంపిన భర్త మహేశ్వరరావుపై పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని, ఇప్పటికైనా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం స్పందించి గోవా అధికారులతో సంప్రదించి అనూష మృతదేహాన్ని తమకు అప్పగించేలా చూడాలని తల్లిదండ్రులు విన్నవించుకుంటున్నారు.

జానపద కళలు, సృజనాత్మక అకాడమీ అధ్యక్షుడుగా హరికృష్ణ



విశాలాంధ్ర - విజయవాడ కల్చరల్ : ఆంధ్రప్రదేశ్ జానపద కళలు, సృజనాత్మక అకాడమీ అధ్యక్షుడుగా పొట్లూరి హరికృష్ణ గురువారం బాధ్యతలు స్వీకరించారు. స్థానిక ఘంటసాల వెంకటేశ్వరరావు ప్రభుత్వ సంగీత, నృత్య కళాశాలలోని రాష్ట్ర ప్రభుత్వ భాషా, సాంస్కృతిక శాఖ, సృజనాత్మకత సంస్కృతి సమితి కార్యాలయంలో హరికృష్ణ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ జానపద పేద కళాకారుల జీవన మనుగడ కోసం, జానపద కళల వైభవాన్ని నేటి తరానికి తెలియజెప్పేందుకు అకాడమీ తన కార్యకలాపాలను కొనసాగిస్తుందని తెలిపారు. తాను అకాడమీ అధ్యక్షుడిని అయ్యేందుకు కృషి చేసిన వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు. భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు, రాష్ట్ర ప్రభుత్వ సృజనాత్మకత సంస్కృతి సమితి సీఈఓ దీర్ఘాసి విజయ భాస్కర్, రాష్ట్ర నాటక అకాడమీ అధ్యక్షులు గుమ్మడి గోపాలకృష్ణలు పొట్లూరి హరికృష్ణను పూలమాలలతో సత్కరించి అభినందనలు తెలిపారు. మహానటి సావిత్రి కళాపీఠం వ్యవస్థాపక అధ్యక్షురాలు డాక్టర్ వరుచూరి విజయలక్ష్మి, హేమచంద్ర, పైడిపాటి వెంకన్న తదితరులు పొట్లూరికి అభినందనలు తెలిపారు.

రూ.1.50 కోట్ల బయో మందులు దగ్ధం



విశాలాంధ్ర - గుడివాడ : చేపలు, రొయ్యల బయోమందుల గోడౌన్‌లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగి రూ.1.50 కోట్ల విలువైన మందులు బూడిదైన ఘటన గురువారం కృష్ణాజిల్లా గుడివాడ మండలం రామనపూడిలో చోటుచేసుకుంది. ఎస్.కె.ఎస్ బయో ప్రోడక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ లో ఈ అగ్నిప్రమాదం జరిగింది. కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ పొట్లూరి వెంకటరవికృష్ణ మాట్లాడుతూ సంక్రాంతికి మూడు రోజులు కంపెనీకి సెలవుల నేపథ్యంలో కస్టమర్‌లకు ఇవ్వాల్సిన బయో మందులను గోడౌన్‌లో భద్రపరచినట్లు తెలిపారు. బుధవారం రాత్రి మంటలు చెలరేగి ఉంటాయని పేర్కొన్నారు. ఉదయం వాచ్‌మెన్ గోడౌన్ పొగ చూసి సమాచారం ఇవ్వడంతో అగ్నిమాపకశాఖ అధికారులకు సమాచారం ఇచ్చామన్నారు.

నేతలపై కులం కత్తి !

- రాజకీయ భవిష్యత్ డోలాయమానం
- విజయనగరం జిల్లాలో నేతల ఫీట్లు
- కోర్టుల్లో తీర్పులొచ్చినా దొడ్డిదారిలో..



శశికళాదేవి



ఆర్పీ భంజ్‌దేవ్

విశాలాంధ్రబ్యూరో - విజయనగరం : విజయనగరం జిల్లాలో రాజకీయ నేతలను కుల వివాదాలు వెన్నాడుతున్నాయి. తప్పుడు కుల ధ్రువీకరణపత్రాలతో రిజర్వుడు స్థానాల నుంచి గెలుపొంది పదవులు అనుభవించిన నేతలకు న్యాయస్థానాల్లో చుక్కెదురైన ఘటనలు ఎన్నో ఉన్నాయి. న్యాయస్థానాలు కొట్టేసినా ఎన్నికల ముందు మళ్లీ కుల సర్టిఫికెట్లు తెచ్చుకొని పోటీకి సిద్ధమవడం అలవాటుగా మారింది. వచ్చే ఎన్నికల్లోనూ ఇదే పరిస్థితి కొనసాగే అవకాశాలు కనిపిస్తున్నాయి.

విజయనగరం జిల్లా సంస్థానాలకు ప్రసిద్ధి. విజయనగరం, బొబ్బిలి, కురుపాం సంస్థానాలే దాదాపు జిల్లా రాజకీయాలను శాసిస్తుంటాయి. రాజరికాలు అంతరించినా ఈ సంస్థానాల వారసులే రాజకీయ నాయకులుగా అవతారాలెత్తి ప్రజాస్వామ్యంలోనూ పదవులు అనుభవిస్తున్నారు. జనరల్ స్థానాలతోపాటు రిజర్వుడు నియోజక వర్గాల్లోనూ అధికారం వీరిదే కావడం ఈ జిల్లా రాజకీయాల ప్రత్యేకం. అసలైన గిరిజన నాయకులకు మాత్రం అధికారం అందని ద్రాక్షగానే మిగులుతోంది. నాటినుంచి నేటివరకు ఏదో ఒక రూపంలో జమిందారులే అధికారం చలాయిస్తున్నారు. ఏదోఒకలా ఎస్టీ సర్టిఫికేట్లు సంపాదించి, ఎన్నికల్లో గెలిచి పదవులు అందుకుంటున్నారు. ఆ తర్వాత వారి సర్టిఫికెట్లు చెల్లవని న్యాయస్థానాలు కొట్టేసినా ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి ఎలాగోలా సర్టిఫికేట్లను తిరిగి సంపాదించి పోటీకి సిద్ధం కావడం పరిపాటిగా మారింది. వచ్చే ఎన్నికల్లో సాలూరు బరి నుంచి పోటీకి సై అంటున్న ఆర్పీ భంజ్‌దేవ్‌ను కులవివాదం వెన్నాడుతోంది. ఆయన గతంలో ఎస్టీ రిజర్వు స్థానం సాలూరు ఎమ్మెల్యేగా గెలుపొందినప్పటికీ తర్వాత న్యాయస్థానంలో ఎస్టీ కాదని విచారణలో రుజువవ్వడంతో, అర్థాంతరంగా పదవిని వదులుకోవాల్సి వచ్చింది. తన రాజకీయ భవిష్యత్ దాదాపు ముగిసిపోయిందని భావిస్తున్న దశలో మళ్లీ టీడీపీ అధికారంలోకి రావడంతో ఇటీవల భంజ్‌దేవ్ తనకు అనుకూలంగా కుల ధ్రువీకరణపత్రాన్ని సంపాదించి వచ్చే ఎన్నికల్లో పోటీకి సిద్ధమవుతున్నారు. ఇప్పటికీ ఆయన కులానికి సంబంధించి మరో కేసు న్యాయస్థానంలో పెండింగ్‌లో ఉండటం గమనార్హం. కుల వివాదంలో చిక్కుకుని ఏకంగా జిల్లా నుంచే వలసపోయిన మరో నేత శత్రుచర్ల విజయరామరాజు. ఆయన ఎస్టీ కాదని కోర్టులో తేలడంతో జిల్లాలో పోటీ చేసేందుకు తగిన స్థానం లేక పదేళ్ల ముందు శ్రీకాకుళం జిల్లా పాతపట్నానికి వలసపోయారు. ఆయన భార్యను మళ్లీ తెరపైకి తీసు కొచ్చి వచ్చే ఎన్నికల్లో టీడీపీ తరపున కురుపాం నియోజక వర్గం నుంచి బరిలోకి దించేందుకు సిద్ధమవుతున్నారు. శత్రుచర్లతోపాటు ఆయన మేనల్లుడు జనార్దన్ థాట్రాజ్ కూడా గతంలో కులవివాదంతోనే అనర్హుడిగా మిగిలిపోయారు. అయినప్పటికీ శత్రుచర్ల మరోమారు భార్య శశికళాదేవిని ఎస్టీ స్థానం నుంచి పోటీకి నిలబెట్టాలని సన్నాహాలు చేస్తుండటం విమర్శలకు తావిస్తోంది.

అరకు ఎంపీ స్థానానికి గతంలో ప్రాతినిధ్యం వహించిన వైరిచర్ల కిషోర్ చంద్రదేవ్‌నూ కులవివాదం వెన్నాడింది. ఆయన తనకు అనుకూలంగా సర్టిఫికెట్ తెచ్చుకోవడంతో వివాదం తాత్కాలికంగా సద్దుమణిగింది. ప్రస్తుతం అరకు ఎంపీ కొత్తపల్లి గీత కూడా ఎస్టీ కాదని న్యాయస్థానంలో వివాదం నడుస్తోంది. పలువురు రాజకీయ నాయకుల కులసర్టిఫికేట్లపై న్యాయస్థానాల్లో వ్యతిరేక తీర్పులు వెలువడినప్పటికీ ఆ తరువాత తమకు అనుకూలమైన సర్టిఫికేట్లు పొందడం, పదవులు అనుభవించడం లాంటి విచిత్ర ఘటనలు జిల్లాలో పరిపాటిగా మారాయి. పదవీకాలం పూర్తయిన తరువాత లేదా, చివరి దశలో కోర్టులు వారికి వ్యతిరేకంగా తీర్పులు వెలువరిస్తుండటం వల్ల, అప్పటికే గిరిజనులకు జరగాల్సిన నష్టం జరిగిపోతోంది. రాజకీయ పార్టీల్లో స్పష్టమైన మార్పు వచ్చి అసలైన గిరిజనులకు మాత్రమే టికెట్లు కేటాయిస్తే ఇలాంటి వివాదాలకు తావుండదు. కానీ ప్రధాన రాజకీయ పార్టీలు స్వార్థ ప్రయోజనాలకే పెద్దపీట వేస్తున్నాయి తప్ప అసలైన గిరిజనులకు న్యాయం చేసేందుకు ప్రయత్నించకపోవడం శోచనీయం.

'ఇగ్నో' ప్రవేశాలకు ఈ నెల 31 వరకు గడువు పెంపు

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): ఇందిరా గాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం (ఇగ్నో)లో పీజీ, డిగ్రీ, డిప్లొమా, కోర్సుల ప్రవేశాల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తులు సమర్పించేందుకు ఈనెల 31వతేదీ వరకు గడువు పొడిగిస్తున్నట్లు ఇగ్నో ప్రాంతీయ కేంద్రం సంచాలకులు డాక్టర్ దోనేపూడి రామాంజనేయశర్మ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సీఏ విద్యార్థుల కోసం ప్రత్యేకంగా అందిస్తున్న బీ.కాం అకౌంట్స్, ఫైనాన్స్ కోర్‌కు దరఖాస్తులను ఆన్‌లైన్‌లోనే చేసుకోవాలన్నారు. ఎం.ఎ. ఎడ్యుకేషన్, బ్యాంకు ఉద్యోగుల కోసం ప్రత్యేకంగా అందిస్తున్న ఎంబీఏ బ్యాంకింగ్ అండ్ ఫైనాన్స్ కోర్సులకు నేరుగా ప్రాంతీయ కేంద్రంలో దరఖాస్తులను సమర్పించాలని కోరారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు ఇగ్నో వెబ్‌సైట్ ద్వారా డెబిట్, క్రెడిట్ కార్డు, ఆన్‌లైన్ బ్యాంకింగ్ ద్వారా ఫీజు చెల్లించవచ్చని సూచించారు. ఎస్సీ, ఎస్టీ, విద్యార్థులు ఆన్‌లైన్‌లో ఫీజు చెల్లించిన తరువాత ఇగ్నో ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా ఫీజు రీయంబర్స్‌మెంట్ కోసం ప్రత్యేక దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు విజయవాడ కొత్తపేటలోని ఎస్‌కేపీవీవీ హిందూ హైస్కూల్ ప్రాంగణంలోని ఇగ్నో ప్రాంతీయ కేంద్రానికి కానీ, గుంటూరు, నందిగామ, నూజివీడు, గుడివాడ, ఒంగోలు, నెల్లూరు, సూళ్ళూరుపేట, తిరుపతి, కర్నూలు, ఆదోని, అనంతపురములోని అధ్యయన కేంద్రాలలో స్వయంగా లేదా ఫోన్ 0866-2565959 ద్వారా సంప్రదించవచ్చని సూచించారు.

అనుభవం చెక్కిన శిల్పి 'చాసో'



పురస్కారాన్ని స్వీకరిస్తున్న వేంపల్లి షరీఫ్

షరీఫ్‌కు చాసో పురస్కార ప్రదానంలో డాక్టర్ కందిమళ్ల

విశాలాంధ్ర బ్యూరో - విజయనగరం : కాలాన్ని మరిపించే కథలు చాసో సొంతమని ప్రముఖ నాటక రచయిత డాక్టర్ కందిమళ్ల సాంబశివరావు కొనియాడారు. చాగంటి సోమయాజులు (చాసో) 104వ జయంతి సందర్భంగా 24వ చాసో స్ఫూర్తి స్మారక పురస్కార ప్రదాన కార్యక్రమం స్థానిక గురజాడ గ్రంథాలయంలోని చాసో వేదికపై గురువారం సాయంత్రం ఘనంగా జరిగింది. ప్రముఖ అభ్యుదయ, యువ రచయిత వేంపల్లి షరీఫ్‌కు ఈ పురస్కారం అందజేశారు. ఈ సభకు అధ్యక్షత వహించిన డాక్టర్ కందిమళ్ల మాట్లాడుతూ అనుభవం చెక్కిన శిల్పి చాసో అన్నారు. జీవితాన్ని విశ్లేషించడం, జీవితాన్ని లోలోపల అన్వయించుకొని రచనలు చేయడం చాసో ప్రత్యేకతన్నారు. భావాన్ని అధిగమించని భాష, తెలియని ఆర్ద్రత ఆయన ప్రత్యేకతన్నారు. సజీవ శిల్పవిన్యాసం చాసో సొత్తు అన్నారు. ఆయన కథలు కొన్నిచోట్ల కంటతడి పెట్టిస్తాయని, మరికొన్నిచోట్ల గుండెను తట్టిలేపుతాయని వివరించారు. అందుకే చాసో కథలు నేటికీ చిరస్మరణీయంగా మిగిలిపోయాయని పేర్కొన్నారు. అతిచిన్న వయసులోనే చాసో పురస్కారాన్ని పొందడం షరీఫ్ కథల్లోని గొప్పదనానికి అద్దం పడుతోందని చెప్పారు. పురస్కార గ్రహీత వేంపల్లి షరీఫ్ మాట్లాడుతూ చాసో పురస్కారాన్ని అందుకోవడం మరింత బాధ్యతను పెంచిందన్నారు. కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు కంటే చాసో పురస్కారం పొందడం ఎంతో ఆనందాన్నిచ్చిందన్నారు. చాసో స్ఫూర్తి ట్రస్టు వ్యవస్థాపకులు, చాసో కుమార్తె చాగంటి తులసి మాట్లాడుతూ చాసో రాసినవి చిన్నకథలే అయినప్పటికీ గొప్ప అర్థాన్ని, సామాజిక ప్రయోజనాన్ని కల్గిస్తాయన్నారు. కథకంటే నాటకం మరింత ఎక్కువగా ప్రజల్లోకి చొచ్చుకుపోతుందని, ప్రభావితం చేస్తుందన్నారు. అందుకే కొన్ని కథలను నాటకాలుగా రూపొందించామన్నారు. చాసో స్ఫూర్తిని కొనసాగించడానికి ఈ పురస్కారం ద్వారా అభ్యుదయ రచనలకు ప్రోత్సాహం ఇస్తున్నామన్నారు. చాసో రచనలను ఎలా చదవాలో, ఎందుకు చదవాలో ప్రముఖ జర్నలిస్టు రెహనా వివరించారు. చాసో రచనల తమిళ అనువాదం చాసో విన్‌తేకన్దు, ఎడుత్త సిరు కదైగళ్ పుస్తకంపై ప్రముఖ తమిళ రచయిత వి.దివాకర్ సమీక్షించారు. పురస్కార స్వీకర్త వేంపల్లి షరీఫ్ కథలపై అభ్యుదయ రచయితల సంఘం జిల్లా అధ్యక్షులు, ప్రముఖ రచయిత జీఎస్ చలం ప్రసంగించారు. అరసం జిల్లా కార్యదర్శి ఆర్.బాలకృష్ణ స్వాగత వచనాలతో ప్రారంభమైన కార్యక్రమం సాహితీ స్రవంతి ప్రతినిధి చీకటి దివాకర్ వందన సమర్పణతో ముగిసింది. పలువురు సాహితీ ప్రముఖులు, సాహిత్యాభిమానులు పాల్గొన్నారు.

పండగపూట పడగవిప్పిన ఫ్యాక్షన్

- ఇద్దరు యువకుల దారుణహత్య
- మద్యం మత్తులో స్నేహితులే బీరు బాటిళ్లతో దాడి
- విశాఖ జిల్లాలో కలకలం



హతుడు ధనరాజ్

విశాలాంధ్ర - విశాఖ సిటీ బ్యూరో/గాజువాక : ముక్కనుమ పండగ కిక్కులో పాతకక్షలు పడగవిప్పాయి. గురువారం రెండు వేర్వేరు ఘటనల్లో ఇద్దరు యువకులు హత్యకు గురయ్యారు. మద్యం మత్తులో బీరు బాటిళ్ళతో దాడులకు తెగబడి స్నేహితులనే హతమార్చిన ఘటన ఉలికిపాటుకు గురి చేసింది. ఈ రెండు హత్యలు మద్యం మత్తులో పాత కక్షల నేపథ్యంలోనే జరగడం అలజడి రేపాయి. ఈ ఇద్దరు యువకులు గంగవరం గ్రామానికి చెందిన ధనరాజ్, భీమిలి మండలం చిననాగమయ్య పాలెం వాసి గరికిన సతీష్‌గా పోలీసులు గుర్తించారు. గంగవరం గ్రామంలో కనుమ సంబరాల సందడిలో పాత కక్షలు చెలరేగాయి. అదే ప్రాంతంలో ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్న యువకుడు పల్లి సురేష్ బీరు బాటిల్‌తో పేర్ల ధనరాజ్‌పై దాడి చేశాడు. ధనరాజ్ పొట్ట, తలపై తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబసభ్యులు స్థానిక ఆసుపత్రిలో చేర్చగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ధనరాజ్, సురేష్ మధ్య గతంలో వివాదాల నేపథ్యంలో ముందస్తు ప్రణాళికతో ఈ హత్య జరిగినట్టు పోలీసులు భావిస్తున్నారు. న్యూపోర్టు పోలీ సులు కేసు దర్యాప్తు చేస్తు న్నారు. ధనరాజ్ మృతదేహాన్ని కేజీహెచ్‌కు తరలించారు. భీమిలి మండలం చిననాగమయ్య పాలెం గ్రామానికి చెందిన గరికిన సతీష్ మద్యంమత్తులో ఉన్న సమయంలో ఇద్దరు వ్యక్తులు బీర్ బాటిళ్లతో పొడిచి హత్య చేశారు. చిననాగమయ్యపాలెం గ్రామానికి చెందిన సతీష్, అఖిల్, నాని షిప్‌యార్డులో కలిసి పనిచేస్తున్నారు. సంక్రాంతి పండక్కి ముగ్గురూ స్వగ్రామానికి వచ్చారు. వీరి మధ్య కొంత కాలంగా వివాదం కొనసాగుతున్నట్టు సమాచారం. గురువారం వాగ్వివాదం చోటుచేసు కోవడంతో అఖిల్, నాని ఒకటై సతీష్‌పై బీర్ బాటిల్స్‌తో దాడి చేసి చంపారు. పండక్కి ఊరొచ్చిన జనానికి ఈ హత్య గగుర్పాటుకు గురిచేసింది. భీమిలి పోలీసులు ఈ రెండు హత్య కేసులను దర్యాప్తు చేస్తున్నారు.

టీడీపీ, వైసీపీలకు బుద్ధి చెప్పాలి



సమావేశంలో మాట్లాడుతున్న బి. గిడ్డయ్య

విశాలాంధ్ర - పత్తికొండ : వచ్చే ఎన్నికల్లో టీడీపీ, వైసీపీలకు బుద్ధి చెప్పాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పి.రామ చంద్రయ్య, సీపీఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య, ఏఐ వైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్య దర్శి లెనిన్‌బాబు పేర్కొ న్నారు. కర్నూలు జిల్లా పత్తికొండలోని సీపీఐ కార్యా లయంలో గురువారం ముఖ్యుల సమావేశం నిర్వహిం చారు. ఈ సమావేశానికి వృత్తిదారుల సంఘం జిల్లా కార్యదర్శి కారన్న అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా పి.రామచంద్రయ్య, బి.గిడ్డయ్య, లెనిన్‌బాబు మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో సీపీఐ, సీపీఎం, జనసేనల కూటమి ఏర్పడుతుందన్నారు. ఈ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. టీడీపీ, వైసీపీలు రెండూ దొంగలేనన్నారు. టీడీపీ ప్రభు త్వం సమస్యలను పూర్తిగా విస్మరించిందని, అసెంబ్లీ సమావేశాలకు వెళ్లి ప్రజల సమస్యలపై పోరాడకుండా పాదయాత్రల పేరుతో సీఎం కుర్చీ కోసం జగన్ తాపత్రయపడుతున్నారన్నారు. ప్రతిపక్షం అసెంబ్లీలో పాలకపక్షం అవినీతిని బయట పెట్టడం లేదని, జగన్ తన సొంత ప్రయోజనాలకోసం పాటుపడు తున్నారే తప్ప ప్రజల సమస్యలను గాలికి వదిలేశారన్నారు. రాబోయే ఎన్నికల్లో ఈ రెండు పార్టీలకు బుద్ధి చెప్పాలని వారు కోరారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు నబీరసూల్, గురుదాస్, పట్టణ కార్యదర్శి సురేంద్ర కుమార్, పత్తి కొండ, తుగ్గలి, మద్దికెర, క్రిష్ణగిరి మండల కార్యదర్శులు సుధాకర్, వెంకటేశ్వర్లు, పాపన్న, ఖలీంద్ర బాష, రైతు సంఘం జిల్లా కార్యదర్శి రాజా సాహెబ్, తిమ్మయ్య, క్రిష్ణయ్య, కారుమంచి, ప్రభాకర్, ఉపేంద్ర, సుల్తాన్, ఈరన్న, రాజప్ప, పులికొండ తదితరులు పాల్గొన్నారు.

'కర్నూలు'కు పదవుల కళ

- తాజాగా రాష్ట్ర మైనారిటీ సెల్ అధ్యక్ష పదవి
- ఎనిమిది కార్పోరేషన్లకు ఛైర్మన్లు
- జిల్లాపై గురిపెట్టిన చంద్రబాబు

విశాలాంధ్రబ్యూరో - కర్నూలు : కర్నూలు జిల్లా తమ్ముళ్లు ప్రభుత్వ పదవులతో పండగ చేసుకుంటున్నారు. రాబోయే ఎన్నికల్లో జిల్లాలో అత్యధిక స్థానాలు లక్ష్యంతో టీడీపీ అధిష్టానం ముందుకు సాగుతోంది. తాజాగా రాష్ట్ర మైనారిటీ సెల్ అధ్యక్షునిగా నంద్యాలకు చెందిన నేషనల్ విద్యాసంస్థల చైర్మన్ ఇంతియాజ్ అహ్మద్‌ను ప్రకటించారు. ఇప్పటికే మూడు రాష్ట్ర మంత్రి పదవులు, ఎనిమిది కార్పోరేషన్ చైర్మన్లు, పార్టీ కీలక పదవులతో అత్యధిక ప్రాధాన్యత కల్పించడంతో తమ్ముళ్ళ కళ్ళలో పదవుల కళ కనబడుతోంది. 2004వ సంవత్సరం వరకు జిల్లాలో తెలుగుదేశం పార్టీ బలంగా ఉంది. అత్యధిక స్థానాల్లో ఆ పార్టీ అభ్యర్థులే ఎమ్మెల్యేలుగా, ఎంపీలుగా విజయం సాధించేవారు. 2004, 2009 ఎన్నికల్లో కాంగ్రెస్‌పార్టీ అత్యధిక స్థానాల్లో విజయకేతనం ఎగురవేసింది. 2004 సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ తరపున పత్తికొండ నుంచి ఎస్వీ సుబ్బారెడ్డి ఒక్కరే గెలుపొందారు. 2009లో డోన్, పత్తికొండ, ఆదోని స్థానాల్లో మాత్రమే టీడీపీ విజయం సాధించింది. 2014 ఎన్నికల్లో వైసీపీ 11 శాసనసభ, రెండు పార్లమెంటు స్థానాల్లో సత్తా చాటగా, టీడీపీ మూడు స్థానాలతో సరిపెట్టుకుంది. అనంతరం అయిదు గురు వైసీపీ ఎమ్మెల్యేలు, ఇద్దరు ఎంపీలు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ నేపథ్యంలో జిల్లాలో పార్టీని బలోపేతం చేయాలన్న ఆలోచనతో టీడీపీ అధిష్టానం అత్యధిక పదవులను జిల్లా నేతలకు కేటాయించింది. జిల్లాలో బీసీలు అత్యధిక జనాభా ఉండటంతో ఆ వర్గానికి చెందిన కేఈ క్రిష్ణమూర్తికి ఉప ముఖ్యమంత్రి పదవితోపాటు రాష్ట్ర రెవెన్యూ శాఖ అప్పగించింది. సామాజికవర్గాల ప్రాధాన్య తలో జిల్లావాసి భూమా అఖిలప్రియకు టూరిజం శాఖ మంత్రిగా, మైనారిటీ ప్రతినిధి ఎన్‌ఎండీ ఫరూక్‌కు తొలుత శాసనమండలి చైర్మన్, తర్వాత రాష్ట్ర మైనారిటీ శాఖ, వైద్యఆరోగ్య శాఖ మంత్రిగా బాధ్యతలు అప్పగించారు. మాజీ మంత్రి టీజీ వెంక టేష్‌ను రాజ్యసభ సభ్యునిగా ఎంపిక చేశారు. అనంతరం స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో నంద్యాలకు చెందిన శిల్పా చక్రపాణిరెడ్డిని బరిలో దింపి గెలిపించింది. ఆయన పదవీ కాలం పూర్తి అయిన తరువాత మళ్లీ పోటీ చేయించి గెలిపించింది. మూడు నెలలకే ఆయన ఎమ్మెల్సీకి రాజీనామా చేసి వైసీపీలో చేరారు. దీంతో ఖాళీ అయిన ఎమ్మెల్సీ స్థానంలో మాజీ మంత్రి కేఈ ప్రభాకర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జిల్లాలోని వాల్మీకి సామాజికవర్గాన్ని దృష్టిలో పెట్టుకుని ఆ పార్టీ సీనియర్ నాయకులు బీటీ నాయుడును వాల్మీకి కార్పోరేషన్ చైర్మన్‌గా, శాలివాహన సంఘం కార్పోరేషన్ చైర్మన్‌గా జిల్లాకు చెందిన తుగ్గలి నాగేంద్ర, కుడా చైర్మన్‌గా సోమిశెట్టి వెంకటేశ్వర్లు, గొర్రెల పెంపకందారుల ఫెడరేషన్ చైర్మన్‌గా వై నాగేశ్వరరావు యాదవ్, దూదేకుల ఫెడరేషన్ చైర్మన్‌గా ఎస్ బాబన్, రాష్ట్ర విత్తనోత్పత్తి సంస్థ చైర్మన్‌గా ఏవీ సుబ్బారెడ్డి, సివిల్‌సప్లయీస్ కార్పోరేషన్ చైర్మన్‌గా చల్లా రామకృష్ణారెడ్డి, రాష్ట్ర హజ్‌కమిటీ చైర్మన్‌గా అహ్మద్‌హుసేన్‌లను నియమించారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శిగా ఎంపీ ఎస్పీవైరెడ్డి అల్లుడు శ్రీధర్‌రెడ్డిని నియ మించారు. ఒకే జిల్లాకు ఇన్ని కార్పోరేషన్ చైర్మన్ పదవులు ఇవ్వడం ద్వారా 2019 ఎన్నికల్లో ఎలాగైనా అత్యధిక స్థానాలను కైవసం చేసుకునేలా టీడీపీ అధిష్టానం అడుగులు వేస్తోందనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. నంద్యాల పార్లమెంటు స్థానం పరిధిలో అత్యధిక పదవుల పంపిణీ జరిగింది. ఈ పదవులతోపాటు కేడీసీసీ బ్యాంక్ చైర్మన్, జిల్లా పరిషత్ చైర్మన్లు కూడా ఓర్వకల్లు మండల వాసులే కావడం గమనార్హం. నాలుగున్నర సంవత్సరాలలో ముఖ్యమంత్రి చంద్రబాబు జిల్లాకు 33 సార్లు రావడం విశేషం. ఈసారి ఎన్ని కల్లోనూ పట్టు నిలుపు కోవాలని వైసీపీ, ఎలాగైనా అత్యధిక స్థానాల్లో పాగావేయాలని టీడీపీ నాయకులు ఎత్తుకు పైఎత్తులు వేయడంతో జిల్లా రాజకీయం రసవత్తరంగా మారింది.

డేరా బాబాకు జీవిత ఖైదు...!

న్యూఢిల్లీ : 20 ఏళ్ల జైలు శిక్ష అనుభవిస్తున్న అత్యాచారాల డేరా బాబా గుర్మీత్ రామ్ రహీమ్ సింగ్‌కు జర్నలిస్ట్ హత్య కేసులో న్యాయస్థానం జీవిత ఖైదు విధించింది. పంచకుల ప్రత్యేక కోర్టు గురువారం ఈ శిక్షను ఖరారు చేసింది. ఈ హత్య కేసులోని మరో ముగ్గురు నిందితులు కిషన్ లాల్, కుల్దీప్ సింగ్, నిర్మల్ సింగ్‌కూ న్యాయస్థానం జీవిత ఖైదు, రూ.50వేల జరిమానా విధించింది. 2002లో జర్నలిస్ట్ రామచందర్ ఛత్రపతి దారుణ హత్యకు గురయ్యారు. డేరాబాబా అక్రమాలపై ఆయన తన పత్రికలో వరుస కథనాలు ఇచ్చారు. పూర్ సచ్చా పేరుతో అతను కథనాలు ఇచ్చారు. దీంతో ఆయనపై కక్ష కట్టి హత్య చేశారు. హర్యానాలోని సిర్సా పట్టణంలో ఈ హత్య జరిగింది. మహిళలపై అత్యాచారం కేసులో డేరాబాబా ఇప్పటికే శిక్ష అనుభవిస్తున్నాడు. కాగా, గుర్మీత్ రామ్ రహీమ్ సింగ్‌కు కోర్టు శిక్షను ఖరారు చేయడానికి ముందే హర్యానా వ్యాప్తంగా పోలీసులను మోహరించారు. ఎలాంటి ఉద్రిక్తతలు చోటు చేసుకోకుండా జాగ్రత్తలు తీసుకున్నారు.

40వేల కాలేజీల్లో 10శాతం సీట్ల పెంపు

ఈడబ్ల్యూఎస్ కోటా అమలే లక్ష్యం : మోడీ

న్యూఢిల్లీ : దేశవ్యాప్తంగా ఉన్న 900 యూనివర్సిటీల పరిధిలోని 40వేల కాలేజీల్లో సీట్లను 10శాతం మేర పెంచనున్నట్టు ప్రధాని మోడీ ప్రకటించారు. ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు 10శాతం కోటాను అమలు చేసే విధంగా ఈ విద్యాసంవత్సరం నుంచే సీట్లను పెంచుతున్నట్టు తెలిపారు. గురువారం అహ్మదాబాద్‌లో 1500 పడకల సర్దార్ వల్లభ్ భాయి పటేల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్ & రీసెర్చి సెంటర్‌ను ఆయన ప్రారంభించారు. మోడీ మాట్లాడుతూ, ప్రస్తుతమున్న సామాజిక రిజర్వేషన్‌ను పరిగణనలోకి తీసుకోకుండా జనరల్ కేటగిరిలో పేదలకు కోటా కల్పించామని చెప్పారు. అన్ని సామాజిక వర్గాలకు సమాన అవకాశాలు కల్పించేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉన్నట్టు తెలిపారు. ఈ ఇనిస్టిట్యూట్‌ను ఆయుష్మాన్ భారత్‌కు అనుసంధానిస్తామని, తద్వారా పేదలకు వైద్యసదుపాయాలు ఉచితంగా లభిస్తాయన్నారు. 100 రోజుల్లో ఏడు లక్షల మంది పేదలకు ప్రధానమంత్రి ఆయుష్మాన్ భారత్ పథకం ద్వారా ఉచితంగా వైద్యం అందించినట్టు తెలిపారు. హెలిపాడ్ కలిగి ఉన మొట్టమొదటి ప్రభుత్వాసుపత్రిగా ఇది నిలవనున్నదన్నారు. రాష్ట్రంలో ఆరోగ్య రంగాభివృద్ధికి నూతన వైద్యకేంద్రం దోహదపడుతుందని మోడీ ఆకాంక్షించారు. సర్దార్ పటేల్ మేయర్‌గా ఉన్ననాళ్ల నుంచి పారిశుద్ధ్యం, ఆరోగ్య సంరక్షణ అన్నవి అహ్మదాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రధాన అజెండాగా ఉన్నట్టు తెలిపారు. 2012లో ప్రారంభమైన ఈ ఆసుపత్రి అద్భుతంగా రూపుదిద్దుకుందని మోడీ అన్నారు.

సీఎం దావోస్ పర్యటన రద్దు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి : రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దావోస్ పర్యటనను రద్దు చేసుకున్నారు. ఈనెల 22 నుంచి 26వరకు సీఎంతో పాటు అధికారుల బృందం దావోస్‌లో పర్యటించాల్సి ఉంది. మొత్తం 12 రోజుల పాటు సీఎం దావోస్‌లో పర్యటించేందుకు షెడ్యూల్ రూపొందించుకున్నారు. అయితే కేంద్ర ప్రభుత్వం సీఎం దావోస్ పర్యటనకు నాలుగు రోజులు మాత్రమే అనుమతి మంజూరు చేసింది. తర్వాత మరలా పొడిగించిన విషయం తెల్సిందే. అయితే ముఖ్యమంత్రి చంద్రబాబు ఈనెల 26న గణతంత్ర దినోత్సవ వేడుకల్లో పాల్గొనాల్సి ఉంది. గత ఏడాది కూడా ఇదే సమయంలో దావోస్ పర్యటనకు హాజరైన సీఎం రిపబ్లిక్ డే ఉత్సవాలకు హాజరు కాలేక పోయారు. విపరీతమైన మంచువల్ల విమాన సర్వీసుల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. దీంతో ముఖ్యమంత్రి లేకుండానే గవర్నర్ రిపబ్లిక్ డే ఉత్సవాలను నిర్వహించారు. అలాగే మార్చిలో సాధారణ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడనున్న నేపథ్యంలో రాజకీయాలు వేడెక్కుతుండడం, మరోవైపు తెలంగాణా ముఖ్యమంత్రి కేసీఆర్, ఇతర టీఆర్ఎస్ నేతలు ప్రతిపక్ష నేత జగన్మోహనరెడ్డికి మద్దతుగా నిలుస్తూ హడావుడి చేస్తున్న నేపథ్యంలో చంద్రబాబు తన పర్యటనను రద్దు చేసుకున్నట్లుగా తెలుస్తోంది. ముఖ్యమంత్రి తరపున మంత్రి నారా లోకేశ్ ఆధ్వర్యాన 17 మంది మంత్రుల బృందం దావోస్‌లో పర్యటించనుంది.

బెజవాడలో భారీ జాతీయ పతాకం

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: విజయవాడ రైల్వేస్టేషన్ వద్ద భారీ జాతీయ జెండా రెపరెపలాడింది. దేశవ్యాప్తంగా ఏ-1 కేటగిరికి చెందిన రైల్వేస్టేషన్ల వద్ద వంద అడుగుల పొడవు కలిగిన మువ్వన్నెల జెండాలను ఎగురవేయాలని కేంద్రం నిర్ణయించింది. ఇందులో భాగంగా గురువారం రైల్వేస్టేషన్ వద్దనున్న సర్క్యులేటింగ్ ఏరియాలో ఏర్పాటు చేసిన జెండాను ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, సంఘసంస్కర్త ఆర్ అర్జునరావు, ఆయన సతీమణి మనోరమ లాంఛనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విజయవాడ డీఆర్ఎం ఆర్.ధనుంజయులు మాట్లాడుతూ ఈనాటి తరంతోపాటు భావితరాల్లో జాతీయ స్ఫూర్తిని, దేశభక్తిని పెంపొందించేందుకు దేశవ్యాప్తంగా భారీ జాతీయ పతాకాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో తొలిసారిగా విజయవాడలో భారీ పతాకాన్ని ఎగురవేసామని, త్వరలో విశాఖపట్నం, తిరుపతి రైల్వేస్టేషన్ల వద్ద కూడా జెండాలను ఏర్పాటు చేస్తామన్నారు. వంద అడుగుల పొడవు కలిగిన స్తంభానికి 20 అడుగుల వెడల్పు, 30 అడుగుల పొడవు కలిగిన త్రివర్ణ పతాకాన్ని అమర్చేందుకు రూ. 10 లక్షలు వ్యయం అయినట్లు వివరించారు. రాత్రివేళల్లో కూడా ఈ పతాకం స్పష్టంగా కన్పించేందుకు వీలుగా విద్యుద్దీపాలతో ఫోకస్ చేసే విధంగా చర్యలు చేపట్టామన్నారు. భారీ గాలులను సైతం తట్టుకునే విధంగా ఈ స్తంభాన్ని బజాజ్ ఎలక్ట్రికల్ సంస్థ రూపకల్పన చేసిందని ధనుంజయులు తెలిపారు.



వారంలో జర్నలిస్టుల హౌసింగ్

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి : గృహాల కోసం దరఖాస్తు చేసుకొన్న జర్నలిస్ట్‌లలో అర్హత ఉన్న వారికి తక్షణమే గృహం మంజూరు ఉత్తర్వులు, అదనపు నిధులను తక్షణమే ఇవ్వాలని గృహనిర్మాణ, సమాచార శాఖ అధికారులను మంత్రి కాలవ శ్రీనివాసులు ఆదేశించారు. గురువారం విజయవాడలోని ఆయన క్యాంప్ కార్యాలయంలో ఏపీయూడబ్ల్యూజే నాయకులు, సమాచార శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. తక్షణమే స్పందించిన శ్రీనివాసులు, రెండు రోజులలో గృహ నిర్మాణ శాఖ జిల్లా అధికారులు జాబితాలను సమాచార శాఖకు పంపి, గృహం మంజూరు ఉత్తర్వులు ఇవ్వాలని సూచించారు. వాటికి జిల్లాల వారీ సమాచార శాఖ ఇచ్చే సబ్సిడీ నిధులు విడుదల చేయాలని ఆ శాఖ అధికారులను ఆదేశించారు. ఏపీయుడబ్ల్యూజే నాయకులు లేవనెత్తిన అంశాలపై వివరణ ఇస్తూ సీఎంతో మరో వారం రోజులలో అధికారికంగా ఈ పథకాన్ని ప్రారంభించేలా చూస్తామన్నారు. కొన్ని జిల్లాలలో జర్నలిస్టులు ఒకే ప్రాంతంలో గృహాలు కట్టుకొనేందుకు సిద్ధమయ్యారని వాటిని తాను, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరై శంకుస్థాపన చేస్తామని ప్రకటించారు. అలాంటి అవకాశం ఉన్న ప్రాంతాలను యూనియన్ నాయకులు ఆయన దృష్టికి తీసుకెళ్లగా వెంటనే అక్కడ అవసరమైన చర్యలు తీసుకోవాలని గృహనిర్మాణ, సమాచార శాఖ అధికారులను ఆదేశించారు. అలాగే సీఎంతో మాట్లాడి గతంలో గృహం తీసుకొన్న వారికి కూడా అవకాశం కల్పించే విధంగా నిబంధన సడలిస్తామన్నారు. రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకొన్న వారికి మూడు రోజులలో రేషన్ కార్డు వచ్చేలా చూడమని కలెక్టర్లను అదేశిస్తున్నట్లు తెలిపారు. ఈ తాజా నిర్ణయాలలో పురోగతి లేకపోతే ఉద్యమిస్తామని యూనియన్ నాయకులు హెచ్చరించారు. ఏపీయూడబ్ల్యూజే అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ఐవీ సుబ్బారావు, చందు జనార్దన్, ఐజేయూ ఉపాధ్యక్షుడు అంబటి ఆంజనేయులు, ఏపీయూడబ్ల్యూజే ఉపాధ్యక్షుడు జయరాజ్, కార్యవర్గ సభ్యులు చావా రవి, సీనియర్ నాయకులు బాబు, చలపతిరావు, సమాచార శాఖ జేడీ కిరణ్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

10శాతం కోటాతో ఓటర్లకు బీజేపీ ఎర : ఏచూరి

న్యూఢిల్లీ : సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి గురువారం బీజేపీ ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. ఎన్నికల్లో లబ్ధి పొందేందుకే ఈబీసీలకు 10శాతం రిజర్వేషన్‌ను మోడీ సర్కార్ ప్రకటించిందని విమర్శించారు. ఇది ఎన్నికల జిమ్మిక్ అని ఓటర్లకు ఎర అని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ' ఆచరణ సాధ్యమైన ప్రణాళిక లేకుండా కేవలం ఓట్ల కక్కుర్తితో మోడీ ప్రభుత్వం ఈ ప్రతిపాదన చేసింది. కేంద్ర సంస్థల విస్తరణకు నిధులను ఎందుకని కేటాయించడం లేదు? ఈ సంస్థలను మోడీ ప్రభుత్వం ఎందుకు నాశనం చేయాలని అనుకుంటోంది?' అంటూ ఆయన ట్విట్టర్ ద్వారా ప్రశ్నించారు. ఈ ప్రభుత్వం రైతు వ్యతిరేకని, రైతాంగానికి తీరని నష్టాన్ని తీసుకొస్తోందని ఏచూరి విమర్శించారు. మోడీ ప్రభుత్వ హయాంలో రైతులకు జరిగిన నష్టాన్ని ఎలాంటి జుమ్లాలుగానీ తమాషాలుగానీ పూరించలేవని, దేశ చరిత్రకే మచ్చ వాటిల్లే పరిస్థితి నెలకొందని ఆయన ఘాటుగా స్పందించారు. పార్లమెంటు శీతాకాల సమావేశాలలో విపక్షాలు వ్యతిరేకిస్తున్నప్పటికీ ఈబీసీలకు 10శాతం కోటా బిల్లును సభ ఆమోదించిన విషయం తెలిసిందే.

- పండగ పూట అర్ధాకలి
- నింగినంటిన కూరగాయాలు నిత్యావసరాల ధరలు

నిత్యావసరాలు భగ్గు

విశాలాంధ్ర - విశాఖ సిటీబ్యూరో : సరదా సంబరాలతో జరుపుకోవాల్సిన సంక్రాంతి పండుగ సర్దుబాటుతో జరుపుకోవాల్సి వచ్చింది. పెరిగిన ధరలు మధ్య తరగతి కుటుంబాలను కలవరానికి గురిచేశాయి. వస్త్రాలు, నిత్యావసర సరుకులు ధరలు ఏకమై సామాన్యుడిని నిలువ దోపిడి చేశాయి. ఇక కూరగాయల ధరలు కొండెక్కి కూర్చున్నాయి. ఇవీ చాలదన్నట్టు పండగ ప్రయాణం చార్జీలు తోడైయ్యాయి. గతంలో ఎన్నాడు లేని జీఎస్టీ పన్ను పోటు ప్రజల్ని వేదించాయి. సంక్రాంతికి కొత్త దుస్తులు, పిండి వంటలే ప్రదానం ఇంటిల్ల పాది నూతన వస్త్రాలు ధరించి సంతోషంగా గడుపుతారు. ఈ సీజన్‌లో పంటలు సమృద్ధిగా పండి నిత్యావసర వస్తువులు, కూరగాయలు చౌకగా లభిస్తాయి. ఈ ఏడాది పరిస్థితి అందుకు భిన్నంగా మారింది. నగరంలో కొన్ని రకాల కూరగాయల ధరలు క్రమంగా పెరుగుతున్నాయి. భారం తెలియకుండానే కిలోకు రూ.4 చొప్పున వేసుకుంటూ పోతున్నారు. బీర, బెండ వంటి వాటి ధరలు తుఫాన్ల సమయంలో కూడా కిలో రూ.40 దాటిన సందర్భాలు లేవు. ఇప్పుడు మాత్రం ఒకటి రూ.50 దాటిస్తే, మరొకటి ఆ రేటుకు దగ్గరగా వేలుతోంది. బెండ, బీర రెండూ వేసవి కాలం పంటలు, శీతాకాలంలో కొద్దిగా మాత్రమే పండుతాయి. వీటికి పాదులు పెట్టిన సమయంలో వర్షాలు పడడంతో అన్నీ పోయాయి. అక్కడక్కడా బతికిన చోట్ల వచ్చిన దిగుబడులే ఇప్పుడు మార్కెట్‌కు వస్తున్నాయి. ఇతర ప్రాంతాల్లోను వీటికి అన్‌సీజన్ కావడంతో స్థానికంగా రైతులు తెచ్చే వాటిపైనే ఆధారపడాల్సి వస్తోంది. దాంతో వాటి రేట్లు అధికంగా వున్నాయి. వరిపంట తీసేసిన రైతులు కొందరు ఇప్పుడు బీర పాదులు పెడుతున్నారు. మార్చికి మళ్లీ పంట అందుబాటులోకి వస్తుంది. అంటే వాటి సీజన్ సమయం ఇప్పటి నుంచి వీటి ధరలు కిలో రూ.20 కే లభించే అవకాశం వుందని రైతులు చెబుతున్నారు.



ధర తగ్గని టమాటా

సంక్రాంతి నాటికి సాధారణంగా రైతు బజార్లను టమాటా ముంచెత్తుతుంది. గ్రామీణ ప్రాంతాల్లో కిలోరూ.5 కే విక్రయించుకునే పరిస్థితి వుంటుంది. రైతుల కష్టాల్ని దృష్టిలో వుంచుకుని కిలో ధర రూ.10కి తగ్గకుండా ఎస్టేట్ అధికారులు జాగ్రత్త వహిస్తారు. ఏటా ఇదే తంతు ఈ సారి పరిస్థితి అందుకు భిన్నంగా మారింది. అకాల వర్షాలు టమాటా పంటను దెబ్బతీయడంతో ఈ సీజన్‌లో దిగుబడి బాగా తగ్గిపోయింది. అంతంత మాత్రంగానే పంట వస్తోంది. ఒక్క విశాఖ జిల్లాలోనే కాకుండా రాష్ట్రమంతటా అకాల వర్షాలు పంటకు నష్టం చేకూర్చడంతో టమాటా కేంద్రంగా పేరొందిన చిత్తూరు జిల్లా మదనపల్లె కూడా టమాటా లేక వెలవెలబోతోంది. దాంతో ఇతర రాష్ట్రాల నుంచి దిగుమతి చేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో ప్రస్తుతం టమాటా ధర కిలో రూ.30 దగ్గర చోబూచులాడుతోంది. స్థానిక రైతులు ఎక్కువ సరకు తెచ్చినప్పుడు మాత్రం కాసింత రేటు తగ్గించి విక్రయిస్తున్నారు. అది ఆ రోజుకే పరిమితంగా వుంటోంది.

ఇవీ ఈ సీజన్ పంటలు

శీతాకాలంలో చిక్కుడు, కాలీఫ్లవర్, క్యారెట్ జిల్లాలో ఎక్కువగా పండిస్తారు. ప్రస్తుతం రైతు బజార్లలో ఈ రకాలు విరివిగా లభిస్తున్నాయి. ధరలు కూడా తక్కువగానే వున్నాయి. చిక్కుడు రూ.31, కాలీఫ్లవర్ రూ.15, క్యారెట్ రూ.22కి లభిస్తున్నాయి. బీన్స్ పిక్కలు కూడా ఈ సీజన్‌లో వస్తాయి. అయితే వాటి దిగుబడి కూడా తక్కువగా వుండడంతో వారం రోజుల్లో వాటి ధర రూ.75 నుంచి రూ.100కి చేరింది.

కూరగాయల ధరలు ఇలా .....

బీర	రూ.50
కాకరకాయ	రూ.36
దొండకాయ	రూ.28
క్యారెట్	రూ.22
క్యాప్సికమ్	రూ.34
బీన్స్	రూ.100
టమోటా	రూ.20
బెండ	రూ.40
పచ్చిబఠానీ	రూ.34
చిక్కుడు పొడవు	రూ.44
ఆగాకర	రూ.45
కాలీఫ్లవర్	రూ.14
తెల్లవంకాయ	రూ.22
నల్లవంకాయ	రూ.20
బరబాటి	రూ.30
పప్పుల ధరలు ఇలా	
పెసరపప్పు	రూ.80
మినపప్పు	రూ.75
కందిపప్పు	రూ.70
శనగపప్పు	రూ.80
గోధుమపిండి	రూ.40
బెల్లం	రూ.50
పంచదార	రూ.37
సన్‌ఫ్లవర్ ఆయిల్ (లీటర్)	రూ.150
పామ్‌ఆయిల్ (లీటర్)	రూ.65

రోహిత్‌కు ఘన నివాళి

అణగారిన వర్గాల ఐక్యతాగళం.. రోహిత్ : ఒవైసీ

హైదరాబాద్ : దళిత రీసెర్చి స్కాలర్ రోహిత్ వేముల మూడవ వర్ధంతి సభ యూనిర్సిటీ ఆఫ్ హైదరాబాద్ (హెచ్‌యూ)లో కట్టుదిట్టమైన భద్రత నడుమ జరిగింది. ఈ కార్యక్రమం సందర్భంగా రాష్ట్ర పోలీసులు, పారామిలటరీ దళాలతో పకడ్బందీ భద్రతా ఏర్పాట్లు చేశారు. యూనివర్శిటీ అనుమతులతో మూడేళ్లల్లో మొదటిసారిగా రోహిత్ వేముల తల్లి రాధిక, సోదరుడు రాజా క్యాంపస్‌లోకి అడుగుపెట్టి నివాళులర్పించారు. అంబేద్కర్ విద్యార్థుల సంఘం (ఏఎస్ఏ)తో పాటు ఇతర విద్యార్థి సంఘాలు సంయుక్తంగా 'రోహిత్ వేముల షహదత్ దిన్'ను నిర్వహించాయి. అయితే, ఏబీవీపీ దూరంగా ఉంది. 2016, జనవరి 17న రోహిత్ వేముల యూనివర్సిటీలో ఆత్మహత్య చేసుకున్నారు. ఆయన మరణంతో దేశవ్యాప్తంగా విద్యాసంస్థల్లో ఆందోళనలు మిన్నంటాయి. దళితులు, ఇతర వెనుకబడిన వర్గాలకు సామాజిక న్యాయం కల్పించాలని విద్యార్థులు డిమాండు చేశారు. రోహిత్ వేముల వర్ధంతి సభలో రాధిక వేముల, 2016 అక్టోబరులో గల్లంత్తైన జేఎన్‌యూ విద్యార్థి నజీబ్ అహ్మద్ తల్లి ఫాతిమా నఫీజ్ ప్రధాన వక్తలు. అగ్రవర్ణానికి చెందిన తన భార్య కుటుంబం చేతిలో హత్యకు గురైన దళిత క్రైస్తవ యువకుడు పి.ప్రణయ్ తండ్రి పెనుమల్ల బాలస్వామి, వర్సిటీకి చెందిన ఇద్దరు దళిత విద్యార్థుల సోదరులు పుల్యాలా రాజు, మందరి వెంకటేశ్ (రోహిత్ కన్నా ముందు ఆత్మహత్య చేసుకున్న విద్యార్థులు), వర్సిటీ ఫ్యాకల్టీ కేవై రత్నం, మహారాష్ట్రలోని వార్ధా నలందా అకాడమీ వ్యవస్థాపకులు అనూప్ కుమార్, న్యాయవాది భీమ్‌రావ్ ప్రసంగీకుల్లో ఉన్నారు. 2016, జనవరి 4న రోహిత్ వేములతో పాటు మరో నలుగురు దళిత విద్యార్థులు స్థాపించిన 'వెలివాడ'ను వర్సిటీ యాజమాన్యం తొలగించడంతో ఉద్రిక్తతకు దారితీసింది. హాస్టల్ నుంచి పంపివేసిన తర్వాత రోహిత్ వేముల తన చివరిరోజులను ఈ వెలివాడలోనే గడిపారు. ఎస్టీ-ఎస్సీ చట్టం కింద వర్సిటీ యాజమాన్యంపై విద్యార్థి నేతలు పోలీసులకు ఫిర్యాదు చేయగా.. యూనివర్సిటీ స్థలంలో అక్రమ కట్టడాన్ని కట్టేందుకు ప్రయత్నించినట్టు అభియోగిస్తూ యాజమాన్యం కూడా ఏఎస్ఏ నేతలపై మరో ఫిర్యాదు దాఖలు చేసింది. రోహిత్ వేముల వర్ధంతి సభకు కుల నిర్మూలన పోరాట సమితి (కేఎన్‌పీఎస్) సహా పలు సామాజిక సంఘాల ప్రతినిధులు హాజరయ్యారు. ఏఐఎంఐఎం ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ ట్విట్టర్ ద్వారా 'యూనివర్సిటీలు విరోధాలకు నిలయాలు కాకూడదన్న సందేశాన్ని అందజేశారు. 'మూడేళ్ల కిందట రోహిత్ వేముల వ్యవస్థాగత హత్యను మరవరాదు. రోహిత తన అభిప్రాయాలను నిర్భయంగా చెప్పారు. ఆయన అణగారిన వర్గాల ఐక్యతాగళం. హిందూత్వను వ్యతిరేకించే వారికి ఆయన లేని లోటు కనిపిస్తుంది' అంటూ ఒవైసీ ట్వీట్ చేశారు.

రైతులను ఆదుకోవాలి

ముప్పాళ్ల నాగేశ్వరరావు డిమాండు

విశాలాంధ్ర-వినుకొండ : వినుకొండ, ఈపూరు మండలం చిట్టాపురం, ఆరేపల్లి, ముప్పాళ్ల గ్రామాలలోని నకిలీ విత్తనాల బాధిత రైతులను వెంటనే ఆదుకోవాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు గురువారం ప్రభుత్వాన్ని డిమాండు చేశారు. నకిలీ విత్తనాలు అమ్మిన వారిపై కఠినచర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. స్థానిక శివయ్య భవన్‌లో ఆయా గ్రామాలలోని బాధిత రైతులు తాము నష్టపోయిన విషయాన్ని ముప్పాళ్ల నాగేశ్వరరావు దృష్టికి తీసుకొచ్చారు. ఎన్ఎల్ఆర్ వద్ద ఇవ్వాల్సిన షాపు యజమాని వాటిని ఇవ్వకపోవడంతో ఎకారాకు రూ.25వేలు చొప్పున రైతు నష్టపోయినట్టు తెలిపారు. దీంతో కల్తీ విత్తనాలను, షాపులపై తక్షణమే చర్యలు తీసుకొని రైతులకు న్యాయం చేయాలని డిమాండు చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు ఏ.మారుతీవరప్రసాద్, ఎస్‌కె.శిలార్, పి.వెంకటేశ్వర్లు, రైతు సంఘం ప్రధాన కార్యదర్శి ఉలవలపూడి రాము పాల్గొన్నారు.



వరిపంటను ముప్పాళ్ళకు చూపిస్తున్న వివిధ గ్రామాల రైతులు

'నకిలీ'పై ఉక్కుపాదం

మంత్రి సోమిరెడ్డి ఆదేశం

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి : రాష్ట్రంలో ఇటీవల జరిగిన నకిలీ పొటాష్ ఎరువుల సరఫరాపై వ్యవసాయశాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం సచివాలయంలో వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. అన్ని జిల్లాల వ్యవసాయ సంయుక్త సంచాలకులు పూర్తి స్థాయి విచారణ జరిపి నకిలీ ఎరువుల డీలర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. శాఖ కమిషనర్ ప్రతిరోజు దీనిపై సమీక్ష జరపాలన్నారు. ఇప్పటివరకు ప్రకాశం జిల్లాలో 5 డీలర్లపై, గుంటూరులో ఒకరిపై క్రిమినల్ చర్యలు తీసుకున్నామని, వివిధ ఎరువుల దుకాణాల్లో 50 పొటాష్ ఎరువుల నమూనాలను సేకరించి పరీక్షా కేంద్రాలకు పంపామని అధికారులు మంత్రికి వివరించారు. రూ.15లక్షలు విలువ చేసే 85 మెట్రిక్ టన్నుల పొటాష్ ఎరువులు సీజ్ చేశామన్నారు. రూ.39 లక్షలు విలువ చేసే 210 మెట్రిక్ టన్నుల పొటాష్ ఎరువుల అమ్మకాన్ని నిలిపివేసినట్టు తెలిపారు. పెథాయి తుపాను వల్ల తడిచిన ధాన్యాన్ని క్వింటా రూ.1550కు కొనాలని నిర్ణయించినట్టు మంత్రి తెలిపారు. మంత్రి నక్కా ఆనంద బాబు, గన్నవరం ఎమ్మెల్యే వంశీ మోహన్ , రైతు సంఘాల నాయకులతో సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కృష్ణా,గుంటూరు,పశ్చిమ గోదావరి జిల్లాల రైతుల నుంచి 3 లక్షల టన్నులను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందన్నారు. ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వం ఎటువంటి ఆర్థిక సహకారం అందించలేదని, నష్టపోయిన రైతులను ఆదుకోవాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వమే రూ.465 కోట్లతో కొనుగోలు చేసేందుకు అంగీకరించిందని తెలిపారు. మంత్రులు,రైతు సంఘాల నాయకులు ఈ వారంలో ఢిల్లీ వెళ్లి కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి రాధామోహన్ సింగ్‌ని కలుస్తారన్నారు.

జనసేన పార్లమెంట్ కమిటీల జాబితా నేడు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : జనసేన పార్లమెంట్ స్థాయి పార్టీ కమిటీల ఎంపిక దాదాపు పూర్తియిందనీ, జాబితాను పార్టీ అధ్యక్షుడు పవన్‌కల్యాణ్‌కు శుక్రవారం సమర్పిస్తామని జనసేనపార్టీ ఉపాధ్యక్షులు మహేందర్‌రెడ్డి తెలిపారు. ఈమేరకు ఆయన ఒక ప్రకటన వెలువరించారు. ఈనెల 3 నుంచి 11వతేదీ వరకు విజయవాడలో జరిగిన జిల్లా సమీక్షా సమావేశాల్లో కమిటీల ఎంపిక కార్యక్రమం ఆరంభించారన్నారు. రాష్ట్రంలో ఉన్న 25 పార్లమెంట్ కమిటీల ఎంపిక చేసే ప్రక్రియ కొనసాగిందని అన్నారు. నాయకులు, క్యాడర్‌ను వేర్వేరుగా కమిటీలు నియమించాలని పవన్ ఆదేశాల మేరకు జాబితాను రూపొందించామని ఆయన వెల్లడించారు. అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ పరిశీలన తర్వాత కమిటీల వివరాలను ప్రకటిస్తారని పేర్కొన్నారు.

ప్రజలే నా వెన్నుదన్నుగా నిలవాలి

(మొదటిపేజీ తరువాయి)

ఉన్నాను. నా పైన అర్బన్ మావోయిస్టుగా ముద్ర వేసారు. ఈ నేపథ్యంలో నా అరెస్టు ప్రమాదాన్ని ఎదుర్కొంటున్నాను. పూణే పోలీసులు నాపై నమోదుచేసిన తప్పుడు ఎఫ్ఐఆర్‌ను రద్దుచేయవలసిందిగా కోరుతూ దాఖలుచేసిన పిటిషన్‌ను ఈ నెల 14వతేదీన సుప్రీంకోర్టు కొట్టివేస్తూ ఒక చిన్న వెసులుబాటును కల్పించింది. ముందస్తు బెయిల్‌ను తగిన కోర్టునుండి పొందేందుకు కోర్టు నాలుగువారాలు గడువు ఇచ్చింది. పోలీసులు ఎలాంటి ఆరోపణలను చేసినప్పటికీ నేరపూరితమైన కట్టు కథలేనని కోర్టులో స్పష్టమవుతుందని విశ్వసిస్తున్నాను. నాకు తోడ్పాటుగా ప్రజలు నిలవాలని విజ్ఞప్తి చేస్తున్నాను. నా అభ్యర్థనను కోర్టు తిరస్కరించిన అంశం ఇప్పటికే మీడియా ద్వారా అందరికీ తెలిసేఉంటుంది. నా అరెస్టును నిలువరించేందుకు బలమైన ప్రజా ఉద్యమంకోసమే నేను ఈ విజ్ఞప్తి చేస్తున్నాను.

చట్ట వ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం(యూఏపీఏ) క్రింద అరెస్టు చేసినట్లయితే ఏళ్ల తరబడి నిర్బంధానికి రకరకాల వేధింపులకు గురికావడమేనని బహుశ చాలామందికి తెలియదు. కరుడుకట్టిన నేరస్థులు సైతం ఒకటి,రెండు సంవత్సరాల శిక్షతో బైటపడే అవకాశం ఉంటుంది. అయితే పైన తెలిపిన చట్టం క్రింద అరెస్టుచేస్తే, ఎలాంటి నేరం చేయనివారు సైతం ఎళ్ల తరబడి జైలులోనే కృశించిపోవలసి ఉంటుంది. పలుకుబడికలిగిన రాజకీయ నాయకుల ఆదేశాల ప్రకారం పోలీసులు ఈ చట్టం క్రింద కేసు బనాయించి తమ వద్ద తగినన్నిసాక్షాధారాలు ఉన్నాయని ఎలాంటి నేరం చేయని వాళ్లను కూడా అనేక సంవత్సరాలు జైలులో నిర్బంధించే అవకాశంఉంది. నన్ను అరెస్టు చేస్తారని ఆందోళన చెందడంలేదు. నాకు అత్యంత ప్రీతిపాత్రమైన, నాజీవితంలో భాగంగా పెనవేసుకుపోయిన లైబ్రరీ పుస్తకాలు, వివిధ స్థాయిల్లో అసంపూర్తిగా ఉన్న పరిశోధనాపత్రాలు, పరిశోధనలు నిర్వహిస్తున్న విద్యార్థుల భవితవ్యం, విడదీయలేని నా ల్యాప్‌టాప్ గురించి ఆందోళన చెందుతున్నాను. విద్యార్థులు తమ వనరులను ఖర్చుచేసి నా వద్ద చదువుకుంటున్నారు. నన్ను అరెస్టు చేస్తే వారి భవిష్యత్తు దెబ్బతింటుంది. నన్ను బోర్డు ఆఫ్ గవర్నర్ సభ్యుడిగా తీసుకున్న సంస్థలు కూడా తీవ్ర ఇబ్బందుల్లో పడతాయి. నా స్నేహితులు, నా సతీమణి(అంబేద్కర్ మనుమరాలు) అసంఖ్యాకంగాఉన్న స్నేహితులు, నా కుమార్తెలు, నాకు ఎలాంటి ప్రమాదం కలుగుతుందోనని గత ఆగస్టు నుండి ఎంతగానో ఆందోళన చెందుతూ మనో వేదనకు గురవుతున్నారు.

నేను చాలా పేద కుటుంబం నుండి వచ్చాను. దేశంలోని ఉత్తమమైన సంస్థలలో విద్యనభ్యసించాను. మేథోపరమైన విజయాలెన్నో సాధించాను. సుప్రసిద్ధమైన అహ్మదాబాద్ ఐఐఎమ్‌లో చదువుకున్న విద్యార్థిగా విలాసవంతమైన జీవితాన్ని గడిపేందుకు అవకాశం ఉన్నప్పటికీ, నా చుట్టూ జరుగుతున్న సామాజిక అవకతవకలను పట్టించుకోకుండా ఉండలేకపోయాను. అందువల్లనే నేను నా కుటుంబ సభ్యులతో సాధారణ జీవితం గడిపేందుకు అవసరమైనంత మాత్రమే సంపాదించుకుంటూ మేథోపరంగా సేవలను అందించేందుకు నా సమయాన్ని కేటాయిస్తున్నాను. ఈ ప్రపంచం న్యాయబద్ధమైనదిగా ఉండేందుకువీలుగా నా మేథోపరమైన కృషినిచేస్తూ, అన్యాయాలను చక్కదిద్దేందుకు పనిచేస్తున్నాను. నేను స్కూలు, కాలేజి విద్యార్థిగా ఉండగానే ప్రజాస్వామ్య, పౌరహక్కుల సంఘంలో పనిచేసాను. ప్రస్తుతం ఈ హక్కుల సంఘం ప్రధానకార్యదర్శిగా, విద్యాహక్కుల జాతీయస్థాయి ఫోరం అధ్యక్షవర్గ సభ్యుడిగా పనిచేస్తున్నాను. నేను చేసిన అసంఖ్యాకమైన రచనల్లోగానీ, నా కార్యకలాపాల్లోగానీ చట్ట వ్యతిరేకమైనవి ఇసుమంతకూడా లేవు. విద్యార్థిదశలోగానీ, నాలుగు దశాబ్దాలకుపైగా ఉద్యోగం చేస్తున్నదశలోగానీ నాపైన ఎలాంటి మచ్చపడలేదు. అత్యంత నిజాయితీగా, నిబద్ధతతో పనిచేస్తున్నాను. అందువల్ల నావృత్తి ద్వారా ఈ సమాజానికి ఎంతోకొంత సేవను అందించగలిగానని భావిస్తున్నాను. అయితే ఎన్నో ఇబ్బందులను, కష్టాలను ఎదుర్కొన్న సమయంలోకూడా ఈ రాజకీయవ్యవస్థ, రాజ్యం అత్యంత నీచమైన విధంగా నాపై నేరస్థుడిగా ముద్రవేస్తాయని కలలోకూడా నేను ఊహించలేదు. ఈ దేశంలో అమాయకులైన పౌరులను నేరస్థులుగా ముద్రవేసి దొంగలను, దోపిడీదారులను రాజ్యవ్యవస్థ రక్షిస్తూ తీవ్రమైన అసమానతలకు కారణమవుతోంది. గత ఏడాది మానవహక్కుల కార్యకర్తలు, మేథావులు, సామాజిక కార్యకర్తలతో పూణేలో జరిగిన 'ఎల్గర్ పరిషత్' కార్యక్రమాలను సైతం నేరపూరితమైన కుట్రఘటనగా ఈ రాజ్యం మార్చివేసింది. దేశానికి స్వాతంత్ర్యం లభించిన తరువాత తమ విధానాలను వ్యతిరేకించే వ్యక్తులపైన అత్యంత నీచమైన విధంగా రాజ్యం కుట్రకేసులను బనాయిస్తూ కనీస ప్రజాస్వామ్య విలువలులేకుండా చేస్తున్నది.

భీమాకొరెగావ్‌లో 1818లో ఆంగ్లేయులు, మరాఠాల మధ్య జరిగిన యుద్ధం 200వ వార్షికోత్సవం సందర్భంగా బీజేపీ అనుసరిస్తున్న మతవాద,కులవాద విధానాలకు వ్యతిరేకంగా ప్రజలను సమీకరించాలని సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ పిబి.సావంత్, బాంబే హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బి.జి.ఖోల్సె పాటిల్ తదితరులు నిర్ణయించారు. ఈ కార్యక్రమానికి సామాజిక కార్యకర్తలను, అభ్యుదయ మేథావులను ఆహ్వానించారు. నన్నుకూడా ఈ కార్యక్రమంలో పాల్గొనాలను ఆహ్వానించారు. అయితే విద్యాపరమైన కార్యకలాపాలవలన రాలేకపోతున్నానని విచారం వ్యక్తం చేస్తూ నిర్వాహకులకు తెలియజేసాను. జస్టిస్ సావంత్ సూచనమేరకు సదస్సు కో-కన్వీనర్‌గా ఉండేందుకు అంగీకరించాను. నిజంగా అక్కడ జరుగుతున్నదేమిటో తెలియదు. ఎల్గర్ పరిషత్ గురించి వాట్సప్‌లో కరపత్రం చూసేవరకు ఈ విషయం నాకు తెలియదు. దళితులను రెచ్చగొట్టేందుకు వారి తరపున పనిచేస్తున్నానని నాపై ఆరోపణ చేసారు. ఈ ఆరోపణ నిజంకాదని చెప్పేందుకు నేను మరోసారి నా అభిప్రాయాలను వెల్లడిస్తున్నాను. అక్కడ జరిగిన సదస్సులో 250 సంస్థలు పాల్గొన్నాయి. ఇందులో మరాఠాలకు చెందిన సంస్థలు కూడా ఉన్నాయి. గతంలో రాజకీయంగా దళితులతో కలిపి ఈ సంస్థలు పనిచేయలేదు. మహారాష్ట్రలో బీజేపీ, శివసేన ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మరాఠాలు అనేకరూపాలులో తమ అసంతృప్తిని ప్రదర్శించారు. రాష్ట్రంలో పెద్ద ఎత్తున ప్రదర్శనలు నిర్వహించారు. రిజర్వేషన్లకోసం సైతం నేడు డిమాండ్ చేసారు. ఈ దశలోనే దళితులతోకలిసి పోరాటం చేయడంద్వారా రాష్ట్రంలో బ్రాహ్మణ ఆధిపత్య ప్రభుత్వాన్ని ఓడించాలని నిర్ణయించారు. మరాఠాలకు చెందిన కొన్ని యువజన సంఘాలు ఎల్గర్ పరిషత్ నిర్వాహకులతోకలిసి పనిచేస్తూ తమ నిరసనను వివిధరూపాలలో వ్యక్తం చేసారు.

నాతోపాటు నేరారోపణలు ఎదుర్కొంటున్న మరో 9మంది ఇప్పటికే జైలులోఉంటూ రకరకాల వేధింపులకు గురవుతున్నారు. నాపైన కేసు ప్రస్తుతం కీలకఘట్టానికి చేరుకున్నది. అరెస్టు తప్పదన్న స్థితిలో నేను ఉన్నాను. ఇప్పుడు మీరంతా నాకు అండగానిలిచి పోరాడితే కేవలం నాకు, నాకుటుంబసభ్యులకు మాత్రమేకాక, నేరారోపణ ఎదుర్కొంటున్నవారందరికీ సహకారంగా ఉంటుంది. దేశంలోని ఫాసిస్టు మూకలను ఎదుర్కొని పోరాడుతున్నారన్న స్పష్టమైన సందేశం ప్రజలకు అందుతుంది. అందువల్ల సంతకాల సేకరణ, పత్రికా ప్రకటనలు,వ్యాసాలు, రచనలు తదితర మార్గాలలో ఆగ్రహాన్ని, నిరసనను, అభ్యంతరాలను తెలియజేసి ఈ రాజ్యం చేసిన కుట్రను తిప్పికొట్టేందుకు ముందుకు రావలసిందిగా విజ్ఞప్తి చేస్తున్నాను.

ప్రధానికి ప్రముఖుల విజ్ఞప్తి : ప్రముఖ మేథావి డాక్టర్ ఆనంద్ తేల్తుంబ్డేను అరెస్టు చేయకుండా, అక్రమంగా ఆయనపై బనాయించిన కేసును ఎత్తివేయించాలని ప్రధాని నరేంద్ర మోడీకి 100మందికిపైగా వివిధరంగాలకు చెందిన మేథావులు విజ్ఞప్తి చేశారు. సుప్రియ, జమిందార్, ప్రీతి, గుర్‌దీప్, పీటర్, మధుసూధన్, సుస్మిత, నళిని, పద్మజ, తరుణ్ లాంటి మేథావులు విజ్ఞప్తి పత్రంపై సంతకాలుచేసి ప్రధానికి పంపారు.

విశాలాంధ్ర

క్రీడలు

క్రికెటర్లూ తప్పులు చేస్తుంటారు..!

పాండ్య, రాహుల్ వ్యాఖ్యలపై గంగూలీ స్పందన



ముంబై : వివాదాలను పక్కనపెట్టి ముందుకు వెళ్లాలని టీమిండియా మాజీ సారథి సౌరవ్ గంగూలీ అన్నాడు. కాఫీ విత్ కరణ్ షోలో మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేసి సస్పెండైన హార్దిక్ పాండ్య, కేఎల్ రాహుల్‌ను ఉద్దేశించి గంగూలీ మాట్లాడాడు. వారిద్దరూ తప్పు తెలుసుకొని మరింత మెరుగవుతారని ఆశించాడు. 'ప్రజలు పొరపాట్లు చేస్తారు. వాటిపై తీవ్రంగా స్పందించొద్దు. తప్పు చేసినవారు దాన్ని తెలుసుకొని మరింత మెరుగైన వ్యక్తిగా మారతారని నమ్మకముంది. తప్పు చేయకుండా ఉండటానికి మనమేమీ యంత్రాలం కాదు మనుషులం. ఇక ముందుకెళ్లి మరోసారి ఇలాంటిది జరగకుండా చూసుకోవాలి' అని గంగూలీ అన్నాడు. 'క్రికెటర్లు చాలా అణకువగా ఉంటారు. ఎప్పుడో ఒకసారి ప్రతి ఒక్కరూ పొరపాటు చేస్తారు. ఇప్పటి క్రికెటర్లు చాలామంది వ్యక్తిగతంగా నాకు బాగా తెలుసు. ఈ తరం క్రికెటర్లూ విధేయులుగా ఉంటారు. విరాట్ కోహ్లిని చూడండి. అతనో ఆదర్శనీయుడు. భారత్‌ది అదృష్టం. ప్రతి తరంలోనూ అందరినీ ఆకట్టుకునే, అలరించే, ఆనందపెట్టే క్రికెటర్లకు జన్మనిస్తోంది. ఒకప్పుడు గవాస్కర్, ఆ తర్వాత సచిన్ టెండూల్కర్ కెరీర్ ముగియగానే తర్వాత ఎవరు? అని ఆలోచించారు. ఇప్పుడా ప్రశ్నకు జవాబు విరాట్. చాలా మంది క్రికెటర్లు స్వతహాగా మంచి మనుషులు. మధ్య తరగతి నుంచి పోరాడి ఈ స్థాయికి వస్తారు. కోట్ల మంది క్రికెట్ ఆడేవారిలో 11 మందిని ఎంపిక చేస్తారంటేనే మనం ఊహించుకోవచ్చు' అని గంగూలీ అన్నారు.

ధోనీకి ఆ మ్యాచ్‌లు సరిపోతాయి



న్యూఢిల్లీ : అడిలైడ్‌లో ఆస్ట్రేలియాతో జరిగిన రెండో వన్డేలో మాజీ కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోని రాణించి, విమర్శకుల ప్రశంసలు అందుకుంటున్నాడు. ఆ మ్యాచ్‌తో అతడు మరోసారి బెస్ట్ ఫినిషర్ ట్యాగ్‌ను నిలబెట్టుకున్నాడు. ఇప్పుడు మాజీ కెప్టెన్ సునీల్ గవాస్కర్ కూడా త్వరలో జరగనున్న ప్రపంచ కప్‌లో వికెట్ కీపర్‌గా ధోని కీలక పాత్ర పోషిస్తాడని ఆశాభావం వ్యక్తం చేశాడు. 'చివరి ఓవర్ల సమయంలో కెప్టెన్ విరాట్ కోహ్లీ బౌండరీ దగ్గర ఫీల్డింగ్ చేయడమే సరైంది. ఆ సమయంలో ఫీల్డింగ్‌లో చిన్న చిన్న మార్పులు చేయడానికి, బౌలర్లతో మాట్లాడటానికి కుదరకపోవచ్చు. అప్పుడు జట్టులో చిన్నపాటి మార్పులకు విరాట్..ధోని మీద నమ్మకం ఉంచాడు' అని ఓ మీడియా సంస్థతో వెల్లడించాడు. 'జట్టుకు ధోని అవసరాన్ని వెలకట్టలేం. అతడి పాటికి అతడిని ఆడనివ్వండి. యువ క్రికెటర్లకు ఉండే నిలకడ అతడికి లేకపోవచ్చు. కొద్దిగా ఓపిగ్గా ఉండండి. కానీ అతడు జట్టుకు ఇప్పటికీ విలువైన ఆటగాడే' అని ధోని ఆటతీరుపై సంతృప్తిని వ్యక్తం చేశాడు. ఆస్ట్రేలియాతో ఫైనల్ వన్డే తరవాత టీమిండియా న్యూజిలాండ్ పర్యటనకు వెళ్లనుంది. కివీస్‌తో విరాట్ సేన వన్డే, టీ20 సిరీసుల్లో తలపడనుంది. ప్రపంచ కప్ నేపథ్యంలో తన బెస్ట్‌ను బయటకు తీయడానికి ధోనికి ఈ మ్యాచ్‌లు సరిపోతాయని గవాస్కర్ వెల్లడించాడు. ఇంకా ఐపీఎల్ మ్యాచ్‌లు కూడా ఉండటంతో జట్టులో కుదురుకోవడానికి మహీకి తగిన సమయం ఉందన్నాడు.

క్వార్టర్స్‌లో సైనా, శ్రీకాంత్



కౌలాలంపూర్:
భారత స్టార్ షట్లర్‌లు సైనా నెహ్వాల్, కిదాంబి శ్రీకాంత్ మలేసియా మాస్టర్స్ బ్యాడ్మింటన్ టోర్నీ క్వార్టర్స్‌లోకి ప్రవేశించారు. మహిళల సింగిల్స్ భాగంగా గురువారం జరిగిన రెండో రౌండ్ పోరులో సైనా నెహ్వాల్ 21-14, 21-16 తేడాతో యిప్ పుయ్ యిన్ (హాంకాంగ్)పై గెలిచి క్వార్టర్స్‌కు చేరింది. కేవలం 39 నిమిషాల్లోనే సైనా మ్యాచ్ ముగించింది. తొలి గేమ్‌ను అవలీలగా గెలిచిన సైనా, రెండో గేమ్‌లో మాత్రం కాస్త పోరాడి గెలిచింది. శుక్రవారం జరగనున్న క్వార్టర్ ఫైనల్లో రెండో సీడ్ ఒకుహారా(జపాన్)తో సైనా తలపడుతుంది. గతేడాది జరిగిన రెండు వరుస టోర్నమెంట్లలో(డెన్మార్క్ ఓపెన్, ఫ్రెంచ్ ఓపెన్) ఒకుహారాపై సైనా విజయం సాధించింది. పురుషుల సింగిల్స్‌లో ఏడో సీడ్ శ్రీకాంత్ హాంకాంగ్‌కు చెందిన వాంగ్ వింగ్ కి విన్సెంట్‌పై 23-21, 8-21, 21-18 తేడా విజయం సాధించి క్వార్టర్స్ చేరాడు. తొలి సెట్‌లో పోరాడి గెలిచిన శ్రీకాంత్ రెండో సెట్‌లో పూర్తిగా విఫలమైయాడు. మూడో సెట్‌లోనూ పోరాడినా చివరికి గెలిచి ఊపిరి పీల్చుకున్నాడు. మరో సింగిల్స్‌లో కశ్యప్ ఓటమిపాలై టోర్నీ నుంచి నిష్క్రమించాడు. మహిళల డబుల్స్‌లోనూ అశ్వినీ పొన్నప్ప-సిక్కి రెడ్డి జోడి ఓటమి పాలైంది.

మూడో రౌండ్‌లో జకోవిచ్

జ్వెరేవ్, సెరీనా, కెబర్, ఒసాకా ముందంజ



మెల్‌బోర్న్ :
టాప్ సీడ్ సెర్బియన్ స్టార్ జొకోవిచ్ ఆస్ట్రేలియన్ ఓపెన్ మూడో రౌండ్‌లో అడుగుపెట్టాడు. ఫ్రాన్స్‌కు చెందిన సోంగాపై జోకోవిచ్ 6-3, 7-5, 6-4 తేడాతో విజయం సాధించాడు. తొలి సెట్‌ను అలవోకగా గెలిచిన జోకో రెండో సెట్‌లో చెమటోడ్చాడు. రెండో సెట్‌లో సొంగా 6వ గేమ్ సర్వ్‌ను బ్రేక్‌చేసి జోకో సెట్‌ను గెలుచుకుని మూడో సెట్‌ను 6-4తో గెలిచి మ్యాచ్‌ను కైవసం చేసుకున్నాడు. నాలుగో సీడ్ జర్మనీకి చెందిన జ్వెరేవ్ చెమటోడ్చి మూడో రౌండ్‌లో అడుగుపెట్టాడు. జ్వెరేవ్ ఫ్రాన్స్‌కు చెందిన చార్డీపై 5 సెట్ల పోరులో 7-6, 6-4, 5-7, 6-7, 6-1 తేడాతో విజయం సాధించాడు. జపాన్‌కు చెందిన 8వ సీడ్ నిషికోరీ మూడో రౌండ్‌లో అడుగుపెట్టాడు. మజీ చాంపియన్ వావ్రింకా 16వ సీడ్ రోనిక్ చేతిలో ఓడి టోర్నీ నుంచి నిష్క్రమించాడు. ఏడో సీడ్ డోమినిక్ థీమ్ అన్‌సీడెడ్ ఆటగాడు పొపిరిన్ చేతిలో ఓడిపోయాడు. మహిళల సింగిల్స్‌లో సెరీనా విలియమ్స్ కెనడాకు చెందిన బౌచర్డ్‌పై 6-2, 6-2 తేడాతో విజయం సాధించి మూడో రౌండ్ చేరింది. రెండో సీడ్ హెలెప్, నాలుగో సీడ్ ఒసాకా మూడో రౌండ్ చేరారు.

గెలిస్తే...చరిత్రే..!



- ✓ సిరీస్ లక్ష్యం..!
- ✓ వెంటాడుతున్న బౌలింగ్ సమస్య
- ✓ రెండు మార్పులతో ఆసీస్

ఉదయం 7.50 సోనీ సిక్స్, సోనీ టెన్3లో

మెల్‌బోర్న్:
ఆస్ట్రేలియా గడ్డపై తొలి టెస్టు సిరీస్ గెలిచి చరిత్ర సృష్టించిన టీమిండియాను.. ఇప్పుడు మరో రికార్డు ఊరిస్తోంది. ఆసీస్‌తో మూడు వన్డేల సిరీస్‌లో భాగంగా చివరి వన్డేలో టీమిండియా గెలిస్తే ఆస్ట్రేలియా గడ్డపై ద్వైపాక్షిక వన్డే సిరీస్‌ను గెలిచిన భారత జట్టుగా కోహ్లి సేన చరిత్ర లిఖించనుంది. తొలి వన్డేలో అన్ని విభాగాల్లో విఫలమై ఓడిన భారత్, రెండో వన్డేలో సమష్టిగా రాణించి విజయాన్ని అందుకుని సిరీస్‌ను సమం చేసింది. ఆఖరి వన్డేలో విజయం సాధించేందుకు ఇరు జట్లు సిద్ధం అవుతున్నా జట్టు కూర్పు విషయంలో ఇద్దరికీ సందేహాలు ఉన్నాయి. ఆసీస్ జట్టులో రెండు మార్పులు చేయగా.. భారత్‌కు 5వ బౌలర్ సమస్య వెంటాడుతోంది. బ్యాటింగ్‌లో టాప్ ఆర్డర్, మిడిల్ ఆర్డర్ గాడిలో పడినా బౌలింగ్‌లో కోహ్లిసేన తేలిపోయి ప్రత్యర్థికి భారీ లక్ష్యాన్ని నిర్దేశించే అవకాశం ఇస్తోంది. భువీ తొలి వన్డేలో విఫలమైనా రెండో వన్డేలో ఫాంలోకి వచ్చాడు. షమీ పర్వాలేదనిపిస్తున్నాడు. ఎడమ చేతి వాటం స్పిన్నర్లు కుల్దీప్, జడేజా పరుగులు కట్టడి చేస్తున్నా.. సమస్య మాత్రం 5వ బౌలర్. తొలి వన్డేలో ఖలీల్ భారీగా పరుగులు ఇచ్చి నిరాశ పరచడంతో రెండో వన్డేలో అతడి స్థానాన్ని భర్తీ చేసిన సిరాజ్ సైతం ఘోరంగా నిరాశపరిచాడు. 10 ఓవర్లలో 76 పరుగులిచ్చిన ఒక్క వికెట్ కూడా తీయలేదు. దాంతో సిరాజ్‌పై వేటు తప్పేలా కనబడటం లేదు. అతని స్థానంలో ఖలీల్ అహ్మద్ తిరిగి జట్టులో చోటు దక్కించుకునే అవకాశం ఉంది. బౌలింగ్ ఆల్‌రౌండ్‌గా విజయ్ శంకర్‌ను తీసుకుంటే కార్తిక్, జడేజాలో ఒకరు స్థానం త్యాగం చేయాల్సి ఉంటుంది. సిరీస్ నిర్ణయాత్మక మ్యాచ్‌లో కేదర్ జాదవ్‌కు జట్టులో చోటు దక్కడం కష్టంగానే ఉంది. ఆల్ రౌండర్ రవీంద్ర జడేజా స్థానంలో కానీ, కుల్దీప్ యాదవ్ స్థానంలో కానీ కేదర్ జాదవ్‌ను తీసుకోవాలి. కాగా, కీలకమైన మ్యాచ్‌కు రవీంద్ర జడేజా, కుల్దీప్ యాదవ్‌లను తీసే సాహసం టీమిండియా యాజమాన్యం చేయకపోవచ్చు. భారత్‌తో ఎట్టి పరిస్థితుల్లోనూ సిరీస్‌ను వదులుకోకూడదనే యోచనలో ఉన్న ఆసీస్ జట్టు రెండు మార్పులతో బరిలోకి దిగనుంది. ఈ వన్డే సిరీస్‌లో ఏమాత్రం ప్రభావం చూపని స్పిన్నర్ నాథన్ లయన్ స్థానంలో ఆడమ్ జంపాను తీసుకోగా, పేసర్ బెహ్రెన్‌డార్ఫ్ స్థానంలో బిల్లీ స్టాన్‌లేక్ జట్టులోకి వచ్చాడు. ఇక రిజర్వ్ ఆటగాడిగా కేన్ రిచర్డ్‌సన్‌ను తీసుకున్నారు. ఏది ఏమైనా ఇరు జట్ల మధ్య రేపటి మ్యాచ్ ఆసక్తికరంగా జరిగే అవకాశం ఉంది.

అతడికి ఎప్పుడెలా ఆడాలో తెలుసు : గిలెస్పీ



అడిలైడ్:
టీమిండియా మాజీ సారథి మహేంద్రసింగ్ ధోనీ సందర్భానికి తగిన విధంగా ఆడతాడని ఆస్ట్రేలియా మాజీ పేసర్ జాసన్ గిలెస్పీ అన్నాడు. ఆస్ట్రేలియాతో రెండో వన్డేలో అతడి ఆట అద్భుతమని ప్రశంసించాడు. ఈ సిరీస్‌లో అతడు వరుసగా రెండు అర్ధశతకాలు బాదిన సంగతి తెలిసిందే. 'మ్యాచ్‌లు ముగించడంలో ధోనీకి ఉన్న నైపుణ్యంతో భారత్ దశాబ్ద కాలంగా లబ్ధి పొందుతోంది. ఇప్పటికీ టీమిండియా ఆ ప్రయోజనం పొందుతోంది. సిడ్నీ వన్డేలో 4/3తో ఉన్నప్పుడు అదే ధోనీ అనుభవంతో జట్టు పుంజుకుంది. సిడ్నీలో అతడు నిదానంగా ఆడినప్పటికీ ఎందుకలా ఆడాడో మనం అర్థం చేసుకోవచ్చు. పరిస్థితిని అనుసరించి ఆడాడు. మిడిలార్డర్‌లో వచ్చి భిన్నమైన పరిస్థితుల్లో ఆడటం చాలా కష్టం. అతడు 300 పైగా వన్డేలు ఆడాడు. ఎప్పుడెలా ఆడాలో ధోనీకి బాగా తెలుసు' అని గిలెస్పీ అన్నాడు. 'ఛేదన రారాజు' విరాట్ కోహ్లిపై గిలెస్పీ ప్రశంసల జల్లు కురిపించాడు. 'విరాట్ కోహ్లి నుంచి మరో మాస్టర్ క్లాస్ ఇన్నింగ్స్. అందరి కన్నా అతడెంతో భిన్నం. గణాంకాలే అతడి గురించి చెబుతాయి. మనం ప్రత్యేకంగా ఉపమానాలు చెప్పాల్సిన పనిలేదు. 39 శతకాలు, సచిన్ కన్నా 50 తక్కువ ఇన్నింగ్సుల్లోనే 10,000 పరుగులు చేశాడు. టెండూల్కర్ ఎంతమంచి ఆటగాడో మనందరికీ తెలుసు. విరాట్ గొప్పగా ఆడుతున్నాడు. ప్రస్తుతం ప్రపంచ క్రికెట్‌లో అతడే అత్యుత్తమం. టీమిండియా మిడిలార్డర్ బాగాలేదని చెప్పను. మంచి బ్యాట్స్‌మన్‌తో సమతూకంగా ఉంది. ధోనీ, అంబటి రాయుడు ఉన్నారు. జట్టు విరాట్‌పై కాస్త అతిగా ఆధారపడుతున్నా మిడిలార్డర్ బాగుంది' అని గిలెస్పీ అన్నాడు.

వన్డే సిరీస్‌కు న్యూజిలాండ్ జట్టు



వెల్లింగ్టన్ : భారత్‌తో జరగనున్న 5 వన్డేల సిరీస్‌లో భాగంగా తొలి మూడు వన్డేలకు న్యూజిలాండ్ తమ జట్టును ప్రకటించింది. ఇటీవల శ్రీలంకతో వన్డే సిరీస్‌ను గెలుచుకుని మంచి ఊపుమీద ఉన్న కివీస్ టీమిండియాతో వన్డే సిరీస్‌కు కేన్ విలియమ్స్ నాయకత్వంలోని 14 మంది జట్టు సభ్యుల పటిష్ట జట్టును ప్రకటించింది. శ్రీలంకతో టీ20 లకు దూరంగా ఉన్న పేస్ బౌలర్ ట్రెంట్ బౌల్ట్ జట్టులో చేరాడు. ఆల్ రౌండర్ మిచెల్ శాంట్నర్, గ్రాండ్‌హోమ్‌లకు జట్టులో స్థానం కల్పించింది. న్యూజిలాండ్ కోచ్ గ్యారీ స్టీడ్ మాట్లాడుతూ 'భారత్, న్యూజిలాండ్‌లు వన్డే ర్యాం కింగ్స్‌లో రెండు, మూడు స్థానాల్లో ఉన్నాయి. ప్రపంచ కప్ సన్నాహక నేపథ్యంలోనే ఈ జట్టును ప్రకటించాం. విరాట్ కోహ్లి నాయకత్వం లోని బలమైన జట్టుపై గెలవాలని కోరుకుం టున్నాం' అని అన్నాడు. ఐదు వన్డేల సిరీస్‌లో భాగంగా తొలి వన్డే నేపియర్ వేదికగా ఈనెల 23న జరుగనుంది.

న్యూజిలాండ్ జట్టు :
కేన్ విలియమ్సన్(కెప్టెన్), ట్రెంట్ బౌల్ట్, డౌగ్ బ్రేస్‌వెల్, కొలిన్ డీ గ్రాండ్‌హోమ్, లోకీ ఫర్గుసన్, మార్టిన్ గప్తిల్, మాట్ హెన్రీ, టామ్ లాథమ్, కొలన్ మన్రో, హెన్రీ నికోలస్, మిచెల్ శాంట్నర్, ఇష్ సోఢీ, టిమ్ సౌథీ, రాస్ టేలర్.

హార్దిక్, రాహుల్ కేసులో కీలక మలుపు



న్యూఢిల్లీ : 'కాఫీ విత్ కరణ్' అనే షోలో మహిళల పట్ల అసభ్య వ్యాఖ్యలు చేసిన టీం ఇండియా యువ క్రికెటర్లు.. హార్దిక్ పాండ్య, కేఎల్ రాహుల్‌లు నిషేధాన్ని ఎదురుకుంటున్న విషయం తెలిసిందే. బాలీవుడ్ దర్శకనిర్మాత కరణ్ జోహార్ నిర్వహించే ఈ షోలో పాల్గొన్న వీళ్లు.. మహిళల గురించి, సెక్స్ గురించి.. మితిమీరి మాట్లాడారు. దీంతో సోషల్‌మీడియాలో వీరిపై విమర్శలు వచ్చాయి. అయితే ఈ కేసులో సుప్రీం కోర్టు కీలక నిర్ణయం తీసుకుంది. ఈ కేసును విచారించేందుకు బీసీసీఐలో అంబడ్స్‌మెన్‌ను నియమిస్తున్నట్లు సుప్రీం ప్రకటించింది. జస్టిస్ ఏఎమ్ సప్రే, జస్టిస్ ఎస్ఏ బొబ్డేల బెంచ్ ఈ కేసు విచారించేందుకు పీఎస్ నరసింహాను అంబడ్స్‌మెన్‌గా నియమించింది. నరసింహాను ఉన్నపళంగా బీసీసీఐలో నియమించాలని సుప్రీం ఆదేశాలు జారీ చేసింది. నరసింహా విచారణ తర్వాత ఇచ్చే నివేదికపై హార్ధిక్, రాహుల్‌ల భవితవ్యం ఆధారపడి ఉంది.

వరల్డ్ కప్‌కు రిషబ్ భారమే.. : సచిన్



న్యూఢిల్లీ:
వచ్చే వరల్డ్‌కప్‌లో పాల్గొనబోయే భారత క్రికెట్ జట్టులో యువ వికెట్ కీపర్ రిషబ్ పంత్‌కు అవకాశం ఇచ్చే అంశాన్ని పరిశీలిస్తున్నామని ఇటీవల చీఫ్ సెలక్టర్ ఎంఎస్‌కే ప్రసాద్ స్పష్టం చేసిన సంగతి తెలిసిందే. పంత్ తమ వరల్డ్ కప్ ప్రణాళికల్లో ఉన్నాడంటూ ఎమ్మెస్కే చెప్పుకొచ్చాడు. అయితే దీనిపై మాస్టర్ బ్లాస్టర్ సచిన్ టెండూల్కర్ మాత్రం పెదవి విరిచాడు. రాబోయే వరల్డ్‌కప్‌లో రిషబ్ పంత్‌కు చోటిస్తే మాత్రం అది జట్టు కూర్పుపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉందన్నాడు. పంత్‌ను వరల్డ్‌కప్ జట్టులో చేర్చాలనుకోవడం మంచి నిర్ణయం అంటూనే, అది జట్టు కాంబినేషన్‌ను కాస్త గందరగోళానికి గురి చేస్తుందన్నాడు. ఇప్పటికే ఇద్దరు స్పెషలిస్టు వికెట్ కీపర్లు ఎంఎస్ ధోని, దినేశ్ కార్తీక్‌లు ఉండగా, మరొక స్పెషలిస్టు వికెట్ కీపరైన పంత్‌కు చోటు కల్పించడం జట్టుకు భారంగా మారుతుందన్నాడు. 'పంత్‌కు వరల్డ్‌కప్ జట్టులో స్థానం కల్పిస్తే ఒక బ్యాట్స్‌మన్‌ను కానీ, బౌలర్ కానీ తీసేయాలి. ఇక్కడ పంత్ కోసం ఒక స్పెషలిస్టు బౌలర్‌ను తీయడం సబబు కాదు. దాంతో బ్యాట్స్‌మన్‌ను తీసేసి మాత్రమే రిషబ్ స్థానాన్ని భర్తీ చేయలి. ఒకవేళ ఆల్ రౌండర్‌ను తీసేసి పంత్‌ను వేసుకుంటే అది జట్టు కూర్పుపై ప్రభావం చూపుతుంది' అని సచిన్ పేర్కొన్నాడు.

కళ వినోదం కోసం కాదు... ప్రజల కోసం

కొవ్వొత్తిలా కరిగిపోయేది కళాకారులే..



మేరుగు విజయ్‌కుమార్‌కు విరాళం అందజేస్తున్న శ్రీకృష్ణ కుటుంబ సభ్యులు. చిత్రంలో నల్లూరి, కొనకళ్ల నారాయణ, జల్లి విల్సన్, నజీర్, ఆజాద్, సంగీతరావు, పిచ్చయ్య తదితరులు

విశాలాంధ్ర-విజయవాడ :
హృదయాన్ని స్పందింపజేసేది, మనిషిని ఆలోచింపజేసేది కళలు, కళారూపాలేనని ఏపీ ప్రజానాట్యమండలి గౌరవాధ్యక్షుడు నల్లూరి వెంకటేశ్వర్లు(అన్న) అన్నారు. జాతీయోద్యమ కాలంలో జాతీయ స్థాయిలో ఇప్టా(ఐపీటీఏ) పిలుపు మేరకు దేశంలో, రాష్ట్రంలో అనేక మంది ప్రజానాట్యమండలిలోకి ప్రవేశించారని, అటువంటి కళాకారుల్లో మహోన్నత వ్యక్తి పడవల శ్రీకృష్ణ అని చెప్పారు. ఇటీవల మరణించిన ప్రముఖ బుర్రకథ కళాకారులు, సీపీఐ నాయకులు పడవల శ్రీకృష్ణ (కాజ కృష్ణ) సంస్మరణ సభ గురువారం కంకిపాడు మండలం ఉప్పులూరులో జరిగింది. అమరులు తమ్మారెడ్డి సత్యనారాయణ, ముక్కామాల నాగభూషణం, సుంకర సత్యనారాయణ, కోగంటి గోపాలకృష్ణయ్య, మిక్కిలినేని రాధాకృష్ణ, తాతినేని ప్రకాశరావు, అల్లూ రామలింగయ్య వంటి ఎందరో ప్రజానాట్య మండలికి సారథ్యం వహించారని నల్లూరి గుర్తు చేశారు. ప్రజా కళలకు పుట్టినిల్లు కృష్ణా జిల్లా అని పేర్కొన్నారు. కళాకారులందరూ కొవ్వొత్తిలా కరిగిపోతూ త్యాగాలు చేసినవారేన న్నారు. నాజర్ బుర్రకథ పితామహుడు అని కొనియాడారు. బందరు ఎంపీ కొనకళ్ల నారాయ ణరావు మాట్లాడుతూ ఎర్రజెండా లక్ష్యాలతోనే ఎన్టీ రామారావు నాడు టీడీపీని స్థాపించారని, ప్రజల కోసం పాటుపడే కమ్యూనిస్టులు 1952 లో రాష్ట్ర వ్యాప్తంగా విజయం సాధించారని తెలిపారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్ మాట్లాడుతూ పడవల శ్రీకృష్ణ తన కళల ద్వారా కృష్ణా, గుంటూరు జిల్లాలతోపాటు రాష్ట్ర వ్యాప్తంగా విస్తృత ప్రచారం చేశారని తెలిపారు. సభకు అధ్యక్షత వహించిన సీపీఐ పెనమలూరు నియో జకవర్గ కార్యదర్శి మేరుగు విజయ్‌కుమార్, రైతుసంఘం నాయకులు వెలగపూడి ఆజాద్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు దగాని సంగీతరావు పడవల శ్రీకృష్ణతో తమ కున్న సాన్నిహిత్యాన్ని వివరించారు. ప్రజా నాట్యమండలి సీనియర్ కళాకారులు ఆర్.పిచ్చయ్య, ఎస్కే నజీర్ 'చెయ్యెత్తి జై కొట్టు తెలుగోడా...' పాటను ఆలపించారు. ఎమ్మెల్సీ వైవీబీ రాజేంద్రప్రసాద్, జెడ్పీటీసీ సభ్యులు గొంది శివరామకృష్ణ, సీపీఐ నియోజకవర్గ సహాయ కార్యదర్శి మున్నంగి నర్సింహారావు, గ్రామ శాఖ కార్యదర్శి పోతురాజు నాగేశ్వరరావు, సీపీఎం నాయకులు జంపన నాగేశ్వరరావు, సీహెచ్ రెడ్డయ్య పాల్గొన్నారు. తొలుత శ్రీకృష్ణ చిత్రపటం వద్ద నాయకులు అంజలి ఘటించారు.

విరాళం అందించిన శ్రీకృష్ణ కుటుంబం

పడవల శ్రీకృష్ణ జ్ఞాపకార్థం ఆయన కుమారుడు మధుసూదనరావు, కుటుంబ సభ్యులు కమ్యూనిస్టు పార్టీకి రూ.5వేలు, ప్రజానాట్య మండలికి రూ.5వేలు నల్లూరు వెంకటేశ్వర్లు చేతుల మీదుగా సీపీఐ పెనమలూరు నియోజకవర్గ కార్యదర్శి మేరుగు విజయ్‌కుమార్‌కు అందించారు.

జర్నలిజంలో విప్లవాత్మక మార్పులు

ఏపీయూడబ్ల్యూజే డైరీ ఆవిష్కరణలో ఈడ్పుగంటి



ఏపీయూడబ్ల్యూజే డైరీని ఆవ్కిరిస్తున్న ఈడ్పుగంటి. చిత్రంలో అంబటి ఆంజనేయులు, ఐవీ సుబ్బారావు, జయరాజ్, షేక్‌బాబు, చలపతిరావు, చావా రవి, కొండా రాజేశ్వరరావు, అయిలు రమేష్, వసంత్, చందు జనార్దన్

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి :
సమాచార విప్లవం అనూహ్యంగా పెరిగిందని, దాన్లో భాగంగా తెలుగు జర్నలిజం లోనూ నూతన పోకడలు, సృజనాత్మకత వెల్లివిరు స్తున్నాయని విశాలాంధ్ర పూర్వ సంపాదకుడు ఈడ్పుగంటి నాగేశ్వరరావు అన్నారు. ఆంధ్ర ప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల యూనియన్ కృష్ణా అర్బన్ యూనిట్ ముద్రించిన 2019 మీడియా డైరీని స్థానిక ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఆయన ఆవిష్కరించారు. తెలుగు జర్నలిజంలో ముట్నూరి కృష్ణారావు, కాశీనాధుని నాగేశ్వరరావు పంతులు, మద్దుకూరి చంద్రశేఖర్ రావు, నార్ల వెంకటేశ్వరరావు వంటి ప్రముఖ సంపాదకులు సాహిత్యంతోపాటు రాజకీయాలపై కూడా రచనలు కొనసాగించి పేరు ప్రఖ్యాతులు గడించి పత్రికా రంగానికి ఆదర్శప్రాయులుగా నిలిచారని ఈడ్పుగంటి కొనియాడారు. ఐజేయూ ఉపాధ్యక్షుడు అంబటి ఆంజనేయులు మాట్లాడుతూ జర్నలిస్టుకు డైరీ ఒక దిక్సూచీ లాంటిదని, సమగ్ర సమాచారంతో కృష్ణా అర్బన్ యూనిట్ ముద్రించిన మీడియా డైరీ ఎంతో ఉపయోగకరమన్నారు. ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ఐ.వి.సుబ్బారావు, చందు జనార్థన్ మాట్లాడుతూ జర్నలిస్టులకు తమ విధి నిర్వహణలో డైరీ వినియోగం ఒక భాగం కావాలని సూచించారు. అమరావతి హౌసింగ్ సొసైటీతోపాటు, రాష్ట్రవాప్తంగా జర్నలిస్టుల హౌసింగ్ స్కీం అమలుకు ప్రభుత్వం వేగవంతమైన చర్యలు చేపట్టాలని డిమాండు చేశారు. ఏపీయూడబ్ల్యూజే కృష్ణా అర్బన్ అధ్యక్షుడు చావా రవి అధ్యక్షతన జరిగిన ఈసమావేశంలో యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కంచల జయరాజ్, షేక్ బాబు, అర్బన్ కార్యదర్శి కొండా రాజేశ్వరరావు, ప్రెస్‌క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు నిమ్మరాజు చలపతిరావు, ఆర్.వసంత్, తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టుల యూనియన్ నాయకులు అయిలు రమేష్ తదితరులు ప్రసంగించారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : MUTYALA PRASAD. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2018-20, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.